సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 89

శుక్రవారం 20-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'



**ఆపింది నేను కాదు**

భారత్–పాక్ యుద్ధంపై ట్రంప్.. ఆ క్రెడిట్ ఇరుదేశాల పాలకులదేనని వెల్లడి

-6లో





**విద్యార్థి వీసాలు ప్రారంభం**

దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాల తనిఖీ తప్పనిసరన్న అమెరికా

-6లో



## రేవంత్‌కు బేసిన్ల కంటే బ్యాగుల మీదే నాలెడ్జి ఎక్కువ



- నదుల బేసిన్లపై కనీస అవగాహన లేకుండా మాట్లాడారు
- బనకచర్ల ప్రాజెక్టు ఏ నది బేసిన్‌లో కడుతున్నారో తెలియకపోతే ఎలా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- ఏపీ జలదోపిడీ, అక్రమ ప్రాజెక్టులు అడ్డుకోవడం చేతకాక అబద్ధాలు చెబుతున్నారు
- తెలంగాణ హక్కులను ఏపీకి, చంద్రబాబుకు రాసిస్తే ప్రజలు ఊరుకోరు.. రైతుల పక్షాన మేం న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం

- వివరాలు 7లో▶



# మళ్లీ తెరపైకి ఇచ్ఛంపల్లి–సాగర్

## కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ముందు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ప్రతిపాదన

- గోదావరి జలాలను వినియోగించాలనుకుంటే దీనిపై చర్చకు సిద్ధమని వెల్లడి
- గతంలో ఈ అనుసంధాన ప్రాజెక్టును ప్రతిపాదించిన కేంద్రం
- 15.8 టీఎంసీల సామర్థ్యంతో ఇచ్ఛంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి ప్రణాళిక
- రోజుకు 2.2 టీఎంసీల నీటిని సాగర్‌కు మళ్లించేలా ఎన్‌డబ్ల్యూడీఏ డీపీఆర్
- మొత్తం 230 టీఎంసీల్లో తెలంగాణకు 65, ఏపీకి 80, తమిళనాడుకు 84 టీఎంసీల కేటాయింపు
- ఏపీ చేపట్టిన 'బనకచర్ల'ను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో తాజాగా ఈ ప్రాజెక్టును ముందుకు తెచ్చిన తెలంగాణ



గురువారం ఢిల్లీలో కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి వరద జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పోలవరం–బనకచర్ల ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ.. గతంలో కేంద్రం ప్రతిపాదించిన ఇచ్ఛంపల్లి–నాగార్జునసాగర్ అనుసంధాన ప్రక్రియను మళ్లీ తెరపైకి తెచ్చింది. గోదావరి జలాలను వినియోగించదలిస్తే కేంద్రం సాయమందించే ఇచ్ఛంపల్లి–సాగర్ లింకు ప్రాజెక్టుపై చర్చించేందుకు తాము సిద్ధమని తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ మేరకు ఒక ప్రతిపాదనను తాజాగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ముందుంచారు. దీంతో నాలుగేళ్ల కిందట గోదావరి–కావేరి అనుసంధాన ప్రక్రియలో భాగంగా జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) తయారు చేసిన ఇచ్ఛంపల్లి–సాగర్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)పై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**మొత్తం 247 టీఎంసీల మళ్లింపు**

ఎన్‌డబ్ల్యూడీఏ 2020–21లో రూపొందించి సంబంధిత రాష్ట్రాలకు అందజేసిన డీపీఆర్‌లో..

మిగతా 7వ పేజీలో ▶

### బనకచర్లను అడ్డుకోండి

- తెలంగాణ ప్రయోజనాలకు ఈ ప్రాజెక్టుతో విఘాతం
- కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్, ఉత్తమ్ ఫిర్యాదు

7 లో

# ఆస్పత్రిపై క్షిపణుల దాడి

- దక్షిణ ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర బాంబుల వర్షం
- క్షిపణుల దాడిలో ఆస్పత్రిలోని 80 మందికి గాయాలు
- ప్రతిగా ఇరాన్ అరాక్ భారజల రియాక్టర్‌పై ఇజ్రాయెల్ దాడి
- మరింత విస్తరిస్తున్న యుద్ధం
- ఇరాన్‌లో 639కి చేరిన మృతులు
- యుద్ధంలో భాగస్వామిగా మారాలా వద్దా అని రెండు వారాల్లో చెప్తామన్న 'వైట్‌హౌస్'

- వివరాలు 6లో▶

### హర్మూజ్‌ను మూసేస్తాం

ఇరాన్ హెచ్చరిక

### డూమ్స్ డే ఎయిర్‌క్రాఫ్ట్ రెడీ!

రక్షణ కోసం ముందస్తుగా తెప్పించిన ట్రంప్ సర్కార్

### టార్గెట్ 'ఫోర్డో'

ఇరాన్‌లోని ఆ అణుకేంద్రంపైనే ఇజ్రాయెల్ గురి

6 లో

# బాండ్లు చూపి బాబును నిలదీయండి



## ఏపీ ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు

14 లో

- సూపర్ సిక్స్ సహా 143 హామీలు అమలు చేశానంటూ చంద్రబాబు అబద్ధాలు
- ఏడాది పాలనపై టీడీపీ ఎమ్మెల్యేలను, కార్యకర్తలను ఇంటింటికీ పంపిస్తాడట
- ఎన్నికలకు ముందు బాబు ఇచ్చిన బాండ్లన్నీ దగ్గర పెట్టుకోండి.. వాటి ప్రకారం ఏడాదికే మీకు ఎంత బాకీ ఉన్నారో వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేయండి

# జేఎన్టీయూలో ఇంజనీరింగ్... జర్మనీలో మాస్టర్స్


ఒప్పంద పత్రాలను చూపిస్తున్న యూనివర్సిటీల అధికారులు

- బ్యాచిలర్స్, మాస్టర్స్ ఇంటిగ్రేటెడ్ కోర్సు
- జేఎన్టీయూహెచ్-జర్మన్ వర్సిటీల మధ్య ఎంఓయూ
- కోర్ గ్రూపులకే అవకాశం.. ఐదున్నరేళ్లలోనే పూర్తి
- విదేశాల్లో మన విద్యార్థులకు పెరగనున్న అవకాశాలు

**సాక్షి, హైదరాబాద్:** విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆశపడుతున్న విద్యార్థులకు హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూహెచ్) శుభ వార్త చెప్పింది. జేఎన్టీయూలో ఇంజనీరింగ్ చేస్తూనే, జర్మనీ విశ్వవిద్యాలయంలో మాస్టర్ చేసేందుకు సీటు పొందవచ్చని ప్రకటించింది. అందుకోసం జర్మనీకి చెందిన నాలెడ్జ్ ఫౌండేషన్-రాయుట్లింగస్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాసెల్‌తో గురువారం కీలక అవగాహన ఒప్పందం చేసుకుంది. జేఎన్టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి కిషన్ కుమార్‌రెడ్డి, రాయుట్లింగస్ సీఈవో డానియల్ జిగ్స్, కాసెల్ వర్సిటీ డీన్ డాక్టర్ డిర్క్ డలహస్ ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎంవోయూ వివరాలను వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి మీడియాకు వివరించారు.

## కోర్సు ఇలా..

జేఎన్టీయూహెచ్‌లో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ వంటి కోర్ గ్రూప్‌లు చదువుతున్న విద్యార్థులు ఈ ప్రోగ్రామ్‌కు అర్హులు. ఇంజనీరింగ్ విద్య సాధారణంగా 4 ఏళ్లు ఉంటుంది. విదేశాల్లో మాస్టర్స్ రెండేళ్లు చేయాలి. కానీ ఈ ఎంవోయూ ప్రకారం ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్ అండ్ మాస్టర్స్ ఇన్ ప్రొఫెషనల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ కోర్సును ఐదున్నరేళ్లలోనే పూర్తి చేయవచ్చు. జేఎన్టీయూ మూడున్నరేళ్ల తర్వాత ఇంజనీరింగ్ డిగ్రీ ఇస్తుంది. ఆ తర్వాత ఏడాదిన్నర జర్మనీలోని భాగస్వామ్య విశ్వవిద్యాలయాల్లో మాస్టర్స్ డిగ్రీ చేయాల్సి ఉంటుంది. అక్కడి వర్సిటీలు మాస్టర్స్ డిగ్రీ ఇస్తాయి. డిగ్రీ, మాస్టర్స్ కలిపి మొత్తం 120 క్రెడిట్స్ ఉంటాయి.

## ప్రయోజనాలేంటి?

జర్మనీ విశ్వవిద్యాలయాలు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యంతో కూడిన ప్రాక్టికల్ సిలబస్‌ను అందిస్తాయి. రెండు విశ్వవిద్యాలయాల నుంచి డిగ్రీ అందుతుంది. వీసా, అడ్మిషన్ ప్రక్రియను జర్మన్ వర్సిటీలే చూసుకుంటాయి. విదేశీ అనుభవం విద్యార్థులకు దక్కుతుంది. ఆధునిక సదుపాయాలతో పరిశోధనలకు అవకాశం ఉంటుంది. జర్మన్ యూనివర్సిటీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు ప్రాధాన్యమిస్తాయి.

### గ్లోబల్ కెరీర్ పెరుగుతుంది



విదేశీ విద్యను కోరుకునే విద్యార్థులకు ఈ డ్యూయల్ డిగ్రీలు ఉపయోగపడతాయి. స్కిల్‌తో కూడిన అంతర్జాతీయ అనుభవం పొందవచ్చు. పైగా వీసా, విదేశీ వర్సిటీ ప్రవేశం సులువు అవుతుంది. సమయం కూడా కలిసి వస్తుంది.
– డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, జేఎన్టీయూహెచ్ రెక్టార్

## క్లుప్తంగా...

### మోదీ 11ఏళ్ల పాలనపై 22న భారీ సభ

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వెల్లడి


కంటోన్మెంట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

**సాక్షి, హైదరాబాద్:** ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 22న ఇంపీరియల్ గార్డెన్స్‌లో భారీ సభ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ ఈటల రాజేందర్ వెల్లడించారు. ఈ సభకు కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌తో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మోదీ 11 ఏళ్ల పాలన, ఏడాదిగా మల్కాజిగిరి ఎంపీగా తన పాత్రపై ఈ సభను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఆయన ఇంపీరియల్ గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాళేశ్వరం వంటి పెద్ద ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం లేకుండా ఉంటుందా? అని ప్రశ్నించారు. తాను కేసీఆర్ మంత్రివర్గంలో ఏడేళ్లు మంత్రిగా పనిచేశానని, అయితే ప్రాజెక్టు నిర్మించడం, అవినీతిని వేరువేరుగా చూడాలని అన్నారు. ప్రాజెక్టులు నిర్మించడం మంచిదే కానీ, వాటిని అడ్డం పెట్టుకొని సంపాదించడాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. అధికారం అడ్డం పెట్టుకొని టెండర్ లేకుండా పనులు పంచుకోవడం తప్పని, కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్న కల్చర్‌ను తప్పు పడుతున్నామని అన్నారు.

### ఫీజు బకాయిలు ఎప్పుడిస్తారు?

ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి ఆగ్రహం



**సాక్షి, హైదరాబాద్:** పోస్టుమెట్రిక్ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7,500 కోట్లకు చేరాయని, ఈ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ శాసనమండలి సభ్యుడు సి.అంజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు పైచదువులకు, ఉద్యోగాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, గురుకులాలకోసం కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. ఇంజనీరింగ్ కాలేజీలు ఫీజు రెగ్యులేటింగ్ కమిటీ నిబంధనలు పాటించడం లేదని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిమితిని పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కాలేజీల్లో పనిచేసే ఫ్యాకల్టీ సమాచారాన్ని యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు.

# వాహనాలన్నీ కంట్రోల్‌లోనే!

- ప్రజావాహనాలపై నిఘా కోసం ఆర్టీఏలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలు
- వాహనాల కదలికలను నమోదు చేసేందుకు ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు
- మహిళా ప్రయాణికుల భద్రత కోసం చర్యలు
- ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా వాహనాలకు చలానాలు



**సాక్షి, హైదరాబాద్:** పోలీస్ కమాండ్ కంట్రోల్ తరహాలో ఆర్టీఏలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. వివిధ రకాల ప్రజా రవాణా వాహనాల కదలికలను నమోదు చేసేందుకు ఇది దోహదం చేయనుంది. ఖైరతాబాద్‌లోని రవాణా కమిషనర్ కార్యాలయంలో ఈ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. మహిళా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రతిపాదించగా.. తాజాగా కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటుపై రవాణాశాఖ దృష్టి సారించింది. వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను నమోదు చేస్తారు. ఈ వివరాల ఆధారంగా చర్యలు తీసుకొనేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ప్రయాణికుల భద్రతకు ప్రమాదం వాటిల్లినట్లు తెలిసినా వెంటనే అప్రమత్తమయ్యేందుకు అవకాశం లభిస్తుంది. ఆర్టీసీ బస్సులతోపాటు, ప్రైవేట్ బస్సులు, వ్యాన్‌లు, క్యాబ్‌లు, మ్యాక్సీక్యాబ్‌లు, మినీబస్సులు తదితర అన్ని కేటగిరీలకు చెందిన వాహనాలను నిఘాచట్రంలోకి తెచ్చేలా ఈ సెంటర్ పని చేస్తుందని రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. రవాణాశాఖలో నమోదైన ప్రతి ప్రజారవాణా వాహనాన్ని ఈజీగా ట్రాక్ చేసేందుకు ఈ సెంటర్ పని చేస్తుందన్నారు. తయారు చేసే సమయంలోనే వాటికి తప్పనిసరిగా జీపీఎస్ ట్రాకింగ్ సదుపాయం కలిగిన డివైజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. కొన్ని కేటగిరీలకు చెందిన వాహనాలకు ఈ డివైజ్‌లు ఉన్నాయి. పాతవాటికి మాత్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయనున్నారు.

### ప్రమాదకరంగా ప్రయాణం

హైదరాబాద్‌లోనే 8 వేలకు పైగా ప్రైవేట్ బస్సులు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల మధ్య స్టేజీ క్యారేజీలుగా నడిచే బస్సులతోపాటు నేషనల్ పర్మిట్‌లపైన టూరిస్టు బస్సులుగా వివిధ రాష్ట్రాలకు మరికొన్ని రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే కొన్ని ప్రైవేట్ సంస్థలు సైతం కంపెనీల పేరిట నమోదు చేసుకొని ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. అలాగే, 1.2 లక్షల క్యాబ్‌లు, సుమారు 30 వేల మ్యాక్సీక్యాబ్‌లు, మినీబస్సులు ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. ఈ ప్రైవేట్ వాహనాల్లోనే మహిళా ప్రయాణికుల భద్రత తరచుగా ప్రశ్నార్థకమవుతోంది. రాత్రివేళల్లో విధులు ముగించుకొని ఇల్లు చేరుకొనేందుకు అనివార్యంగా క్యాబ్‌లను ఆశ్రయించవలసి వస్తుంది. అలాగే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సైతం పెరిగాయి. ఈ క్రమంలోనే డ్రైవర్‌ల తీరుపట్ల మహిళా ప్రయాణికులు తరచుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అలాగే, హైదరాబాద్ నుంచి దూరప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ బస్సుల్లో డ్రైవర్లు, సిబ్బంది తరచుగా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో వెహికల్ ట్రాకింగ్ అనివార్యంగా మారింది.

### కెమెరా క్లిక్‌మంటుంది..

నిబంధనలను ఉల్లంఘించి నడిచే వాహనాలపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు మరో సాంకేతిక వ్యవస్థను కూడా ఏర్పాటు చేసేందుకు రవాణాశాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం వివిధ ప్రాంతాల్లో ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను ఏర్పాటు చేయనుంది. ఈ కెమెరాలు వాహనాల నంబర్‌ప్లేట్‌లను క్లిక్‌మనిపిస్తాయి. ఈ కెమెరాలను కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేస్తారు. దీంతో సదరు వాహనం ఏ రకమైన నిబంధనలను ఉల్లంఘించి తిరుగుతోందనేది ఇట్టే తెలిసిపోతుంది. దాని ఆధారంగా వాహన యజమానికి నోటీసులు పంపిస్తారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలను బదిలీ చేయకుండానే నడపడం, వాహనబీమా లేకపోవడం, పర్మిట్‌ల కాలపరిమితి ముగిసినా పునరుద్ధరించకపోవడం, ఫిట్‌నెస్ లేకుండా తిరిగే స్కూల్ బస్సులు, వివిధ రకాల వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టేందుకు ఈ కెమెరాలు దోహదం చేస్తాయి. మొదట ప్రయోగాత్మకంగా 30 ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## బీఐఎస్ ధ్రువీకరణ లేకుండా ఐఎస్ఐ ముద్ర వినియోగించడం నేరం: జాయింట్ డైరెక్టర్ సవిత

**సాక్షి, హైదరాబాద్:** ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌తో పాటు ఏ ఉత్పత్తి అయినా బీఐఎస్ ధ్రువీకరణ లేకుండా ఐఎస్ఐ ముద్ర వినియోగించడం నేరమని బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ సవిత అన్నారు. ఐఎస్ఐ ముద్ర కనిపించగానే వస్తువులు కొనేయొద్దని.. వాటిపై ఉండే సీఎంఎల్ నంబరును బీఐఎస్ కేర్ యాప్‌లో ధ్రువీకరించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలన్నారు. అనుమతి లేకుండా ఐఎస్ఐ మార్కును ముద్రిస్తూ పలు హోటళ్లు, వాణిజ్య కేంద్రాల పేర్లతో వాటర్ బాటిళ్లు తయారు చేస్తున్న మూసాపేటలోని ఓ కేంద్రంపై బీఐఎస్ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ దాడుల్లో వేల సంఖ్యలో బాటిళ్లపై లైసెన్సు గడువు ముగిసినా ఐఎస్ఐ ముద్ర వినియోగిస్తున్నట్లు గుర్తించి జప్తు చేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు, నకిలీ ఐఎస్ఐ ముద్ర వాడినట్లు గుర్తిస్తే బీఐఎస్ కేర్ యాప్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.



## పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

- 24 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు
- రెండు దశల్లో కౌన్సెలింగ్
- జూలై 4న తొలి దశ సీట్ల కేటాయింపు
- వచ్చే నెల 18 నుంచి క్లాసులు ప్రారంభం

**సాక్షి, హైదరాబాద్:** పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. గురువారం తెలంగాణ టెక్నికల్ బోర్డు కౌన్సెలింగ్ తేదీలను వెల్లడించింది. పాలిసెట్‌లో అర్హత సాధించిన వారు ఈ నెల 24 నుంచి 28 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తొలి దశ సీట్ల కేటాయింపు జూలై 4వ తేదీన ఉంటుంది. తుది దశ కౌన్సెలింగ్ జూలై 9 నుంచి మొదలవుతుంది. జూలై 15న సీట్లు కేటాయిస్తారు. ఇదే నెల 18 నుంచి పాలిటెక్నిక్ క్లాసులు మొదలవుతాయి. స్పాట్ అడ్మిషన్లు జూలై 30వ తేదీ నాటికి ముగించాలని బోర్డు నిర్ణయించింది. రాష్ట్రంలో 114 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీలు ఉండగా, వీటిల్లో 28,590 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా కేసముద్రం, పటాన్‌చెరులో పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటు చేశారు. వీటిల్లో కూడా ఈ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తారు.

| పాలిసెట్ కౌన్సెలింగ్ ముఖ్యమైన తేదీలు | |
|---|---|
| **తొలి దశ కౌన్సెలింగ్** | |
| ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ | 24.6.25 నుంచి 28.6.25 వరకు |
| ఆప్షన్లు | 26.6.25 నుంచి 1.7.25 |
| సీట్ల కేటాయింపు | 4.7.25 |
| సెల్ఫ్ రిపోర్టింగ్ | 4.7.25 నుంచి 6.7.25 |
| **ఫైనల్ ఫేజ్** | |
| ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ | 9.7.25 నుంచి 10.7.25 |
| ఆప్షన్లు | 11.7.25 నుంచి 12.7.25 |
| సీట్ల కేటాయింపు | 15.7.25 |
| సెల్ఫ్ రిపోర్టింగ్ | 15.7.25 నుంచి 17.7.25 |
| ఓరియంటేషన్ ప్రోగ్రాం | 15.7.25 నుంచి 17.7.25 |
| క్లాసులు మొదలు | 18.7.25 |
| అంతర్గత స్లైడింగ్ | 21.7.25 నుంచి 24.7.25 |
| స్పాట్ అడ్మిషన్లు | 30.7.25 |

## భవిష్యత్తులో అన్నీ 'టెక్' యుద్ధాలే!

- ఐఐఎం ఇండోర్ డైరెక్టర్ ప్రొఫెసర్ హిమాన్షు రాయ్
- ఎంసీఈఎంఈ 107వ స్నాతకోత్సవంలో డిగ్రీల ప్రదానం



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ రోబోటిక్స్, మెషీన్ లెర్నింగ్, మానవరహిత వ్యవస్థల వంటి అధునాతన సాంకేతికతలు సమకాలీన, భవిష్యత్ యుద్ధాలలో అత్యంత కీలకంగా మారుతున్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఇండోర్ డైరెక్టర్ ప్రొఫెసర్ హిమాన్షు రాయ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎంసీఈఎంఈ) 107వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన, ఎంసీఈఎంఈలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సు పూర్తి చేసిన 43 మంది అధికారులకు బీటెక్ డిగ్రీలను ప్రదానం చేశారు. 20 మంది అధికారులకు బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ డిగ్రీలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హిమాన్షు రాయ్ మాట్లాడుతూ.. సైనిక, పౌర రంగాలలో నీతి, ధైర్యం, మేధో చురుకుదనం ఉన్న నాయకత్వం ఎంతో అవసరమని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో సాయుధ బలగాలు అద్భుతంగా పనిచేశాయని కొనియాడారు. ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షేయ్ మాట్లాడుతూ, ఎంసీఈఎంఈ అందించే శిక్షణ మన అధికారులు సాంకేతిక, కార్యాచరణ రంగాలలో అగ్రగామిగా నిలుపుతుందని తెలిపారు. లెఫ్టినెంట్ డి.సుభాష్ ఉత్తమ విద్యార్థిగా డీజీ ఈఎంఈ బంగారు పతకాన్ని జీఓసీ ఇన్ సీఆర్ ట్రాక్ ట్రోఫీలను అందుకున్నారు. లెఫ్టినెంట్ అభినవ్ నాయర్, లెఫ్టినెంట్ ఆదర్శ్ కుమార్ సింగ్ వరుసగా మెకానికల్, ఎలక్ట్రానిక్స్ స్ట్రీమ్‌లలో మొదటి స్థానం సాధించి కమాండెంట్ వెండి పతకాలు పొందారు.

## 'దోస్త్' రిజిస్ట్రేషన్ గడువు పెంపు




**సాక్షి హైదరాబాద్:** డిగ్రీ అడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న 'దోస్త్' రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు దోస్త్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. డిగ్రీ కాలేజీల ప్రిన్సిపల్స్, లెక్చరర్లు, విద్యార్థుల విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు గురువారం ఒక ప్రకటనలో చెప్పారు. సెకండ్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టు చేసేందుకు గడువును ఈనెల 25 వరకు పెంచినట్టు పేర్కొన్నారు. మరోపక్క ఈనెల 28న థర్డ్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు జూలై 1 వరకూ ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు. ఈనెల 30 నుంచి డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ క్లాసులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. జూలై 1 నుంచి 4 వరకు కాలేజీల్లో ఓరియంటేషన్ క్లాసులు ఉంటాయన్నారు.

## ఇదంజగత్



## 'బ్రహ్మోస్' యూనిట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

- దేవరకద్రలో పర్యటించిన డీఆర్‌డీఎల్ అధికారులు


స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఎల్ అధికారులతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**దేవరకద్ర:** బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయమై ఆసక్తి నెలకొంది. ఇందుకోసం డీఆర్‌డీఎల్ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ) బృందం వివిధ చోట్ల స్థల పరిశీలన చేస్తోంది. ఇందులో భాగంగా గురువారం డీఆర్‌డీఎల్, బ్రహ్మోస్ డైరెక్టర్ల బృందం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలోని చౌదర్‌పల్లి- బస్వాయపల్లి గ్రామాల శివారులోని ప్రభుత్వ భూమిని పరిశీలించింది. ఇప్పటికే డీఆర్‌డీఎల్‌కు సంబంధించిన వివిధ భవనాల నిర్మాణం బస్వాయపల్లి శివార్లలో చేపట్టగా, ప్రస్తుతం మిస్సైల్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నారు. జనరల్ ఆఫ్ బ్రహ్మోస్ డైరెక్టర్ డాక్టర్ జైతీర్థ్ జోషి, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాస్‌మూర్తి, బ్రహ్మోస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.సాంబశివప్రసాద్‌తోపాటు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. ఇక్కడున్న 299 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు గతంలో సేకరించిన 200 ఎకరాలు కలుపుకొని దాదాపు 500 ఎకరాల స్థలం ఉన్నట్టు తహసీల్దార్ మ్యాప్‌ను చూపించారు. డీఆర్‌డీఎల్ అధికారులు స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, గతంలో మినీ విమానాశ్రయం ఏర్పాటు కోసం కూడా ఇదే స్థలాన్ని ఎంపిక చేశారు. తర్వాత ఈ అంశం మరుగున పడింది. ప్రస్తుతం మళ్లీ అదే స్థలాన్ని బ్రహ్మోస్, డీఆర్‌డీఎల్ బృందం పరిశీలించింది.

ఎవరైతే పశ్చాత్తాపపడి, విశ్వసించి, సత్కార్యాలు చేస్తాడో అతడు సాఫల్యం పొందేవారిలో చేరగలడని ఆశించవచ్చు!
– ఇస్లాం ధర్మం



సాక్షి
శుక్రవారం, 20 జూన్ 2025

# ఇదెక్కడి దౌత్యనీతి?!

దేన్నయినా ఒకటికి పదిసార్లు చెబితే అది నిజమై కూర్చుంటుందని, ప్రపంచం దాన్ని మాత్రమే విశ్వసిస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గట్టిగా నమ్ముతున్నట్టున్నారు. పాకిస్తాన్ ఉగ్ర ఎత్తుగడను తిప్పికొట్టడానికి మన దేశం 'ఆపరేషన్ సిందూర్'తో అక్కడి ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడులు నిర్వహించింది. దానికి ప్రతిగా భారత్‌పై పాక్ సైన్యం చేసిన దాడుల్ని తిప్పి కొట్టడంతోపాటు పాకిస్తాన్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. గత నెల 6న మొదలై 9వరకూ సాగిన ఈ ఘర్షణలు... ఇరుపక్షాలూ 11న కాల్పుల విరమణ ప్రకటించటంతో ముగిశాయి. కానీ ట్రంప్ వేరే పనిలేనట్టు ఆనాటి నుంచీ 'కాల్పుల విరమణ' తన ఘనతేనంటూ చెప్పుకు తిరుగుతున్నారు. అక్కడితో ఆగలేదు. సంధి కుదుర్చుకోనట్టయితే వాణిజ్య ఒప్పందం ఉండబోదని భారత్‌ను హెచ్చరించాకే ఇది సాధ్యమైందని చెబుతున్నారు. మన దేశం దాన్ని ఖండించినప్పుడు 'అవును... నిజమే. వారిద్దరూ మాట్లాడుకొని సంధి కుదుర్చుకున్నారు. ఇందులో మాపాత్ర లేద'ని నాలుక మడతేస్తుంటారు. మళ్లీ నాలుగు రోజులు గడిచేసరికల్లా పాత పాటే అందుకుంటారు. భారత్, పాకిస్తాన్‌లు కాల్పుల విరమణ ప్రకటించటానికి కొన్ని గంటల ముందు ట్రంప్ ఆ సంగతి వెల్లడించటమైతే వాస్తవం. ప్రకటించటంలో రెండు దేశాలూ కొంత వ్యవధి తీసుకోవటాన్ని ఆసరా చేసుకున్న ట్రంప్ దాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. తాజాగా బుధవారం మరోసారి ఆ పనే చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 35 నిమిషాలసేపు ఆయనతో ఫోన్‌లో సంభాషించారు. 'కాల్పుల విరమణ ప్రతిపాదన ఏ దశలోనూ మీ నుంచి రాలేదు. అలాగే వాణిజ్య ఒప్పందం గురించి ఇంతవరకూ మీ దేశంతో చర్చించలేదు' అని వివరణనిచ్చారు. అక్కడితో అయిందను కుంటే... మరికొన్ని గంటలు గడిచాక మరోసారి ట్రంప్ పాత పాటే వినిపించారు.

రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య కొనసాగుతున్న భీకర యుద్ధాన్ని ఆపటానికి ప్రయత్నించి ఆయన అభాసుపాలయ్యారు. అక్కడ యథావిధిగా పోరు సాగుతోంది. గాజాలో ఇప్పటికి 56,000 మంది పౌరుల్ని ఊచకోత కోసిన ఇజ్రాయెల్‌పై చర్యకు అడ్డుపడటమే కాదు... వారంరోజుల క్రితం దాన్ని ఉసిగొల్పి ఇరాన్‌పై దాడులు చేయించారు. ప్రతి దాడులు చేస్తున్న ఇరాన్‌ను బెదిరిస్తున్నారు. పైగా ఆ దేశంపై సైనిక దాడికి పథక రచన చేస్తున్నారు. పశ్చిమాసియా ఊబిలోకి దేశాన్ని దించవద్దంటూ స్వదేశంలో, స్వపక్షంలో అనేకులు హెచ్చరిస్తున్నా ట్రంప్‌కు పట్టడం లేదు. ఇలాంటి వ్యక్తి భారత్, పాకిస్తాన్‌ల మధ్య సంధి కుదిర్చానని ఎలా చెప్పుకుంటారో అనూహ్యం. కశ్మీర్ సమస్యపై గానీ, భారత్–పాక్‌ల మధ్య ఉన్న ఇతరేతర సమస్యలపై గానీ మూడో పక్షం జోక్యాన్ని అంగీకరించబోమని దశాబ్దాలుగా భారత్ చెబుతూనే ఉంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఈ వైఖరే కొనసాగుతోంది. తాజాగా మోదీ ప్రభుత్వం దీన్ని మరికాస్త సవరించింది. మూడో పక్షం జోక్యాన్ని ఒప్పుకోబోమని చెబుతూనే ముున్ముందు పాకిస్తాన్‌తో చర్చలంటూ జరిగితే ఆక్రమిత కశ్మీర్(పీఓకే) పైనా, ఉగ్రవాదుల అప్పగింత పైనా మాత్రమేనని స్పష్టం చేసింది. ట్రంప్‌తో సంభాషించినప్పుడు పెహల్‌గామ్ ఉగ్రదాడి, ఆ తర్వాత జరిగిన 'ఆపరేషన్ సిందూర్' మొదలుకొని అన్ని విషయాలూ మోదీ పూసగుచ్చినట్టు చెప్పారని, ఇక నుంచి ఉగ్రదాడిని పరోక్ష యుద్ధంగా పరిగణించదల్చుకోలేదని, దాన్ని యుద్ధంగానే చూస్తామన్నారని మన విదేశాంగ కార్యదర్శి మిస్రీ తెలియజేశారు.

జిత్తులమారితనం దౌత్యం అనిపించుకోదు. స్పష్టంగా, పారదర్శకంగా, అరమరికలు లేకుండా వ్యవహరించినప్పుడే ఎంతటి సంక్లిష్ట సమస్యయినా దారికొస్తుంది. దౌత్యం విజయవంతమవుతుంది. బెదిరింపులకు దిగటం, బెదిరించానని గొప్పలుపోవటం దౌత్యమెలా అవుతుంది? తన వ్యాపారాన్ని విస్తరించుకోవటానికీ, ప్రత్యర్థులపై పైచేయి సాధించటానికి పూర్వాశ్రమంలో నేర్చుకున్న కళలన్నీ ట్రంప్ వైట్‌హౌస్‌లో ప్రదర్శిస్తున్నట్టు కనబడుతోంది. దీన్ని వదిలించుకోనట్టయితే నవ్వులపాలవుతానన్న ఆలోచన ఆయనకు స్ఫురిస్తున్నట్టు లేదు. ఉగ్రవాదులకు పాక్ సైన్యం ఊతమిస్తున్న వైనం స్పష్టంగా కనబడుతున్నా ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు బుధవారం విందుకు ఆహ్వానించారు. అది ఆయన ఇష్టం. కానీ అదే రోజు మోదీ అక్కడుండాలని కోరుకోవటం, వేరే దేశాల పర్యటన రద్దుచేసుకుని వాషింగ్టన్ రమ్మనటం హుందాతనం అనిపించుకుంటుందా? పరస్పరం కత్తులు దూసుకుంటున్న వైరిపక్షాలను ఒకేసారి పిలవటం తెలివితక్కువతనం అనుకోవాలా? అతి తెలివి అనుకోవాలా? ఒకపక్క కశ్మీర్ సమస్యను అంతర్జాతీయం చేయటం సమ్మతం కాదని మన దేశం పదే పదే చెబుతున్నా ఈ మూర్ఖత్వం దేనికి? రేపో మాపో ఇరాన్‌పై తాము దండెత్తితే రీఫ్యూయలింగ్ కోసం పాకిస్తాన్ అవసరపడుతుంది. అందుకోసం ఆ దేశాన్ని దువ్వుతూ మనల్ని ఉద్ధరించటానికి కంకణం కట్టుకున్నట్టు ఈ కపటనాటకం ఎందుకు?

జీ7 శిఖరాగ్ర సదస్సు నుంచి హడావిడిగా నిష్క్రమించనట్టయితే, అక్కడ మోదీ ప్రసంగాన్ని నేరుగా విన్నట్టయితే ట్రంప్‌కు విషయం కాస్తయినా అర్థమయ్యేది. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్న పాశ్చాత్య దేశాలను మోదీ నిశితంగా విమర్శించారు. సొంత కారణాలతో కొన్ని దేశాలపై ఆంక్షలు పెడుతూ, ఉగ్రవాదుల్ని ఉసిగొల్పే దేశాలను మాత్రం నెత్తిన పెట్టుకుంటున్నారని మోదీ చెప్పారు. అయినా ట్రంప్ ధోరణి మారలేదు. ఈ పరిస్థితుల్లో ఇరాన్‌తో సహా అన్ని అంతర్జాతీయ అంశాల్లోనూ స్వతంత్ర విధానం పాటించటమే మనకు శ్రేయస్కరం. ద్వంద్వ నీతిని అనుసరించేవారికి తమ స్థానం ఏమిటో చెప్పనట్టయితే మనమే నష్టపోతాం.

# యాభై ఏళ్ల చీకటి గాయం

సందర్భం



డా॥ గోపరాజు నారాయణరావు

ఏదైనా చారిత్రక పరిణామం మీద సరైన అంచనాకు రావడానికి యాభై ఏళ్ల కాలం విశేషంగా దోహదం చేయగలదు. చరిత్రను పునర్లిఖించుకునే బాధ్యత ప్రతి తరం మీద ఉందన్న వాస్తవాన్ని గుర్తిస్తే, 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలాన్నీ, దాని ఫలితాలనూ అర్థం చేసుకోవడానికి ఇది సరైన సమయమే. ఎమర్జెన్సీ విధించిన వారు దేశానికి స్వాతంత్ర్యం తెచ్చామని చెప్పే పార్టీ వారు కావచ్చు. అయినా చరిత్ర తీర్పు ముందు అంతా సమానమే. ఎమర్జెన్సీ దేశంలో 'క్రమశిక్షణ' తెచ్చిందా? లేక చీకటి యుగంలోకి నెట్టిందా?

### ప్రేరేపించిన కారణాలేమిటి?

1975 జూన్ 25 అర్ధరాత్రి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ, కేంద్ర మంత్రిమండలి సిఫారసుతో రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ ఎమర్జెన్సీ ప్రకటించారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 352లోని 1వ నిబంధన ఆ అధికారాన్ని రాష్ట్రపతికి ఇచ్చింది. అంతరంగిక భద్రతకు తీవ్ర విఘాతం వాటిల్లితే రాష్ట్రపతి ఈ అసాధారణ చర్య తీసుకుంటారు.

ఎమర్జెన్సీ విధించిన సమయానికి దేశంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయి? అవి రాజ్యాంగం నిర్దేశించినట్టు ఉన్నాయా? 1974 జనవరి నుంచి చూసినా ఆ పరిస్థితులు కానరావు. కొంచెం గట్టిగా కనిపించే పరిణామం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్(జేపీ) సంపూర్ణ విప్లవం మాత్రమే. మెస్‌చార్జీలు తగ్గించాలన్న డిమాండ్‌తో మొదలై, రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్న స్థాయికి వెళ్లిన గుజరాత్ విద్యార్థి ఆందోళన ఉంది. 1975 జనవరిలో సమస్తిపూర్(బిహార్)లో రైల్వే మంత్రి ఎల్ఎన్ మిశ్రా సభలో బాంబు పేలి, ఆయన చనిపోయారు. దీనిని జేపీ ఉద్యమంతో ముడిపెట్టలేక పోయారు. సంపూర్ణ విప్లవానికి మద్దతుగా పార్లమెంటుకు జనతా మార్చ్ నిర్వహించాలని విపక్షాలన్నీ (సీపీఐ మినహా) నిర్ణయించాయి. ఈ మధ్యలో జరిగిన మరొక అనూహ్య పరిణామం, రాయ్‌బరేలీ ఎన్నిక పిటిషన్‌పై మార్చి 18న అలహాబాద్ హైకోర్టు బోనులో ఇందిర నిలబడటం. గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని మొరార్జీ దేశాయ్ ప్రారంభించిన నిరాహార దీక్షను ఏప్రిల్ 13న విరమించారు. ఎన్నికలు జరిపించడానికి ఇందిర సుముఖత వ్యక్తం చేశారు.

అయినా స్వతంత్ర భారత చరిత్రను మలుపు తిప్పిన అత్యవసర పరిస్థితి వంటి తీవ్ర నిర్ణయం ఇందిర ఎందుకు తీసుకున్నారు? రెండు తక్షణ కారణాలు. 1971 నాటి సాధారణ ఎన్నికలలో రాయ్‌బరేలీ నియోజక వర్గం నుంచి ఇందిర ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగ్‌మోహన్‌లాల్‌సిన్హా 1975 జూన్ 12న తీర్పు ఇవ్వడం. ఇందిరపై పోటీ చేసి ఓడిన సోషలిస్ట్ నాయకుడు రాజ్ నారాయణ్ ఈ కేసు వేశారు. అదే రోజు గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజా తీర్పు వచ్చింది. కాంగ్రెస్ ఓడి, జన మోర్చా గెలిచింది. రెండోది: అలహాబాద్ హైకోర్టు తీర్పు మీద శాశ్వత స్టే ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టుకు వెళితే జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్ 1975 జూన్ 25న షరతులతో కూడిన స్టే మాత్రమే ఇచ్చి, ఇందిరకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సభలో ఓటు హక్కు లేకుండా చేయడం. న్యాయ వ్యవస్థ చేసిన ఈ రెండు నిర్ణయాలు, గుజరాత్ ప్రజాతీర్పు ఆమెను ఇరకాటంలోకి నెట్టాయి. కాంగ్రెసేతర పక్షాలు ఇందిర పదవిలో కొనసాగడానికి అనర్హులని ప్రకటిస్తూ ఆ సాయంత్రం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సభ నిర్వహించి కొత్త ఉద్యమం కోసం లోక్‌సంఘర్ష సమితిని ప్రకటించాయి. ఆ అర్ధరాత్రి రాష్ట్రపతి ఎమర్జెన్సీ ప్రకటనపై సంతకం చేశారు. మరునాడు ఉదయం ఆరు గంటలకు ఇందిర నివాసంలో జరిగిన సమావేశంలో మంత్రి మండలి ఎమర్జెన్సీ ప్రతిపాదనను లాంఛనంగా ఆమోదించింది. ఎమర్జెన్సీ విధించిన సంగతి అప్పటి కేంద్ర హోంమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి రాష్ట్రపతి సంతకం పడిన తరువాత తెలిసింది.



◆ ఇందిరాగాంధీ భారత పాలనా వ్యవస్థకు కొత్త రూపం ఇవ్వాలనుకున్నారు. అధ్యక్ష తరహా పాలనలోనే దేశాభివృద్ధి సాధ్యమన్న ఒక వాదాన్ని అప్పటికే ప్రచారంలో పెట్టారు.

◆ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవ్‌కాంత్ బారువా 'ఇందిరే ఇండియా, ఇండియా అంటే ఇందిర' అన్నారు. మరొక నినాదం కూడా ఇచ్చారు: 'వర్తమాన పరిస్థితులలో భారత దేశానికి అసలు ప్రతిపక్షమే అవసరం లేదు' అని.

◆ ఆనాడు లోక్‌సభలో ప్రతిపక్షాలన్నింటి బలం అరవై లోపే! కానీ, లోక్ సంఘర్ష సమితి ఆధ్వర్యంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా చరిత్రాత్మక ఉద్యమమే జరిగింది.

### ప్రతిపక్షం అవసరం లేదా?

ఇందిర భారత పాలనా వ్యవస్థకు కొత్త రూపం ఇవ్వాలనుకున్నారు. దేశాభివృద్ధి అధ్యక్ష తరహా పాలనలోనే సాధ్యమన్న ఒక వాదాన్ని అప్పటికే ప్రచారంలో పెట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు దేవ్‌కాంత్ బారువా 'ఇందిరే ఇండియా, ఇండియా అంటే ఇందిర' అన్నారు. మరొక నినాదం కూడా ఇచ్చారు. 'వర్తమాన పరిస్థితులలో భారత దేశానికి అసలు ప్రతిపక్షమే అవసరం లేదు' అని! నాటి హరియాణా ముఖ్యమంత్రి ఇందిరను జీవితకాలపు అధ్యక్షురాలిగా (పార్టీకి), తద్వారా యావజ్జీవితం దేశ ప్రధానిగా చూడాలని కోరుకున్నారు.

ప్రచ్ఛన్న యుద్ధ నేపథ్యం కూడా ఇందిర చర్యకు ప్రాతిపదిక ఇచ్చాయి. 'సోవియెట్ నాయకుల సలహాతో దేశంలో అత్యవసర పరిస్థితి విధించినట్లు అర్థమైంది. సోవియెట్‌లో అసంతృప్తి వ్యక్తం చేసిన వారిని సైబీరియాకు పంపిస్తారు. ఇక్కడా ప్రతిపక్షాల వారిని అదే విధంగా జైళ్ల పాలు చేశారు.' మాజీ గవర్నర్, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి సుర్జీత్ సింగ్ బర్నాలా రాసిన 'క్వెస్ట్ ఫర్ ఫ్రీడమ్: స్టోరీ ఆఫ్ ఏన్ ఎస్కేప్' గ్రంథంలోని వాక్యాలివి. బర్నాలా ఎమర్జెన్సీ బాధితుడే. 'చిలీ పాలకుడు సాల్వెడార్ అలెండి తరువాత నిన్నే అమెరికా లక్ష్యంగా చేసుకుంది' అంటూ క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రో చేసిన హెచ్చరికతోనే ఇందిరాగాంధీ ఆగమేఘాల మీద అత్యవసర పరిస్థితిని విధించారన్న వాదన గురించి సంజయ బారు ప్రస్తావించారు.

1975 జూన్ 25 అర్ధరాత్రి రెండు, మూడు గంటల మధ్య జయప్రకాశ్ నారాయణ్‌ను, మొరార్జీ దేశాయ్‌ని పోలీసులు అరెస్టు చేశారు. మరునాడు ఉదయం జనసంఘ్ నాయకులు వాజ్‌పేయి, అడ్వాణీ, మధు దండావతే, మరికొందరిని బెంగళూరులో అరెస్టు చేశారు. ఆంధ్రలో పెద్దలు గౌతు లచ్చన్న, తెన్నేటి విశ్వనాథం, జూపూడి యజ్ఞనారాయణ, యలమంచిలి శివాజీ వంటి వారిని అరెస్టు చేశారు. దేశం మొత్తం మీద ఎమర్జెన్సీ పేరుతో ఆ 21 మాసాలలో దాదాపు లక్ష మందిని అరెస్టు చేశారు. 7 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

### ఎదురు దెబ్బ తప్పదు!

ఎమర్జెన్సీ విధించిన వెంటనే తీసుకున్న చర్య సెన్సార్ షిప్. దీనితో దాదాపు భారతీయ పత్రికలన్నీ మూగబోయాయి. ఇది జూన్ 26 నుంచి అమలులోకి వచ్చింది. ఆర్ఎస్ఎస్, ఆనందమార్గ్, జమాతే ఇస్లాం, సీపీఐ (ఎం.ఎల్.)లతో సహా 26 సంస్థలపై నిషేధం విధించారు. న్యాయమూర్తులను బదిలీ చేశారు. క్రమశిక్షణ పేరుతో వందలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు.

ఆనాడు లోక్‌సభలో ప్రతిపక్షాలన్నింటి బలం అరవై లోపే! కానీ, లోక్ సంఘర్ష సమితి ఆధ్వర్యంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా చరిత్రాత్మక ఉద్యమమే జరిగింది. దాంతో లోక్‌సభకు తాజాగా ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఇందిర 1977 జనవరి 18న ఆకాశవాణి ప్రసంగంలో వెల్లడించారు. 1977 జనవరి 20న జనతా పార్టీ ఆవిర్భవించింది. ఆ ఎన్నికలో జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇందిరాగాంధీ, సంజయ్‌గాంధీ కూడా ఓడిపోయారు. 1977 మార్చి 21న తాత్కాలిక రాష్ట్రపతి బి.డి. జెట్టి ఎమర్జెన్సీని రద్దు చేశారు.

ఎమర్జెన్సీ అంటే కొందరు విపక్షాల నాయకుల అర్ధరాత్రి అరెస్టులు మాత్రమే కాదు. కోటీ పదకొండు లక్షల మందికి జరిగిన బలవంతపు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు; మీసా, డిఫెన్స్ ఇండియా రూల్స్ పేరుతో లక్షా పద మూడు వేల మంది అమాయకుల అక్రమ అరెస్టులు; స్వాతంత్ర్య పోరాటం స్ఫూర్తితో ఏర్పడిన రాజ్యాంగానికి జరిగిన తీరని అవమానం. అన్నింటికీ మించి భారతీయ ఆత్మకు అది పెద్ద గాయం. న్యాయ వ్యవస్థ, పత్రికా రంగం భంగపడి ప్రజాస్వామ్యం బలహీన మైంది.

ఇక అత్యవసర పరిస్థితి, తదితర పరిణామాల ద్వారా కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రత్యర్థిని తానే సిద్ధం చేసుకుంది. బీజేపీ అనే ఒక రాజకీయ పక్షం అలా దేశ రాజకీయ రంగం మీదకు వచ్చింది.

వ్యాసకర్త 'జాగృతి' సంపాదకుడు | 98493 25634

## సోషల్ మీడియా

### అమెరికా ప్లాన్?



అమెరికా పెద్ద పథకం ఏమిటంటే– పాకిస్తాన్‌కు మరింత అణు శక్తిని కల్పించడం, ఇరాన్‌లో తోలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పరచడం; పాక్, ఇరాన్, ఇరాక్, సిరియా, బంగ్లాదేశ్, ఇంకా మయన్మార్‌లోని చీలిక వర్గాలతో 'బాగ్దాద్ ఒడంబడిక' లాంటి ఒక కూటమిని ఏర్పరచి చైనా, ఇండియాలను బలహీన పరచడం! ఈ పథకంలో భాగంగానే ఇరాన్ అణు పదార్థాలను పాక్‌కు పంపే యోచన చేస్తున్నారు.

– దివ్యకుమార్ సోతీ, కాలమిస్ట్

### తనిఖీల సమయం



ఢిల్లీ నుంచి వెళ్తున్న ఇండిగో విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే తిరిగొచ్చింది. 72 గంటల్లో సాంకేతిక సమస్యల వల్ల 30కి పైగా విమానాలు రద్దయ్యాయి. గత పదేళ్లలో భారత విమానయానం ప్రచండంగా వ్యాపించింది. దానివల్ల కొన్ని ఆదరాబాదరాగా జరిగాయి. ప్రాథమిక భద్రతా సమస్యలను ఏ రాజీ లేకుండా గుర్తించడానికి ఇదే సమయం.

– ఎం.కె. వేణు, సంపాదకుడు

### మనకేం పని?



నెతన్యాహూ యూఎస్ అధ్యక్షుడు కాదు. యూఎస్ విదేశాంగ, సైనిక విధానాలను ఆయన నిర్ణయించకూడదు. ఇరాన్‌తో యుద్ధం చేయాలన్న ఆయన నిర్ణయాన్ని ఇజ్రాయెల్ ప్రజలు ఆమోదిస్తే అది వాళ్లిష్టం. అందులో యూఎస్ భాగం కాకూడదు.

– బెర్నీ శాండర్స్, యూఎస్ సెనేటర్

### స్వశక్తితోనే...



ఏళ్లుగా పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఉన్నప్పటికీ, మన చాలా నగరాల కంటే తెహ్రాన్ శుభ్రంగా, సమృద్ధిగా కనబడుతోంది.

– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

### చిన్నవిగా తేవాలి!



4 నుంచి 6 ఉండే చిన్న ప్యాకెట్లలో కూడా బ్రెడ్లు రావాలి. ఒక్కరే ఉన్నప్పుడు అంత పెద్ద ప్యాకెట్ తీసుకుంటే అది మామూలుగా పాడైపోతుంది. ఒక శాండ్‌విచ్ చేసుకోవాలనుకున్నప్పుడు, మొత్తం బ్రెడ్ ప్యాకెట్ ఎందుకు కొనాలి?

– ప్రాచీ సింఘాల్, ప్రొడక్ట్ డిజైనర్

ఇన్ బాక్స్

## ఖర్చు లేని మందు

అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) సందర్భంగా 'సంపూర్ణ ఆరోగ్యానికి ఖర్చులేని మందు, మానసిక వికాస సిద్ధి, శరీరం – మనసు మధ్య సమతుల్య సాధనకు సహాయపడేది యోగా ఒక్కటే' అనే నినాదం మార్మోగుతోంది. విశాఖపట్నంలో యోగా ప్రధాన వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనుండడం మరో విశేషం. విద్యాలయాల్లో గతంలో ప్రతిరోజూ ఒక పీరియడ్ 'డ్రిల్ క్లాసు' కోసం కేటాయించేవారు. తొలుత పరుగుతో పాటు ఆపై అనేక క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి పీఈటీ, ఎంపీఈడీ, బీపీఈడీ టీచర్లు, అధ్యాపకులు ఉండేవారు. ఆపై వేలాది మంది శిక్షకులు విద్యార్థులకు క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చే వారు. విద్యాలయాల్లో రానురాను వీరి నియామకాలు నిలిచిపోవడంతో, ఏకంగా పలు క్రీడాంశాలే మటు మాయమయ్యాయి.



గతంలో ప్రతి ఏటా జోన్, సెంట్రల్ జోన్, జిల్లా, రాష్ట్రస్థాయుల్లో జరిగే క్రీడాపోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనేవారు. ఇవి వారిలో పోటీతత్వాన్ని పెంపొందించేవి. ప్రస్తుతం జిల్లా స్థాయిలో మొక్కుబడిగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. వీటిలోనూ అనేక విద్యాలయాలకు కనీస ప్రాతినిధ్యం కూడా లభించడం లేదు. నేడు అనేక పాఠశాలలు, కళాశాలల్లో క్రీడాపరికరాలు సైతం మచ్చుకైనా కనిపించడం లేదు. ఇక విద్యాలయాల్లో వ్యాయామ విద్యకు చోటెక్కడున్నట్టు? అలాగే, ప్రభుత్వ గుర్తింపు పొందిన వేలాది పాఠశాలలు జానెడు ఖాళీ స్థలానికి కూడా నోచుకోని అపార్ట్‌మెంట్లలో నడుస్తున్నాయి. కచ్చితంగా ఆటస్థలం ఉండాలనే విద్యాశాఖ నిబంధనలున్నా, ఫలితం మాత్రం శూన్యం!

యోగా, వ్యాయామ విద్యల మధ్య పెద్దగా తేడాలేమీ లేవు. రెండింటిలోనూ శారీరక భంగిమలు 70 శాతం సమానం. వ్యాయామంలో తొలుత రన్నింగ్ ఉంటే, యోగాలో మెడిటేషన్ ఉంటుంది. రన్నింగ్ తర్వాత యోగా చేస్తే సత్ఫలితాలు ఉంటాయని నిపుణులు కూడా చెబుతున్నారు. అయితే, ఆధునిక కాలానుగుణంగా వ్యాయామ విద్యలో అవసరమైన మార్పు–చేర్పులు చేసి, ఉన్నత పాఠశాలల్లోని ప్రతి విద్యార్థీ విధిగా నిత్యం 'స్పోర్ట్స్ పీరియడ్'లో పాల్గొనేలా ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకోగలిగితే... యోగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందని చెప్పడంలో సందేహించాల్సింది లేదు.

– నిమ్మరాజు చలపతిరావు (రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం)

# నిర్లక్ష్యం వల్లే... ఈ ఘోర ప్రమాదం

అభిప్రాయం



ఎస్. వేణుగోపాల్

ఒక ప్రమాదం, అందులోనూ పెద్ద ఎత్తున ప్రాణ నష్టం, జరగగానే ఒకటి రెండు రోజులు గగ్గోలు పెట్టడం, ఆ ప్రమాద కారణాలను గుర్తించి సవరించే పని ఎంత మాత్రమూ చేయకుండా మరొక ప్రమాదం దాకా మౌనంగా ఉండిపోవడం మన సమాజానికీ, రాజకీయ నాయకత్వానికీ, ప్రచార సాధనాలకూ బాగా అలవాటు అయిపోయింది. నిజానికి సమాజం మొత్తంగా ఇందులో చేయగలిగినదేమీ లేదు. ఆ బాధ్యత రాజకీయ నాయకత్వాలదీ, ప్రభుత్వాలదీ, అధికార వ్యవస్థలదీ! ఒక ప్రమాదం జరగగానే కూలంకుషంగా అధ్యయనం చేసి, ప్రమాద కారణాలను అన్వేషించి, మరొకసారి అటువంటి ప్రమాదం జరగడానికి వీలులేని విధంగా ఆ కారణాలన్నిటినీ తొలగించవలసిన బాధ్యత అధికార వ్యవస్థలదే!

అహ్మదాబాద్ విమాన ప్రమాదం అత్యంత విషాదకరమైన, ఘోరమైన ప్రమాదం. టేకాఫ్ అయిన కొద్ది సెకన్లలోనే కూలిపోయి, 241 మంది విమాన ప్రయాణికులు, కనీసం 40 మంది ఇతరులు చనిపోయారు. ఆ ప్రమాదం ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో శాస్త్రీయ విశ్లేషణ జరిపి కారణాలు నిర్ధారించడానికి మూడు నాలుగేళ్లు పడుతుందంటున్నారు. ఈలోగా మన వాట్సప్ కార్ఖానాలూ, వాచాలత్వమే పెట్టుబడిగా నడుస్తున్న ఛానళ్లూ, సంచలనాత్మకమైతే చాలు ఎంత అబద్ధమైనా, ఎంత నిరాధారమైనా మాట్లాడ వచ్చునని అనుకుంటున్న సామాజిక మాధ్యమాలూ చాలా కారణాలను వండి వార్చాయి.

ఈ ప్రమాదానికి సాంకేతిక కారణాలు ఎట్లాగూ అధ్యయనంలో బయటపడతాయి కాని ఈలోగా ఆలోచించవలసిన సామాజిక, రాజకీయార్థిక కోణాల వైపు నుంచి చూస్తే అధికార వ్యవస్థల నిర్లక్ష్యం, లేదా లాభాపేక్షాపరుల అక్రమాలను అధికారులు అవినీతి వల్లనో, సోమరితనం వల్లనో చూసీ చూడనట్టు పోవడం మూల కారణం అని తేలుతుంది.

ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించి 2022 జనవరిలో టాటా గ్రూప్‌కు అప్పగించినప్పటి నుంచీ గడచిన మూడేళ్లలో ఆ సంస్థ నిర్వహణలో భద్రతా లోపాల గురించీ, నిర్వహణ లోపాల గురించీ, నిబంధనల ఉల్లంఘనల గురించీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనేక సార్లు మందలించింది, జరిమానాలు వేసింది, హెచ్చరించింది. విమానాల నిర్వహణలో, కాక్ పిట్ క్రమశిక్షణలో, అంతర్గత జవాబుదారీతనంలో లోపాలను ఎత్తి చూపింది. అర్హత లేని పైలట్లను వాడుతున్నారని 2025 జనవరిలో కూడా ముప్పై లక్షల రూపాయల జరిమానా విధించింది.



◆ సామాజిక, రాజకీయార్థిక కోణాల వైపు నుంచి చూస్తే అధికార వ్యవస్థల నిర్లక్ష్యం, లేదా లాభాపేక్షాపరుల అక్రమాలను అధికారులు అవినీతి వల్లనో, సోమరితనం వల్లనో చూసీ చూడనట్టు పోవడం ఈ ప్రమాదానికి మూల కారణం అని తేలుతుంది.

అహ్మదాబాద్ సర్దార్ వల్లభ్ భాయి పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలో అత్యంత ప్రమాదకర విమానాశ్రయాలలో ఒకటని గతంలోనే పేరు పొందింది. విమానాలకు పక్షుల తాకిడి అతి ఎక్కువగా ఉండే విమానాశ్రయం అది. ఎందువల్లనంటే దాని రన్ వేలు సరాసరిగా కిక్కిరిసిన జనసమ్మర్దపు కాలనీలకూ, భవనాలకూ అంటుకుని ఉంటాయి. రన్ వేకూ నివాస గృహ, భవన సముదాయాలకూ మధ్య ప్రామాణికంగా ఉండవలసినంత దూరం కాదు గదా, కనీసమైన స్థలం కూడా లేదు. అందు వల్ల టేకాఫ్‌లో విఫలమయ్యే విమానం ఆ నివాస గృహాల మీద కూలిపోక తప్పదు. ఆ నివాస గృహాల భవన సముదాయాల కుప్పలో ఒకటి ఇప్పుడు నలభై మంది వైద్య విద్యార్థులు మరణించిన బీజే మెడికల్ కాలేజ్ విద్యార్థి వసతిగృహం.

అయితే ఈ సంగతి ఇప్పుడు, ఇంత ఘోరమైన ప్రమాదం జరిగాక మాత్రమే తెలిసినది కాదు. ఎన్నో భద్రతా అధ్యయనాలు ఈ సంగతి ఎన్నో ఏళ్లుగా చెబుతూనే ఉన్నాయి. విమానాశ్రయ రన్ వే అంచుల్లో నివాస గృహాలు ఉన్నాయనీ, ఆ ఇళ్లవాళ్లు తమ చెత్తను ఈ గోడ ఇవతల పారబోస్తున్నారనీ, అక్కడ పురుగులు చేరి, ఆ పురుగుల కోసం పక్షులు వచ్చి, సరిగ్గా విమానం టేకాఫ్ సమయంలో ఫాన్‌లలోకి పక్షులు ఎగిరే అవకాశం ఉందనీ; అక్కడ నేల చదునుగా లేదనీ, మురికి కాల్వల మాన్ హోల్స్ మీద కప్పులు కూడా లేవనీ ఇదివరకు తెలిసిన విషయాలే. అధ్యయనాలలో, నివేదికలలో రాసినవే. పరిష్కరించాలని సిఫారసులు అందినవే. డీజీసీఏ 2019 నివేదికలోనే అహ్మదాబాద్ విమానాశ్రయం భద్రతా ప్రమాణాలు పాటించడంలో విఫలమయిందని వివరంగా రాసింది. అంతకు ముందే 2018లో 'ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' గుజరాత్ ప్రభుత్వానికి సమర్పించిన ఒక విజ్ఞాపనలో రన్ వే భద్రత కోసం, 29.79 ఎకరాల అదనపు స్థలం కావాలని కోరింది. దానికి గుజరాత్ ప్రభుత్వ ఆమోదం కూడా దొరికింది. కాని అక్కడ ఉన్న 350 కుటుంబాలను తరలించి, స్థలం ఖాళీ చేయించడంలో రాజకీయాలు అడ్డుపడి ఏడు సంవత్సరాలు గడిచినా ఆ పని జరగలేదు.


ప్రస్తుత విమానాశ్రయం మీద ఒత్తిడి తగ్గించే పరిష్కారంగా ధోలేరాలో పదివేల ఎకరాలలో రెండో విమానాశ్రయాన్ని 2022లో ప్రకటించారు. అది 2025 కల్లా ప్రారంభమవుతుందన్నారు. దాని ప్రచార కార్యక్రమం నడిచినంతగా నిర్మాణ కార్యకలాపాలు సాగలేదు.

విజయ్ రూపానీ ఐదు సంవత్సరాల పాటు 2016 నుంచి 2021 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రమాదాల హెచ్చరికలన్నీ ఉన్నాయి. వాటిని నివారించే అవకాశాలూ ఉన్నాయి. కాని నిర్లక్ష్యమే రాజ్యమేలింది. ప్రస్తుత విమాన ప్రమాదంలో రూపానీ విషాదకర మరణానికి ఆ నిర్లక్ష్యమూ కారణమే!

వ్యాసకర్త 'వీక్షణం' ఎడిటర్

## కృతజ్ఞత

కృతజ్ఞత, పరోపకారం మనిషికి రెండు కళ్ళలాంటివి. పరిస్థితుల ప్రభావం వల్ల తనకు ఆశ్రయం ఇచ్చినవారి స్థితి తలకిందులైనప్పుడు, తప్పించుకుని వెళ్ళిపోకుండా వారి వెంట ఉండి మనోబలాన్ని ఇవ్వటం మంచి వ్యక్తిత్వ లక్షణం. కాశీ దేశంలో ఒక వేటగాడున్నాడు. అతడు ఒకనాడు వేటకు వెళ్లి, విషపూరితమైన బాణాన్ని ఒక లేడిపై ప్రయోగించాడు. అది గురి తప్పి చెట్టుకు గుచ్చుకుంది. పూలతో, కాయలతో కళకళ లాడుతున్న చెట్టు మాడిపోయి, మోడు మిగిలింది. ఆ చెట్టు తొర్రలో ఒక చిలుక చాలా కాలంగా నివసిస్తోంది. ఇన్నాళ్లు తనకా చెట్టు ఆశ్రయమిచ్చిందనే గౌరవ భావంతో చిలుక చెట్టును వదలకుండా అక్కడే ఉండిపోయింది.




అప్పుడు ఇంద్రుడు, ఆ చిలుక దగ్గర కొచ్చి, 'ఈ అడవిలో ఇంకా ఫల సమృద్ధి గల చెట్లు చాలా ఉన్నాయి కదా! ఇంకా ఈ ఎండిన చెట్టునే ఆశ్రయించుకుని ఉన్నావెందుకు?' అనడిగాడు. ఆ చిలుక పూర్వజన్మ జ్ఞానంతో అతనిని గుర్తించి, 'చెట్టు బాగున్నప్పుడు ఉండటం, ఎండినప్పుడు వదిలిపోవటం కృతఘ్నత కాదా మహేంద్రా!' అంది. ఇంద్రుడు తనని గుర్తు పట్టిన ఈ చిలుక చాలా గొప్పది అని భావించి, ఈ చిలుకకి మేలు చేయాలి అనుకున్నాడు. 'నీ మాటలు నాకు ఆనందాన్నిచ్చాయి, ఏదైనా వరం కోరుకొమ్మ'న్నాడు. అప్పుడు చిలుక ఆ చెట్టుకు పూర్వ వైభవాన్నిమ్మని కోరింది. ఇంద్రుడు అమృతం చల్లి ఆ చెట్టుకు పూర్వ వైభవం కన్నా గొప్ప వైభవాన్నిచ్చాడు.

చిలుక తనకు ఏ మేలు కోరుకోకుండా తనకు ఆశ్రయం ఇచ్చిన చెట్టు మేలు కోరింది. అది నిజమైన ఆశ్రిత లక్షణం.


– డా॥ చెంగల్వ రామలక్ష్మి

**గ్రహం అనుగ్రహం**

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.నవమి ఉ.6.32 వరకు, తదుపరి దశమి తె.4.13 వరకు (తెల్లవారితే శనివారం), **నక్షత్రం:** రేవతి రా.7.16 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ఉ.8.00 నుండి 9.30 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.59 వరకు, తదుపరి ప.12.26 నుండి 1.18 వరకు, **అమృత ఘడియలు:** సా.4.57 నుండి 6.28 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.32.

# ఒక్కమాటే.. మంత్రము

మనం ఆన్‌లైన్లో ఏదైనా కొనాలన్నా.. ఆహారం ఆర్డర్ చేయాలన్నా.. బైక్/కారు బుక్ చేయాలన్నా.. ఏ భాషలోనైనా సమాచారం కావాలన్నా.. ఇకమీదట ఫోన్లో టైప్ చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు. నేరుగా ఏం కావాలో 'మాట' మాత్రంగా చెప్తే చాలు.. పని జరిగిపోతుంది. దేశంలోని అన్ని భాషలనూ అర్థం చేసుకుని, ఆయా భాషల్లో సేవలు అందించే 'వాయిస్ ఏఐ' రోజులు వస్తున్నాయి. ఇందుకోసం భారత ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన 'ఇండియా ఏఐ మిషన్' జోరందుకుంది. రోజువారీ పనులను చక్కబెట్టుకోడానికీ 'వాయిస్ ఏఐ' అనే కృత్రిమ మేధ మనకోసం 'కార్యేషు కమాండర్'లా సిద్ధం కాబోతోంది.



- సాక్షి, స్పెషల్ డెస్క్

**వాయిస్ కమాండ్‌తో అన్నీ చకచకా**

**భారతీయ భాషలన్నీ అర్థం చేసుకునేలా..**

**కేంద్ర ప్రభుత్వ 'ఇండియా ఏఐ మిషన్'**

**వాయిస్ ఏఐ మోడళ్ల తయారీ**

**ఐదేళ్లలో రూ.10వేల కోట్ల వ్యయం**

దేశంలో ప్రస్తుతం ఉన్న 90 కోట్ల మంది ఇంటర్‌నెట్ వినియోగదారులు ఉన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు, గ్రామాల్లో.. ఇంగ్లీష్ వ్యాప్తి తక్కువగా ఉంటుంది. డిజిటల్ అక్షరాస్యత ఇప్పుడిప్పుడే విస్తరిస్తోంది. ఈ ప్రాంతాల్లోని వారు వాయిస్ కమ్యూనికేషన్ ద్వారా తమ పనులు చక్కబెట్టేందుకు ఇష్టపడుతున్నారు. ఇలా టెక్స్ట్‌ను టైప్ చేయటానికి ఇష్టపడని, లేదా టైప్ చేయటం రాని వారి కోసం ఒక సరళమైన, స్పష్టమైన 'వాయిస్ ఇంటరాక్షన్' విధానాన్ని వృద్ధి చేసేందుకు భారతీయ కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్ కంపెనీలు కృషి చేస్తున్నాయి.

### చెబితే చాలు... చేసి పెడుతుంది!

రైతులు, గ్రామీణ వ్యాపారులు, గిగ్ వర్కర్‌లు, గృహిణులు సహా ఆన్‌లైన్ వినియోగదారులందరూ ఈ వాయిస్ ఏఐతో ఇంటర్నెట్ వాడకం స్వరూపాన్నే మార్చేయబోతున్నారని భారతీయ వాయిస్ ఏఐ స్టార్టప్ కంపెనీలు చెబుతున్నాయి. రైతులు ఇప్పటికే తమ ఫోన్‌లో ఒక్క మాట కూడా చదవకుండానే, ఒక్క బటన్ కూడా నొక్కకుండానే పంటల బీమా, క్రెడిట్ అర్హత, వాతావరణ పరిస్థితులకు తట్టుకునే వ్యవసాయ విధానాల సమాచారం తెలుసుకుంటున్నారు. జ్ఞాని.ఏఐ ప్రయోగాత్మకంగా ఇటీవలే దేశంలోని 120 గ్రామాలలో 15 వేల కంటే ఎక్కువ మంది రైతులకు ఈ విధానంలో సమాచారాన్ని అందించింది. ఒక బాట్ (సాఫ్ట్‌వేర్ అప్లికేషన్) ద్వారా వారికి 3 నిమిషాల వాయిస్ కాల్ వచ్చింది. ఇది వాళ్ల స్థానిక భాష, యాసలోనే వాళ్లకు కావాల్సిన సూచనలూ, సలహాలూ అందించడం విశేషం.

### నాలుగు కంపెనీల ఎంపిక

'ఇండియా ఏఐ మిషన్' కింద భారత ప్రభుత్వం రూ.10,372 కోట్ల పంచవర్ష బడ్జెట్ కేటాయింపులతో 'సర్వమ్', సోకెట్ ల్యాబ్స్, జ్ఞాని.ఏఐ, గాన్.ఏఐ అనే నాలుగు స్టార్టప్ కంపెనీలను ఎంపిక చేసింది. ప్రాథమిక వాయిస్ ఏఐ మోడళ్లను, అత్యాధునిక లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎమ్) తయారుచేసే బృహత్తర బాధ్యతలను వీరికి అప్పగించింది. 'సర్వమ్' ఏఐ.. 10 భారతీయ భాషల్లో శిక్షణ పొందిన వ్యవస్థను రూపొందించింది. ఇది గణితం, కోడింగ్, బహుభాషా అవగాహన వంటి అనేక ప్రక్రియలను సులభంగా చేయగలదు. జ్ఞాని.ఏఐ 12 భారతీయ భాషలు సహా మొత్తం 40 ప్రపంచ భాషలను గుర్తించి సేవలు అందిస్తుంది. సోకెట్ ల్యాబ్స్ భారతీయ భాషలకు అనుగుణంగా 'ప్రజ్ఞ–1బి' అనే ప్రాథమికమైన ఏఐ మోడల్‌ని (ఓపెన్ ఏఐ, చాట్ జీపీటీ మాదిరిగా) రూపొందించింది. గాన్.ఏఐ అనేది ఇన్‌స్టంట్ ఏఐ వీడియోలు తయారుచేస్తుంది.

'భారత్‌లోనే తయారవ్వాలి – భారతదేశ అభివృద్ధికే పనిచేయాలి.. ఇదే ఇండియా ఏఐ మిషన్ ప్రధాన ఉద్దేశం' అని కంపెనీల ఎంపిక సందర్భంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

### 'స్వదేశీ వాయిస్' సవాళ్లు!

భారతీయ స్టార్టప్‌లు నేటికీ పాశ్చాత్య డేటాసెట్‌లపై శిక్షణ పొందిన ఓపెన్ ఏఐ, డీప్‌గ్రామ్ వంటి నమూనాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఇవి భారతీయ భాషలు, అందులోని యాసలు, పేర్లు లేదా స్థానిక సూక్ష్మాంశాలను తరచుగా తప్పుగా అర్థం చేసుకుంటున్నాయి. ఈ అంతరాన్ని తగ్గించడానికి, అందుకు అవసరమైన సాంకేతికను సాధించేందుకే కేంద్రం 'ఇండియా ఏఐ మిషన్'కు శ్రీకారం చుట్టింది.

### భవిష్యత్తంతా మాటలదే..!

గూగుల్ నివేదిక ప్రకారం స్మార్ట్ ఫోన్ వాడేవారిలో 60 శాతం భారతీయులు వాయిస్ అసిస్టెంట్‌ల ద్వారా సంభాషిస్తున్నారు. 'వాట్ కన్సల్ట్' నివేదిక ప్రకారం నెట్ సేవల్ని పొందే భారతీయుల్లో 76 శాతం మందికి స్పీచ్, వాయిస్ రికగ్నిషన్ టెక్నాలజీపై అవగాహన ఉంది. దీన్ని బట్టి, మాతృభాషలో స్మార్ట్‌ఫోన్‌తో మాట కలిపి దైనందిన పనుల్ని చక్కబెట్టుకునే అలవాటు దేశ ప్రజల్లో ఎంతలా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. ఆంగ్ల భాష లేదా ఇతర భాషలలో ఉండే ఆప్షన్‌లను ఫోన్‌లో చేతి వేళ్లతో నొక్కటం ద్వారా ముందుకు సాగే 'గ్రాఫికల్ యూజర్ ఇంటర్ఫేస్' (జి.యు.ఐ.) విధానానికి ఉన్న పరిమితులకు పరిష్కారంగా వచ్చిన ఈ 'వాయిస్ ఏఐ'దే భవిష్యత్తంతా అని నిపుణులు అంటున్నారు.



**2022లో మొత్తం ఏఐ స్టార్టప్‌లలో 702 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడితే.. అందులో సుమారు 437 మిలియన్ డాలర్లు సంభాషణాపరమైన / వాయిస్ ఏఐ స్టార్టప్‌లలో పెట్టారు.**

**ఎవరెవరు ఏమేం చేస్తారంటే..**

కొత్తగా తయారుచేయబోయే ఈ ఏఐ మోడళ్ల స్థాయిని వాటిలో ఉండే పారా మీటర్ల ఆధారంగా అంచనా వేస్తారు. ఎన్ని ఎక్కువ పారామీటర్లు ఉంటే అంత శక్తిమంతమైన మోడల్ అన్నమాట.

**సర్వమ్ ఏఐ రూపొందించిన సర్వమ్:** ఎమ్. 2,400 కోట్ల పారామీటర్లు ఉండే మోడల్. ఇది భారతీయ భాషలన్నింటిలోనూ శిక్షణ పొందింది. స్టార్టప్‌లకు చేయూత నివ్వడం, సీసీటీవీ కెమెరాల్లాంటి భారతదేశంలో తయారయ్యే ఏఐ హార్డ్‌వేర్ వంటి వాటిని ప్రోత్సహించడం వంటి అదనపు బాధ్యతలు దీనికి అప్పగించింది ప్రభుత్వం.

**సోకెట్ ఏఐ:** ఇది భారత దేశ మొట్టమొదటి ఓపెన్ సోర్స్ ఏఐ మోడల్‌ను తయారుచేస్తుంది. 12,000 కోట్ల పారామీటర్లతో అనేక భారతీయ భాషల్లో పనిచేసే దీన్ని ఆరోగ్య సంరక్షణ, విద్య, రక్షణ రంగాల్లో వాడతారు.

**జ్ఞాన్ ఏఐ:** 1,400 కోట్ల పారామీటర్లతో రూపొందించే ఈ వాయిస్ మోడల్ వివిధ భారతీయ భాషలను అర్థం చేసుకోగలదు. రియల్ టైమ్‌లో కూడా స్పందించగలదు. కేవలం మాటలతోనే స్మార్ట్‌ఫోన్లో పనులు చేయాలనుకునేవారి కోసం స్మార్ట్ వాయిస్ అసిస్టెంట్లు, టూల్స్‌ను ఇది తయారుచేస్తుంది.

**గన్ ఏఐ:** 700 కోట్ల పారామీటర్లతో, టెక్స్ట్ టు స్పీచ్ (టీటీఎస్) సాంకేతికను మరో స్థాయికి తీసుకెళ్లే మోడల్ తయారీలో ఇది నిమగ్నమై ఉంది. చాలా సహజంగా, భావ వ్యక్తీకరణతో, అచ్చంగా మనుషుల మాట్లాడినట్టే ఉండే కంప్యూటర్ వాయిస్‌లను ఇది రూపొందిస్తుంది.

## నవీన్ మిత్తల్‌పై విచారణ ఏమైంది?

- నానల్‌నగర్ భూమికి తప్పుడు ఎన్వోసీపై హైకోర్టు
- సీఎస్‌తోపాటు మిత్తల్‌కు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గుడిమల్కా పూర్ నానల్‌నగర్‌లోని భూములకు తప్పుడు నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) జారీ చేసిన అంశంపై సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిత్తల్‌పై విచారణ ఏమైందని సర్కార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా నవీన్ మిత్తల్, ఇతర అధికారులకు నోటీసులు జారీ చేసింది. నానల్‌నగర్‌లో 5,262 చదరపు గజాల ప్లాట్‌కు సంబంధించి తప్పుడు ఎన్వోసీ ఇచ్చిన కేసులో మిత్తల్‌పై విచారణ చేపట్టాలని సీఎస్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదంటూ ముషీరాబాద్‌కు చెందిన శాంతి అగర్వాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇది ఆర్టికల్ 19, 21ను ఉల్లంఘించడమేనన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్.. సీఎస్, నవీన్‌మిత్తల్‌కు నోటీసులు జారీ చేశారు. అలాగే సర్వే నంబర్ 284/ 6లోని భూమిపై తన అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోలేదంటూ శాంతి అగర్వాల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు చేశారు. దీన్ని కాగ్నిజెన్స్‌లోకి తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ తుకారాంజీ నవీన్ మిత్తల్‌తోపాటు 42 మందికి నోటీసులు జారీ చేస్తూ.. విచారణ ఆగస్టు 13కు వాయిదా వేశారు.

# రేవంత్ కోసం 'ఆర్ఆర్ మాడ్యూల్'!

**నిఘా ఉంచడానికి ఏర్పాటు చేయించిన ప్రభాకర్‌రావు**

- ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ప్రణీత్‌రావు
- దీనికి దాదాపు 20 మంది ఎస్ఐబీ అధికారుల వినియోగం
- అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వెలుగులోకి

సాక్షి, హైదరాబాద్: ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు చేసిన వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. 2023 ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబీకులు, అనుచరులపై నిఘా ఉంచడానికి 'ఆర్ఆర్ మాడ్యూల్'పేరుతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఎస్ఐబీలోని స్పెషల్ ఆపరేషన్ టీమ్‌కు (ఎస్ఓటీ) నేతృత్వం వహించిన డీఎస్పీ డి.ప్రణీత్‌రావు దీనిని పర్యవేక్షించారని వెలుగులోకి వచ్చింది. ప్రభాకర్‌రావు హయాంలో అనేకమంది ఫోన్లను ట్యాపింగ్ చేశారు. వీరి కోసం మాడ్యూల్స్ రూపొందించారు. ఒక్కో మాడ్యూల్‌లో సదరు వ్యక్తితోపాటు ఆయనకు సంబంధించి ఇంకా ఎవరెవరివి ఫోన్లు ట్యాప్ చేయాలో ఆ నంబర్లు చేర్చేవారు. ఈ మాడ్యూల్‌ను అనునిత్యం పర్యవేక్షిస్తూ వారికి వచ్చే ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లను పర్యవేక్షించడానికి కొందరు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు.

ఇందులో భాగంగానే రేవంత్‌రెడ్డికి సంబంధించిన మాడ్యూల్‌కు ప్రభాకర్‌రావు 'ఆర్ఆర్ మాడ్యూల్'అనే పేరు పెట్టారు. ఈ మాడ్యూల్‌లో ఉన్న వారి ఫోన్లను పర్యవేక్షిస్తూ ఉండటానికి డీఎస్పీ ప్రణీత్‌రావు నేతృత్వంలో 20 మంది సిబ్బందిని నియమించారు. ప్రభాకర్‌రావు ఎస్ఐబీ చీఫ్‌గా మారిన తర్వాత ట్యాపింగ్ దుర్వినియోగం కావడం మొదలైంది. దీనివల్ల ఒనగూరుతున్న లాభాలు తెలిసిన తర్వాత ప్రభాకర్‌రావు అక్రమంగా ట్యాప్ చేసేలా ప్రేరేపించారు. ఎస్ఐబీ అధికారులు చాలా కాలం కేవలం ఫోన్లు మాత్రమే ట్యాప్ చేశారు.



(ఫైల్)

### 2018 తర్వాత మారిన ట్యాపింగ్ పంథా

2018 ఎన్నికల సందర్భం నుంచి వీరి ట్యాపింగ్ పంథా మారిపోయింది. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో ఫోన్లతోపాటు సోషల్‌మీడియాను ట్యాప్ చేయాలని భావించారు. ప్రణీత్‌రావు, తిరుపతన్న తదితరులను ఎస్ఐబీలోకి తీసుకున్న తర్వాత, భుజంగరావు పొలిటికల్ ఇంటెలిజెన్స్ బాధ్యతలు చేపట్టడంతో ప్రభాకర్‌రావు ట్యాపింగ్‌ను కొత్త పుంతలు తొక్కించారు. దీనికోసం విదేశాల నుంచి ఉపకరణాలు, సాఫ్ట్‌వేర్స్ అక్రమంగా దిగుమతి అయ్యాయి. ఓ టెక్నాలజీ కన్సల్టెంట్ సహకారంతో ఇజ్రాయెల్ నుంచి సాఫ్ట్‌వేర్స్, ఎంసీ క్యాచర్స్ సమీకరించుకున్నారు. దీన్ని ప్రణీత్‌రావు టీమ్ ఓ వాహనంలో పెట్టుకొని టార్గెట్ చేసిన వ్యక్తి ఇల్లు, కార్యాలయం సమీపంలో మాటు వేసేది. ఇలాంటి ఓ ఉపకరణాన్నే ప్రణీత్‌రావు బృందం రేవంత్‌రెడ్డి ఇంటికి సమీపంలో తీసుకున్న వార్‌రూమ్‌లో ఏర్పాటు చేసి 'ఆర్ఆర్ మాడ్యూల్'ను కొన్నాళ్లు పర్యవేక్షించిందని దర్యాప్తు అధికారులు గుర్తించారు.

### నాలుగోసారి హాజరైన ప్రభాకర్‌రావు

ప్రభాకర్‌రావు గురువారం నాలుగోసారి సిట్ ఎదుట హాజరయ్యారు. పోలీసులు ఆయన్ను ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు సుదీర్ఘంగా ప్రశ్నించారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తమ విచారణకు ప్రభాకర్‌రావు సహకరించట్లేదని సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయించింది. ఆయనకు ఇచ్చిన రిలీఫ్‌ను రద్దు చేయాలని కోరనుంది. మరోవైపు ప్రభాకర్‌రావును కస్టోడియల్ విచారణ చేసేందుకు అనుమతి కోరుతూ నాంపల్లి కోర్టులో పిటిషన్ వేయడానికి ఉన్న అవకాశాలను న్యాయ నిపుణులతో పరిశీలిస్తోంది.

## ఏసీబీ కస్టడీకి ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించనున్నారు. శ్రీధర్‌ను ఐదు రోజుల పాటు ఏసీబీ కస్టడీకి ఇస్తూ నాంపల్లిలోని ఏసీబీ స్పెషల్ కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం నుంచి వచ్చే మంగళవారం వరకు కస్టడీకి అనుమతి ఇచ్చింది. దీంతో చంచల్‌గూడ జైలులో ఉన్న శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం అదుపు లోకి తీసుకోనున్నారు. బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి తరలించి విచారించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో కీలక బాధ్యతలు నిర్వహించిన శ్రీధర్‌పై ఏసీబీ ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసిన సంగతి తెలి సిందే. ఈ నెల 11న రాష్ట్రవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, శ్రీధర్‌కు చెందిన దాదాపు రూ.200 కోట్లకు పైగా విలువైన అక్రమాస్తులను గుర్తించింది. ఈ అక్రమాస్తులపై మరిన్ని వివరాలు రాబట్టేందుకు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు.















# 5 ఎకరాల రైతులకు 'భరోసా'

- రూ.1,189.43 కోట్లు విడుదల
- నాలుగు రోజుల్లో రూ.6,404.70 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- ఇప్పటివరకు 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రైతుభరోసా పథకం కింద ఐదు ఎకరాల లోపు రైతులకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం రూ.1,189.43 కోట్లు విడుదల చేసింది. గురువారం సాయంత్రం 19.82 లక్షల ఎకరాలకు సంబంధించి 4.43 లక్షల మంది రైతుల కోసం ఈ నిధులను విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకు 62.47 లక్షల మంది రైతులకు సంబంధించిన కోటీ ఆరు లక్షల ఎకరాలకు రైతుభరోసా కింద రూ.6,404.70 కోట్లను ప్రభుత్వం విడుదల చేసినట్లయింది. ఇంకా 5 ఎకరాలకు పైబడి భూములున్న మరో 9 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. ఈనెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా నాలుగో రోజు రైతుభరోసా విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందిస్తామని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.

# రూ.104 కోట్లతో వ్యవసాయ యాంత్రీకరణ

- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ యాంత్రీకరణ (2025–26) పథకాన్ని వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు ఉపయోగకరమైన, డిమాండ్ ఉన్న పరికరాలను గుర్తించి, వాటిని సబ్సిడీపై అందించాలన్నారు. గురువారం మంత్రి తుమ్మల వ్యవసాయ, దాని అనుబంధ సంఘాల అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గాల వారీగా వ్యవసాయ పనిముట్లు, యంత్రాల కేటాయింపులు జరిపి సరఫరా చేయాలని అధికారులకు చెప్పారు. ఈ పథకంలో సన్న, చిన్నకారు, మహిళా రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 'నమో డ్రోన్ దీదీ'కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళా సంఘాలకు అందించాలన్నారు. వీటన్నింటికి కలిపి రూ.104 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సరఫరా అయిన ఎరువుల వివరాలను అధికారులు మంత్రికి తెలియజేశారు. జూన్‌లోగా 5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉండాలని, అయితే కేంద్రం కోటాను సరైన రీతిలో పంపలేదని తెలిపారు. రాష్ట్రంలో జూలై వరకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని, ప్రస్తుతం ఆగస్టు మాసానికి సరిపడా ఎరువులను తెప్పించడానికి కృషి చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. రైతుల నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పొద్దు తిరుగుడు, జొన్న పంటలకు సంబంధించిన వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు నిర్దేశించే వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సీఏసీపీ) దక్షిణ ప్రాంతీయ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని మారిగోల్డ్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్టు మంత్రి తెలిపారు.



**వ్యవసాయానికి శాస్త్ర, సాంకేతికతను జోడిస్తాం**

నెదర్లాండ్స్‌కు చెందిన 'అరిక్ట్' కంపెనీ ప్రతినిధులతో గురువారం మంత్రి తుమ్మల సచివాలయంలో సమావేశమయ్యారు. తమ సంస్థ ద్వారా రైతులకు ఒకేసారి సమాచారాన్ని అందించడం, రైతుల ఫిర్యాదులకు ఏఐ ఆధారంగా తక్షణ సూచనలు ఇవ్వడం వంటి సౌకర్యాలు కల్పించే అంశాన్ని అర్టిక్ ప్రతినిధులు మంత్రికి వివరించారు. పంటలకు సోకే చీడపీడలను మొబైల్ ఫోన్ కెమెరా ద్వారా స్కాన్ చేసి గుర్తించే టెక్నాలజీని రాష్ట్రంలోకి తీసుకువచ్చేందుకు ఆ కంపెనీ ప్రతినిధులు ఆసక్తిని వ్యక్తం చేశారు. నెదర్లాండ్స్ కంపెనీ ప్రతినిధుల సూచనలు పరిశీలిస్తామని మంత్రి చెప్పారు.

# ఈటల, రఘునందన్‌రావుకు హైకోర్టులో ఊరట

**ట్రయల్‌కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు**

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావులకు హైకోర్టులో ఊరట లభించింది. వారిపై దాఖలైన కేసులలో ట్రయల్‌కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ.. తదుపరి విచారణను వచ్చే నెల 10కి వాయిదా వేసింది. కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించి ఈటల రాజేందర్, బీజేపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారని, ముందస్తుగా ఎలాంటి అనుమతి కూడా తీసుకోలేదన్న ఫిర్యాదు మేరకు కమలాపూర్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. అయితే తనపై కేసును కొట్టివేయాలంటూ ఈటల హైకోర్టును ఆశ్రయించారు. అలాగే కోవిడ్ సందర్భంగా గణేశ్ చతుర్థి వేడుకలపై నాటి రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దానిని వ్యతిరేకిస్తూ రఘునందన్‌రావు, బీజేపీ కార్యకర్తలు దుబ్బాకలోని గాంధీ విగ్రహం వద్ద సమావేశమయ్యారు. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన కూడా తనపై కేసు కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ రెండు క్వాష్ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

# హర్మూజ్‌ను మూసేస్తాం

**హెచ్చరించిన ఇరాన్**

**టెహ్రాన్:** ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఖ్యాతికెక్కిన హర్మూజ్ జలసంధిని మూసేస్తామని ఇరాన్ హెచ్చరించింది. సముద్రం ద్వారా రవాణా అయ్యే చమురులో దాదాపు 25 శాతం చమురు ఈ జలమార్గం నుంచే రవాణా అవుతోంది. కేవలం 33 కిలోమీటర్ల వెడల్పుండే ఈ జలమార్గం గుండా చమురు నౌకల రాకపోకలను అడ్డుకుంటే ప్రపంచవ్యాప్తంగా ముడి చము రు ధరలు పెరుగుతాయి. దీంతో పెట్రో ల్, డీజిల్ ధరలు సైతం పైకెగసి ప్రపంచ వాణిజ్యం, ఆర్థికాభివృద్ధిపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూప నుంది. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో హర్మూ జ్ జలసంధినిన మూసివేయాలనే ఒక ఆప్షన్ కూడా తమ వద్ద ఉందని గురువారం ఇరాన్ సైన్యాధికారి సర్దార్ ఇస్మాయిల్ కోసారీ ప్రకటించారు.

**ఏమిటీ హర్మూజ్ జలసంధి?**

పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే జలమార్గమిది. ఇరాన్, ఒమన్‌ల మధ్య నుంచి 33 కి.మీ.ల వెడల్పుతో ఈ మార్గం వెళ్తోంది. చమురు సరఫరా దేశాలైన ఇరాన్, సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి సహజవాయువు, ముడి చమురు నౌకలు ఈ మార్గం గుండానే ప్రయాణిస్తాయి. భారత్‌కు వచ్చే చమురులో ఎక్కువ శాతం క్రూడ్ ఆయిల్ ఈ రూట్ గుండానే వస్తోంది.

# అమెరికా దాడికి ట్రంప్ గ్రీన్‌సిగ్నల్

**ఇంకా లభించని తుది ఆమోదం**

ఇరాన్‌పై అమెరికా యుద్ధ విమానాలు దాడిచేసేందుకు డొనాల్డ్ ట్రంప్ అంగీకారం తెలిపారు. అయితే ఏరోజు, ఏ ప్రాంతాల్లో దాడులు చేయాలనే విషయంలో స్పష్టతరాలేదు. అయితే దాడులకు సంబంధించిన తుది ఆమోదం ట్రంప్ ఇవ్వలేదని అమెరికా నిఘా విభాగంలోని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. అమెరికాకు పశ్చిమాసియాలో చాలా వైమానిక, సైనిక స్థావరాలు ఉన్నాయి. సిరియా, ఇరాక్, సౌదీ అరేబియా, జోర్డాన్, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, ఖతార్, బహ్రెయిన్, కువైట్ దేశాల్లో అమెరికా స్థావరాలు ఉన్నాయి. ఇన్ని దేశాల్లోని తమ స్థావరాల నుంచి అమెరికా ముప్పేటదాడి చేస్తే తట్టుకోవడం ఇరాన్‌కు అసంభవం.

# ఆస్పత్రిపై క్షిపణుల దాడి

**దక్షిణ ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర బాంబుల వర్షం**

- క్షిపణుల దాడిలో ఆస్పత్రిలో 80 మందికి గాయాలు
- ప్రతిగా ఇరాన్ అరాక్ భారజల రియాక్టర్‌పై ఇజ్రాయెల్ దాడి
- మరింత విస్తరిస్తున్న యుద్ధం
- ఇరాన్‌లో 639కి చేరిన మరణాల సంఖ్య
- యుద్ధంలో భాగస్వామిగా మారాలా వద్దా అనేది 2 వారాల్లో చెప్తామన్న వైట్‌హౌస్

క్షిపణి దాడిలో ధ్వంసమైన సొరోక ఆస్పత్రి నుంచి పొగ వెలువడుతున్న దృశ్యం



**బీర్‌షెబా/టెహ్రాన్/టెల్ అవీవ్/దుబాయ్/వాషింగ్టన్:** అంతూదరీ లేకుండా భీకరంగా కొనసాగుతూ పశ్చిమాసియా శాంతిదీపం కొండెక్కేలా చేస్తున్న ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం మరింతగా విస్తరిస్తోంది. కయ్యానికి కాలు దువ్వుతూ యుద్ధజ్వాలను మరింత రాజేసిన ఇజ్రాయెల్‌పై ఇరాన్ గురువారం బదులు తీర్చుకుంది. దక్షిణ, మధ్య ఇజ్రాయెల్ ప్రాంతాలపై పెద్ద ఎత్తున క్షిపణులను ప్రయోగించింది. వాటిల్లో కొన్ని బాలిస్టిక్ క్షిపణులు దక్షిణ ఇజ్రాయెల్‌లోనే అత్యంత పెద్ద ఆస్పత్రి అయిన బీర్‌షెబా నగరంలోని వేయి పడకల సొరొక ఆస్పత్రిపై పడ్డాయి. క్షిపణుల ధాటికి ఆస్పత్రి ధ్వంసమైంది. ఈ దాడి ఘటనలో 80 మందికిపైగా గాయాలపాలయ్యారు. మంటలు అంటుకుని, అగ్నికీలలు ఎగసిపడుతున్న భవనం నుంచి రోగులను సహాయక బృందాలు స్ట్రెచర్‌లపై బయటకు తీసుకొస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి. ఆస్పత్రిపై దాడి జరగబోతోందని సైరన్లు వినిపించడంతో చాలా మంది ముందుగానే బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. ఆస్పత్రిలో కొంతభాగాన్ని ఒకరోజు ముందే ఖాళీచేయించినట్లు తెలుస్తోంది. దాడి సమయంలో ఆస్పత్రిలో 700 మంది రోగులున్నారు. గురువారం దేశవ్యాప్తంగా ఇరాన్ జరిపిన దాడుల్లో 270కిపైగా ఇజ్రాయెలీలు రక్తమోడారు. టెల్ అవీవ్, రమాత్ గాన్, రెహోవోత్ సిటీ సహా పలు నగరాలపైనా ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది. పలు భవనాలు పాక్షికంగా ధ్వంసమైన దృశ్యాలను ఇజ్రాయెల్ టీవీచానళ్లు ప్రత్యక్ష ప్రసారాలు చేశాయి. సిటీలోని గవ్‌యమ్ నెగెవ్ ఇజ్రాయెల్ సైనిక నిఘా కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకోగా పొరపాటున ఆస్పత్రిపై క్షిపణులు పడ్డాయని తెలుస్తోంది. అయితే ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే పౌరుల రక్తం కళ్లజూస్తోందని, ఇందుకు ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అన్నారు. ''మాకు అమెరికా సాయం చేస్తుందన్న నమ్మకం నాకుంది. అమెరికాకు ఏది అత్యుత్తమమో అదే ట్రంప్ చేస్తారు'' అని నెతన్యాహూ అన్నారు. అయితే యుద్ధంలో పాల్గొనాలా వద్దా అనేదానిపై మరో రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటామని శ్వేతసౌధం ప్రకటించింది. చర్చలకు ఇంకా అవకాశం ఉందని ట్రంప్ భావిస్తున్నారని వైట్‌హౌస్ ప్రెస్‌సెక్రటరీ కరోలిన్ లీవిట్ చెప్పారు.

**ప్లుటోనియం చిక్కకుండా దాడులు**

ప్రస్తుతం క్రియాశీలంగా లేని ఇరాన్‌లోని ఖోన్‌దాబ్ పట్టణ సమీపంలోని అరాక్ భారజల రియాక్టర్‌పై ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు దాడులుచేశాయి. దాడుల తర్వాత ఈ రియాక్టర్ నుంచి ఎలాంటి రేడియోధార్మికత వెలువడలేదని ఇరాన్ తెలిపింది. అణురియాక్టర్లను చల్లబరిచేందుకు భారజలాన్ని ఉపయోగిస్తారు. ఇలా అణురియాక్టర్లను చల్లబరిచినప్పుడు ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా ప్లుటోనియం అనే అత్యంత శక్తివంతమైన పేలుడుపదార్థం ఏర్పడుతుంది. దీనిని సైతం అణుబాంబు తయారీలో ఉపయోగించుకోవచ్చు. యురేనియంను 90 శాతం శుద్ధత స్థాయికి తీసుకొచ్చాకే అణుబాంబు తయారీకి పనికొస్తుంది. యురేనియం శుద్ధి కర్మాగారాలపై ఇజ్రాయెల్ క్షిపణిదాడుల నేపథ్యంలో ఇరాన్‌కు అణుబాంబు తయారీలో ఈ ప్లుటోనియం అక్కరకొస్తుంది. ఇలా ఉపయోగపడకూడదనే ఉద్దేశంలోనే అరాక్ హెవీవాటర్ రియాక్టర్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులుచేసింది. గురువారం నాటికి యుద్ధంలో ఇరాన్‌లో 263 మంది పౌరులు, 154 మంది సైనికులు సహా 639 మంది ప్రాణాలు కోల్పోయారు. 1,300 మందికిపైగా గాయాలపాలయ్యారు. దీనికి ప్రతిగా ఇరాన్ ప్రయోగించిన 400కుపైగా క్షిపణుల్లో ఇజ్రాయెల్‌లో 24 మంది చనిపోయారు.

**అప్రమత్తంగా ఉన్న అమెరికా యుద్ధవిమానాలు**

అత్యవసర పరిస్థితుల్లో ఇజ్రాయెల్‌కు సాయం చేయాల్సి వస్తే ఇరాన్ ప్రతిదాడులు చేస్తుందన్న అంచనాతో అమెరికా యుద్ధవిమానాలను ఆయా వైమానిక స్థావరాల నుంచి వేరే చోటుకు తరలించారు. ముఖ్యంగా ఖతార్‌లోని దోహాలో ఉన్న అల్ ఉదేయిద్ అమెరికా వైమానిక స్థావరంలోని సైనిక, ఆయుధ రవాణా విమానాలు, యుద్ధవిమానాలు, డ్రోన్లను వేరే చోటుకు తరలించినట్లు తెలుస్తోంది. తొలుత దాక్కుని తర్వాత దాడి చేయడం అమెరికా వ్యూహమని కొందరు యుద్ధనిపుణులు చెప్పారు. మరోవైపు భారత్, జపాన్, చైనా, ఇండోనేసియా, ఒమన్ తదతర దేశాలు తమ పౌరులను ఇరాన్ నుంచి సురక్షితంగా స్వదేశానికి తరలిస్తున్నాయి.

## మధ్యవర్తిత్వానికి సిద్ధం: పుతిన్

**మీ సంగతి చూసుకోండి అంటూ ట్రంప్ చురక**



**మాస్కో:** ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఘర్షణకు తెరదించడానికి వీలుగా మధ్యవర్తిత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని రష్యా అధినేత పుతిన్ చెప్పారు. ఇజ్రాయెల్ భద్రతకు హామీ ఇస్తూ శాంతియుత ప్రయోజనాల కోసం ఇరాన్ అణు కార్యక్రమం కొనసాగించేలా ఒక స్పష్టమైన ఒప్పం దానికి రావడానికి అవసరమైన చర్చలకు సహకరిస్తానని తెలిపారు. ఆయన గురువారం అంతర్జాతీయ వార్తా సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. ఇజ్రాయెల్–ఇరాన్ ఘర్షణ నిజంగా చాలా సంక్లిష్టమైన అంశమని పేర్కొన్నారు. అయినప్పటికీ దీనికి పరిష్కార మార్గం కనిపెట్టవచ్చని స్పష్టంచేశారు. ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్ హత్య చేస్తే రష్యా ఎలా స్పందిస్తుందని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, దానిపై మాట్లాడడం తనకు ఇష్టం లేదన్నారు. ఖమేనీ హత్య జరుగుతుందని అనుకోవడం లేదని పుతిన్ ఉద్ఘాటించారు. మరోవైపు పుతిన్ ప్రతిపాదన పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘాటుగా స్పందించారు. ''ముందు మీ సంగతి చూసుకోండి. ఉక్రెయిన్‌తో యుద్ధం ఎలా ఆపాలో ఆలోచించుకోండి. మీకు మీరే మధ్యవర్తిత్వం వహించుకోండి. నా కోసం ఈ సాయం చేయండి. మీ సొంత సమస్య గురించి ఆలోచించుకున్న తర్వాత ఇజ్రాయెల్–ఇరాన్ గురించి ఆలోచిస్తే బాగుంటుంది'' అని పుతిన్‌కు చురక అంటించారు.

## ఆధునిక హిట్లర్ అంతం కావాల్సిందే

**ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ వ్యాఖ్య**

ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీని ఆధునిక హిట్లర్‌గా ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ అభివర్ణించారు. ఇరాన్ క్షిపణి దాడుల్లో ధ్వంసమైన ఇజ్రాయెల్‌లోని హోలోన్ సిటీలో మీడియాతో మంత్రి 'ఇజ్రాయెల్ కట్జ్' మాట్లాడారు. ''మాకు పైనుంచి ఆదేశాలు అందాయి. పూర్తి లక్ష్యాలను సాధించేందుకు సిద్ధంగా ఉన్నాం. అసలు ఈపాటికే మేం ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్(ఐడీఎఫ్)ను పంపి ఆయనను అంతంచేయాల్సింది. ప్రస్తుతం ఇరాన్‌లో పరిస్థితులను చూస్తుంటే ఖమేనీ ఒక ఆధునిక హిట్లర్‌లా వ్యవహరిస్తున్నారు. ఆస్పత్రులు, జనావాసాలపై క్షిపణులు వేయాలని ఆదేశిస్తున్నారు. అణుబాంబు ఉపద్రవాన్ని అడ్డుకోవడమే మా లక్ష్యం' అని కట్జ్ అన్నారు.



# డూమ్స్‌డే ఎయిర్‌క్రాఫ్ట్ రెడీ!

- మేరీల్యాండ్‌కు చేరుకున్న 'ప్రళయకాల' విమానం
- రక్షణ కోసం ముందస్తుగా తెప్పించిన ట్రంప్ సర్కార్!

**వాషింగ్టన్:** అత్యంత అరుదైన సందర్భాల్లో వాడే శత్రు దుర్భేద్య ఈ–4బీ రకం విమానం హఠాత్తుగా అగ్రరాజ్య గగనతలంలో కనిపించి ఆశ్చర్యానికి గురిచేసింది. యుద్ధంలో ఇరాన్‌పై అమెరికా బాంబులేస్తే ప్రతిదాడిగా ఇరాన్ సైతం అమెరికాపై బాంబుల వర్షం కురిపించొచ్చు. అలాంటి సందర్భాల్లో భూమిపై ఎక్కడా దిగకుండా గాల్లో చక్కర్లు కొడుతూనే అమెరికా రక్షణ మంత్రిసహా కీలక ఉన్నతాధికారులు పాలన సాగించేందుకు ఈ విమానాన్ని వినియోగిస్తారు. ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోబోతోందన్న వార్తల నడుమ ఈ అధునాతన లోహ విహంగం ప్రత్యక్షమవడం గమనార్హం. ఈ విమానాన్ని బోయింగ్ 747–200బీ మోడల్‌లో మార్పులు చేసి తయారు చేశారు. అమెరికాలో యుద్ధంవస్తే అంటే ప్రళయకాలంలో వాడే విమానంగా దీనికి డూమ్స్‌డే ఎయిర్‌క్రాఫ్ట్‌అనే పేరుంది. దీనిని 'నైట్‌వాచ్', 'ఫ్లయింగ్ పెంటగాన్' అని మారు పేర్లు కూడా ఉన్నాయి. ఈ విమానం మంగళవారం లూసియానాలోని బోస్సియర్ వైమానిక స్థావరం నుంచి మేరీల్యాండ్‌లోని జాయింట్ బేస్ ఆండ్రూస్‌కు చేరుకుంది.

**ఎన్నెన్నో ప్రత్యేకతలు..**

ఈ విమానం ఏకధాటిగా 7,000 మైళ్ల దూరం ప్రయాణించగలదు. సిబ్బంది సహా 112 మంది వరకు ప్రయాణించే సదుపాయం ఉంది. గతంలో ఈ విమానం అత్యధికంగా ఏకధాటిగా 35 గంటలపాటు ఎగిరింది. శత్రుదాడులను తట్టుకునేలా అంటే సైబర్ దాడులు, అణు బాంబుపేలుళ్ల ప్రకంపనలు, విద్యుదయస్కాంత ప్రభావాలకు లోనుకాకుండా దీనిని పటిష్టంగా నిర్మించారు. న్యూక్లియర్, థర్మల్ కవచాలు దీనికి తొడిగారు. గాల్లో ప్రయాణిస్తూనే ఇందులోని అధికారులు ప్రపంచం నలుమూలల ఉన్న స్వదేశీ, విదేశీ నేతలు, అధికారులకు ఆదేశాలు జారీచేయొచ్చు. దీనిలో ఏకంగా 67 ఉపగ్రహ డిష్ వ్యవస్థలు ఉన్నాయి.

**యుద్ధవిమానంగానూ..**

అత్యవసర సందర్భాల్లో యుద్ధవిమానంగానూ మారిపోతుంది. వెంటబడే శత్రు విమానాలపై బాంబులను ప్రయోగించగలదు. మళ్లీ ల్యాండింగ్ చేయాల్సిన పనిలేకుండా గాల్లోనే ఇంధనాన్ని నింపుకోగలదు. ఈ మొత్తం విమానంలో ఉన్నతాధికారుల విశ్రాంతి కోసం 18 పడకలు ఉన్నాయి. కీలక నిర్ణయాలు తీసుకునేందుకు పెద్ద సమావేశ గది ఏర్పాటు చేశారు. ఈ విమానం మొత్తంగా మూడు అంతస్తుల్లో ఉంటుంది. 9/11 దాడుల తర్వాత ఈ సిరీస్ విమానంలో నాటి అధ్యక్షుడు జార్జ్ బుష్ పలుమార్లు ప్రయాణించారు. 1995లోనూ హరికేన్ ఓపెల్ ఘటన సమయంలో ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ఉన్నతాధికారులు ఇందులోంచే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమెరికా వాయుసేనలో ఇలాంటివి నాలుగు విమానాలు ఉన్నాయి. యుద్ధ సన్నద్ధతను పరీక్షించేందుకే ఈ విమానాన్ని వాషింగ్టన్‌కు తీసుకొచ్చారని అంతర్జాతీయ మీడియా తెలిపింది.

# టార్గెట్ 'ఫోర్డో'

**ఇరాన్‌లోని ఆ అణుకేంద్రంపైనే ఇజ్రాయెల్ గురి**

- ఉపరితలం నుంచి 90 మీటర్ల దిగువన అణు పరీక్షలు
- ధ్వంసం చేయాలంటే అమెరికా జీబీయూ–57 బాంబులే శరణ్యం
- అందుకే అమెరికాను యుద్ధంలోకి లాగుతున్న ఇజ్రాయెల్

ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం మొదలైన తర్వాత ఫోర్డో ఫ్యూయెల్ ఎన్‌రిచ్‌మెంట్ ప్లాంట్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇజ్రాయెల్ క్షిపణి దాడుల్లో ఇరాన్‌లోని నతాంజ్, ఇస్ఫహాన్ అణుశక్తి కేంద్రాలు చాలావరకు ధ్వంసమయ్యాయి. అక్కడ అణుబాంబులు తయారు చేసే పరిస్థితి లేకపోవచ్చని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక మిగిలిన అతిపెద్ద అణుకేంద్రం ఫోర్డో. అందుకే ఇజ్రాయెల్ సైన్యం దీనిపై గురిపెట్టింది. ఉపగ్రహ చిత్రాలను పరిశీలిస్తే ఫోర్డో అణుకేంద్రం గురించి స్పష్టంగా తెలిసిపోతోంది. కొండ చుట్టూ రహదారులు, సొరంగాల ప్రవేశ మార్గాలు, పక్కనే సహాయక భవనం, సెంట్రీఫ్యూజ్‌లు భద్రపర్చిన స్థలంగా భావిస్తున్న ప్రాంతం ఇందులో కనిపిస్తున్నాయి. పర్వతాల అంతర్భాగంలో అత్యంత దుర్భేద్యంగా నిర్మించిన ఫోర్డో న్యూక్లియర్ సైట్‌ను ధ్వంసం చేయాలంటే ఇప్పుడున్న ఏకైక మార్గం అమెరికానే.

**ఏమిటీ అణుకేంద్రం?**

అణు బాంబు తయారీపై ఇరాన్ ఎప్పటినుంచో దృష్టి పెట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ సహా పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా లెక్కచేయకుండా ముందుకెళ్తోంది. బాహ్య ప్రపంచానికి తెలియకుండా రహస్యంగా ప్రయోగాలు కొనసాగిస్తోంది. ఇరాన్‌లో షియా ముస్లింల పవిత్ర నగరం ఖోమ్‌కు 20 మైళ్ల దూరంలోని ఫోర్డో అనే గ్రామం వద్ద కొండ కింద 80 నుంచి 90 మీటర్ల(262 నుంచి 295 అడుగుల) లోతున అణుకేంద్రం నిర్మించింది. దీని గురించి తొలిసారిగా 2009లో అందరికీ తెలిసింది. ఇరాన్ నుంచి కొన్ని కీలక డాక్యుమెంట్లను ఇజ్రాయెల్ నిఘా సంస్థలు చేజిక్కించుకోవడంతో ఫోర్డో గురించి కొంత సమాచారం బయటకు వచ్చింది. కానీ, 2002 నుంచే ఇక్కడ నిర్మాణాలు మొదలైనట్లు తెలిసింది.



ఫోర్డో అణుకేంద్రం(ఉపగ్రహ చిత్రం)

**ఫోర్డోలో 2,700 సెంట్రీఫ్యూజ్‌లు**

ఫోర్డో కేంద్రంలో అణుబాంబు తయారీకి అవసరమైన సెంట్రీఫ్యూజ్‌లు 2,700 ఉన్నట్లు ఐఏఈఏ ఇటీవల తెలియజేసింది. 3,000 సెంట్రీఫ్యూజ్‌లు ఏర్పాటు చేసే వెసులుబాటు ఫోర్డోలో ఉంది. ఇరాన్ అణు శాస్త్రవేత్తలు ఇక్కడ యురేనియంను 60 శాతం వరకు శుద్ధిచేశారు. దాన్ని 90 శాతంగా మార్చడానికి ఎక్కువ సమయం పట్టదు. ఇప్పుడున్న యురేనియంను 233 కిలోల వెపన్–గ్రేడ్ యురేనియంగా మూడు వారాల్లో మార్చొచ్చు. 9 అణు బాంబులు తయారు చేయడానికి ఈమాత్రం యురేనియం చాలు. అణ్వస్త్ర రహిత దేశమైన ఇరాన్ ఈ స్థాయిలో యురేనియం నిల్వ చేసుకోవడం ఆందోళనకరమని ఐఏఈఏ ఈ ఏడాది మే 31న పేర్కొంది. అణు బాంబు తయారీకి ఇరాన్ అత్యంత చేరువలోకి రావడమే ఇజ్రాయెల్ భయానికి అసలు కారణం. ఫోర్డో అణుకేంద్రాన్ని సర్వనాశనం చేస్తే తప్ప తమ భద్రతకు ఢోకా ఉండదని ఇజ్రాయెల్ చెబుతోంది. కానీ, అది ఇజ్రాయెల్ వల్ల సాధ్యమేనా?

**ప్రత్యామ్నాయ మార్గం ఇదే..**

ఒకవేళ ఫోర్డోను పూర్తిగా నామరూపాల్లేకుండా చేయడం సాధ్యం కాకపోతే కనీసం నిర్వీర్యం చేయడానికి ఒక అవకాశం ఉంది. అది ఏమిటంటే.. అణుకేంద్రం లోపలికి దారితీసే సొరంగాల ఎంట్రన్స్‌లను ధ్వంసం చేయడం. అలాగే గాలి ప్రసరణ కోసం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థను దెబ్బతీయొచ్చు. సొరంగాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థను ధ్వంసం చేస్తే లోపల కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. అణుబాంబు ప్రయోగాలు హఠాత్తుగా ఆగిపోవచ్చు. దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించుకోవాలంటే చాలా సమయమే పడుతుంది. ఇరాన్ అణుశక్తి ప్రయోగాల్లో ఫోర్డో న్యూక్లియర్ సెంటర్ అత్యంత కీలకంగా మారింది. ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధంలోకి అమెరికాను సైతం ఎలాగైనా లాగడానికి ఇజ్రాయెల్ గట్టి ప్రయత్నాలే చేస్తోంది. దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఫోర్డో అణుకేంద్రాన్ని ధ్వంసం చేయడమేనని తెలుస్తోంది.

**– సాక్షి, నేషనల్ డెస్క్**

**ఏకైక అస్త్రం జీబీయూ–57 పెనిట్రేటర్ బాంబు**

ఉపరితలం నుంచి 90 మీటర్ల లోతులో రాతికొండల కింద ఉన్న అణుశక్తి కేంద్రాన్ని ధ్వంసం చేయాలంటే సాధారణ క్షిపణులు, డ్రోన్లు, బాంబులు సరిపోవు. దానికి శక్తివంతమైన బాంబు కావాలి. ఇది అమెరికా వద్ద మాత్రమే ఉంది. ఈ విషయాన్ని అమెరికాలోని ఇజ్రాయెల్ రాయబారి యెచీల్ లీటర్ స్వయంగా చెప్పారు. సొంతంగా పనిపూర్తి చేసే సామర్థ్యం ఇజ్రాయెల్‌కు లేదు కాబట్టి అమెరికాపై ఆధారపడక తప్పదు. అమెరికా వద్ద జీబీయూ–57 ఆర్డినెన్స్ పెనిట్రేటర్ బాంబులు ఉన్నాయి. ఇవి భూమిలోకి దూసుకెళ్లి పేలుళ్లు సృష్టిస్తాయి. ఒక్కో బాంబు 60 మీటర్ల లోతు వరకు దూసుకెళ్లగలదు. అమెరికా వైమానిక దళానికి చెందిన బి–2 స్టెల్త్ బాంబర్ల ద్వారా జీబీయూ–57 బాంబులను ప్రయోగించాల్సి ఉంటుంది. ఫోర్డో న్యూక్లియర్ సెంటర్‌ను ధ్వంసం చేయాలంటే కేవలం ఒక్క బాంబు సరిపోదు. ఒకేచోట వెన్వెంటనే కనీసం రెండు బాంబులు ప్రయోగిస్తేనే ఆశించిన ఫలితం ఉంటుంది. మొదటి బాంబు 60 మీటర్ల వరకు వెళ్లి పేలుడు జరిగిన వెంటనే మరో బాంబును ప్రయోగించాలని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. రిపీటెడ్ స్ట్రైక్స్ తప్ప మరో మార్గం లేదని అమెరికా ఎయిర్‌ఫోర్స్ మాజీ కల్నల్ సెడ్రిక్ లైటన్ తెలిపారు.

## కాంగ్రెస్ నాయకత్వంతో విభేదాలు నిజమే: థరూర్



**తిరువనంతపురం:** కాంగ్రెస్ నాయకత్వంలోని కొందరితో తనకు అభిప్రాయ భేదాలున్న మాట నిజమేనని ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు శశి థరూర్ వెల్లడించారు. ఆ విభేదాలు జాతీయ నాయకులతోనా లేక రాష్ట్ర నాయకత్వంతోనా అనే విషయాన్ని వివరించేందుకు ఆయన నిరాకరించారు. నీలంపూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు జరుగుతున్న వేళ ఆ అంశంపై తాను మాట్లాడలేనన్నారు. ఎన్నికలయ్యాక వివరిస్తానని చెప్పారు. ఉప ఎన్నిక ప్రచారానికి తనను ఆహ్వానించలేదని చెప్పారు. గతంలోనూ ఉప ఎన్నికల సమయంలో ప్రచారానికి తనకు కబురు పంపలేదని గుర్తు చేశారు. శశిథరూర్ గురువారం తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడారు. పహల్గాం దారుణం అనంతరం మోదీ ప్రభుత్వ వైఖరిని సమర్థిస్తూ మాట్లాడిన థరూర్‌పై కాంగ్రెస్‌లోని కొందరు నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై స్పందిస్తూ ఆయన..కాంగ్రెస్ విలువలు, నాయకులు తనకు ఎప్పటికీ అత్యంత ప్రియమైన వారేనని పేర్కొన్నారు. పదహారేళ్లుగా అత్యంత సన్నిహితంగా కలిసి పనిచేసిన పార్టీ నేతలంతా తనకు స్నేహితులు, సోదరుల్లాంటి వారని తెలిపారు. కొన్ని అపోహల కారణంగానే వారలా మాట్లాడారని చెప్పుకొచ్చారు. తాను కాంగ్రెస్ పార్టీని వదిలి ఎక్కడికీ వెళ్లబోనని స్పష్టం చేశారు.

# ఆ యుద్ధం ఆపింది నేను కాదు

**ఆ క్రెడిట్ భారత్, పాక్‌లదే: ట్రంప్**



**న్యూయార్క్/ఇస్లామాబాద్:** భారత్–పాకిస్తాన్ యుద్ధాన్ని తానే చొరవ తీసుకొని ఆపేశానంటూ ఇన్నాళ్లూ మొండిగా వాదిస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హఠాత్తుగా మాట మార్చేశారు. నిజం అంగీకరించారు. భారత్– పాకిస్తాన్ యుద్ధం ఆగిపోవడం వెనుక తన పాత్ర ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. అణుయుద్ధంగా మారాల్సిన సంఘర్షణకు ఇద్దరు తెలివైన నాయకులు చక్కగా ముగింపు పలికారని చెప్పారు. యుద్ధం ముగించాలన్న నిర్ణయం భారత్, పాకిస్తాన్ ప్రధానమంత్రులదేనని పేర్కొన్నారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌తో బుధవారం శ్వేతసౌధంలో ట్రంప్ సమావేశమయ్యారు. ఇరువురు మధ్యాహ్నం కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడుకున్నారు. భేటీ కంటే ముందు అసిమ్ మునీర్ మాట్లాడుతూ.. ఇండియా–పాక్ మధ్య యుద్ధాన్ని నివారించినందుకు డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ప్రతిపాదించారు. మధ్యాహ్నం భోజనం తర్వాత ట్రంప్ మీడియాతో మాట్లాడారు. అసిమ్ మునీర్‌ను కలుసుకోవడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు.

**మోదీని అభినందించకుండా ఉండలేకపోతున్నా..**

భారత్, పాక్ మధ్య గత నెల 7 నుంచి 10వ తేదీ దాకా జరిగిన యుద్ధంపై ట్రంప్ స్పందించారు. యుద్ధం ముగిసిపోవడం వెనుక తన ప్రమేయం లేదన్నారు. ''ఇండియాతో ఘర్షణ మరింత ముదరకుండా త్వరగానే స్వస్తి పలికినందుకు అసిమ్ మునీర్‌కు కృతజ్ఞతలు చెప్పడానికే ఈరోజు ఇక్కడ కలిశా. భారత ప్రధాని నరేంద్ర మోదీకి కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మంగళవారం రాత్రే ఆయనతో ఫోన్‌లో మాట్లాడా. పాకిస్తాన్ విషయంలో మంచి నిర్ణయం తీసుకున్నందుకు మోదీని అభినందించకుండా ఉండలేకపోతున్నా. ఇండియాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనే పనిలో నిమగ్నమయ్యాం. పాకిస్తాన్‌తోనూ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం. రెండు అతిపెద్ద అణ్వస్త్ర దేశాలు పూర్తిస్థాయి యుద్ధంలోకి దిగకుండా సంయమనం పాటిస్తూ వెనక్కి తగ్గడం నాకు చాలా సంతోషం కలిగించింది. ఈ క్రెడిట్ భారత్, పాక్ పాలకులకే దక్కుతుంది. వారు తీసుకున్న తెలివైన నిర్ణయం పెద్ద ముప్పునే తప్పించింది'' అని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు.

## బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపలేదు: కేంద్రం

**ముంబై:** అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం బ్లాక్ బాక్స్‌ను డీకోడ్ చేసేందుకు అమెరికాకు పంపించినట్లు వస్తున్న వార్తలను కేంద్రం తోసిపుచ్చింది. బ్లాక్ బాక్స్‌ను ఎక్కడికి పంపించాలనే విషయాన్ని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) మాత్రమే నిర్ణయిస్తుందని గురువారం తెలిపింది. సాంకేతిక, భద్రతాపరమైన అన్ని అంశాలను మదింపు చేశాకే బ్లాక్ బాక్స్‌ను ఎక్కడికి పంపించాలనే అంశంలో ఏఏఐబీ నిర్ణయం తీసుకుంటుందని వివరించింది.

కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయని.. సినిమాను, స్టాండప్ కామెడీని ఆపలేం: సుప్రీం
కెనడా గడ్డపై ఖలిస్తాన్ ఉగ్రవాదం నిజమే
జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలి
సాక్షి ప్లస్ జాతీయం పేజీలో..

# విద్యార్థి వీసాల ప్రక్రియ ప్రారంభం

- దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాల తనిఖీ తప్పనిసరి
- ప్రొఫైళ్లను 'పబ్లిక్' మోడ్‌లో ఉంచాలని అమెరికా సూచన

**వాషింగ్టన్:** ఉన్నత విద్యకోసం అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులకు ఆ దేశం శుభవార్త చెప్పింది. కొంతకాలంగా తాత్కాలికంగా నిలిపేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల ప్రక్రియను పునఃప్రారంభిస్తున్నట్టు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. వీసా కోసం అప్లై చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా అకౌంట్లను తప్పనిసరిగా తనిఖీ చేస్తామని ప్రకటించింది. దీనికోసం తాజాగా కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. 'సోషల్ మీడియా తనిఖీల ద్వారా మా దేశంలోకి రావాలనుకునే ప్రతి వ్యక్తిని సమగ్రంగా పరిశీలించడానికి వీలవుతుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను యూఎస్ కాన్సులర్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ప్రొఫైళ్ల ప్రైవసీ సెట్టింగ్స్‌ను 'పబ్లిక్'గా మార్చుకోవాల్సి ఉంటుంది' అని అమెరికా విదేశాంగ శాఖ అధికారి ఒకరు తెలిపారు. అమెరికా స్టూడెంట్ వీసా కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే వారి ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను ట్రంప్ సర్కార్ ఈ ఏడాది మే చివరి వారంలో తాత్కాలికంగా నిలిపేసింది. అమెరికా రావాలనుకునే విద్యార్థుల సోషల్ మీడియా అకౌంట్లను పరిశీలించేందుకు సన్నాహాలు చేస్తున్నామని.. అందుకే వీసాల జారీని ఆపేసినట్లు ప్రకటించింది. ఈ క్రమంలోనే తాజాగా కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. దరఖాస్తుదారుల సోషల్ మీడియా వెట్టింగ్ కంపల్సరీ చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ల ప్రక్రియను పునఃప్రారంభించింది.

**'సోషల్ మీడియా వెట్టింగ్' అంటే?**

'సోషల్ మీడియా వెట్టింగ్' అంటే వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు అనుమతి ఇవ్వొచ్చా? లేదా? అనే విషయాన్ని నిర్ణయించడానికి వారి ఆన్‌లైన్ కార్యక లాపాలను, ముఖ్యంగా సోషల్ మీడియా పోస్టులను క్షుణ్ణంగా తనిఖీ చేయడం. విద్యార్థి సామాజిక మాధ్యమాల్లోని తన ఖాతాల్లో పాలస్తీనా అనుకూల పోస్టులు, అమెరికా వ్యతిరేక పోస్టులు ఏమైనా ఉన్నాయా? అని అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు నిశితంగా పరిశీలిస్తారు. వారివల్ల అమెరికా భద్రతకు ఎలాంటి ముప్పు లేదని నిర్ధారించుకున్న తర్వాతే స్టూడెంట్ వీసా మంజూరు చేస్తారు.

# మ్యాట్రిక్స్‌తోనే డేటాలో కిక్



**నాస్కామ్ నివేదికలో కీలక విషయాలు వెల్లడి**

- ప్రాబబులిటీలో పట్టు ఉంటేనే మనుగడ
- గురి లేకుంటే వీడియో అనలిటిక్స్ గోవిందా
- చాలామంది డేటా ఇంజనీర్లకు గణితంపై పట్టు నిల్
- ఇంజనీరింగ్‌లోనే నైపుణ్యం పెంచుకోవాలి

**ఐటీ సెక్టార్‌లో డేటాసైన్స్ తికమక పెడుతోంది.** ఫ్రెషర్స్ ఆ స్పీడ్‌ను అందుకోలేకపోతున్నారు. ఏడాది గడచినా డేటా అనుపానులు బుర్రకెక్కడం లేదు. దీంతో కొత్తగా చేరినవారు బెంచ్ మీదే కాలక్షేపం చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితి ఐటీ ఫ్రెషర్స్‌లో ఆందోళన రేపుతోంది. ప్రాజెక్టు రాకుంటే ఉద్యోగం నిలబడటం కష్టమే. దేశవ్యాప్తంగా డేటాసైన్స్ చదువుతున్నవారు ఏటా 3.5 లక్షల మంది ఉన్నారు. వీరిలో 80 వేల మందికే డేటా అనలిస్టులుగా ఉద్యోగాలొస్తున్నాయి. వీళ్లలో సగటున 20 వేల మందికే నైపుణ్యం ఉంటోంది. మిగిలిన 60 వేల మంది బెంచ్ మీదే ఉంటున్నారని ఇటీవల నాస్కామ్ వెల్లడించింది.

సాక్షి, హైదరాబాద్

## గణితమే కీలకం



డేటాసైన్స్‌కు కీలకం మేథమెటిక్స్. ముఖ్యంగా మ్యాట్రిక్స్‌పై పట్టు ఉంటేనే డేటా అనాలిసిస్‌లో రాణిస్తారు. ఇంటర్‌లోనే మేథ్స్‌పై సమర్థత ఎంత అనేది బేరీజు వేసుకోవాలి. ప్రాబబులిటీ, మ్యాట్రిక్స్‌పై ఆసక్తి ఉంటేనే డేటాసైన్స్ వైపు వెళ్లడం మంచిది.

– డాక్టర్ కేపీ సుప్రీతి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, జేఎన్‌టీయూహెచ్

## స్పీడ్ లేకుంటే కష్టమే



డేటాసైన్స్‌పై శరవేగంగా పనిచేసే సమర్థత ఉండాలి. కొన్నిసార్లు అర్థం చేసుకోవడం కష్టమే. కాలిక్యులేషన్ వేగంగా ఉంటే తప్ప కంప్యూటర్ పరుగును అందుకోలేం. ఇంజనీరింగ్ స్థాయిలోనే డేటాసైన్స్‌లో మెళకువలు నేర్చుకోవడమే కాదు, వాటిని ప్రాక్టీస్ కూడా చేయాలి.

– కంకిపాటి శేషగిరిరావు, ఐటీ రంగ నిపుణుడు

## కారణాలేంటి?

డేటాసైన్స్‌కు ఆయువు పట్టు గణితం. గణితంపై పట్టు సాధించాలంటే పాఠశాల స్థాయి నుంచే కష్టపడాలి. ఇంటర్‌లో లోతుగా అధ్యయనం చేయాలి. ముఖ్యంగా మ్యాట్రిక్స్‌పై పట్టు ఉండాలి. ప్రాబబులిటీస్‌ను ఏ రూపంలో ఉన్నా చేయగల సమర్థత ఉండాలి. కానీ ఇంటర్‌లోనే మ్యాట్రిక్స్, కాలిక్యులేషన్స్‌ను సాదాసీదాగా తీసుకుంటున్నారు. కాలేజీల్లో పరీక్ష కోసం మాత్రమే గణితం ప్రాక్టీస్ చేయిస్తున్నారు. సబ్జెక్టు లోతుల్లోకి వెళ్లడం లేదు. ఒకటి రెండు మెథడ్స్‌తో సరిపుచ్చుతున్నారు. ఇదే విద్యార్థులకు శాపంగా మారుతోంది. ఇంజనీరింగ్‌లో ఈ విధానం పనికిరాదని అధ్యాపకులు అంటున్నారు. డిజిటల్ ఎలక్ట్రానిక్స్, డేటా స్ట్రక్చర్, డిస్క్రియేట్ మేథమెటిక్స్, ఆల్గరిథమ్ డిజైన్ అండ్ అనాలిసిస్ వంటి చాప్టర్స్‌లో రాణించాలంటే ఇంటర్ పునాది గట్టిగా ఉండాలి. మ్యాట్రిక్స్‌పై పూర్తి అవగాహన ఉండాలి. బిగ్ డేటా అనాలిసిస్‌లో డిజిటల్ డిజైనింగ్‌లో డేటా విశ్లేషణ క్షణాల్లో శరవేగంగా మారుతుంది. ఐటీ సెక్టార్‌లో డేటా స్పీడ్ మరింత వేగంగా ఉంటుంది. దీన్ని విశ్లేషించే వేగం ఇంజనీరింగ్ ఫ్రెషర్స్‌కు ఉండటం లేదని ఐటీ పరిశ్రమ అంటోంది.

## గురి పెట్టకుంటే గోవిందా..

ప్రపంచవ్యాప్తంగా డేటా అనలిస్టులకు డిమాండ్ పెరుగుతోంది. అమెరికా ఇప్పటికే 5,381 బిగ్ డేటా కేంద్రాలు ఏర్పాటు చేసింది. మనదేశంలో 870 కేంద్రాలు ఉన్నాయి. మరో మూడేళ్లలో ఇవి 1,800కు చేరబోతున్నాయి. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై కార్పొరేట్ కంపెనీలు రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్నాయి. మన దేశంలో ఈ ఏడాది చివరి నాటికి 15 లక్షల మంది డేటా అనలిస్టుల అవసరం ఉందని ఐటీ కంపెనీలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్నది 4.5 లక్షల మందే. దీన్ని దృష్టిలో పెట్టుకుని డేటాసైన్స్‌లో నాణ్యత పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. డేటా వేగాన్ని పెంచేలా మైండ్‌సెట్‌ను కేంద్రీకరించే తీరును టెన్త్ నుంచే తీసుకురావాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రాబబులిటీస్, మ్యాట్రిక్స్ విభాగాలపై ప్రత్యేక దృష్టి పెంచాలని సూచిస్తున్నారు. ఇంజనీరింగ్ డేటా సైన్స్ చేసే విద్యార్థులు కూడా డేటా నిపుణుల వద్ద ప్రత్యేక తర్ఫీదు తీసుకోవాలని, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యం పెంచుకోవాలని చెబుతున్నారు.

---

### త్వరలో తెలుగు రాష్ట్రాల
# సీఎంల భేటీ

- తెలంగాణ అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి




మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి, కృష్ణా నదీ జలాల వివాదాలపై చర్చించేందుకు త్వరలోనే రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకున్నాకే ప్రాజెక్టుపై ముందుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన డీపీఆర్ అందలేదని కేంద్ర మంత్రి చెప్పారని వివరించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రజల్లో ఆందోళన ఉన్న విషయాన్ని తెలియజేయగా, రాష్ట్ర అభ్యంతరాలు విన్నాకే ముందుకు పోతామని హామీ ఇచ్చారని ఉత్తమ్ తెలిపారు. కృష్ణా నదీ జల వివాదాల ట్రిబ్యునల్–2 తీర్పు సైతం త్వరగా వచ్చేలా చూడాలని చెప్పామన్నారు. కేంద్ర మంత్రితో చర్చలు మంచి వాతావరణంలో జరిగాయని, తెలంగాణకు అన్యాయం చేయమని కేంద్ర మంత్రి మాటిచ్చారని ఉత్తమ్ తెలిపారు. 'గోదావరి నీటిని వినియోగించుకునేలా తెలంగాణ వేగంగా ప్రాజెక్టుల నిర్మాణం చేస్తున్నా, అనుమతులు ఇవ్వట్లేదు. ఏపీ ప్రాజెక్టులకు ఇస్తున్నారు. ఇది రాష్ట్రాలను సమదృష్టితో చూడ కపోవడమే. నీటి ప్రాజెక్టుల విషయంలో ఏపీ పట్ల ఒకలా.. తెలంగాణ పట్ల మరోలా వ్యవహరించవద్దు' అని సీఎం రేవంత్ చెప్పారు.

## తెలంగాణలో కూడా ప్రాజెక్టులు కట్టుకోవచ్చు

**నేను అభ్యంతరం చెప్పను: ఏపీ సీఎం చంద్రబాబు**



సాక్షి, అమరావతి: 'గోదావరిలో పుష్కలంగా నీళ్లున్నాయి. తెలంగాణ, ఏపీ ఎవరి శక్తికొద్దీ వాళ్లు ప్రాజెక్టులు కట్టుకోవచ్చు. ఇందులో ఎలాంటి వివాదంలేదు. తెలంగాణ కూడా ప్రాజెక్టులు కట్టుకోవచ్చు. నేను అభ్యంతరం చెప్పను. కాళేశ్వరం ప్రాజెక్టుకూ అభ్యంతరం చెప్పలేదు. పోలవరం–బనకచర్లను ఇష్యూ చేయాల్సిన అవసరంలేదు. గొడవలవల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు. సముద్రంలోకి పోతున్న 3,000 టీఎంసీల్లో తెలంగాణ ఎగిరెగిరి 300 టీఎంసీలను.. ఏపీ 200 టీఎంసీలను తీసు కోవచ్చు' అని ఏపీ సీఎం చంద్రబాబు గురువారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

## యూకే పర్యటనకు కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యునైటెడ్ కింగ్ డమ్‌లో పర్యటించేందుకు గురువారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు. ఇంగ్లండ్‌లోని ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే సదస్సులో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని కీలకోపన్యాసం చేస్తారు. ఈ సదస్సులో 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు'అనే అంశంపై చర్చ జరగనుంది. ఈ నెల 24న కేటీఆర్ హైదరాబాద్‌కు తిరిగి రావొచ్చని బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి.

---

### రేవంత్‌కు బేసిన్ల కంటే
# బ్యాగుల మీదే నాలెడ్జి ఎక్కువ

**నదుల బేసిన్లపై కనీస అవగాహన లేకుండా మాట్లాడారు**

- బనకచర్ల ప్రాజెక్టు ఏ నది బేసిన్‌లో కడుతున్నారో తెలియకపోతే ఎలా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- ఏపీ జలదోపిడీ, అక్రమ ప్రాజెక్టులు అడ్డుకోవడం చేతకాక అబద్ధాలు చెబుతున్నారు
- తెలంగాణ హక్కులను ఏపీకి, చంద్రబాబుకు రాసిస్తే ప్రజలు ఊరుకోరు



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో సబితా ఇంద్రారెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నదుల బేసిన్‌ల గురించి బేసిక్ నాలెడ్జ్ (కనీస అవగాహన) లేకుండా మాట్లాడారు. బేసిన్ (పరివాహక ప్రాంతం)ల కంటే కూడా బ్యాగుల మీదే నాలెడ్జి బాగా ఉన్నట్లు ఉంది. నదీ పరివాహక ప్రదేశాల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకుంటూ రాష్ట్రం పరువు తీశారు..' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గోదావరి–బనకచర్లపై ఏపీ ప్రభుత్వం గత ఆరు నెలలుగా కేంద్ర మంత్రులను కలుస్తూ అనుమతులు కోరుతుంటే, కనీసం ఆ ప్రాజెక్టు ఏ నది బేసిన్‌లో కడుతున్నారో కూడా సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. 'రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడారు. అంతులేని అజ్ఞానంతో మూర్తీభవించిన మూర్ఖత్వంతో మాట్లాడారు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలియదు. బనకచర్ల ఏ బేసిన్‌లో కడుతున్నారో తెలియదు. ఇవేవీ తెలుసుకోకుండా సీఎం ఏం చేస్తున్నట్లు..?' అంటూ మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

### రాష్ట్ర ప్రయోజనాలు పక్కనపెట్టి రాజకీయాలా?

'తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌కు అవగాహన, చిత్తశుద్ధి లేదని బుధవారం ఆయన ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో తేలిపోయింది. నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ కూడా బనకచర్ల ప్రకాశం జిల్లాలో ఉందని చెప్పడం విడ్డూరంగా ఉంది. బనకచర్ల విషయంలో మొద్దు నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ అప్రమత్తం చేస్తే, సీఎం మాత్రం రాష్ట్ర ప్రయోజనాలు పక్కనపెట్టి రాజకీయాలు మాట్లాడుతున్నాడు. ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో.. 'ఈ భేటీని రాజకీయ వేదికగా మార్చకు..బనకచర్ల ఆపాలి' అని మా రవిచంద్ర అంటే సీఎం అబద్ధాలకు వేదికగా మార్చారు. ఏపీ జలదోపిడీ, అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవడం చేతకాని సీఎం చెప్తున్న అబద్ధాలకు అంతు ఉండటం లేదు. రేవంత్‌రెడ్డి కుసంస్కారి.. వదరుబోతు. ఆయన నల్లమల పులిబిడ్డ కాదు..వెకిలి మాటల వెర్రిబిడ్డ. మేం ఉద్యమాల నుంచి వచ్చినం. నీలాగా అడ్డమైన తొక్కులు తొక్కుతూ రాలేదు..' అంటూ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఏపీకి రేవంత్ దాసోహం అవుతున్నారు..

'గోదావరిలో 1,000, కృష్ణా నదిలో 500 టీఎంసీలు తెలంగాణకు తీసుకుని, మిగిలిన జలాలను ఏపీకి తరలించుకునేందుకు ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలంగాణ ఆయన జాగీరు కాదు. చంద్రబాబు దయాదాక్షిణ్యాల మీద బతకడాన్ని రేవంత్ మానుకోలేక పోతున్నారు. ఏపీకి దాసోహం అవుతూ బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. రేవంత్ చేసిన ద్రోహానికి ఆయనను ఉరి తీసినా తప్పులేదు. నదీ జలాల్లో తెలంగాణ హక్కులను ఏపీకి, చంద్రబాబుకు రాసిస్తే ప్రజలు ఊరుకోరు. చంద్రబాబుకు రేవంత్‌కు మధ్య ఆదిత్యనాథ్ దాస్ అనుసంధాన కర్తగా పనిచేస్తున్నాడు. గోదావరి, కృష్ణా జలాలు ఏపీకి దోచి పెట్టేందుకు అవి రేవంత్ అయ్య సొమ్ము కాదు. ఆయన కేవలం తెలంగాణకు కాపలాదారు మాత్రమే..' అని మాజీమంత్రి అన్నారు.

### మేం అంగీకరించామనడం శుద్ధ అబద్ధం

'తెలంగాణకు సాగునీటి కోసం పరితపించిన కేసీఆర్ రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన నీటి వాటా కోసం సుప్రీం కోర్టు దాకా వెళ్లారు. పోలవరం ద్వారా పెన్నా బేసిన్‌కు నీరు తరలిస్తే కృష్ణా బేసిన్‌లో 763 టీఎంసీలు తెలంగాణకు రావాలని గతంలో అఫిడవిట్ ఫైల్ చేశాం. గోదావరిలో సగటున ఏటా 3 వేలకు పైగా టీఎంసీలు సముద్రంలో కలుస్తాయని సీడబ్ల్యూసీ లెక్కల ఆధారంగా కేసీఆర్ అంచనా వేసి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో ప్రస్తావించారు. కానీ రేవంత్‌రెడ్డి వాస్తవాలను వక్రీకరించి బనకచర్లకు గత ప్రభుత్వం అంగీకరించినట్లు అబద్ధాలు చెప్తున్నారు. తెలంగాణను సంప్రదించకుండా గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం చేపడితే అంగీకరించేది లేదని గతంలోనే అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ కుండబద్దలు కొట్టారు. కానీ రేవంత్ మాత్రం 1,000 టీఎంసీలు తెలంగాణకు ఇచ్చి, మీరు ఎన్ని జలాలు అయినా తరలించుకోండి అని ఏపీకి చెప్తున్నారు..' అని హరీశ్‌రావు ఆరోపించారు.

### ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోం..

'కృష్ణా–గోదావరి నదీ జలాల అనుసంధానం గురించి కేసీఆర్ చేసిన ప్రతిపాదనకు గతంలో ఏపీ సీఎం జగన్ అంగీకరించక పోవడంతో అది ముందుకు సాగలేదు. తెలంగాణతో సంబంధం లేకుండా కృష్ణా–గోదావరి అనుసంధానికి అంగీకరించే ప్రసక్తే లేదు. గోదావరి జలాల్లో తెలంగాణకు హక్కుగా రావాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోం. అవసరమైతే రైతుల పక్షాన కోర్టులను ఆశ్రయిస్తాం..' అని హరీశ్‌రావు ప్రకటించారు. మీడియా సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, అనిల్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

---

### మెట్రో ఫేజ్–2కు
# అనుమతులివ్వండి

**కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి**

- కేంద్రంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధమని వెల్లడి
- బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో భేటీ



కేంద్ర మంత్రి ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్, ఎంపీలు రఘువీర్, మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రితో ఆయన నివాసంలో సీఎం సమావేశమయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్–2 అవసరం ఎంతో ఉందని చెప్పారు. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. మెట్రో ఫేజ్–2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని..నగర సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి కూడా అవసరమైన అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

**తెలంగాణ విజన్ భేష్: టోనీ బ్లెయిర్**

తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్–2047 విజన్ అద్భుతంగా ఉందని బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. 1997–2007 మధ్య పదేళ్ల పాటు యూకేకు ప్రధానమంత్రిగా పని చేసిన ఆయన.. రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహరచన... వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో 'టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టీబీఐజీసీ)'ను స్థాపించారు. ఈ నేపథ్యంలో భారత్‌లో పర్యటిస్తున్న టోనీ బ్లెయిర్‌తో గురువారం ఢిల్లీలో రేవంత్‌రెడ్డి గంటకు పైగా భేటీ అయ్యారు. తెలంగాణలో రైతులు, యువత, మహిళలు వంటి విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 ముఖ్య అంశాలను తెలియజేస్తూ, ఈ విజన్‌ను 2025, డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రజలకు వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టోనీ బ్లెయిర్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రణాళిక సుస్థిరాభివృద్ధి దిశగా ఉందని ప్రశంసించారు. అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలులో భాగస్వామ్యానికి సంబంధించిన ఆసక్తి వ్యక్తీకరణ పత్రాన్ని(లెటర్ ఆఫ్ ఇంటెంట్) తెలంగాణ ప్రభుత్వం, టీబీఐజీసీ ప్రతినిధులు మార్చుకున్నారు. మంత్రి ఉత్తమ్, ఎంపీలు మల్లు రవి, రఘువీర్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఏపీ జితేందర్‌రెడ్డి, మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఉన్నతాధికారులు జయేశ్ రంజన్, విష్ణువర్ధన్‌రెడ్డి, గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## బనకచర్లను అడ్డుకుంటామని రేవంత్ ఎందుకు చెప్పలేదు?: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బనకచర్లను కచ్చితంగా అడ్డుకొని తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చెప్పడం లేదని మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టు పెడుతుందని ధ్వజమెత్తారు. బనకచర్ల విష యంలో హరీశ్‌రావు ప్రశ్నించిన తర్వాతనే ఈ ప్రభుత్వం స్పందించిందన్నారు.

---

# మళ్లీ తెరపైకి ఇచ్చంపల్లి–సాగర్

▶ మొదటి పేజీ తరువాయి

ఇచ్చంపల్లి–సాగర్ అనుసంధాన ప్రాజెక్టు, జలాల లభ్యత, మళ్లించే విధానం, అవసరమయ్యే నిధులు, ఆయా రాష్ట్రాలకు దక్కే నీటి వాటాలు, వృద్ధిలోకి వచ్చే ఆయకట్టు తదితర అంశాలను స్పష్టంగా పేర్కొంది. దీని ప్రకారం.. తెలంగాణలోని ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిపై 15.8 టీఎంసీల సామర్థ్యంతో బరాజ్ నిర్మించి తమిళనాడులో కావేరి నదిపై ఉన్న గ్రాండ్ ఆనకట్ట వరకు 247 టీఎంసీల నీటిని మళ్లిస్తారు. బరాజ్ నుంచి రోజుకు 2.2 టీఎంసీల చొప్పున నీటిని సాగర్‌కు మళ్లిస్తారు. ఈ దారిలో గొట్టిముక్కల బ్రాంచి కాలువ కింద నల్లగొండ జిల్లాలోని మునుగోడు, చండూరు ప్రాంతాల్లో 80 వేల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు, ఎస్సారెస్పీ–2 కింద 1.78 లక్షలు, ఎస్‌ఎల్‌బీసీ కింద 1.09 లక్షల హెక్టార్లకు నీరందించాల్సి ఉంటుంది. ఇక ఏపీలో సాగర్ కుడి కాలువ కింద 1.26 లక్షల హెక్టార్లు, నాగార్జునసాగర్–సోమశిల కింద 1.68 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు నీటిని ప్రతిపాదించారు. సోమశిల–కావేరి మధ్య 2.5 లక్షల హెక్టార్లకు నీటి సరఫరాకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఇందులో ఉన్నాయి.

### మూడు రాష్ట్రాలకు 230 టీఎంసీలు

గోదావరిలో వరద ఉండే జూన్–అక్టోబర్ నెలల్లో 143 రోజుల్లో 247 టీఎంసీలను మళ్లిస్తారు. ఇందులో ఆవిరి నష్టాలు పోనూ మిగిలే 230 టీఎంసీలలో తెలంగాణ 65, ఆంధ్రప్రదేశ్ 79.9, తమిళనాడు 84 టీఎంసీలు వినియోగించుకునేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు ఆ సమయంలోనే రూ.85 వేల కోట్ల మేర వ్యయాన్ని అంచనా వేసింది. ఇచ్చంపల్లి నుంచి సాగర్‌కు నీటిని మళ్లించే క్రమంలో మూడు లిఫ్టులు నిర్మించాల్సి ఉండగా, వీటి నిర్వహణకు 3,840 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరమవుతుందని, ఇందుకు ఏటా రూ.770 కోట్లు ఖర్చవుతుందని లెక్కగట్టింది. ఇక ఇచ్చంపల్లి వద్ద నిర్మించే బరాజ్‌తో 9,300 హెక్టార్లు ముంపునకు గురికానుండగా, 22 వేల మంది నిరాశ్రయులవుతారని ఎన్‌డబ్ల్యూడీఏ పేర్కొంది. అయితే ఈ ప్రతిపాదనను అప్పట్లో తెలంగాణ వ్యతిరేకించింది. దీనికి దిగువన అకినేపల్లి నుంచి ఒక ప్రతిపాదన, తుపాకులగూడెం నుంచి మరో ప్రతిపాదన, దుమ్ముగూడెం నుంచి ఇంకో ప్రతిపాదన సిద్ధం చేశారు. అయితే ఇంద్రావతి మిగులు జలాలపై ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో దీనిపై చర్చోపచర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ పోలవరం–బనకచర్ల చేపట్టడంతో, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ తాజాగా ఇచ్చంపల్లి–సాగర్ అనుసంధానాన్ని తెరపైకి తెచ్చింది. దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

---

# బనకచర్లను అడ్డుకోండి



**తెలంగాణ ప్రయోజనాలకు ఈ ప్రాజెక్టుతో విఘాతం**

- ఎలాంటి అనుమతులు, ఆర్థిక చేయూతనివ్వొద్దు
- పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్, ఉత్తమ్ ఫిర్యాదు
- గోదావరిలో 1,000, కృష్ణాలో 500 టీఎంసీల వినియోగానికి ఎన్‌వోసీ ఇవ్వండి
- పాలమూరు–రంగారెడ్డి, సమ్మక్క–సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు, అన్ని అనుమతులు మంజూరు చేయండి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు ప్రీఫీజబిలిటీ నివేదికను తిరస్కరించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్–1980 (జీడబ్ల్యూడీటీ), ఏపీ పునర్విభజన చట్టం–2014లకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని చెప్పారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో రేవంత్, ఉత్తమ్‌తోపాటు ఎంపీలు మల్లురవి, రఘువీర్ రెడ్డి, నీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళన నెలకొందని వివరించారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని.. జీడబ్ల్యూడీటీ–1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదన్నారు. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని, అయితే బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటిని ఉల్లంఘిస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలని రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కోరారు.

**వరద నిజమైతే ఇచ్చంపల్లి–సాగర్ అనుసంధానంపై చర్చిద్దాం**

సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టిందని కేంద్ర మంత్రి పాటిల్‌కు రేవంత్, ఉత్తమ్ వివరించారు. గోదావరి అవార్డు ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని, తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు కొనసాగిస్తూనే ఉందని చెప్పారు. గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఏపీ భావిస్తుంటే పోలవరం–బనకచర్లకు బదులు, కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి–నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధమని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తాము ఎట్టిపరిస్థితుల్లో రాజీపడబోమని, అన్ని వేదికల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కేంద్రం స్పందన సానుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సీఎం స్పష్టం చేశారు.

## 1,500 టీఎంసీలను వాడుకునేలా..

- తెలంగాణకు గోదావరి నదిలో 1,000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు మొత్తంగా 1,500 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర జల్‌శక్తి శాఖ, ఏపీ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని, దానికి కేంద్రం ఆమోదం తెలపాలని సీఆర్ పాటిల్‌కు రేవంత్ విజ్ఞప్తి చేశారు. 1500 టీఎంసీల నీటితో కోటి న్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఏపీ చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీ లిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.
- ఏపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతు ల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదని సీఎం రేవంత్ అన్నారు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. పాలమూరు–రంగారెడ్డి, సమ్మక్క–సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతోపాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు.
- గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవానికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి పాటిల్‌కు రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## క్లుప్తంగా...

### కేన్సర్ బాధితుడికి రూ.10 లక్షల సాయం

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పెద్దమనసు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: కేన్సర్ వ్యాధితో పోరాడుతున్న సంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ ప్రసాద్‌కు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అండగా నిలిచారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని హరికృష్ణకు గురువారం రూ.పది లక్షల ఆర్థిక సాయం అందించారు. హరికృష్ణ గురుకుల పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. రూ.13 వేల వేతనంతో బతుకీడుస్తున్నాడు. ఆయనకు భార్య శైలజ, ఒకటో తరగతి చదువుతున్న పాప, ఓ బాబు ఉన్నారు. నిరుపేద అయిన హరికృష్ణకు కేన్సర్ చికిత్స చేయించుకోవడం ఆర్థిక భారంతో కూడుకున్నది కావడంతో అతడి కుటుంబానికి అండగా నిలవాలని జగ్గారెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ఆర్థిక సాయం అందించి భరోసా ఇచ్చారు. చికిత్స కోసం అయిన ఖర్చులు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కూడా సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హరికృష్ణ కుటుంబ సభ్యులు జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల మరో ఇద్దరు కేన్సర్ రోగులకు కూడా జగ్గారెడ్డి రూ.పది లక్షల చొప్పున రూ.20 లక్షలు ఆర్థిక సాయం అందించిన సంగతి తెలిసిందే.

### పార్కిన్సన్స్ చికిత్సలో ప్రభావవంతంగా 'న్యూరోగ్రిట్'

పతంజలి యోగపీఠ్ వెల్లడి..

హరిద్వార్: పతంజలి పరిశోధనతో అభివృద్ధి చేసిన న్యూరోగ్రిట్ గోల్డ్ మందు పార్కిన్సన్స్ వ్యాధి చికిత్సలో సమర్థవంతంగా పనిచేస్తోందని పతంజలి యోగ పీఠ్ తెలిపింది. ఈ మేరకు ప్రముఖ అంతర్జాతీయ ప్రచురణ సంస్థ వైలీలో కథనం ప్రచురితమైంది. న్యూరోగ్రిట్ గోల్డ్ సాంప్రదాయ ఆయుర్వేదం, ఆధునిక శాస్త్రాల ప్రత్యేక మిశ్రమమని యోగపీఠ్‌కు చెందిన ఆచార్య బాలకృష్ణ వెల్లడించారు. ఈ మందు పార్కిన్సన్స్ వ్యాధిగ్రస్తుల్లో జ్ఞాపక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడటమే కాకుండా, రోగి జీవన ప్రమాణాలను కూడా పెంచుతోందని తెలిపారు. సహజ మూలికలను శాస్త్రీయ దృష్టితో విశ్లేషిస్తే, అవి ఆధునిక ఆరోగ్య సవాళ్లకు విప్లవాత్మక పరిష్కారాలను తీసుకురాగలవని ఈ న్యూరోగ్రిట్ గోల్డ్ నిరూపిస్తుందని తెలిపారు. పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ అనురాగ్ వర్ష్ణే మాట్లాడుతూ ఆయుర్వేద సూత్రీకరణను ఉపయోగించి సి.ఎలిగాన్స్‌పై ప్రయోగం నిర్వహించడం ఇదే మొదటిసారని చెప్పారు.

### వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో చండీగఢ్ వర్సిటీకి 575వ ర్యాంక్

హైదరాబాద్: క్యూఎస్‌వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్- 2026లో చండీగఢ్ విశ్వవిద్యాలయం తన స్థానాన్ని నిలుపుకుంది. 575వ ర్యాంక్‌తో 2 శాతం ఉన్న ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలిచింది. అలాగే 25వ స్థానాలు ఎగబాకి ఈ విశ్వవిద్యాలయం భారతదేశంలో 16వ స్థానం సాధించింది. ఎంప్లాయర్ రిప్యుటేషన్‌లో 7వ స్థానం, అంతర్జాతీయ పరిశోధనలో 12వ స్థానం, విద్యా ఖ్యాతిలో 13వ స్థానంలో నిలిచింది. భారతదేశ ర్యాంకింగ్స్‌లో ఈ విశ్వవిద్యాలయం గత సంవత్సరం 18వ ర్యాంక్‌తో పోలిస్తే 16వ ర్యాంక్‌తో మెరుగైంది. భారతదేశంలోని అన్ని ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో, చండీగఢ్ వర్సిటీ గత సంవత్సరం మూడవ స్థానంలో, తాజాగా 2వ స్థానంలో నిలిచింది, వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ జాబితాలో మొత్తం 54 భారతీయ విశ్వవిద్యాలయాలు చోటు దక్కించుకున్నాయి.

# 54 ఉన్నత విద్యాసంస్థలకు గ్లోబల్ గుర్తింపు

**క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026లో భారత్ కొత్త రికార్డు**

- వరుసగా 14వ సంవత్సరం 'ఎంఐటీ'టాప్..
- ఆ తర్వాత స్థానాల్లో ఇంపీరియల్ కాలేజ్ లండన్.. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం
- ప్రపంచ 123వ ర్యాంకుతో దేశంలో ఐఐటీ ఢిల్లీ టాప్.... 118 నుంచి 129కి పడిపోయిన ఐఐటీ బాంబే ర్యాంకు
- ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్ ర్యాంకుల్లో పురోగతి
- ఐఐటీ హైదరాబాద్‌కు 664వ ర్యాంకు..
- ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హర్షం




సాక్షి, న్యూఢిల్లీ: విద్యారంగంలో భారత్ మరో మైలురాయిని అందుకుంది. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026లో మన దేశానికి చెందిన 54 ఉన్నత విద్యాసంస్థలు చోటు దక్కించుకున్నాయి. ఈ రంగంలో ఇప్పటివరకు భారత్ అందుకున్న అతిపెద్ద గ్లోబల్ రికార్డు ఇది. లండన్‌కు చెందిన గ్లోబల్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనలిటిక్స్ సంస్థ క్వాక్ క్వరెల్లీ సిమండ్స్ (క్యూఎస్) గురువారం విడుదల చేసిన వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026 జాబితాలో ప్రపంచంలోని 1,500కి పైగా అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఈ ర్యాంకింగ్ కోసం అకడెమిక్ ప్రతిష్ఠ, ఫ్యాకల్టీ-స్టూడెంట్ నిష్పత్తి, రీసెర్చ్ ప్రభావం, అంతర్జాతీయ విద్యార్థుల భాగస్వామ్యం, గ్రాడ్యుయేట్ల ఉద్యోగావకాశాలు వంటి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటారు.

**వరుసగా 14వ సంవత్సరం 'ఎంఐటీ'టాప్..**

అమెరికా కేంబ్రిడ్జిలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) ప్రపంచంలోని ఉత్తమ విశ్వవిద్యాలయంగా వరుసగా 14వ సంవత్సరం కూడా తొలి ర్యాంకు పొందింది. తరువాత.. ఇంపీరియల్ కాలేజ్ లండన్ రెండో స్థానంలో, అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం మూడవ స్థానంలో ఉన్నాయి. జాబితాలో 192 విద్యాసంస్థలతో అత్యధిక ప్రాతినిధ్యం వహించే దేశంగా అమెరికా ఉంది. గత సంవత్సరం నుండి దాదాపు 500 విశ్వవిద్యాలయాలు తమ పనితీరును మెరుగుపరుచుకున్నాయి. వీటిలో మలేసియాలోని సన్‌వే యూనివర్సిటీ 120 స్థానాలకు పైగా తన ర్యాంకును మెరుగుపరుచుకుంది.

**భారత్‌లో ఐఐటీ-ఢిల్లీ టాప్..**

ఇక ఈ క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్న భారత్‌లోని 54 ఉన్నత విద్యాసంస్థల్లో 65.5 స్కోర్‌తో ఐఐటీ-ఢిల్లీ అగ్రస్థానంలో నిలిచింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా 2025లో 150, 2024లో 197 ర్యాంకు నుంచి ఈ ఏడాది ప్రపంచంలో 123వ స్థానానికి చేరుకుంది. అకడమిక్ రెప్యుటేషన్‌లో 142వ స్థానంలో, ఫ్యాకల్టీకి సైటేషన్స్‌లో 86వ స్థానంలో నిలిచింది. దేశంలోని ఇతర ఐఐటీలు, ప్రధాన వర్సిటీలూ ప్రభావవంతమైన ప్రదర్శన చేశాయి. ఐఐటీ హైదరాబాద్‌కు 664వ ర్యాంకు, వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)కు 691వ ర్యాంకు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు 801-850 మధ్య ర్యాంకు, ఉస్మానియా యూనివర్సిటీ 1,201-1,400 మధ్య ర్యాంకులో నిలిచింది. అలాగే, ఐదు భారతీయ విశ్వవిద్యాలయాలు ఎంప్లాయర్ రెప్యుటేషన్ కోసం పోటీపడి ప్రపంచవ్యాప్తంగా టాప్-100లో స్థానం సంపాదించాయి. అంతేకాక.. సగటున 43.7 స్కోరుతో 8 భారతీయ విద్యాసంస్థలు పరిశోధన ప్రభావం పరంగా సైటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీలో టాప్-100లో స్థానం సంపాదించాయి. ఇక 2025లో ఉత్తమ భారతీయ విశ్వవిద్యాలయంగా ర్యాంకు పొంది గతేడాది 118వ స్థానంలో ఉన్న ఐఐటీ బాంబే, ఈ సంవత్సరం 129వ స్థానానికి పడిపోయింది. ఐఐటీ మద్రాస్ గతేడాదితో పోలిస్తే 47 స్థానాలు ఎగబాకి 180వ స్థానానికి చేరుకుంది. ఐఐటీ ఖరగ్‌పూర్ (215), ఐఐఎస్‌సీ బెంగళూరు (219), ఢిల్లీ వర్సిటీ (328).. ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ (851-900), బిట్స్ పిలాని (668) వంటివి కూడా తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నాయి.

**ప్రపంచంలో భారత్‌కు 4వ స్థానం..**

ఇదిలా ఉంటే.. ఈ సంవత్సరం భారత్ నుంచి ఎనిమిది కొత్త విద్యాసంస్థలు మొదటిసారిగా ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నాయి. దీంతో జాబితాలో చోటు దక్కించుకున్న మొత్తం భారతీయ విద్యా సంస్థల సంఖ్య 54కి చేరుకుంది. అమెరికా (192), యూకే (90), చైనా (72) తర్వాత నాలుగో స్థానంలో భారత్ నిలిచింది. ఈ సంవత్సరం మరే దేశ విద్యా సంస్థలు కూడా ఇంత ఎక్కువ సంఖ్యలో క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకోలేదు. ఇక ఈ ఏడాది ఎనిమిది కొత్త విద్యా సంస్థలకు ర్యాంకులతో భారత్ తొలిస్థానంలో ఉండగా.. జోర్డాన్, అజర్‌బైజాన్ దేశాలు ఆరు కొత్త సంస్థలతో రెండో స్థానంలో ఉన్నాయి.

**ప్రధాని, కేంద్రమంత్రి హర్షం..**

క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ-2026 ర్యాంకింగ్స్‌లో భారత్ సాధించిన మైలురాయిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లు హర్షం వ్యక్తంచేశారు. ఈ ర్యాంకింగ్స్ మన విద్యా రంగానికి గొప్ప కీర్తిని తెస్తున్నాయని.. దేశ యువత ప్రయోజనం కోసం పరిశోధన, ఆవిష్కరణ, పర్యావరణ వ్యవస్థలను మరింతగా పెంచడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. అలాగే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా 'ఎక్స్'వేదికగా స్పందిస్తూ.. '2014లో కేవలం 11 భారత విద్యాసంస్థలు మాత్రమే ఈ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకోగా, ఇప్పుడా సంఖ్య అయిదింతలు పెరిగి 54కి చేరింది. ఇది ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్దంలో అమలుచేసిన విద్యా సంస్కరణల ఫలితం. అలాగే, నూతన విద్యా విధానం (ఎన్‌పీఈ)-2020 వల్ల ఇది సాధ్యమైంది. రికార్డు స్థాయిలో 54 సంస్థలు ఆ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకోవడం భారత విద్యావ్యవస్థలో సంభవించిన మార్పు, పురోగతికి నిదర్శనం. ఇది ఒక మార్పు మాత్రమే కాదు-ఒక విద్యా విప్లవం'అని తెలిపారు.



పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ.హరగోపాల్. చిత్రంలో ప్రొ. గడ్డం లక్ష్మణ్, నారాయణ తదితరులు

## నక్సల్స్‌పై చంద్రబాబు ప్రతీకారం

**మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ బూటకం: ప్రొ. హరగోపాల్**

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నక్సలైట్లపై ప్రతీకారం తీర్చుకుంటున్నాడని, ఇప్పటికీ ఆయన గ్రేహౌండ్స్ పోలీసులను వాడుకుంటున్నారని పౌర హక్కుల సంఘం మండిపడింది. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ బూటకమని ప్రొఫెసర్ హరగోపాల్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణలతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులను హత్యచేసి ఎప్పటిలాగే ఎన్‌కౌంటర్ కథలు అల్లుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్ల పేరుతో కొనసాగుతున్న మారణహోమాన్ని ఆపే దిక్కులేకుండా పోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కొనసాగుతున్న నరమేధం ఆగిపోవాలని కోరారు. సజీవంగా దొరికిన గణేష్, అరుణ, అంజులను పట్టుకొని కాల్చి చంపినట్లుగా అర్థమవుతోందని, చట్టాలను, రాజ్యాంగాన్ని ప్రభుత్వాలే ఖాతరు చేయడం లేదని ఆయన విమర్శించారు. ఏవోబీ కార్యదర్శి గాజర్ల రవి మారేడుమిల్లి కిట్టుకూరు అడవి ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లుగా పోలీసులు కట్టుకథలు అల్లుతున్నారని విమర్శించారు. నంబాల కేశవరావు మృతదేహాన్ని కూడా ఆంధ్రప్రదేశ్‌లోకి రానివ్వకుండా చంద్రబాబు అడ్డుపడ్డాడని ఆయన ఆరోపించారు. దండకారణ్యంలో ఇప్పటివరకు 550 మందిని చంపేశారని, అటవీ వనరులను కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలనే లక్ష్యంతో ఆపరేషన్ కగార్ పేరిట హత్యాకాండను సాగిస్తున్నారని హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు.

## కనుబొమలు లేని నాయకుడు వెన్నుపోటు పొడిచాడు

- దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలి
- నా కాళ్లు పట్టుకుంటే పరకాలలో ఎమ్మెల్యేగా గెలిపించా
- కొండా మురళి సంచలన వ్యాఖ్యలు



రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

రామన్నపేట: టీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన కనుబొమలు లేని నాయకుడు ఆ రోజు చంద్రబాబు నాయుడు, మొన్న కేసీఆర్, కేటీఆర్‌లను వెన్నుపోటు పొడిచారని, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్‌లోకి వచ్చారని.. సొంత పార్టీ ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ వెన్నుపోటు నాయకుడు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. పరకాలలో ప్రస్తుతం గెలిచిన ఎమ్మెల్యే 75 ఏళ్ల దరిద్రుడని, ఎన్నికలకు ముందు తన వద్దకు వచ్చి కాళ్లు పట్టుకుంటే ఎమ్మెల్యేగా గెలిపించానని అన్నారు. రానున్న ఎన్నికల్లో పరకాలలో కొండా సుస్మితా పటేల్ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. పోలీసులు తనకు ఎస్కార్ట్ కల్పిస్తే, కొంతమంది నాయకులు పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారని, అలాంటి ఎర్రబెల్లి కుటుంబాన్ని కొడితే కుక్కను కొట్టినట్లేనని విమర్శించారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ఉన్నంత వరకు కొండా సురేఖ మంత్రి పదవి ఎక్కడికి పోదని పేర్కొన్నారు.




పిల్లలు రాకపోవడంతో ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయుడు మల్లికార్జున్ (ఇన్‌సెట్) మూసాపేట మండలం స్ఫూర్తి తండాలోని ప్రాథమిక పాఠశాల

## ఒక్క విద్యార్థీ రావట్లే..

**స్ఫూర్తి తండాలో ఖాళీగా కూర్చుని వెళ్తున్న ఉపాధ్యాయుడు**

అడ్డాకుల: ఇది మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం స్ఫూర్తి తండా ప్రాథమిక పాఠశాల. ఇక్కడ ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. బడికి వచ్చే ఉపాధ్యాయుడు మల్లికార్జున్ తరగతి గదిలో ఖాళీగా కూర్చుని సాయంత్రం ఇంటికి వెళ్తున్నారు. బడిబాట కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ టీచర్‌తో కలిసి తండాలో రోజూ ఇంటింటికి తిరిగినా.. సర్కారు బడికి పిల్లలను పంపడం లేదు. ఒక్క టీచర్‌తో పాఠాలు ఎలా చెప్తారని తల్లిదండ్రులు ఎదురు ప్రశ్నించినట్లు టీచర్ మల్లికార్జున్ వాపోతున్నాడు. గతేడాది నలుగురు విద్యార్థులు వచ్చినా.. రెండుమూడు నెలల తర్వాత వారు కూడా మానేయడంతో ఇక్కడ పనిచేసే టీచర్‌ను డిప్యూటేషన్‌పై వేరే స్కూల్‌కు పంపించారు. ఈ తండాలో సుమారు 25 మంది 5వ తరగతి లోపు పిల్లలు ఉన్నారు. వారిలో 14 మంది సమీపంలోని లక్ష్మింపల్లి, భూత్పూర్‌లోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు. 11 మంది పిల్లలు వారి తల్లిదండ్రులు హైదరాబాద్‌కు మకాం మార్చడంతో వారితోపాటే వెళ్లారు.

## చైల్డ్ పోర్న్ చూస్తే.. పట్టేస్తాం

- ఇప్పటికే 220 అశ్లీల వెబ్‌సైట్స్ మూయించేశాం
- ఆ వీడియోలు చూసేందుకు అలవాటు పడిన 15 మందిని అరెస్టు చేశాం
- టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్



సాక్షి, హైదరాబాద్: చైల్డ్ పోర్న్ వీడియోలు చూడటం చట్టరీత్యా నేరమని..ఇలాంటి వీడియోలు చూసినా, ఆన్‌లైన్‌లో వ్యాప్తి చేసినా కఠినచర్యలు తప్పవని టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ హెచ్చరించారు. టీజీసీఎస్‌బీలోని చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (సీపీయూ) అధికారులు పూర్తిస్థాయిలో టెక్నాలజీతో గమనిస్తున్నారన్న విషయాన్ని మరవొద్దన్నారు. చిన్నారుల అశ్లీల వీడియోలు చూస్తున్నట్టు గుర్తిస్తే అలాంటి వారిపై ఐటీ చట్టాలతోపాటు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. చిన్నారుల అశ్లీల వీడియోల కోసం ఆన్‌లైన్‌లో బ్రౌజింగ్, అలాంటి వీడియోలను ప్రచారం చేయడం, చిన్నారుల అశ్లీల వీడియోలు, ఇతర అభ్యంతరకర మెటీరియల్ తయారు చేయడం నేరమని పేర్కొన్నారు. సీఎస్ఈఏఎం (చైల్డ్ సెక్స్వల్ ఎక్స్‌ప్లోటివ్ అండ్ అబ్యూజివ్ మెటీరియల్) సంబంధిత కేసులో రిపీటెడ్‌గా చిన్నారుల అశ్లీల చిత్రాలు చూస్తున్న 15 మందిని గుర్తించినట్టు తెలిపారు. సీపీయూ అధికారులు బుధవారం హైదరాబాద్, యాదగిరిగుట్ట, కరీంనగర్, జగిత్యాల, వరంగల్‌లో నిర్వహించిన స్పెషల్ ఆపరేషన్‌లో వారిని అరెస్టు చేసినట్టు తెలిపారు. గురువారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టీజీసీఎస్‌బీ ఎస్పీ హర్షవర్ధన్ ఇతర అధికారులతో కలిసి శిఖాగోయల్ ఆ వివరాలు వెల్లడించారు. పట్టుబడిన వారు చూస్తున్న చైల్డ్ అబ్యూజివ్ వీడియోల్లో ఉన్న బాధితులంతా విదేశీ చిన్నారులుగా ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపారు.

**పట్టుబడిన నిందితుల్లో 19 నుంచి 50 ఏళ్లవారూ ఉన్నారు**

పట్టుబడిన నిందితుల్లో 19 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయస్సు వారు ఉన్నట్టు శిఖాగోయల్ తెలిపారు. ఇందులో ఒకరు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నట్టు గుర్తించామన్నారు. చిన్నారుల అశ్లీల వీడియోల సర్క్యులేషన్ ముఠాలతో పట్టుబడిన నిందితులకు ఏమైనా సంబంధాలున్నాయా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కొన్ని సోషల్ మీడియా యాప్‌లలో గ్రూపులుగా ఏర్పడి ఈ తరహా అశ్లీల వీడియోలు పంచుకున్నట్టు గుర్తించామన్నారు. ఇలాంటి యాప్స్‌పైనా ఫోకస్ పెట్టినట్టు తెలిపారు. కొన్ని నెలల క్రితం సూర్యాపేటలో ఒక అమ్మాయితో బలవంతంగా చైల్డ్ పోర్న్ వీడియోలు చేయిస్తున్నట్టు గుర్తించి ఆ బాలికను చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారులు రక్షించినట్టు శిఖాగోయల్ తెలిపారు. చిన్నారుల అశ్లీల కంటెంట్‌ను ప్రచారం చేస్తున్న 220 వెబ్‌సైట్లను ఇప్పటికే టీజీసీఎస్‌బీ ద్వారా మూసివేయించినట్టు తెలిపారు. సమావేశంలో డీఎస్పీలు ఎన్.వాసు, కేవీ సూర్యప్రకాశ్, కేవీఎం ప్రసాద్, వై.వెంకటేశ్వర్లు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



టీచర్లు ఏర్పాటు చేసిన ఆటోలో వెళ్తున్న విద్యార్థినులు

## మా మంచి మాస్టారు..

- బడి బాగుకోసం హెచ్‌ఎం సొంతంగా రూ. 6.5 లక్షల ఖర్చు
- విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ఆటో కూడా..

భైంసా టౌన్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనగానే.. బడికి వచ్చారా.. వెళ్లారా అన్నట్లు ఉంటారు చాలా మంది. కానీ, ఓ ప్రధానోపాధ్యాయుడు బడి బాగు కోసం అవిరళ కృషి చేస్తున్నారు. పేద విద్యార్థులు చదివే పాఠశాలలో వారికి నాణ్యమైన విద్యతోపాటు, తన భార్య జ్ఞాపకార్థం అవసరమైన వసతులు కూడా కల్పిస్తున్నారు. ఆయనే.. నిర్మల్ జిల్లా భైంసాలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచేవాడ్ గంగాధర్.

**ఆమె కోసం..**

హెచ్‌ఎం గంగాధర్ భార్య పద్మావతి కూడా ప్రభుత్వ టీచరే. 2015లో ఆమె మృతిచెందింది. ఆమె చివరగా భైంసాలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించారు. కొద్ది కాలానికి అదే పాఠశాలకు గంగాధర్ హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వచ్చేనాటికి పాఠశాల పరిస్థితి అధ్వానంగా ఉండేది. దీంతో తన భార్య పేరిట బడిబాగు కోసం సంకల్పించాడు. సొంత ఖర్చుతో పాఠశాల భవనానికి మరమ్మతులు, ప్రార్థన కోసం స్టేజీ, కోతుల బెడద తప్పించేందుకు ఇనుప జాలి, మూత్రశాలలు, మరుగుదొడ్లు, కంప్యూటర్లు, ఫ్యాన్లు ఇలా అవసరమైన అన్ని వసతులను కల్పించారు. ఇందుకుగాను రూ.6.5 లక్షల వరకు వెచ్చించారు.

**విద్యార్థినుల కోసం ఆటో..**

రాహుల్‌నగర్‌కు చెందిన కొందరు విద్యార్థినులు దూరాభారంతో పాఠశాలలో చేరేందుకు ఆసక్తి చూపకపోవడంతో విద్యార్థినులు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులంతా సొంతంగా ఆటో వసతి కల్పిస్తామని చెప్పారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు అందుకు ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఆ కాలనీ నుంచి దాదాపు 15 మంది విద్యార్థినులు పాఠశాలలో చేరగా, ప్రతినెలా వారి ఆటో ఖర్చుల కోసం టీచర్లంతా కలిసి రూ.9 వేలు వెచ్చిస్తున్నారు. ఉపాధ్యాయుల ఈ ప్రయత్నాన్ని పలువురు అభినందిస్తున్నారు.

**ప్రభుత్వ బడిని కాపాడాలని..**



పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. రాహుల్‌నగర్‌కు చెందిన విద్యార్థినులు దూరాభారంతో ఇబ్బందిపడుతుండడంతో, టీచర్లమంతా కలిసి ఆటో ఏర్పాటు చేశాం. నా భార్య పద్మావతి జ్ఞాపకార్థం బడిబాగు కోసం నా వంతుగా రూ.6.5 లక్షలు ఖర్చు చేసి వసతులు కల్పిస్తున్నాను.

– ఆర్.గంగాధర్, హెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్, భైంసా

# తక్కువ పంట కాలం.. అధిక దిగుబడి

- కొత్తగా సన్నరకం వరి వంగడాలను అభివృద్ధి చేసిన వ్యవసాయ విశ్వవిద్యాలయం
- నాణ్యమైన వంగడాలను అందుబాటులోకి తెస్తున్న వరి పరిశోధన కేంద్రాలు

సాక్షి, హైదరాబాద్: తక్కువ పంట కాలంలో అధిక దిగుబడి ఇచ్చే వరి సాగు వైపు తెలంగాణ రైతులు మొగ్గుచూపుతున్నారు. క్రమక్రమంగా దొడ్డు ధాన్యం పండించే రైతుల సంఖ్య తగ్గుతుండగా, సన్నాలే ఎక్కువగా సాగుచేస్తున్నారు. యాసంగి సీజన్‌లో కూడా భారీ ఎత్తున సన్నాల సాగు చేయడం, పౌరసరఫరాల సంస్థకు ఏకంగా 23 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం విక్రయించడమే అందుకు తార్కాణం. ఈ పరిస్థితుల్లో రైతులకు ఉపయోగకరంగా ఉండేలా, తక్కువ పంట కాలంలో ఎక్కువ దిగుబడిని ఇచ్చే సన్న రకం వరి వంగడాలను అభివృద్ధి చేస్తోంది ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం. రాష్ట్రంలోని ఆరు వరి పరిశోధన కేంద్రాల ద్వారా నిరంతరం వరి విత్తనాలపై పరిశోధనలు సాగిస్తూ... తెలంగాణ వాతావరణానికి అనువుగా ఉండే కొత్త వంగడాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు. సాధారణంగా వరి పంట కాలం 130 నుంచి 140 రోజుల వరకు ఉంటుంది. 115 రోజుల నుంచి 125 రోజుల్లో పంట దిగుబడి వచ్చేలా కొత్త వంగడాలను అభివృద్ధి చేశారు.

**సాంబ మసూరికి ప్రత్యామ్నాయంగా...**

అత్యధికంగా సాగయ్యే సన్న రకాల్లో సాంబమసూరి (బీపీటీ-5204) ముందు వరుసలో ఉంటుంది. అయితే శాస్త్రవేత్తలు పలు ప్రత్యామ్నాయ రకాలను అభివృద్ధి చేశారు. బీపీటీ 5204 గింజ నాణ్యతతో 120-125 రోజుల పంట కాలంలో అధిక దిగుబడిని ఇచ్చేలా అభివృద్ధి చేసిన వంగడాలను రైతులకు అందుబాటులోకి తెచ్చినట్టు వర్సిటీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ చంద్రమోహన్ 'సాక్షి'కి తెలిపారు. సిద్ధి (డబ్ల్యూజీఎల్-44) 2012 నుంచే అభివృద్ధి చేయగా, కొత్తగా కేఎన్ఎం -7715, కేఎన్ఎం 12472లను అభివృద్ధి చేశారు. ఇదే క్వాలిటీతో జేజీఎల్-28545, జేజీఎల్-33124, ఆర్‌డీఆర్-1200 రైతులకు ఆయా రైతు పరిశోధన కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

**జై శ్రీరాం వంటి ప్రైవేటు రకాలకు దీటుగా ..**

అతి సన్నరకం బియ్యం వచ్చే జైశ్రీరాం, చింటూ జైశ్రీరాం ప్రైవేట్ వెరైటీలకు బహిరంగ మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉంది. ఈ రకం బియ్యం కిలో రూ.70 నుంచి రూ. 80 వరకు పలుకుతోంది. కాగా ఇదే నాణ్యతతో వర్సిటీ శాస్త్రవేత్తలు జగిత్యాల వరి పరిశోధన కేంద్రంలో జేజీఎల్-27356 రకాన్ని ఇప్పటికే అభివృద్ధి చేశారు. నాణ్యతతో, రోగాలను తట్టుకొనేలా 125 రోజుల్లో పంట చేతికొచ్చేలా ఈ వంగడాన్ని అభివృద్ధి చేశారు.



జగిత్యాల వరి పరిశోధన కేంద్రంలో కొత్త వంగడాలు

- రాజేంద్రనగర్‌లో అభివృద్ధి చేస్తున్న మరో వంగడం ఆర్ఎన్ఆర్-31479ను త్వరలో విడుదల చేయనున్నారు. వీటితోపాటు ఆర్‌డీఆర్ -1162 కూడా జైశ్రీరాం, హెచ్ఎంటీకి దీటుగా ఉంటుంది.

**తెలంగాణ సోనాకు ప్రత్యామ్నాయంగా ఆరు రకాలు**

వానాకాలం, యాసంగి సీజన్‌లలో సాగు చేసేందుకు అనువైన అత్యంత ఆదరణ పొందిన రకం తెలంగాణ సోనా. ఆర్ఎన్ఆర్ -15048గా పిలిచే 125 రోజుల పంటకాలపు ఈ వంగడానికి ఉన్న డిమాండ్ దృష్ట్యా అవే లక్షణాలతో మరో ఐదారు రకాల వంగడాలను వర్సిటీ అభివృద్ధి చేస్తోంది. కేఎన్ఎం-1638 ఇప్పటికే మార్కెట్‌లో రైతులకు అందుబాటులో ఉండగా, మరో ఐదు వంగడాలను పంట క్షేత్రాల్లో అభివృద్ధి చేస్తున్నారు. కేఎన్ఎం-12368, కేఎన్ఎం -12510, కేఎన్ఎం- 7715, కేపీఎస్-10631, కేపీఎస్-10642 రకాలను తెలంగాణ సోనా లక్షణాలతో రోగాలను తట్టుకొని, తెలంగాణ వాతావరణంలో మనుగడ సాధించేలా అభివృద్ధి చేస్తున్నారు. ఈ పంట దిగుబడి కూడా 30 క్వింటాళ్ల వరకు ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**దొడ్డు రకం ఎంటీయూ 1010 నాణ్యతతో కూడా..**



దొడ్డు రకం సాగులో అధికంగా వినియోగించే వంగడం ఎంటీయూ 1010. వెయ్యి పదిగా పిలవబడే ఈ పంట ఉత్తర తెలంగాణలో ఎక్కువగా సాగు చేస్తారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎకరాకు 30 నుంచి 32 క్వింటాళ్ల దిగుబడి ఇచ్చేలా మరో నాలుగు రకాలను విశ్వవిద్యాలయ వరి పరిశోధన కేంద్రం విడుదల చేసిందని ప్రిన్సిపల్ సైంటిస్ట్ చంద్రమోహన్ తెలిపారు. కేఎన్ఎం 118, ఆర్ఎన్ఆర్ 28361, ఆర్ఎన్ఆర్ 29325, జేజీఎల్ 28639 రకాలు అధిక దిగుబడిని ఇస్తాయని తెలిపారు.



## ప్లాస్టిక్ డబ్బాలతో టాయ్‌లెట్ సింకులు

**ఓ స్కూల్ పీడీ వినూత్న ఆలోచన**

కురవి: ఆ బడిలో ఓ పీడీ ఐడియా విద్యార్థుల టాయిలెట్ ఇబ్బందులను తొలగించింది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు జెడ్పీ హైస్కూల్‌లో కాశీనాథ్ పీడీగా పనిచేస్తున్నారు. కాగా, స్కూళ్లో టాయ్‌లెట్లు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందిని చూసిన ఆయన, ప్లాస్టిక్ డబ్బాలతో అద్భుతంగా టాయ్‌లెట్స్ సింక్‌లు తయారీ చేశారు. ఈ ఏడాది మార్చిలో వీటిని ప్రారంభించారు. ఆరుబయటకు వెళ్లి మూత్ర విసర్జన చేసే బాధలను తీర్చడంతో గ్రామస్తులు, విద్యార్థులు పీడీని అభినందించారు. ఈ ఏడాది మార్చిలో డీఈఓ రవీందర్‌రెడ్డి సైతం వీటిని చూసి కాశీనాథ్‌ను అభినందించారు. అయితే ప్రస్తుతం మూత్రశాలలు మంజూరు కావడంతో నిర్మాణ పనులు మొదలుపెట్టారు.

# సాక్షి హైదరాబాద్

శుక్రవారం ౹ 20 ౹ జూన్ ౹ 2025





**పాఠశాలలపై పోలీసుల నజర్**

బడి బస్సుల ఫిట్‌నెస్ తదితర అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. గురువారం జరిగిన సమావేశంలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పాల్గొని మాట్లాడారు. -10లో



**లద్దాఖ్.. లబ్ డబ్ బీట్స్..**

పహల్గామ్ దాడి అనంతరం పర్యాటకుల సంఖ్యలో కొంత మార్పు కనిపిస్తోంది. బైకర్స్, కార్లలో టూర్ వెళ్లే వారు ఇప్పటికే తమ ప్లాన్స్ పూర్తి చేసుకుంటున్నారు. - సిటీప్లస్‌లో



గరిష్ఠం/కనిష్ఠం
**34.0/24.0**

**వాతావరణం**

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.


# మౌనమేలనో..

## నగరంలో వెలుగులోకి నకిలీ వైద్యుల ఘటనలు

- అనధికార ఆస్పత్రులపై 150కి పైగా కేసులు
- చర్యలకు వెనకాడుతున్న ఉన్నతాధికారులు
- యథావిధిగానే అనధికార ఆస్పత్రుల కార్యకలాపాలు

☛ నగరంలోని వనస్థలిపురంలో వెంకటేశ్వర క్లినిక్‌పై దాడులు నిర్వహించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందాలు రెండు దఫాలు కేసులు చేశాయి. తదుపరి చర్యల కోసం సంబంధిత దస్త్రాలను డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపించాయి. కానీ.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

☛ నిజాంపేట్ కేర్ అండ్ క్యూర్ సీజ్ ఆస్పత్రిని సీజ్ చేశారు. తాజాగా అనధికారికంగా మెడికల్ దుకాణం నిర్వహిస్తున్నారు, నిజాంపేట్ పరిధిలో శ్వేత క్లినిక్ సీజ్ అయినా నిబంధనలకు విరుద్ధంగా తిరిగి ఓపెన్ చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి.



☛ ఉప్పల్‌లో ఎలాంటి అర్హతలు లేని వ్యక్తి వైద్యం అందించడంతో రెండు రోజుల క్రితం జిమ్ ట్రైనర్ కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందారు.

– సాక్షి, సిటీబ్యూరో

అర్హత లేకున్నా వైద్యం చేయడం, అనుమతులు లేకున్నా క్లినిక్‌లు, ఆస్పత్రులను నిర్వహించడం.. ఇలా కొందరు నకిలీ వైద్యులు రెండు చేతులా కాసులు సంపాదిస్తూ.. అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నగరంలో నకిలీ వైద్యులు, ఆస్పత్రుల యాజమాన్యాలు కొన్నేళ్లుగా ఇదే పంథా కొనసాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు తనిఖీలు విస్తృతం చేశారు. ఫిర్యాదులపై స్పందిస్తున్నారు. సదరు క్లినిక్‌లపై దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు అప్పగిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు కథ ఇక్కడే మొదలవుతోంది. కేసులు నమోదైన తర్వాత నకిలీ వైద్యులు, ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకునే నాథుడే కనిపించడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా కేసులు దస్త్రాలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మీనమేషాలు లెక్కిస్తున్న యంత్రాంగం..

◆ గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు సుమారు నాలుగు వేలు ఉన్నాయి. అనధికారికంగానూ వందల సంఖ్యలో క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల వైద్యులు తమకు సంబంధం లేని చికిత్సలు చేయడం, అసలు అర్హత లేని వ్యక్తులు వైద్యులుగా చలామణి కావడం నగరంలో సర్వసాధారణమైంది.

◆ దీనిపై దృష్టి సారించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు దాడులు నిర్వహించి 150కిపైగా ఆస్పత్రులు, క్లినిక్‌లు, నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేశారు. తదుపరి చర్యల కోసం ఆయా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు అప్పగించారు. కేసులపై పూర్తి విచారణ చేపట్టి, చట్టం అతిక్రమించినందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది నిర్ణయించే అధికారం డీఎంహెచ్‌ఓ, డ్రగ్ కంట్రోల్ అధికారులకు ఉంటుంది. ఈ కేసులను పరిశీలించి నిబంధనల అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి ఆయా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. డీఎంహెచ్‌ఓలకు పంపిన కేసులకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నారో తిరిగి తమకు తెలియజేయాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సిబ్బంది కోరినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పందన కనిపించడం లేదు.

### మేడ్చల్‌లో ఇలా.. రంగారెడ్డి జిల్లాలో అలా..

జీహెచ్‌ఎంసీ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్ జిల్లాకు సంబంధించిన కేసుల్లో కొంత వరకు పురోగతి కనిపిస్తోందని, రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న కేసులకు సంబంధించి అక్కడి వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం తమకు సంబంధం లేన్నట్లుగా వ్యవహరిస్తున్నారని సంబంధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. తాజాగా మరో 18 కేసుల ఎఫ్ఐఆర్ నివేదికలను రంగారెడ్డి జిల్లా అధికారులకు పంపించినట్లు సమాచారం. వీటిపై చర్యలు తీసుకోవడానికి ఇంక ఎంత సమయం పడుతుందోననే ప్రశ్న ఉదయిస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



# టీచింగ్ స్టాఫ్.. స్టాప్

## వైద్య కళాశాలల్లో బోధన సిబ్బంది కొరత

- **పోస్టుల భర్తీపై ఎన్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం చెరో దారి**
- వైద్య విద్య, రోగులకు సేవలు, పరిశోధనలపై తీవ్ర ప్రభావం
- గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, కేన్సర్, ఫీవర్ ఆస్పత్రుల్లో పని భారం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, కేన్సర్, ఫీవర్ ఆస్పత్రులు ఆరోగ్య ప్రదాయినులుగా నిలుస్తున్నాయి. ఆయా ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వైద్య సేవల కోసం రిఫరల్ కేసులు పెద్ద సంఖ్యలో వస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యమున్న బోధనాస్పత్రుల్లో టీచింగ్ స్టాఫ్ కొరత వేధిస్తోంది. పోస్టులు భర్తీ చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 40 శాతం మంది వైద్యులు (టీచింగ్) పోస్టులు ఖాళీలు ఉన్నాయని సమాచారం. వైద్య కళాశాలకు అవసరమైన పోస్టులను జాతీయ మెడికల్ కౌన్సిల్ నిర్ణయిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలతో కలిసి ఉన్న ఆస్పత్రి, అందులో పడకలు ఆధారంగా పోస్టులను కేటాయిస్తోంది. దీంతో ఈ రెండింటి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఫలితంగా మెడికల్ కళాశాలల్లో బోధన సిబ్బంది సరిపడా ఉన్నారంటే ఉన్నారు. లేరంటే లేరనే వాదనలు వినిపిస్తున్నాయి. సమర్థించుకునేవారు ఎన్ఎంసీ లెక్కలను చూపిస్తున్నారు. ఈ అంకెల ఆధారంగా చూస్తే కళాశాల అవసరాల కంటే ఎక్కువ మంది ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే.. రాష్ట్ర ప్రభుతకేటాయింపులను పరిశీలిస్తే మాత్రం అసలు విషయం వెలుగుచూస్తోంది. రోగులకు అందే సేవలు, వైద్య విద్యార్థుల తరగతులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ప్రస్తుతం పరిశోధనలపై ఫోకస్ చేసే అవకాశమే లేదని పలువురు వైద్యులు పేర్కొంటున్నారు.

### వైద్య సేవలపై ప్రభావం..

నగరంలోని ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల్లో అత్యధిక శాతం మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఉంటారు. సిబ్బంది కొరతతో నాణ్యమైన వైద్య సేవలు అందించే అవకాశం లేకుండాపోతోంది. బెడ్‌లు ఎక్కువ, వైద్యులు సంఖ్య తక్కువగా ఉండటమే దీనికి కారణంగా కనిపిస్తోంది. కొన్ని విభాగాల్లో ఒక్కరూ లేని పరిస్థితి. ఉదాహరణకు గాంధీ వైద్య కళాశాలకు ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 147 మంది బోధన సిబ్బంది (ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్) ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మూడు కేటగిరీలు కలిపి 330 మందికిపైగా సిబ్బందిని కేటాయించింది. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న వారు సుమారు 200 మంది ఉన్నారు. మిగతా 130 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ 2 వేల పడకల ఆస్పత్రి ఉంది. నిత్యం వేలాది మంది ఓపీ, ఐపీ ఉంటుంది. ఉస్మానియా పరిధిలోని ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్ ఆస్పత్రుల్లోనూ సుమారు 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. దీంతో ఉన్న వారిపై ఒత్తిడి పెరుగుతోందని చెబుతున్నారు. ఖాళీల ప్రభావం రోగులకు అందించే సరైన వైద్యం అందించే అవకాశం లేకుండాపోతోంది. రోగులు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులకు సరైన బోధన అందుతోందా అంటే అదీ కష్టమే అంటున్నారు.

### పరిశోధనలపై ఫోకస్ నిల్..

వైద్య కళాశాలల్లో బోధనతో పాటు రోగులకు అందించే వైద్య సేవలు, పరిశోధనలూ కీలకంగా ఉంటాయి. బోధనాస్పత్రుల్లో సిబ్బంది కొరతతో ఉన్న వారిపై ఒత్తిడి పెరుగుతోంది. పలు రకాల కమిటీల్లో సభ్యులుగా ఉండటం, పరిపాలనా విధులు అప్పగించడం వంటివి అదనపు భారంగా మారుతున్నాయని పలువురు వైద్యులు పేర్కొంటున్నారు. పరిశోధనలు చేపట్టే అవకాశమే లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పరిశోధనలు ప్రారంభించాలని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కావడంలేదని ఆరోపిస్తున్నారు. 2023లో చివరిసారిగా నియామకాలు చేపట్టారు. అనంతరం రెండేళ్లు కావస్తున్నా ఖాళీల భర్తీకి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదంటున్నారు. కొంత మంది వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకుంటున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు.



## దరఖాస్తుదారులకు ఊరట

### ట్రిపుల్ ఆర్ వరకు నిర్మాణ అనుమతులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)లో కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో లే అవుట్లు , భవన నిర్మాణ అనుమతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో కొంతకాలంగా అనుమతుల కోసం పడిగాపులు కాస్తున్న దరఖాస్తు దారులకు ఊరట లభించింది. ట్రిపుల్ ఆర్ వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తూ ఈ ఏడాది మార్చి నెలలో జీఓ వెలువరించిన సంగతి తెలిసిందే. దీంతో హెచ్‌ఎండీఏ పరిధి 7 నుంచి 11 జిల్లాలకు విస్తరించింది. 1,355 గ్రామాలు కొత్తగా హెచ్‌ఎండీఏలో కలిశాయి.అప్పటి వరకు డీటీసీపీ నుంచి అనుమతులు లభించేవి. కానీ హెచ్‌ఎండీఏ లో కలిసిన తర్వాత అనుమతులు స్తంభించాయి. దీంతో నిర్మాణ రంగంలో గందరగోళం నెలకొంది. తాజాగా రెండు రోజుల క్రితం అనుమతులకు లైన్ క్లియర్ చేస్తూ ప్రభుత్వం జీఓ వెలువరించింది. దీంతో హెచ్‌ఎండీఏ పరిధిలోని 10,472 చ.కి.మీ పరిధిలో హెచ్‌ఎండీఏ నుంచే అనుమతులు లభించనున్నాయి. ఫ్యూచర్ సిటీలోని 56 గ్రామాలు, 765 చ.కి.మీ పరిధిలో కూడా నిర్మాణ రంగం ఊపందుకొనే అవకాశం ఉంది.

# స్థలాల కోసం వెతుకులాట!

## విద్యుత్ సబ్‌స్టేషన్లకు భూములు కరువు

- సర్కిళ్ల వారీగా డిస్కం టెండర్లు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు



సాక్షి, సిటీబ్యూరో: కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థల లభ్యత ప్రధాన అడ్డంకిగా మారింది. సబ్‌స్టేషన్లు నిర్మించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిద్ధంగా ఉన్నప్పటికీ.. నిర్మాణాలకు అవసరమైన భూములు అందుబాటులో లేకపోవడం, రెవెన్యూ యంత్రాంగం కేటాయించిన భూములపై వివాదాలు కొనసాగుతుండటం, పెరిగిన ధరలకు అనుగుణంగా ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచక పోవడంతో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణ ప్రక్రియ ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్నచందంగా మారింది.

### అనువుగా లేకపోవడం, వివాదాలు కొనసాగడం..

◆ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలో రూ.420 కోట్ల అంచనా వ్యయంతో వచ్చే ఏడాది చివరి నాటికి 88 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించాలని నిర్ణయించింది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో భూములను కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి లేఖ రాసింది. కోర్‌సిటీలో అనువైన భూములు లేకపోవడం, ఉన్నవి కూడా కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోవడం, శివారు ప్రాంతాల్లో కేటాయించిన భూములపై కూడా పలు వివాదాలు కొనసాగుతుండటం తదితర కారణాలతో టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు ఔత్సాహిక కంపెనీలు ముందుకు రాకపోవడంలేదు. విధిలేని పరిస్థితిల్లో డిస్కం సర్కిళ్ల వారీగా టెండర్లు ఆహ్వానించింది. ఇప్పటి వరకు ఆరు సబ్‌స్టేషన్లకు టెండర్లు ఖరారు చేయగా, తాజాగా మరో నాలుగు సబ్ స్టేషన్లకు టెండర్లు ఆహ్వానించింది.

◆ కోర్‌సిటీ పరిధిలో సబ్‌స్టేషన్లకు భూముల కొరత ప్రధాన అడ్డంకిగా మారింది. రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ.. డిస్కంకు కేటాయించిన భూముల్లో వివాదాలు కొనసాగుతున్నాయి. కొన్ని కోర్టు పరిధిలో ఉండగా, మరికొన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. వీటిని విడిపించి డిస్కం ఇంజినీర్లకు అప్పగించడంలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. భూములు కేటాయిస్తే.. కేవలం ఏడాది లోపే సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో సబ్‌స్టేషన్‌లు నిర్మించనున్నారు.

### వీటికి ఓకే..

మేడ్చల్ జోన్‌లో.. హబ్సిగూడ సర్కిల్ పరిధిలోని సబ్‌స్టేషన్లకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఏ వివాదం లేని భూములు ఉండటం ఇక్కడ కలిసి వచ్చిన అంశం. వెంకటాపూర్, మేడిపల్లి సహా మేడ్చల్ సర్కిల్ పరిధిలో శంభీపూర్, సాయినగర్, అంతాయిపల్లి ఐడీఓసీ, షాపూర్‌నగర్‌లలో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. సంగారెడ్డి సర్కిల్ పరిధిలోని పోచారం, లక్డారం, పెద్దాపూర్, సదాశివపేట్, సింఫనీ పార్క్‌కాలనీ, అందోల్, రాజంపేట్, ఆరుట్ల, జహీరాబాద్ రైల్వేస్టేషన్, గోపనపల్లి, గుడిపల్లి, తిమ్మాపూర్‌లలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి.

## నగరంలో మరో రెండు ఫ్లై ఓవర్లు

### అంచనా వ్యయం రూ.180 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ కింద మరో రెండు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద, ఐడీఎల్ జంక్షన్ వద్ద వీటిని నిర్మించనుంది. అమీర్‌పేట వైపు వెళ్లేందుకు మూడు లేన్లతో కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఒక ఫ్లై ఓవర్, మియాపూర్ వైపు వెళ్లేందుకు ఐడీఎల్ జంక్షన్ వద్ద మూడు లేన్లతో మరో ఫ్లై ఓవర్ నిర్మించనుంది. నగరంలో ట్రాఫిక్ చిక్కులు తప్పించేందుకు ఇప్పటికే ఎన్నో ఫ్లై ఓవర్లు అందుబాటులోకి రాగా, మరెన్నో ఫ్లై ఓవర్లకు టెండర్లు పూర్తయ్యాయి. తాజాగా మరో రెండు ఫ్లై ఓవర్లకు జీహెచ్‌ఎంసీ టెండర్లు పిలిచింది. వీటి అంచనా వ్యయం రూ.180 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు 2024 డిసెంబరులోనే పరిపాలన అనుమతులు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియకు అనుమతినిచ్చింది. ఫ్లై ఓవర్లు 11.5 మీటర్ల క్యారేజ్‌వేతో నిర్మించనున్నారు. ఫ్లై ఓవర్లతో పాటు గ్రేడ్ లెవెల్‌లో రోడ్ల విస్తరణ, డ్రైనేజీ, ఫుట్‌పాత్‌లు, డక్ట్‌లు, సైనేజీలు తదితర పనులు చేయనున్నారు. టెండరులో అర్హత పొందే ఏజెన్సీయే సర్వే, ఇన్వెస్టిగేషన్, నిర్మాణ పనులు చేయాల్సి ఉంది. రెండేళ్ల వరకు ఏవైనా లోపాలు వెల్లడైతే పరిష్కరించాల్సి ఉంటుంది.

## దుర్గం చెరువు డ్రైనేజీ పనులు వేగిరం చేయండి

### – జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

గచ్చిబౌలి: దుర్గం చెరువులోకి మురుగు నీరు రాకుండా పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ వాసుదేవరావుతో కలిసి దుర్గం చెరువును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దుర్గం చెరువు డ్రైనేజీ సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు నీటి పైపులైన్ మళ్లింపు పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీవరేజీ లైన్ పూర్తి చేసి వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. దుర్గం చెరువు పార్క్‌లో మరింత సుందరంగా తీర్చిదిద్దాలని సీఎస్ఆర్ నిధులు సమకూర్చేవారికి సూచించారు. ఎస్టీపీ శుద్ధి వ్యవస్థను పరిశీలించి నీటిని పరీక్షించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఎస్ఎన్‌డీపీ ద్వారా చేపడుతున్న స్టామ్ వాటర్ బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించి సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. కమిషనర్ వెంట ఎస్ఎన్‌డీపీ సీఈ కోటేశ్వర్ రావు, లేక్స్ ఈఈ నారాయణ తదితరులు ఉన్నారు.



దుర్గం చెరువు ఎస్టీపీ వద్ద ఆర్‌వీ కర్ణన్ తదితరులు

# ఉద్యోగాలిప్పిస్తామని రూ.35 లక్షలు స్వాహా

## మహిళ సహా మరో నిందితుడి అరెస్టు

సికింద్రాబాద్: విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసగించిన మహిళను, ఆమెకు సహకరించిన మరో నిందితుడిని సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర చెప్పిన వివరాల ప్రకారం.. నగరంలోని నాచారంలో నసీమాబాను అనే మహిళ కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలన్న అత్యాశతో నసీమాబాను తన సోదరి ఫాతిమా ఇంకొందరి సహకారంతో తార్నాకలో ఓ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని ప్రారంభించింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకుని విదేశాలకు వెళ్లేందుకు వీసాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసింది. వీరి ప్రకటనలు చూసిన హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు ఉద్యోగాలు చేసేందుకు, పాస్‌పోర్టులతో పాటు రూ.35 లక్షలు అప్పగించారు. నిర్ణీత సమయంలో వారికి వీసాలు రాలేదు. ఉద్యోగాలు ఇప్పించలేదు. పాస్‌పోర్టులు, డబ్బులు అప్పగించిన వారినుంచి ఒత్తిడి రావడంతో నసీమాబాను నకిలీ వీసాలు, ఉద్యోగ నియామక పత్రాలు సృష్టించి వారికి ఇచ్చింది. అసలు నిజం బయటపడటంతో పాస్‌పోర్టు దారులు తమ డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తుండడంతో ఆమె సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టిన టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్ పోలీసులు నసీమాబానును, ఆమెకు సహకరించిన బేగంపేటకు చెందిన సయ్యద్ ఆదిల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. వాస్తవాలను వెల్లడించారు. ఇదే కేసులో భాగస్వాములుగా ఉన్న ఫాతిమా, రేఖ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



నిందితులు నసీమాబాను, సయ్యద్ ఆదిల్

# రూ.కోట్లు ఊడ్చేయాలని..

## స్పెషలైజ్డ్ పేరిట ప్రైవేటు ఏజెన్సీలకు పారిశుద్ధ్యం

- 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్'ను ఆహ్వానించిన బల్దియా
- గతంలోనూ టూరిస్టు ప్రాంతాల పేరిట నిధుల దుబారా
- ఇప్పుడు ఇంకెవ్వరి జేబులు నింపుతారో?!



సాక్షి, సిటీబ్యూరో: పారిశుద్ధ్య కార్యక్రమాల పేరిట ఇప్పటికే ఏటా రూ.వందల కోట్లు వెచ్చిస్తున్న జీహెచ్‌ఎంసీ.. తాజాగా పర్యాటక ప్రాంతాల్లో స్పెషలైజ్డ్ శానిటేషన్ పేరిట రూ.కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోంది. గతంలోనూ చార్మినార్, గోల్కొండ కోట వంటి ప్రాంతాల్లో, బేగంపేట- బంజారాహిల్స్ వంటి సంపన్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్యం పేరిట కోట్లు వెచ్చించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ప్రైవేటు ఏజెన్సీల పేరిట ఎవరి జేబులు నిండాయో కానీ, ఆ విధానం వల్ల ఎలాంటి ప్రయోజనం కనిపించనప్పటికీ.. తిరిగి అదే చరిత్రను పునరావృతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. స్పెషలైజ్డ్ ఏజెన్సీల పేరిట ఇప్పటికే సికింద్రాబాద్ జోన్‌లో రైల్వే స్టేషన్ నుంచి క్లాక్ టవర్ వరకు, ఖైరతాబాద్ జోన్‌లోని మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో, చార్మినార్ జోన్‌లోని రెండు సర్కిళ్లలో టూరిస్టు ప్రదేశాలున్న వాణిజ్య ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల కోసమంటూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పీ) ఆహ్వానించింది. మిగతా జోన్లలోనూ, మిగతా ప్రాంతాల్లో సైతం పిలిచే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

### పర్యాటకాభివృద్ధి కోసమట..

పారిశుద్ధ్య కార్యక్రమాలు సవ్యంగా లేకపోవడం పర్యాటకాభివృద్ధికి ఆటంకంగా మారుతుందని, వాణిజ్య మార్గాల్లో దుకాణాల వారు పడేసే వ్యర్థాలతో నగరాన్ని సందర్శించడానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు ప్రతికూల అభిప్రాయం ఏర్పడే అవకాశమున్నందున, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ స్పెషలైజ్డ్ ఏజెన్సీల సేవలు కోరుతున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మూడు షిఫ్టులుగా పనిచేసే సిబ్బందితో 24 గీ7గా పారిశుద్ధ్యం బాగుండేందుకు తగిన సాంకేతిక నైపుణ్యం కలిగిన సంస్థలు తమ ప్రపోజల్స్ పంపాలని పేర్కొంది.

### అయ్యే పనేనా?

ఆయా రోడ్లపై కాగితాలు, చెత్త, పూడిక, కూల్చివేతల వ్యర్థాలు, రాళ్లతో సహా నిర్మాణ రంగంలోని వ్యర్థాలు 24 గంటల పాటు ఏ సమయంలోనూ కనిపించకుండా ఉండాలని నిబంధనల్లో పేర్కొంది. ఇందుకుగాను మొదటి షిఫ్టులో ప్రతి 300 మీటర్లకు, రెండో షిఫ్టులో ప్రతి 500 మీటర్లకు ఒక స్వీపింగ్ వర్కర్‌తో పాటు ప్రతి వెయ్యి మీటర్లకు కాగితాలు ఏరివేసేందుకు ఒక కార్మికుడు, ప్రతి రెండువేల మీటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉండాలని పేర్కొంది. పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించేందుకు తగిన వాహనాలు, యంత్రాలు ఉండాలని తెలిపింది. రోడ్లతోపాటు ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్లు సైతం తళతళలాడాలని సూచించింది. ఇలా ఎన్నో నిబంధనలు విధించింది. అంతేకాదు, స్వచ్ఛమైన తాగునీరు, పబ్లిక్ టాయ్‌లెట్లను కూడా యూజర్ చార్జీలు తీసుకొని నిర్వహించాలట. గత అనుభవాలు తెలిసిన వారికి మాత్రం ఇది అమలయ్యే కార్యక్రమంగా కనిపించడం లేదు. తొలుత మూడేళ్ల వ్యవధి వరకు ఉండే ఒప్పందం పని తీరును బట్టి మరో ఏడాది పొడిగిస్తారు. ఏడాదికి కిలోమీటరుకు దాదాపు రూ.30 లక్షలు చెల్లిస్తారు.

### పాత తరహాలోనే..

ఎస్ఎఫ్‌సీఎల్-కేబీఆర్ పార్కు, రోడ్ నెంబర్ 45 - జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, పెద్దమ్మ గుడి -నీరూ జంక్షన్, రోడ్‌నెంబర్ 12- కేబీఆర్ పార్క్, కేబీఆర్‌పార్క్-జగన్నాథ ఆలయం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్- పెద్దమ్మ గుడి, రోడ్ నెంబర్ 45- అగ్రసేన్ విగ్రహం, ఎస్ఎఫ్‌సీఎల్- విరించి హాస్పిటల్‌తో పాటు ఆయా సర్కిళ్లలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు స్పెషలైజ్డ్ ఏజెన్సీలను ఆహ్వానించారు.

# కోడలిపై కత్తితో మామ దాడి

నిందితుడి రిమాండ్

**బంజారాహిల్స్:** కోడలిపై కత్తితో దాడికి పాల్పడిన మామను జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... శ్రీకృష్ణానగర్‌లోని సీ బ్లాక్‌కు చెందిన అరుణ్ ప్రసాద్ ప్రైవేట్ ఉద్యోగి. అతడికి భార్య జయలక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన అరుణ్ ప్రసాద్ ప్రతి రోజూ మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. అంతేగాక జయలక్ష్మి మామ చిల్లర వెంకటేశ్వరరావు కూడా కోడలిని అసభ్యంగా దూషిస్తూ వేధింపులకు గురి చేసేవాడు. బుధవారం ఉదయం కోడలితో గొడవపడిన వెంకటేశ్వరరావు కూరగాయల కత్తితో ఆమెపై దాడి చేయడంతో మెడ వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను యూసుఫ్‌గూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. తన భర్త అరుణ్ ప్రసాద్ మద్యం మత్తులో తనపై దాడి చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అరుణ్ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించేందుకు యత్నిస్తుండగా అతను తీవ్ర భయాందోళనకు లోనయ్యాడు. చేయని తప్పునకు బలవుతున్నానంటూ పోలీసుల ముందు కన్నీరుమున్నీరయ్యాడు. దీంతో పోలీసులు ఆరా తీయగా కత్తితో దాడి చేసింది తాను కాదని తన తండ్రి అని చెప్పాడు. దీంతో వారు బాధితురాలిని పలు కోణాల్లో విచారించగా మామ వెంకటేశ్వరరావు తనపై హత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పింది. ఎందుకు అబద్ధం చెప్పావని ప్రశ్నించగా అంత పెద్ద వయసులో ఆయన జైలుకు వెళ్లడం ఇష్టం లేదని అందుకే అబద్ధం ఆడినట్లు భార్యా, భర్తలు ఒప్పుకున్నారు. తన తండ్రే తల్లిపై దాడి చేశాడంటూ అంతకు ముందు ముగ్గురు కొడుకులు కూడా పోలీసులకు చెప్పారు. దీంతో పోలీసులు నిందితుడు వెంకటేశ్వరరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాలు తారుమారు చేసినందుకు అతడి కుమారుడు అరుణ్‌ప్రసాద్‌పై కూడా కేసు నమోదు చేశారు.

# హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

**కాచిగూడ:** ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో రౌడీషీటర్‌ను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ జావేద్, ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్పతో కలిసి వివరాలు వెల్లడించారు. యాకత్‌పురా, బడాబజార్‌కు చెందిన షేక్ ఖదీర్ యాకుత్‌పుర రైల్వే స్టేషన్‌లో ఫ్లాట్ ఫారం దాటుతుండగా మాదన్నపేట, చౌని ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మహ్మద్ అబ్దుల్ సోహైల్‌తో పాటు అతని అనుచరులు డబ్బులు, సెల్‌ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. షేక్ ఖదీర్ అందుకు నిరాకరించడంతో అబ్దుల్ సోహైల్ కత్తితో అతనిపై దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కాచిగూడ రైల్వే పోలీసులు ప్రధాన నిందితుడు మహ్మద్ అబ్దుల్ సోహైల్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు ముదస్సిర్, ఆయన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# పాఠశాలలపై పోలీసుల నజర్

- డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్, ట్రాఫిక్ సిబ్బందితో ప్రత్యేక బృందాల ఏర్పాటు
- ట్రాఫిక్, వాహనాల క్రమబద్ధీకరణ వీరి బాధ్యత
- ప్రతి స్కూల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి
- సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి



మాట్లాడుతున్న సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

**సాక్షి, సిటీబ్యూరో:** విద్యా సంవత్సరం పునఃప్రారంభమైన నేపథ్యంలో పోలీసులు పాఠశాలలపై ప్రత్యేక నిఘా పెట్టారు. బడి బస్సుల ఫిట్‌నెస్ మొదలు యాజమాన్యం, డ్రైవర్ల పనితీరు తదితర అంశాలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాల విద్యార్థుల భద్రతపై సిటీ పోలీసులు రవీంద్ర భారతిలో పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి స్కూల్ బస్సు అనుమతులు, సీటింగ్ సామర్థ్యం, పాఠశాలల పేరు, నంబరు, డ్రైవర్ అనుభవం తదితర వివరాలను డిస్‌ప్లే చేయాలని ఆదేశించారు. అజాగ్రత్త కారణంగా గత మూడేళ్లలో 8 మంది విద్యార్థులు మృత్యువాత పడ్డారని సీపీ గుర్తు చేశారు. విద్యార్థులు పాఠశాల బస్సులలోనే ప్రయాణించేలా చూసుకోవాలని, ప్రతి పాఠశాలలో బస్సు భద్రతలపై యాజమాన్యాలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పిల్లలకు ఎలాంటి సమస్య ఎదురైనా యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**డ్రోన్లతో నిఘా..**

ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ మాట్లాడుతూ.. నగరంలో రోజూ 90 లక్షల పైగా వాహనాలు తిరుగుతున్నాయని, 3 వేల మంది సిబ్బందితో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లలో 8 మంది విద్యార్థులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారన్నారు. త్వరలో పాఠశాలల వద్ద డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, పాఠశాలల పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ యాజమాన్యాల బాధ్యత అని స్పష్టం చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి యాజమాన్యాలు సెక్యూరిటీ, ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిమితికి మించి పిల్లలను వాహనాల్లో ఎక్కించుకోకూడదని, దీనిని పోలీసుల బాధ్యతగా వదిలేయకుండా తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, ప్రైమరీ స్కూల్, హై స్కూళ్ల సమయాల్లో మార్పులు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. వీరికి 25 సంవత్సరాల వరకు డ్రైవింగ్ లైసెన్స్ రాదని హెచ్చరించారు. ఇప్పటివరకు 766 వాహనాల రిజిస్ట్రేషన్లను రద్దు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**సీసీ కెమెరాలు తప్పనిసరి..**

ప్రతి పాఠశాల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవాలని, వాటి నిర్వహణపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డ్రైవర్లు పిల్లలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పరిసర ప్రాంతాలను గమనించాలని, అక్కడే ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఒక్క విద్యార్థి చనిపోయినా పాఠశాలకు పెద్ద సమస్యగా మారుతుందన్నారు. పిల్లలు పాఠశాలలకు ఓవర్ లోడెడ్ ఆటోల్లోనూ వెళ్తున్నారని, అలా వెళ్లడం వల్ల ప్రమాదాలు, మరణాలు సంభవించే అవకాశం ఉంటుందని, వీటిపై తల్లిదండ్రులు దృష్టి పెట్టి జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సీవీ ఆనంద్ కోరారు. యాజమాన్యాలు పాఠశాల పరిసర ప్రాంతాలలో సైన్ బోర్డు ఉండేలా చూసుకోవాలని, ఒకే ప్రాంతంలో ఎక్కువ పాఠశాలలు ఉన్నప్పుడు ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉంటాయని, అబిడ్స్, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్ లాంటి ప్రాంతాలలో ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో రవాణా, ట్రాఫిక్ సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ గోపాల్, జేటీసీ రమేష్ డీఈఓ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్ రావుపై కేసు నమోదు

**గచ్చిబౌలి:** సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్ రావుపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో రోడ్లపై హైడ్రా అధికారులు సర్వే నిర్వహించి మార్కింగ్ చేసిన విషయం తెలిసిందే. దీనిని వీడియో తీస్తుండగా శ్రీధర్ రావు అతడి అనుచరులు తమపై బ్యాట్, కత్తితో దాడి చేశారని నటి రమ్యశ్రీ సోదరుడు ప్రశాంత్‌తో పాటు కుషీ చంద్ వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ చేపట్టిన గచ్చిబౌలి పోలీసులు శ్రీధర్ రావు, అతని అనుచరుడు వెంకటేష్‌తో పాటు మరికొంత మందిపై కేసులు నమోదు చేశారు.

## భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య


అన్నపూర్ణ మృతదేహం

**మణికొండ:** కుటుంబ తగాదాల నేపథ్యంలో ఓ మహిళ భవనం 4వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ, సాయిరాం కాలనీలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయిరాం కాలనీలోని ఆర్‌కే రెసిడెన్సీలో అన్నపూర్ణ(58) తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటోంది. గత కొన్ని రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి లోనైన ఆమె భవనం నాలుగవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి చాక్లెట్ల పట్టివేత

నిందితుడి అరెస్ట్


నిందితుడు జయరాంమిశ్రా

**మేడ్చల్:** గంజాయిని చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు అతడి నుంచి 5 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుండ్లపోచంపల్లి పరిధిలోని అయోధ్య చౌరస్తా వద్ద రూట్ వాచ్ చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన ఉత్తరప్రదేశ్ కు చెందిన జయరామ్ మిశ్రా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడి వద్ద చాక్లెట్ల గంజాయి చాక్లెట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌లో వాటిని కొనుగోలు చేసిన అతను నగరానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు, నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ నవనీతతో పాటు ఎస్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## కత్తితో బెదిరించి డబ్బు లాక్కెళ్లిన రౌడీషీటర్

**గౌలిపురా:** ఓ వ్యక్తిని రౌడీషీటర్ కత్తితో బెదిరించి డబ్బు లాక్కెళ్లిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..యాకుత్‌పురా బడాబజార్‌కు చెందిన మహ్మద్ ఫుర్కాన్ అన్సారీ (18) చార్మినార్ బట్టల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అన్సారీకి స్నేహితుడు ఇమ్రాన్ ఫోన్ చేసి ఉదయం ఊరు వెళుతున్నానని కలవాలని తెలిపాడు. దీంతో అన్సారీ గురువారం తెల్లవారుజామున 12.30 గంటలకు స్నేహితుడు ఇమ్రాన్‌ను కలిసేందుకు సమద్ హోటల్ వద్దకు వచ్చాడు. అదే సమయంలో రౌడీషీటర్ మహ్మద్ వాజిద్ అలియాస్ షా (30) అన్సారీని కత్తితో బెదిరించి తన వద్ద ఉన్న రూ.3 వేలను బలవంతంగా లాక్కొని దాడి చేసి పారిపోయాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి


అస్రా ఫాతిమా మృతదేహం

**అత్తాపూర్:** ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను చూసి వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై గర్భిణి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఎస్ఐ కేతనారెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణానికి చెందిన జమీల్ అసరా ఫాతిమా(29) దంపతులు గురువారం క్రిస్టల్ గార్డెన్ సమీపంలోని బటర్‌ఫ్లై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు నగరానికి వచ్చారు. బంధువులను చూసి యాక్టివాపై తమ కుమారుడితో కలిసి తిరిగి వెళుతుండగా పీవీఎన్.ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్ 198 వద్ద ముందుగా వెళ్తున్న వాహనం కారు డోర్ తెరిచి ఉండటాన్ని గుర్తించిన జమీల్ బైక్‌ను ఒక్కసారిగా ఆపి వేశాడు. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొనడంతో అస్రా ఫాతిమా కింద పడింది. బస్సు చక్రాలు ఆమె మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దోపిడీ కేసులో నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

**కాచిగూడ:** ప్రయాణికుడిపై దాడిచేసి అతడి నుంచి నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్. జావేద్, ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, వివరాలు వెల్లడించారు. మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో కనకయ్య అనే వ్యక్తి ఎంఎంటిఎస్ రైలు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేసి నగదు, మొబైల్ ఫోన్ లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన బతుకమ్మ కుంట ప్రాంతానికి చెందిన దాసరి మౌనిక, పోతుగల్ ప్రాంతానికి చెందిన బి.సుక్కయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి సెల్‌ఫోన్, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

## బీదర్ టు హైదరాబాద్



- గంజాయి అక్రమ రవాణా
- నలుగురు యువకుల అరెస్ట్
- ఐదు కిలోల గంజాయి స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితులు

**రాజేంద్రనగర్:** బీదర్ నుంచి గంజాయిని తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు యత్నించిన నలుగురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి కారుతో పాటు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మామిడి కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్ బుద్వేల్‌కు చెందిన జగదీష్, నరేందర్, చింతల్‌మేట్‌కు చెందిన రామ్ కుమార్ స్నేహితులు. చెడు అలవాట్లకు బానిసలైన వీరు బీదర్ వెళ్లి గంజాయిని తీసుకొచ్చి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా కారులో బీదర్ వెళ్లిన వారు మహేశ్ అనే వ్యక్తిని సంప్రదించగా అతను రూ. 40 వేలకు ఐదు కిలోల గంజాయిని విక్రయించాడు. సరుకు తీసుకుని నగరానికి వస్తుండగా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు గురువారం మధ్యాహ్నం కారును ఆపి సోదా చేయగా ఐదు కిలోల గంజాయిని గుర్తించారు. కారుతో పాటు గంజాయిని సీజ్ చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విక్రయించిన మహేశ్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

## నాకు న్యాయం చేయాలి

భర్త ఇంటి ఎదుట యువతి మౌన దీక్ష


మౌన దీక్ష చేస్తున్న స్రవంతి

**మణికొండ/బండ్లగూడ:** నీవు నాకు నచ్చావని.. నీవు లేకుండా బతకలేనని.. వెంటపడి ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. పెళ్లయిన నాలుగు నెలల నుంచే తన నైజాన్ని బయటపెట్టి నరకం చూపించినా మౌనంగా భరించింది. తీరా ఇప్పుడు నీవు వద్దంటూ రెండో వివాహానికి సిద్ధమయ్యాడు. దీంతో ఆమె భర్త ఇంటి ఎదుట తనకు న్యాయం చేయాలని ఆందోళన బాట పట్టింది. బాధితురాలి తల్లి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. హైదర్షాకోట్‌లోని సాయి బాలాజీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీధర్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్ల క్రితం స్రవంతి అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అతడి ప్రేమ నిజమని నమ్మిన ఆమె తల్లితండ్రులను సైతం ఎదిరించి అతడిని వివాహం చేసుకుంది. నాలుగు నెలలు గడవగానే తన నిజస్వరూపం బయటపెట్టిన శ్రీధర్ ఆమెను ప్రతి రోజూ వేధించేవాడు. అయినా సంతృప్తి చెందని అతను ఇటీవల మరో వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఆ విషయం తెలుసుకున్న స్రవంతి గురువారం సాయంత్రం భర్త ఇంటి ఎదుట తల్లితో కలిసి ప్లకార్డులు పట్టుకుని మౌనదీక్షకు దిగింది. తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చుంది. చుట్టు పక్కల వారు ఆమెకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినకుండా తన దీక్షను కొనసాగిస్తోంది.

# ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు కొట్టివేత

**సిటీ కోర్టులు :** ఓ వర్గానికి చెందిన వారి మనోభావాలు దెబ్బతినేలా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంకేతాలు ఇచ్చారని ఆయనపై మంగళ్‌హాట్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసుపై గత విచారణలో రాజాసింగ్ తరుపు న్యాయవాది కరుణసాగర్ వినిపించిన వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం కేసును కొట్టివేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 ఆగస్టులో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మహమ్మద్ ప్రవక్తపై తప్పుడు వ్యాఖ్యలు చేశారని, ఆయన వ్యాఖ్యలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని పలువురు మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసులో బెయిల్‌పై బయటికి వచ్చిన రాజాసింగ్ తన నివాసానికి వెళ్తూ అలాస్కా జంక్షన్ వద్ద మరో వర్గానికి చెందిన వారిని అపహాస్యం చేసేలా విక్టరీ, థంబ్స్‌అప్ (విజయ సంకేతం ) చూపించారని, ఈ ఘటన శ్రీరాం ఛానెల్ తెలంగాణలో ప్రసారం అయ్యిందని చ్చిన ఫిర్యాదుతో మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేశారు. రాజాసింగ్ తమను ఉద్దేశపూర్వకంగానే కించపర్చేందుకే ఇలాంటి సంకేతాలు ఇచ్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అప్పటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో రాజాసింగ్ ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని దురుద్దేశపూర్వకంగానే ఫిర్యాదు చేశారని ఆయన తరుపు న్యాయవాది కరుణసాగర్ కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వాదనలతో ఏకీభవించిన కోర్టు గురువారం రాజాసింగ్‌పై నమోదైన కేసును కొట్టివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

# వికలాంగుల హక్కుల సాధనకు పోరాటం



**నాగోలు:** వికలాంగ సమాజాన్ని ఏకం చేసి పాలకుల మెడలు వంచి అనేక హక్కులు సాధించుకున్న చరిత్ర ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ లకు ఉందని, భవిష్యత్తులోనూ వికలాంగులకు పెన్షన్లు, అన్ని రకాల హక్కులతో పాటు రాజకీయ భాగస్వామ్యం సాధించేంతవరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం నాగోలు శుభం కన్వెన్షన్ హాల్ పద్మశ్రీ పురస్కార గ్రహీత మంద కృష్ణ మాదిగను వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షన ఏర్పాటు చేసిన సభలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ పురస్కారం అణచివేతకు గురైన వర్గాల ప్రయోజనాలు కాపాడే విషయంలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ కులం, మతంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజల కోసం చేసిన పోరాటాలకు గుర్తింపుగానే పద్మశ్రీ దక్కిందన్నారు. 17 ఏళ్లుగా వికలాంగులు తనపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, వారికి న్యాయంగా దక్కాల్సిన హక్కులతో పాటు రాజ్యాధికారంలో భాగస్వామ్యం సాధించేంతవరకు పోరాడతానన్నారు. దేశంలో, రాష్ట్రంలో వికలాంగులను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఆ బాధ్యత ఎమ్మార్పీఎస్ తీసుకొని వీహెచ్‌పిఎస్ ఏర్పాటు చేసి వికలాంగులకు పెన్షన్లు పెంచాలని పెద్ద ఎత్తున పోరాటం చేసిందని గుర్తు చేశారు. వికలాంగులకు ఏపీలో రూ. 6000, తెలంగాణలో రూ.4016 పెన్షన్ రావడానికి ఎమ్మార్పీఎస్, విహెచ్‌పీఎస్ చేసిన పోరాటమే ప్రధాన కారణం అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగుల రూ.6 వేలు పెన్షన్ ఇస్తామని మాట ఇచ్చి తప్పాడని ఆరోపించారు. తమ సోదరుడిగా భావించి సన్మాన సభను ఏర్పాటు చేసినందుకు వికలాంగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాలరావు, ఉపేందర్ మాదిగ, రావుగళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పేరుతో పైశాచికం

- ఆటిజం చిన్నారులతో అసభ్య ప్రవర్తన
- వైద్యుడిపై కేసు నమోదు


నిందితుడు రంజిత్

**లాలాపేట:** చికిత్స పేరుతో ఆటిజంతో బాధ పడుతున్న చిన్నారులతో అమానుషంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిపై ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆటిజం, స్పీచ్ థెరపిస్టుగా చెలామణి అవుతున్న రంజిత్ అనే వ్యక్తి గత కొంత కాలంగా హబ్సిగూడలో వైబ్రాంట్ వింగ్స్ పేరుతో చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అక్కడికి వచ్చే చిన్నారులకు స్పీచ్ థెరఫీ ద్వారా మాటలు నేర్పించాల్సిన అతను వారి శరీరంపై, కాళ్లపై రక్తం వచ్చేలా గాట్లు పెట్టడం, స్కేల్ తో కొట్టడం చేస్తున్నాడు. చెంగిచర్ల ప్రాంతానికి చెందిన బాలిక (04) మైల్డ్ ఆటిజం, స్పీచ్ డిలేతో బాధపడుతోంది. ఆమె తల్లిదండ్రులు అమెరికాలో ఉంటున్నారు. సదరు చిన్నారి చెంగిచర్లలోని అమ్మమ్మ తాతల వద్ద ఉంటూ గత మూడు నెలలుగా వైబ్రాంట్ వింగ్స్ సెంటర్‌లో చికిత్స పొందుతోంది. ఇందుకు గాను నెలకు రూ. 60 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజు చెల్లిస్తున్నట్లు బాలిక తల్లి ఉమాశ్రీ తెలిపారు. కాగా రంజిత్ ట్రీట్‌మెంట్ పేరుతో చిన్నారి ఒంటిపై రక్తం కారేలా గోళ్లతో రక్కడం, స్కేల్‌తో వాతలు వచ్చేలా కొడుతున్నాడు. దీంతో బాలిక రంజిత్‌ను చూడగానే భయంతో వణికిపోతోంది. ఈ విషయమై బాలిక తల్లి రంజిత్‌ను నిలదీయగా చికిత్సలో భాగంగానే అలా చేస్తున్నట్లు బుకాయించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే మీ పాపను కిడ్నాప్ చేస్తామంటూ బాలిక అమ్మమ్మను బెదిరించాడు. బాధితురాలి తల్లి బుధవారం ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా అతడికి నోటీసు ఇచ్చి పంపించినట్లు బాలిక తల్లి ఆరోపిస్తోంది. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి

- కుటుంబ కలహాలే కారణం
- నిందితులపై కేసు నమోదు


గాయపడిన రాములు

**నాగోలు:** భార్యాభర్తల వివాదంలో జోక్యం చేసుకున్న భార్య కుటుంబ సభ్యులు భర్తపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ కృషినగర్‌కు చెందిన సీహెచ్ రాములు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి భార్య విజయతో విభేదాలు రావడంతో గత 5 ఏళ్లుగా వేరుగా ఉంటున్నారు. విడాకుల విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. వారికి ఇద్దరు కుమారులు. భార్య పిల్లల పోషణ బాధ్యత రాములే చూసుకుంటున్నాడు. కాగా బుధవారం సాయంత్రం విజయ, తన సోదరి భానుమతి సోదరుడు మహేందర్ మరో 10 మందితో కలిసి వచ్చి రాములుతో పాటు అతడి సోదరడు రాజుపై బీరు సీసాలు, ఇనుపరాడ్లతో దాడి చేశాడు. ఈ ఘటనలో రాములు కాళ్లు విరిగిపోయాయి. దాడి అనంతరం వారు ఇంట్లో ఉన్న సీసీ కెమెరాల హార్డ్ డిస్క్, రాములు పర్సు, ఫోన్ ఏటీఎం కార్డు సైతం తీసుకెళ్లడమేగాక అతడి ఖాతా నుండి రూ. లక్ష డ్రా చేసుకున్నారు. దీనిపై సమాచారం అందడంతో రాములు మరో సోదరుడు సుదర్శన్ అక్కడి వచ్చిన బాధితునలు స్థానిక సుప్రజా హాస్పిటల్‌కు తరలించాడు. సుదర్శన్ ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాధ్యతల స్వీకరణ



బంజారాహిల్స్: జలమండలి డివిజన్–6 జనరల్ మేనేజర్‌గా ప్రభాకర్‌రావు ఎస్ఆర్‌నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి జీఎం హరి శంకర్ కూకట్‌పల్లి డివిజన్–9కు బదిలీ కాగా డివిజన్–9 జీఎంగా ఉన్న ప్రభాకర్‌రావును ఇక్కడ నియమించారు.

## పాఠశాలల్లో పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్



ఫిలింనగర్ ఎమ్మార్సీకాలనీ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న టీచర్లు

ఫిలింనగర్: షేక్‌పేట మండల పరిధిలోని విద్యా సంస్థల్లో హైజెనిక్ శానిటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, తదితర ప్రాథమిక పాఠశాలలను శుభ్రం చేశారు. అలాగే పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని షేక్‌పేట మండల ఎమ్మార్సీ పురుషోత్తం తెలిపారు.

## ఆపరేషన్ కగార్ నిలిపేయాలి




పోస్టరు విడుదల చేస్తున్న ధర్మేంద్ర

హిమాయత్‌నగర్: ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చలో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను హిమాయత్‌నగర్‌లోని సత్య నారాయణ రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.బాలకృష్ణ, సల్మాన్ బేగ్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, మాజీద్ అలీ ఖాన్, మోసిన్ ఖాన్ పాల్గొన్నారు.

## చదువులు పూర్తయినా అందని సర్టిఫికెట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: చదవులు పూర్తి చేసినా సర్టిఫికెట్లు అందుకోలేని దుస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రావలసిన రూ.8000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయనందున కాలేజీల యజమానులు సర్టిఫికెట్లు జారీ చేయడం లేదన్నారు. సర్టిఫికెట్లు లేనందున విద్యార్థులుపై చదవులకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టోకెన్లు ఇచ్చి విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని కోరారు.

## ఎంప్లాయిూస్ సంఘ్ డిప్యూటీ జీఎస్‌గా మురళీకృష్ణ

సికింద్రాబాద్: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా వేగి మురళీకృష్ణ నియమితులయ్యారు. సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య అధ్యక్షతన సికింద్రాబాద్‌లో రెండు రోజుల పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్, నాందేడ్ డివిజన్లకు చెందిన ఎంప్లాయిస్ సంఘ్ కార్యకర్తలు, నాయకులు, వర్కింగ్ కమిటీ మెంబర్స్ సర్వసభ్య సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో భాగంగా గురువారం సంఘ్ నాయకులు వేగి మురళీకృష్ణను డిప్యూటీ డిజిటల్ సెక్రటరీగా నియమించినట్లు మర్రి రాఘవయ్య ప్రకటించారు.

## మృతదేహం లభ్యం

గాంధీఆస్పత్రి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు మేరకు.. గాంధీ ఎన్‌టీపీసీ వెయింటింగ్ హాలు వద్ద బుధవారం సాయంత్రం ఓ వ్యక్తి పడున్నట్లు సెక్యూరిటీగార్డు గుర్తించి అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఎమర్జెన్సీ విభాగానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధృవీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

# ఎక్కడి చెత్త అక్కడే..!



ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్ ఎదుట చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్

- జూబ్లీహిల్స్ సర్కిల్–18లో పడకేసిన పారిశుద్ధ్యం
- సీఎం సర్కిల్‌లోనే స్వచ్ఛతపై తీవ్ర నిర్లక్ష్యం
- పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- అపరిశుభ్ర వాతావరణంలో బస్తీలు, కాలనీలు
- ఇబ్బందుల్లో స్థానికులు, పట్టని అధికారులు

ఫిలింనగర్: 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో గ్రేటర్ హైదరాబాద్‌ను మొదటిస్థానంలో నిలిపేలా పని చేయాలంటూ ఓ వైపు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తుంటే..క్షేత్ర స్థాయిలో మాత్రం పారిశుద్ధ్య విభాగం సిబ్బంది ఆ దిశగా పని చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోజుల తరబడి సిబ్బంది చెత్తను తరలించకపోవడంతో రహదారులపై పెద్ద ఎత్తున చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ముఖ్యంగా సీఎంతో పాటు మంత్రులు, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు నివాసం ఉండే జూబ్లీహిల్స్ సర్కిల్–18లో చెత్త సమస్య అధికంగా ఉంది. రోజుల తరబడి చెత్తను అక్కడే ఉంటుండడంతో దుర్వాసనతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

### జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో..

జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ తదితర వీవీఐపీ డివిజన్లు వస్తాయి. వీటి పరిధిలో 33 మంది ఎస్ఎఫ్ఏలు, 300 పైచిలుకు స్వీపర్లు ఉన్నారు. ఊడ్చిన చెత్తను, పేరుకుపోయిన చెత్తను ప్రతిరోజూ తొలగించాల్సి ఉండగా సంబంధిత ఎస్ఎఫ్ఏల నిర్లక్ష్యం ప్రజలపాలిట శాపంగా మారింది.

- బంజారాహిల్స్ రోడ్ నంబర్–2 లోని కమలాపురి కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలంటూ కాలనీవాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.
- చెత్తకుప్పలను తొలగించాల్సిన లారీలు ఎక్కడికి వెళ్తున్నాయన్నది అంతుబట్టకుండా ఉంది.

### కార్పొరేటర్ నిరసన..

జూబ్లీహిల్స్ డివిజన్ గౌతంనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద పేరుకుపోయిన చెత్తకుప్పలు, వ్యర్థాలను రోజుల తరబడి తొలగించకపోవడంపై జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మధ్యాహ్నం 2 దాటితే చెత్త తీసుకెళ్లే వాహనాలు రావడం లేదని దీని వల్ల దుర్వాసనతో దోమలు, ఈగలతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బస్తీలతో పాటు, కాలనీల్లోనూ పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి.
- వీవీఐపీ జూబ్లీహిల్స్ సర్కిల్‌లో పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షించే ఏఎంవోహెచ్ ఇన్‌చార్జి హోదాలోనే విధులు నిర్వహిస్తున్నారు. శాశ్వత ఏఎంవోహెచ్‌ను నియమించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- కొంతమంది ఎస్ఎఫ్ఏలో కామాటీలు ట్రేడ్ లైసెన్స్‌లు, ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలు లేవంటూ వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయడంలోనే నిమగ్నమైనట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఇక్కడ పారిశుద్ధ్య విభాగం నిర్వాహకులు కొంత మంది గతంలో ఏసీబీకి కూడా పట్టుబడ్డారు.
- సీఎం నివాసం ఉండే డివిజన్‌లో చెత్తను తరలించడంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు చేతులెత్తేశారు.



భారతీయ విద్యా భవన్ స్కూల్ పక్కన ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన చెత్త

# జవహర్‌కాలనీలో అక్రమ నిర్మాణం సీజ్




అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–5 అన్నపూర్ణ స్టూడియో లేన్‌లో జవహర్‌కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని జీహెచ్ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. భవన యజమాని రవీందర్‌యాదవ్ సెల్లార్, స్టిల్ట్, 5 అంతస్తులు అనుమతులకు విరుద్ధంగా నిర్మించారని, దీంతో పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడమే కాకుండా విచారణకు కూడా హాజరుకాకపోవడంతో జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 461ఏ ప్రకారం నిర్మాణాన్ని సీజ్ చేశామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన నేతలు



కలెక్టర్‌తో మాల సంఘం నేతలు

బంజారాహిల్స్: హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరిచందనను మాల వెలుగు సంఘం నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమర్థవంతమైన అధికారిగా పేరున్న హరిచందనను హైదరాబాద్ కలెక్టర్‌గా నియమించడంపై ఫిలింనగర్‌కు చెందిన మాల వెలుగు సంఘం నేతలు దండు లక్ష్మణ్‌తో పాటు సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## నీటి సమస్య పరిష్కరించాలి

శ్రీనగర్ కాలనీ: నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు జలమండలి జీఎం ప్రభాకర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ బీజేపీ కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కల్యాణ్‌నగర్ వెంచర్–3 కాలనీలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీరు సరాఫర అవుతోందని దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారన్నారు. జీఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

## పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ అన్నారు. చిక్కడపల్లిలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ బూత్ శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల లిస్ట్, నివేదికను భరత్‌గౌడ్‌కు మహంకాళి జిల్లా శక్తి కేంద్రాల కన్వీనర్ టోపి శంకర్‌కు గురువారం అందజేశారు.

# రూ.72 లక్షల దోపిడీ కేసులో ప్రత్యేక బృందాల గాలింపు

**కేసులో 8వ బెటాలియన్ కానిస్టేబుల్ కూడా**



నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాంగోపాల్‌పేట్: తక్కువ ధరకు బంగారం ఇస్తామంటూ ఓ బంగారం వ్యాపారిని కొట్టి అతని నుంచి రూ.72లక్షలు లాక్కుని పోయిన ఘటనలో ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి ఈ ఘటన జరిగిన సంగతి తెలిసిందే. బంగారం వ్యాపారం నిర్వహించే హీరారాంకు రాధేశ్యాంతో పరియచం ఉంది.రాధేశ్యాం ద్వారా ఇతని ద్వారా తక్కువ ధరకు బంగారం ఇచ్చే ముఠా పరిచయం అయింది. ఈ ముఠా సభ్యులు కిలో బంగారానికి రూ.72 లక్షలకు ఇస్తామని బేరం కుదుర్చుకున్నారు. సాయంత్రం సమయంలో శివాజీనగర్‌కు వచ్చి డబ్బు తనిఖీ చేసినట్లు చేసి కొట్టి లాక్కొని కారులు పరారయ్యారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడితో పాటు మరి కొంత మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దోపిడీ చేసిన డబ్బు కూడా ఇంకా పోలీసులకు దొరకలేదు. ప్రధాన నిందితుడు పట్టుబడితేనే డబ్బుతో పాటు కేసు చిక్కుముడి వీడే అవకాశం ఉంది. మార్కెట్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూడా ప్రత్యేక బృంధాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. హీరారాం పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేస్తాడని దాని కోసం అధిక మొత్తంలో నగదు నిలువ చేస్తాడని తెలిసే ఈ పథకాన్ని రచించినట్లు తెలిసింది.

**దోపిడీకి మూడు టీంలు**

బంగారం వ్యాపారి నుంచి డబ్బును దోపిడీ చేశాక వారి నుంచి ఒక్కో టీం, వారి నుంచి ఇంకో టీం ఇలా మూడు టీమ్‌లను ప్రధాన నిందితుడు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అందుకే కారులో కొద్ది దూరం వెళ్లగానే మరో టీం వీరి నుంచి డబ్బును లాక్కోగా వారి నుంచి ఇంకో టీం తీసుకుని వెళ్లినట్లు తెలిసింది. ఈ కేసులో కేశవ్ అనే 8వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ కూడా నిందితుడిగా ఉండటం గమనార్హం. ఇతనే తనకు తెలిసిన ఆటో నగర్‌లోని కారు రెంటల్స్ దగ్గర నుంచి కారును అద్దెకు తీసుకున్నాడు. పోలీసులకు వెంటనే సమచారం తెలియడంతో కారు యజమాని కారు జీపీఎస్‌తో నిందితులు ఎక్కడ ఉన్నారని తెలియచేశాడు. దీంతో 4 నిందితులతో పాటు మరో ఇద్దరితో పాటు కారును కూడా స్వాధీనం చేసికున్నారు.

## ట్రిపుల్‌ఐటీ కార్మికులకు పెరిగిన జీతాలు ఇవ్వాలి

చిక్కడపల్లి: బాసర ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన జీతాలను వెంటనే విడుదల చేయాలని బీఎంఎస్ ఆలిండియా వర్కింగ్ కమిటీ సభ్యుడు కేవీ రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలకు ఒకసారి పెరిగే 8 డీఏలు పెండిగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెరిగిన డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలను పరిష్కరించి పేస్లిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కార్మికశాఖ ఉపకమిషనర్ నీలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు వెంకటేశం, శంకర్, రంగారావు, అజయ్, రాములు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్‌కు పీజేఆర్ పేరు పెట్టడంపై హర్షం

రహమత్‌నగర్ : శిల్పారామం ఫ్లైఓవర్‌కు సీఎల్‌పీ లీడర్, మాజీ మంత్రి పీజేఆర్ పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్ పేర్కొన్నారు. రహమత్‌నగర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. పేదల పక్షాన ఎనలేని పోరాటం చేసి, ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన పీజేఆర్ నగరవాసుల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారని, ఆయన సేవలను గుర్తించడంతో కాంగ్రెస్ శ్రేణులు, పీజేఆర్ అభిమానుల్లో ఆనందం నింపిందన్నారు.

## నగలు,నగదు అపహరణ

రహమత్‌నగర్: పనికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని నగలు, నగదు అపహరణకు గురైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..డివిజన్‌లోని రాజ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ అతని కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారు నగలు, నగదు కనిపించక పోవడంతో చుట్టుపక్కల వారిని విచారించగా గుర్తుతెలియని మహిళ ఇంట్లోకి వెళ్లగా చూశామని వారు తెలిపారు. దీంతో అదే రోజు రాత్రి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అమెరికా వర్సిటీతో ఓయూ ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ బీఈడీ కాలేజీ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నోటెర్ డామ్‌తో పరస్పర అవగాహన ఒపందాలు కుదర్చుకున్నాయి. ఈ రెండు వర్సిటీలు గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్ చైల్డ్ సంస్థ ఇక నుంచి పనిచేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు, అధ్యాపకులు పరస్పర మార్పిడితో పాటు ఉమ్మడి పరిశోధనలకు ఉపయోగపడుతుందని వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొ.నీల్ బూత్‌బి, ఎంఓయూ కమిటీ చైర్మన్ ప్రొ.కిషన్, డీన్ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్ ఇతర అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతకు ప్రజలు సహకరించాలి

సికింద్రాబాద్: పరిసరాల పరిశుభ్రతకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు కోరారు. గురువారం సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు సురేష్ థియేటర్ వద్ద శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాలను కార్పొరేటర్ సామల హేమతో కలిసి డిప్యూటీ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా రోడ్ల మీద పేరుకుపోయిన చెత్త తొలగింపు, డ్రైనేజీ లైన్లను శుభ్రపరచడం, మురుగునీటి నిల్వలు లేకుండా చేయడం, చెట్టు కొమ్మలు తొలగింపు వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ వెంకటేష్, ఏఈ కౌశిక్, శానిటేషన్ పర్యవేక్షకులు, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, శైలెందర్, కృష్ణ, అజీజ్, మహేష్, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

# 'కార్పొరేటర్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి'



జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అధికారులు, సిబ్బంది

వెంగళరావునగర్: జీహెచ్ఎంసీ అసిస్టెంట్ కమిషనర్ బాల్‌రాజ్‌పై దాడికి పాల్పడిన కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి కార్పొరేటర్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్–19 కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. జీహెచ్ఎంసీ ఐఎన్‌టీయూసీ గ్రేటర్ అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ హాజరై మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న అధికారిపై దాడి చేస్తే ఉద్యోగాలు ఎలా చేయాలని ప్రశ్నించారు. డిప్యూటీ కమిషనర్ ఎదుటే ఏఎంసీపై దాడి చేసి చంపుతానంటూ బెదిరించడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఏఎంసీ బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు తమకు మద్దతు తెలిపి రక్షణ కల్పించాలని కోరారు. అలాగే మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఉమెన్ కమిటీ చైర్మన్ జె.ఎల్.మెర్సీ, జోనల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యాదయ్య, అడిషనల్ జనరల్ సెక్రటరీ శివకుమార్, బిల్ కలెక్టర్లు, సంఘం నేతలు ధన్‌రాజ్, మోసిన్, సయ్యద్ అజారుద్దీన్ పాల్గొన్నారు.

**'సమస్యలపై ప్రశ్నిస్తే ఆభాసుపాలు చేస్తారా?'**

రహమత్‌నగర్: జీహెచ్ఎంసీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఘటనపై కార్పొరేటర్ సీఎన్ రెడ్డి స్పందించారు. గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ..ప్రజాప్రతినిధిగా సమస్యల పరిష్కారానికి తాను జవాబు దారిగా ఉండాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలోనే రహమత్‌నగర్ ఏఎంసీ బాలరాజును ప్రశ్నించినట్లు తెలిపారు. ఆయనే దురుసుగా ప్రవర్తించారని రారోపించారు. వ్యక్తిగతంగా తాను అధికారులను గౌరవిస్తానని చెప్పారు. ప్రజాప్రతినిధిగా ప్రశ్నిస్తే అభాసుపాలు చేయడం తగదని పేర్కొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పర్యటన



రహమత్‌నగర్: డివిజన్‌లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పిడమర్తి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో మొదట బిల్లును ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఎస్పీఆర్‌హిల్స్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న దళిత స్టడీ సెంటర్ భవనాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు జేపి జ్ఞానేశ్వర్, పురమి సంజీవరావు, శాంతకుమార్, భాస్కర్, రవిశంకర్, సయ్యద్ షరీఫ్, మన్సూర్, ఎక్బాల్ పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్లో ఓరియంటేషన్ ప్రోగ్రాం



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వర్చువల్ ఓరియంటేషన్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాంచనవల్లి స్కూల్ వివరాలు, జిల్లాపరంగా విద్యార్థులు సాధించిన విజయాలు, స్కూల్‌కి వచ్చిన అవార్డులు, విద్యార్థుల ప్రతిభా పాటవాలు, సృజనాత్మకతను పెంపొందించేందుకు పాఠశాలలో ఉన్న వివిధ రకాల ల్యాబ్స్ గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. అలాగే డైరెక్టర్ వరలక్ష్మి తల్లిదండ్రులు తమ పిల్లలు ఆదర్శంగా ఉండడంలో, పర్యవేక్షించడంలో, వారి భావోద్వేగ సమతుల్యతను ప్రదర్శించడంలో గల వారి ప్రాముఖ్యతను వివరించారు. సెకండరీ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి శ్రీరామ్, ప్రాథమిక ప్రధానోపాధ్యాయురాలు మిథుమోహన్ మాట్లాడుతూ.. తరగతి గదికి మించి విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని నిర్ధారించేందుకు పాఠ్యేతర కార్యకలాపాలపై కూడా అవగాహన అవసరమన్నారు.

## యువకుడి అదృశ్యం

వెంగళరావునగర్ : యువకుడు అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదారి లత కుటుంబ కొంతకాలంగా కల్యాణ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆమె కుమారుడు సాయిచరణ్ కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ విషయపై తల్లి చదువుకున్న వాడివని డ్రైవర్‌గా పని చేయవద్దని కోరినా వినలేదు. ఈ క్రమంలో ఈనెల 7న డ్రైవింగ్‌కు వెళ్లిన సాయిచరణ్ తిరిగి రాలేదు. 10వ తేదీన తల్లితో మాట్లాడాడు. తల్లి డ్రైవింగ్ వద్దని చెప్పిందని ఇంటికి రమ్మని చెప్పగా సరేనని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీంతో ఆందోళన చెందిన వారు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అకారణంగా యువకులపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా కొందరు యువకులు ముగ్గురు స్నేహితులపై దాడి చేసి ఫోన్లు లాక్కెళ్లిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణానగర్‌లో నివసించే ఎల్.దిలీప్, నవీన్, షరీఫ్ ఒక గదిలో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి మాదాపూర్‌లోని హోటల్‌కు వెళ్లి భోజనం చేసి తిరిగి వస్తుండగా మరో వాహనంపై వచ్చిన వ్యక్తి వారిని ఆపి దూషించాడు. అనంతరం వారిని కొట్టాడు. దీంతో దిలీప్ ద్విచక్ర వాహనంతో పారిపోయాడు. మిగితా ఇద్దరిని గుర్తు తెలియని వ్యక్తి, మరికొంతమంది వచ్చి దాడి చేసి ఫోన్లు లాక్కెళ్లారు. కొద్దిసేపటికి దిలీప్ పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి వచ్చారు. బాధితులు ఆసుపత్రిలో చికిత్స అనంతరం గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : భరత్‌నగర్, ఐఏఎస్ క్వార్టర్స్, స్వర్ణజయంతి 11 కేవీ ఫీడర్లు, జనప్రియ, ఈఎస్ఐ సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మతుల కారణంగా ఈనెల 20న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ, శ్రీరాములు థియేటర్లు, అశ్వినీ హెయిర్ ఆయిల్ లైన్లు, శ్రీనివాస్‌కాలనీ ఈస్ట్, 2ఆర్‌టీ, ఎస్ఆర్‌నగర్ బస్టాప్, గాయత్రీనగర్, మాజీ ఎమ్మెల్యే జ్ఞానేశ్వరావు ఇల్లు ఏరియా, హుడా కాంప్లెక్స్, స్వర్ణజయంతి కాంప్లెక్స్ ప్రాంతాలు. అలాగే మూసాపేట, ఈస్ట్ శ్రీనివాస్‌కాలనీ, మైత్రీవనం 11 కేవీ ఫీడర్లు, మైత్రీవనం సబ్‌స్టేషన్ పరిధిల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్యం థియేటర్ మెయిన్‌రోడ్డు, బ్లూఫాక్స్, ప్రైమ్ ఆసుపత్రి, గాయత్రీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాల ద్వారా లబ్ది పొందిన వారు తమ పరిసరాల్లోని అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్‌రాజు పాల్గొన్నారు.

# మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



రాంగోపాల్‌పేట్: మోండా డివిజన్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గురువారం రెజిమెంటల్ బజార్‌లోని గురుద్వార ప్రాంతాల్లో రూ.11లక్షల నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత చాలా కాలంగా ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారని త్వరలోనే మరిన్ని నిధులు మంజూరు చేసి ఎక్కడ సమస్య తలెత్తకుండా చూస్తామని హామి ఇచ్చారు. అధికారులు వెంటనే పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు బద్రినాథ్‌యాదవ్, సంతోష్ యాదవ్, అల్లాడి గౌరిశంకర్, బాబూరావు ముదిరాజ్, నాగేష్ యాద్, నందికంటి రవి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో నేడు

- మాదాపూర్‌లో హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ నోవొటెల్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట వేసవికాలం వివాహ ప్రత్యేక కలెక్షన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణా ఎదురుగా ఉన్న బంజారా హాల్‌లో బిగ్ పటోలా శారీస్ సేల్ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .
- అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు ఎల్బీ స్టేడియంలో ఒన్ డే ఈవెంట్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

## సీపీగెట్‌కు తొలిరోజు 2 వేల దరఖాస్తులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** టీజీ సీపీజీఈటీ–2025 (సీపీగేట్) దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. తొలిరోజు 2 వేల మంది అభ్యర్థులు దరఖాస్తుల చేసుకున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూతోపాటు ఇతర వర్సిటీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సులకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు వచ్చే నెల 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## మధ్యలోంచే వెనక్కొచ్చిన తిరుపతి విమానం


బ్యాగేజీ డోర్‌లో సాంకేతిక సమస్య

**శంషాబాద్:** శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుపతి బయలుదేరిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో మార్గమధ్యంలోంచి వెనుదిరిగి హైదరాబాద్‌కు చేరుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్పైస్‌జెట్ 2926 విమానం 80 మంది ప్రయాణికులతో గురువారం ఉదయం 6.20 గంటలకు టేకాఫ్ తీసుకుంది. కొంతసేపటి తర్వాత విమానంలోని రియర్ బ్యాగ్ డోర్(వెనక సామాను ఉండే ద్వారం)లో సమస్యను గుర్తించిన పైలట్ వెంటనే శంషాబాద్ ఏటీసీకి సమాచారం అందించారు. ఏటీసీ అనుమతి మేరకు వెనక్కి తిరిగిన విమానం 7.10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ప్రత్యామ్నాయ విమానం కోసం ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎయిర్‌లైన్స్ అధికారులు వేర్వేరు విమానాల్లో ప్రయాణికులను గమ్యస్థానికి పంపినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

## కైలాస్ మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభం

**సాక్షి, సిటీ బ్యూరో:** కోవిడ్, భారత్–చైనాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐదేళ్ల క్రితం నిలిచిపోయిన కైలాస్ మానస సరోవర్ యాత్రను పునఃప్రారంభిస్తున్నామని సదరన్ ట్రావెల్స్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. మూడు ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయని, ఖాట్మండు నుంచి 14 రోజుల ఓవర్ ల్యాండ్, 12 రోజుల హెలికాప్టర్ ప్యాకేజీ, లక్నో నుంచి హెలికాప్టర్‌లో 10 రోజుల ప్యాకేజీలను ప్రకటించారు. ఆధ్యాత్మిక, పవిత్ర స్థలాలను మిళితం చేస్తూ, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడానికి ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. అనుభవజ్ఞులైన గైడ్స్, వైద్య సాయం అందించనున్నామని పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ నాకే: అజహరుద్దీన్



**శ్రీనగర్ కాలనీ:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో తనకే కాంగ్రెస్ టికెట్ వస్తుందని, ఎమ్మెల్యేగా పోటీ చేసి ఈసారి విజయం సాధిస్తానని కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యుడు, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మహ్మద్ అజహరుద్దీన్ ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఈ స్థానంలో పోటీ చేసిన తాను తక్కువ ఓట్లతో ఓడిపోయానని గుర్తుచేశారు. అనంతరం జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌కు అత్యధికంగా ఓట్లు వచ్చేవిధంగా కృషి చేశామన్నారు. తనకు టికెట్ రావడం లేదంటూ కొంతమంది నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానన్నారు.

# శివారు రైతుకు 'భరోసా' ఏదీ!

**మేడ్చల్ ఆరు, రంగారెడ్డిలో తొమ్మిది మండలాలకు నిలిపివేత**

- మెజార్టీ భూములు వెంచర్లుగా మారడమే కారణమంటున్న అధికారులు
- 'భరోసా' ఇవ్వాలని మంత్రి తుమ్మలకు బీఆర్ఎస్ నేతల విజ్ఞప్తి



**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** హైదరాబాద్ శివారు రైతులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వానాకాలం సీజన్ మొదలైనా 'రైతు భరోసా' నిధులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఔటర్ రింగ్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న అర్బన్ మండలాల్లోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి రైతులు వరి, పత్తిసహా కూరగాయలు, పండ్లు, పూల పంటలతో నగరవాసుల అవసరాలు తీరుస్తున్నారు. గత యాసంగిలోనూ ఇక్కడి రైతులకు ప్రభుత్వం మొండిచేయి చూపించింది. మేడ్చల్ జిల్లాలోని ఆరు మండలాలు, రంగారెడ్డిలోని తొమ్మిది మండలాలకు ప్రభుత్వం 'భరోసా' ఇవ్వలేదు. రైతుల విషయంలో ప్రభుత్వ తీరును బీఆర్ఎస్ నిరసించింది. మాజీ మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు, ఆయా మండలాల రైతులు గురువారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు.

**ధరలను బూచీగా చూపి...**

రంగారెడ్డి జిల్లాలో శేరిలింగంపల్లి, గండిపేట్, హయత్‌నగర్, సరూర్‌నగర్, బాలాపూర్ మండలాల్లోని 90 శాతం భూములు ఇప్పటికే వ్యవసాయేతర భూములుగా మారాయి. అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శంషాబాద్ మండలాల్లోని మెజార్టీ భూములు పంట సాగు కిందే ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని 36,200 మంది రైతులు 38,184 ఎకరాలు సేద్యం చేస్తున్నారు. వీరందరికీ రెండు విడతలు పంట సహాయం అందలేదు. మేడ్చల్ జిల్లాలో ఐదు అర్బన్ మండలాలు, ఆరు గ్రామీణ మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 45,067 ఎకరాల విస్తీర్ణంలో 49,727 మంది రైతులు వివిధ పంటలను సాగు చేసుకుంటున్నారు. వీరికి రూ.27.40 కోట్ల రైతు భరోసా అందించాల్సి ఉంది. మేడ్చల్ జిల్లా లోని శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్, దుండిగల్, కుత్బుల్లాపూర్, అల్వాల్ మండలాల రైతుల ఖాతాల్లో ఇప్పటికీ రైతు భరోసా సొమ్ము జమ చేయలేదు. ఆయా మండలాల్లోని వ్యవసాయ అధికారులు ఇప్పటికే పంట భూముల వివరాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదించారు. ఇక్కడి భూములకు ఎక్కువ ధర ఉందనే కారణంతో పంట సాగు చేస్తున్న రైతులకు సహాయాన్ని నిలిపివేసినట్లు తెలిసింది.

**పంటలు సాగవుతున్నా ...**

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండ రావిరాల, కుత్బుల్లాపూర్, గౌరెల్లి, బాచారం, చిన్న రావిరాల, అనాజ్‌పూర్, మజీద్‌పూర్, కవ్వాడిపల్లి, బలిజగూడలోని మెజార్టీ భూముల్లో ఇప్పటికీ పంటలు సాగవుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం, రాపోలు, ముక్కునూరు, పొల్కంపల్లి, నాగన్‌పల్లి, తులేకలాన్, కప్పాడు, వెల్మినేడు, చర్లపటేల్ గూడం, పోచారం, ఉప్పరిగూడెంలోని మెజార్టీ రైతులు సాగు చేస్తున్నారు. మహేశ్వరం మండలం రావిర్యాల, అమీర్‌పేట్, మాణిక్యమ్మగూడ, చిన్నతూప్రా, గట్టిపల్లి, ఆకన్‌పల్లిల్లో పంటలు సాగవుతున్నాయి. శంషాబాద్ మండలంలో ఏడు వేల ఎకరాల్లో పంట సాగవుతోంది. మల్కారం, రాయన్నగూడ, కాచారం, రామంజాపూర్, బోటిగూడ, పాల్మాకులలో వరి, కూరగాయలు, పండ్లు, పూలు పండిస్తున్నారు. ప్రభుత్వం ఏళ్లుగా సబ్సిడీపై డ్రిప్‌లు ఇవ్వకపోవడం, యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు అందజేయకపోవడానికి తోడు తాజాగా పంట సహాయం నిలిపివేయాలని ఆయా మండలాల్లోని రైతులు జీర్ణించు కోలేకపోతున్నారు.

## రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన సుగుణమ్మ

**సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ**



సుగుణ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఆర్ ఫౌండేషన్ సభ్యులు

**చందానగర్:** నిరంకుశ నిజాం సైన్యం, రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు శాఖమూరి సుగుణమ్మ వీరోచితంగా పోరాడారని, దోపిడీ, అసమానతల పునాదిని ప్రశ్నించిన ఉద్యమ నిర్మాతల్లో ఆమె ఒకరని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఆమె భౌతిక కాయాన్ని కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో గురువారం ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయన మాట్లాడుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకురాలుగా మహిళా ఉద్యమానికి ఆమె కొత్త మలుపు తీసుకొచ్చారన్నారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, బీవీ విజయలక్ష్మి, సీపీఐ మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు, వీరయ్య, జ్యోతి, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు, ప్రముఖకవి డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ఆంధ్రా బీసీ కులాలను కలపొద్దు

**తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నేతలు**



వీహెచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీహరి, భాగయ్య

**కవాడిగూడ:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత తొలగించిన 27 ఆంధ్రా బీసీ కులాలను తెలంగాణ ప్రభుత్వం మళ్లీ కలిపేందుకు కుట్రలు చేస్తోందని, దీనిని అడ్డుకోవాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ బాగయ్య గురువారం కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ కులాలను మళ్లీ కలిపితే తెలంగాణలోని బీసీలకు అన్యాయం జరుగుతుందని, ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ కులాలను బీసీ జాబితాలో కలవకుండా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గంగపుత్ర సంఘం, యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ గంగపుత్ర పాల్గొన్నారు.

## బల్దియా రికార్డుల్లో రోహింగ్యాల సంతతి వివరాలు

**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలో నివసిస్తున్న రోహింగ్యా శరణార్థుల సంతతి వివరాలను జీహెచ్‌ఎంసీ తన ప్రత్యేక డేటా బేస్‌లో నమోదు చేయనున్నట్లు తెలిసింది. జీహెచ్‌ఎంసీలో కొంత కాలంగా బోగస్ బర్త్ సర్టిఫికెట్ల జారీపై దుమారం చెలరేగుతుండటం విదితమే. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ విభాగం సూచనలకనుగుణంగా జీహెచ్‌ఎంసీ ఇందుకు సిద్ధమైంది. దీంతోపాటు వారు రోహింగ్యాలని తెలిసేలా యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యూఎన్‌హెచ్‌సీఆర్) గుర్తింపు నెంబరును డేటాలో నమోదు చేయనున్నారు. ఈ నెంబర్ రోహింగ్యాల సంతతికి జారీ చేసే బర్త్ సర్టిఫికెట్లపై ఉండదు. ఏదైనా ప్రభుత్వ విభాగం కోరినప్పుడు, ప్రభుత్వ అవసరాలకు వినియోగించాల్సి వచ్చినప్పుడు జీహెచ్‌ఎంసీ తన డేటాబేస్‌లోని సదరు వివరాలను డిజిటల్ రూపంలో పంపించేందుకు ఏర్పాట్లు చేసుకోనున్నట్లు సమాచారం.

**20 వేల మందికిపైగా నివాసం..**

నగరంలోని బండ్లగూడ, బార్కాస్, బాలాపూర్ తదితర ప్రాంతాల్లో రోహింగ్యా శరణార్థులు సుమారు 20వేల మందికి పైగా నివసిస్తున్నట్లు అంచనా. యూఎన్‌హెచ్‌సీఆర్, మోడర్న్ ఆర్కిటెక్ట్స్ ఫర్ రూరల్ ఇండియా (మారి) రోహింగ్యా శరణార్థులకు అవసరమైన సేవలు అందిస్తున్నట్లు సమాచారం. తాజాగా జీహెచ్‌ఎంసీ అధికారులను సంప్రదించిన ఇంటెలిజెన్స్ అధికారులు రోహింగ్యాలకు బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ చేసేప్పుడు జీహెచ్‌ఎంసీ డేటాలో యూఎన్‌హెచ్‌సీఆర్ గుర్తింపు నెంబరు నమోదు చేయాలని సూచించినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశంలో బోగస్ బర్త్ సర్టిఫికెట్లపై తీవ్ర దుమారం చెలరేగడం తెలిసిందే. అక్రమ మార్గాల్లో బర్త్ సర్టిఫికెట్లు పొందుతున్న రోహింగ్యాలు వాటితో ఆధార్, పాస్‌పోర్టులు పొందుతున్నారని బీజేపీ సభ్యులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, భవిష్యత్‌లో ప్రభుత్వం లేదా ఇతర విభాగాలకు ఏవైనా సందేహాలు తలెత్తినప్పుడు జీహెచ్‌ఎంసీ డేటా ఆధారంగా ధ్రువీకరించుకునేందుకు వీలు కానుంది.

## ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో మాక్‌డ్రిల్





**నాంపల్లి:** స్వీయ రక్షణే శ్రీరామ రక్ష అని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి టి.వెంకన్న అన్నారు. అగ్ని ప్రమాదాలపై రోగులు, రోగి సహాయకులకు అవగాహన కల్పించడంలో భాగంగా గురువారం రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏయే సందర్భంలో ఎలాంటి పరికరాలను వినియోగించాలో, ఎవరికి వారు ప్రమాదం నుంచి ఎలా బయటపడాలో అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరిగితే వెంటనే ఫైర్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆసుపత్రి డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై మాక్‌డ్రిల్ వీక్షించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓ కె.యుగంధర్, ఎస్ఎఫ్‌ఓ చాణక్య, ఆర్ఎంఓ ఎన్.నిర్మల, హెల్త్ ఇన్‌స్పెక్టర్, నర్సింగ్ స్టాఫ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు యోగాపై కౌంట్ డౌన్ ఈవెంట్

**లక్డీకాపూల్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎల్బీ స్టేడియంలో ఒన్ డే కౌంట్‌డౌన్ ఈవెంట్ నిర్వహించనున్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు జరిగే ఈ యోగా కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు తదితర ప్రముఖులు పాల్గొననున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కేంద్రమంత్రి ...



**గన్‌ఫౌండ్రీ:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఎల్బీ స్టేడియం వేదికగా నిర్వహించ తలపెట్టిన యోగా ఏర్పాట్లను గురువారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ సురేఖ ఓం ప్రకాష్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

## 168 ఆసుపత్రులకు నోటీసులు

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ పరిధిలోని 168 ఆసుపత్రులకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ జాబితాలో పలు కార్పొరేట్, సాధారణ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు, క్లినిక్‌లు ఉన్నాయి. వైద్యారోగ్య శాఖ పరంగా తీసుకున్న అనుమతులు వచ్చే ఆరు నెలల్లో ముగియనున్న నేపథ్యంలో ఆయా ఆసుపత్రులకు ముందస్తు సమాచారంగా ఈ నోటీసులు జారీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సకాలంలో స్పందించకుంటే చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు.

## కాకినాడ–చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

**సాక్షి, సిటీబ్యూరో:** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాకినాడ–చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు కాకినాడ టౌన్–చర్లపల్లి (07447/07448) స్పెషల్ ట్రైన్ ప్రతి శనివారం రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30కు చర్లపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు జూలై 5వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 29వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. కాకినాడ–లింగంపల్లి (07445/07446) స్పెషల్ ట్రైన్ ప్రతి సోమ, బుధ, శుక్ర వారాల్లో రాత్రి 8.10 గంటలకు కాకినాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.50 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళ, గురు, శని వారాల్లో సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది. ఈ రైళ్లు జూలై 2 వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు అందుబాటులో ఉంటాయి.

## ఎఫ్‌డీడీఐలో అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రారంభం

**రాయదుర్గం:** ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ క్యాంపస్‌లో అడ్మిషన్ల సెషన్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించినట్లు ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.తేజ్ లోహిత్‌రెడ్డి తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఈ ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే ఎఫ్‌డీడీఐ అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఆలిండియా సెలక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ)–2025 ఫలితాలను ప్రకటించారని గుర్తు చేశారు. ఈ మేరకు ఫుట్‌వేర్ డిజైన్, ఫ్యాషన్, రిటైల్, లెదర్ లైఫ్‌స్టైల్, ప్రొడక్ట్ డిజైన్, మేనేజ్‌మెంట్ వంటి కోర్సుల్లో ప్రతిష్టాత్మకంగా యూజీ, పీజీ కోర్సుల అడ్మిషన్లను ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. ఔత్సాహిక అభ్యర్థులు బి.డిఈఎస్, బీబీఏ, ఎం.డిఈఎస్, ఎంబీఏ వంటి కోర్సుల్లో అడ్మిషన్లను పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతుందని, జూలై 4న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. తరగతులను జూలై 21న ఆరంభిస్తున్నట్లు ప్రకటించారు. ఫీజుల వివరాలను ఎఫ్‌డీడీఐ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. అందుకోసం వెబ్‌సైట్ www.fddiindia.com లో అందుబాటులో ఉంటుంది. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ అమిత్(95055 55133), ఫియాజ్(78693 98146)లను సంప్రదించాలని సూచించారు.

## విద్య మెరుగుకు అమ్మ కమిటీలు దోహదం

**ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి**



దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమ దృశ్యం

**చిలకలగూడ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో ప్రభుత్వ ప్రాథమిక విద్య మరింత బలోపేతం అవుతోందని ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్, రాష్ట్ర ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడేందుకు అమ్మ కమిటీలు దోహదపడుతున్నాయని అన్నారు. 50 వేల మంది టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లతోపాటు మెగా డీఎస్సీ నిర్వహించి 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించి 50 మంది చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మారేడుపల్లి మండల ప్రత్యేకాధికారి సూర్యప్రకాశ్, సికింద్రాబాద్ డిప్యూటీ ఈఓ శ్రీధర్, మారేడుపల్లి డిప్యూటీ ఐఎస్ఓ మదన్ మోహన్‌రెడ్డి, సీపీఐ సికింద్రాబాద్ ఇన్‌చార్జి శ్రీనివాస్, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రవీణ్ కుమార్, మత గురువులు అశోక్, షేక్ యూనిస్, ప్రకాశం, చిన్నారుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫిలిం చాంబర్ వద్ద సినీ కార్మికుల ధర్నా



ఫిలిం చాంబర్ ముందు ధర్నా చేస్తున్న జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ సభ్యులు...

**బంజారాహిల్స్:** చిత్రపురి కాలనీ అవినీతి అక్రమాలు, హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్‌కుమార్ అక్రమార్జనపై చర్యలు తీసుకోవాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ సభ్యులు గురువారం ఫిలిం చాంబర్ ముందు ధర్నా చేపట్టారు. ధర్నాకు సినీ కార్మికులు భారీగా తరలివచ్చారు. అనిల్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ డిమాండ్ చేశారు. డివిజనల్ కో–ఆపరేటివ్ ఆఫీసర్ 2016లో యూనియన్‌లో అధికంగా సభ్యులను చేర్చుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా చిత్రపురి సొసైటీలో ఇంకా సభ్యులను చేర్చుకుంటున్నారని ఆరోపించారు. చిత్రపురి హౌసింగ్ సొసైటీ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాము అద్దె ఇళ్లల్లో ఉంటుంటే ఈ అవినీతి కమిటీ సభ్యులు మాత్రం కోట్ల రూపాయల ఇళ్లల్లో నివసిస్తున్నారని, సినీ కార్మికుల ముసుగులో వందల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. చిత్రపురి సాధన సమితి ఆధ్వర్యంలో ఈ ధర్నాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ధర్నాలో మద్దినేని రమేష్ బాబు, రవీందర్, కస్తూరి శ్రీనివాస్, ఈశ్వర్‌రావు, వెంకటేష్, ప్రతాని రామకృష్ణ గౌడ్, భద్ర, లలిత, లతాశ్రీ, రమావేణి, సత్య, శ్రీనివాస్‌తోపాటు పలువురు సినీ కార్మిక నేతలు పాల్గొన్నారు.

## పెట్ పార్కు పనుల పరిశీలన



జూబ్లీహిల్స్‌లో నిర్మిస్తున్న పెట్ పార్కును పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్ రోడ్ నెం.44/45లో ఎకరానికిపైగా విస్తీర్ణంలో నిర్మిస్తున్న పెట్ పార్కు పనులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ గురువారం పరిశీలించారు. నగరవాసుల పెట్స్ కోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న ఈ పార్కులో సకల సౌకర్యాలు ఉండాలని, పచ్చదనానికి ప్రాముఖ్యం ఇవ్వాలని సూచించారు. పిల్లలకు సంబంధించిన ప్లే ఏరియాల్లో భిన్న రకాల డిజైన్లతో తీర్చిదిద్దాలని సూచించారు. సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీఎంసీ సమ్మయ్య, ఈఈ విజయ్‌కుమార్, పార్కుల విభాగం డీడీ చంద్రశేఖర్, మేనేజర్ బాలయ్య పాల్గొన్నారు.

## బీజేపీ కనుసన్నల్లోనే గద్దర్ అవార్డుల ప్రదానం

**'రజాకార్'కు ఇచ్చిన అవార్డును వెనక్కి తీసుకోవాలని వక్తల డిమాండ్**




సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

**హిమాయత్‌నగర్:** ఆర్ఎస్ఎస్, బీజేపీ కనుసన్నల్లో తీసిన రజాకార్ సినిమాకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చి తెలంగాణను అవమాన పర్చిందని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ చరిత్రను, సంస్కృతిని వక్రీకరించి రజాకార్ సినిమా తీశారని ఆరోపించారు. రజాకార్ సినిమాకు ఇచ్చిన అవార్డును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని వారన్నారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ హైదరాబాద్ చాప్టర్(ఏపీసీఆర్) ఆధ్వర్యంలో రజాకార్ ఫాక్ట్స్ ఆర్ ఫాల్స్‌హుడ్ ద గద్దర్ అవార్డ్ కాంట్రవర్సీ అనే అంశంపై హనీఫ్ అహ్మద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్ మాట్లాడుతూ గతంలో నంది అవార్డులు తీసుకోకుండా వ్యతిరేకించిన ప్రజా గాయకుడు గద్దర్ పేరుతో సినిమా అవార్డులు ఇవ్వడం అభ్యంతరకరమని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని తక్కువ చేసి చూపించారని, నిజాలను దాచిపెట్టి అబద్ధాలనే చూపించారని విమర్శించారు. రచయిత స్కైబాబా మాట్లాడుతూ రజాకర్ సినిమా ముస్లింలను అవమానపరిచిందన్నారు. సీపీఐ నేత రాజబహదూర్ సోదరి అవరీచ్ బాణీ మాట్లాడుతూ రజాకార్లను కూడా నాడు కొంతమంది ముస్లింలు వ్యతిరేకించారని అన్నారు. కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కన్నెగంటి రవి, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, న్యాయవాది అఫ్సర్ జహాన్, పరాజ్ అహ్మద్, మరియా ఆరీఫుద్దీన్, సారా మాథ్యూస్, ప్రేమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసనకు యత్నం

**74 మంది వామపక్ష పార్టీల నాయకుల అరెస్ట్**



యూఎస్ కాన్సులేట్ సమీపంలో నిరసనకు దిగిన వామపక్ష పార్టీల నాయకులు

**గచ్చిబౌలి:** పాలస్తీనా–ఇరాన్‌లపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ అమెరికన్ కాన్సుల్ జనరల్ వద్ద నిరసనకు యత్నించిన వామపక్ష నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లోని యూఎస్ కాన్సులేట్ సమీపంలో ప్లకార్డులతో నిరసనకు దిగారు. యూఎస్ కాన్సులేట్ వైపు వెళ్లకుండా గచ్చిబౌలి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 74 మందిని నార్సింగి, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్), ఎంసీపీఐ(యు), ఎస్‌యుసీఐ(సి), ఫార్వర్డ్ బ్లాక్ తదితర వామపక్ష పార్టీలు యూఎస్ కాన్సులేట్ వద్ద నిరసనకు తరలివస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. యూఎస్ కాన్సులేట్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వామపక్ష పార్టీల నాయకులు యూఎస్ కాన్సులేట్ సమీపంలో అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, ఇజ్రాయిల్ మారణహోమం తక్షణమే ఆపేయాలని ప్లకార్డులతో నిరసనకు దిగారు. పశ్చిమాసియా దేశాలతోపాటు ఇజ్రాయిల్ దాడులు ప్రపంచ దేశాల్లో ఆందోళన కల్గిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పీఓడబ్ల్యూ నేత సంధ్య, వామపక్ష నాయకులు పాలమాకుల జంగయ్య, ప్రభు లింగం, నర్సింహ్మారెడ్డి, ఛాయాదేవి, స్టాలిన్, యాదయ్య, చంద్రమోహన్ గౌడ్, గోవర్ధన్ ఆందోళనకు దిగిన వారిలో ఉన్నారు.

# లద్దాఖ్.. లబ్ డబ్..

## ఏటా జూన్‌లో నగరం నుంచి లద్దాఖ్‌కు పర్యాటకుల జోరు

నగరంలో చాలా మందికి వేసవి సీజన్ పూర్తవ్వగానే టూర్స్ గురించిన టాపిక్స్‌పై చర్చలు పూర్తవుతాయి. కొంతమందికి మాత్రం అప్పుడే మొదలవుతాయి. అలాంటి వారిలో లద్దాఖ్ ప్రియులు ముందుంటారు. అయితే పహల్గామ్ దాడి తదనంతర పరిణామాల వల్ల పర్యాటకుల సంఖ్యలో కొంత మార్పు కనిపిస్తోంది. బైకర్స్, కార్లలో టూర్ వెళ్లే వారు ఇప్పటికే తమ తమ ప్లాన్స్ పూర్తిచేసుకునే దిశగా కదులుతున్నారు. అయితే వివిధ రకాల మార్గాల ద్వారా వెళ్లే పర్యాటకుల తాకిడి మాత్రం బాగా తగ్గిందని సమాచారం.

– సాక్షి, సిటీబ్యూరో

- బైకర్స్, కార్లలోనూ డ్రీమ్ టూర్‌గా గుర్తింపు
- పహల్గామ్ తదనంతర పరిణామాలతో సందిగ్ధం
- ఆనందాల పర్యటనపై అనుమానాల ముసురు
- గత నెలతో పోలిస్తే మెరుగైందంటున్న టూర్ ఆపరేటర్లు



### సోషల్ మీడియా కేంద్రంగా..

లద్దాఖ్‌ను తరచూ సందర్శించే ఉత్తరాది వాసి రట్టన్ ఢిల్లాన్, లద్దాఖ్‌లోని ముఖ్యపట్టణమైన లేహ్ ఖాళీగా ఉన్నట్లు చూపించే వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'గత 10 సంవత్సరాలుగా లేహ్‌ను సందర్శిస్తున్నా.. ఇంత తక్కువ మంది పర్యాటకులు ఉన్న లెహ్ పట్టణాన్ని ఎప్పుడూ చూడలేదు. ఇది లద్దాఖ్ అంటే నమ్మడం కష్టం' అంటూ ఆయన తన అనుభవాన్ని వెల్లడించారు. ఇది చూసిన పలువురు నెటిజన్లు లద్దాఖ్ ప్రస్తుత పరిస్థితికి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ.. ఇది తాత్కాలికమేనని తిరిగి పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



హల్గామ్ ఉగ్రవాద దాడి తరువాత, జమ్మూ కశ్మీర్‌లోని పర్యాటక రంగం దెబ్బతింది. హోటళ్ళు, రిసార్టులు హౌస్‌బోట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ పరిణామాలతో ఈ ప్రాంతంలోని పొరుగు ప్రాంతాల్లో, ముఖ్యంగా దాని ప్రక్కనే ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో కూడా కనిపిస్తోంది. అయితే మరోవైపు యువత మాత్రం తగ్గేదే లేదంటూ రైడర్స్ గ్రూపుల ద్వారా టూర్‌కు ప్లాన్ చేస్తున్నారు.

### జూన్ నెలలోనే ఎందుకు?

సాధారణంగా లద్దాఖ్ ప్రాంతం చలికాలంలో మంచు తీవ్రంగా ఉంటుంది. మంచుతో కప్పబడిపోయే రహదారుల వల్ల ప్రయాణం కష్టతరమవడం, మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత వల్ల శారీరక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఆ సమయాన్ని ఎవరూ ఎంచుకోరు.. అదే మే నెల నుంచి అక్టోబరు వరకూ ఈ ప్రాంతంలో వాతావరణం పూర్తి పొడిగా ఆహ్లాదకరంగా ఉంటుంది. దీంతో అద్భుతమైన వైవిధ్యభరితమైన లద్దాఖ్ అందాలను సందర్శించడానికి ఉవ్విళ్లూరుతుంటారు. మరోవైపు ఈ సీజన్‌లో దేశంలోని మిగిలిన ప్రాంతాలు వర్షాలతో పర్యటనలకు అంత అనుకూలంగా ఉండకపోవడం కూడా లద్దాఖ్‌ను ఈ సీజన్‌లో అత్యంత అనువైన ఎంపికగా మార్చింది అనొచ్చు.








### బైకర్లలో సందిగ్ధం.. అయినా తగ్గేదేలే..

అయితే నగరం నుంచి ఏటా ఈ సమయానికి లద్దాఖ్ ప్రయాణానికి హుషారుగా సిద్ధమయ్యే బైకర్లు ప్రస్తుతం కొంత తటపటాయిస్తున్నారని నగరానికి చెందిన బైకర్ సదాశివరెడ్డి అన్నారు. తీవ్రవాద దాడి అనంతరం సెక్యూరిటీ పటిష్టం కావడంతో పాటు ఇతరత్రా ఇబ్బందులపై బైకర్స్ సందేహంతో ఉన్నారని, అయితే ఇప్పటికే కొందరు బయలుదేరారు కాబట్టి.. వారిని చూసి మరికొందరు కూడా అదే బాట పట్టవచ్చని చెప్పారాయన. లద్దాఖ్ అనేది బైకర్స్‌కి స్వర్గధామం లాంటిది అంటున్న ఆయన.. ఏటా కేవలం 3, 4 నెలల పాటు మాత్రమే అందుబాటులో ఉండే అవకాశాన్ని వదులుకోరని అంటున్నారు.

దేశంలో మరే ప్రాంతంలో చూడలేని అనేక అద్భుతమైన ప్రకృతి విశేషాలు ఇక్కడ చూడొచ్చు. ఈ ప్రాంతం అక్కడి ప్రకృతి సౌందర్యం అలవాటైతే మళ్లీ మళ్లీ వెళ్లకుండా ఉండడం కష్టం. అందుకే దేశవ్యాప్తంగా లద్దాఖ్ చాలా కాలం నుంచి అనేక మందికి అభిమాన టూరిస్ట్ ప్లేస్‌గా మారింది. బైక్ రైడర్లకైతే మరింత ఇష్టం ఏర్పడుతుంది. అయితే

### ప్రభావం ఉన్నా.. పుంజుకుంటోంది..



ఇప్పుడు కార్లు, ఇతర వాహనాల ద్వారా వెళ్లేవారు పెరిగారు. గత ఐదారేళ్లుగా మన తెలుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగింది. ఒకప్పుడు బైక్ రైడర్‌గా లద్దాఖ్‌కు వెళ్లడం అలవాటైన నేను ఆ తర్వాత టూర్ ఆపరేటర్‌గా మారాను. గత పదేళ్లుగా పర్యాటకుల్ని తీసుకెళుతున్నా. తీవ్రవాద దాడి వల్ల సాధారణంగా మే నెల కల్లా ఊపందుకోవాల్సిన పర్యాటకుల సంఖ్య జూన్ నెలకు గానీ పుంజుకోలేదు. ఏదేమైనా ఈ నెలలో పరిస్థితి పూర్తి ఆశాజనకంగా కనిపిస్తోంది.

– శ్రవణ్ కొన్నేరు, మ్యాడ్ ఓవర్ లద్దాఖ్




## ఆకట్టుకున్న 'కన్వర్జెన్స్'

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీడీకే ఇండియా నిర్వహించిన వార్షిక 'ఫ్యామిలీ డే' కార్యక్రమం 'కన్వర్జెన్స్' ఆకట్టుకుంది. జూబ్లీహిల్స్‌లోని జీఆర్‌సీ కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేట్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన థీమ్ ఆధారిత ఫ్యాషన్ వాక్, ఉద్యోగుల గాన నృత్య ప్రదర్శనలు, సామూహిక నృత్యాలు, స్కిట్స్, డాక్యుమెంటరీ ప్రదర్శనలు సహా పలు ఉత్సాహభరిత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీపీ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ శక్తి సాగర్ జైన్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్కృతిలో కుటుంబ బంధాల మేళవింపుగా సాగే ఇలాంటి కార్యక్రమాల అవసరం ఎంతైనా ఉందన్నారు. సీడీకే ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ కుమార్ జైన్ పర్యవేక్షించారు.

## రేపు చౌమహల్లా ప్యాలెస్‌లో సూఫీ ఖవ్వాలి

చార్మినార్: వరల్డ్ మ్యూజిక్ డే సందర్భంగా ఈనెల 21న చౌమహల్లా ప్యాలెస్‌లో ఏక్ శామ్ ఖుస్రో కే నామ్.. అనే థీమ్ తో సూఫీ ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయం సంధ్యా కాలం పచ్చటి పచ్చిక బయళ్ల నడుమ చౌమహల్లా ప్యాలెస్ ప్రాంగణంలో వీనులవిందైన ఖవ్వాలి సాంస్కృతిక కార్యక్రమం జరుగనుంది. సూఫీ స్టైల్లో ఆధునిక సంప్రదాయ పద్ధతిలో ఈ ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అక్బర్ నిజామీ, గుస్తాన్ నిజామీ అనే ఇద్దరు సోదరులు పాల్గొని తమ ఖవ్వాలి పాటలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనున్నారు. సాయంత్రం ఏడు గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఎంట్రీ ఉచితమని చౌమహల్లా ప్యాలెస్ పీఆర్ఓ తెలిపారు.



## హెచ్ఐసీసీలో సీజన్స్ ఫ్యాషన్..

### 21వ తేదీ వరకూ నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నోవోటెల్ హైదరాబాద్ వేదికగా సీజన్స్ ఫ్యాషన్ స్పెషల్ ఎగ్జిబిషన్‌ను గురువారం ప్రారంభించారు. నోవోటెల్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఈ నెల 20, 21 వరకూ మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ డిజైనర్లు రూపొందించిన 350కు పైగా డిజైన్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సినీ నటి సీరత్ కపూర్, నటి స్రవంతి చోకరపు, అందలీజ్ జైదీ (మిస్ యూనివర్స్-మహారాష్ట్ర-2025) పలువురు మోడళ్లు ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాషన్ ఔత్సాహికులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



## 'స్కిల్ డెవలప్‌మెంట్'తో వెల్‌స్పన్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ సంస్థ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ)తో చేతులు కలిపింది. వస్త్రరంగంలో భారీ స్థాయిలో నైపుణ్యం ఉపాధి కల్పనకు చేయూతను అందించేందుకు గానూ పరిశ్రమకు, మానవ వనరులకు మధ్య ఉన్న నైపుణ్య అంతరాలను పరిష్కరించడానికి, ఉపాధిని పెంచడానికి తమ ఇరు సంస్థల భాగస్వామ్యం సహాయపడుతుందని ఈ సందర్భంగా వెల్‌స్పన్ ప్రతినిధులు ఓ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణ సమయంలో ప్రయాణం, స్టైఫండ్ సుమారు రూ.42,500 ఖర్చులను భరించేలా రూపొందిన ఈ కార్యక్రమానికి మొత్తం పెట్టుబడి రూ.4.25 కోట్లుగా వెల్లడించింది. తొలి దశలో 11వేల మందికి శిక్షణ అందిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## నచికేత తపోవన్.. 'పరోపకార' ప్రదర్శన

- అనాథ పిల్లల విద్య కోసం నిధుల సేకరణ
- తోట వైకుంఠం, జోగెన్ చౌదరి, శక్తి బర్మన్, ఆలే లక్ష్మణ్, రమేష్ గోర్జాల వంటి ప్రముఖ ఆర్టిస్టుల కళాకృతులు
- వినూత్న కళా సేవా కార్యక్రమానికి శ్రీకారం



సాక్షి, సిటీబ్యూరో: కళాకారుని సృజనాత్మకతకు మానవత్వం తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని.. అది అనాథ, నిరుపేద చిన్నారుల జీవితాల్లో వెలుగు నింపుతుందని పలువురు కళాకారులు నినదిస్తున్నారు. ఇందులో భాగంగా నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారుల విద్యకు సహకారం అందించడమే లక్ష్యంగా పరోపకార -2025 కళా ప్రదర్శన నిర్వహించనున్నారు. నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థ నచికేత తపోవన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల సమగ్ర విద్య, సాధికారత కోసం ప్రత్యేక నిధుల సేకరణ కళా కార్యక్రమంగా 'పరోపకార-2025' సగర్వంగా ఆవిష్కరిస్తున్నారు. కళ, లగ్జరీ రంగాల్లో వ్యాపారవేత్త అయిన సుష్మ తోట నిర్వహణలో నగరంలోని జూబ్లీహిల్స్ 'ది కులినరీ లౌంజ్' వేదికగా ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నారు.





### ప్రసిద్ధ కళాకారుల ప్రదర్శన..


ఉచిత విద్య, సామాజిక సేవ లక్ష్యంతో సుష్మ తోట సంకలనం చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమం.. కళను సమాజిక మార్పుకు నాంది పలికే విధంగా సరికొత్త లక్ష్యంతో మిళితం చేస్తుంది. ప్రఖ్యాత కళాకారులు తోట వైకుంఠం, జోగెన్ చౌదరి, శక్తి బర్మన్, ఆలే లక్ష్మణ్, రమేష్ గోర్జాల తదితరుల అద్భుతమైన కళాకృతులు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. అంతేకాకుండా ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందనున్న చిన్నారుల ఆధ్వర్యంలో కూడా హృదయాన్ని హత్తుకునే ప్రదర్శనలు ఉంటాయి. ఈ వేదికగా రెండు రోజుల ప్రదర్శనలో ప్రసిద్ధ కళాకారులతో సమావేశాలు, విద్యార్థులతో సంభాషణలు ఉంటాయి.



### ప్రతి రూపాయి చిన్నారుల చదువుకే..

నా పదేళ్ల అనుభవం.. నచికేత తపోవన్ కోసం ఈ పరోపకార- 2025 భారీ నిధుల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టేలా చేసింది. ఈ ఏడాది పరోపకార ఫండ్ రైజింగ్ ప్రధానంగా అనాథ, పేద, గిరిజన, మొదటి తరం విద్యార్థులకు ఉచిత విద్యపై దృష్టి సారిస్తోంది. పరోపకార 2025లో ప్రదర్శించే కళాఖండాల కొనుగోలు ద్వారా వచ్చే ప్రతి రూపాయి చిన్నారులు చదువుకోడానికి ఫీజులు, పుస్తకాలు, యూనిఫారమ్స్, ఆహారం అందించే నిధిగా వినియోగిస్తాం. కార్పొరేట్ సంస్థల కోసం ప్రత్యేకంగా ఎన్నో టీమ్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాలను రూపొందించిన అనుభవం ఉంది.. కానీ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలో ఉన్నటువంటి సంతృప్తి, సంతోషం మరెక్కడా లభించదు. విద్య, ఆరోగ్యం అనేవి ప్రతి ఒక్కరి హక్కు.. కలిసొచ్చే అదృష్టం కాదు.

– సుష్మ తోట, నిర్వాహకులు



## వినూత్నంగా 'వీ రీచ్'..

- మహిళా సాధికారతకు సరికొత్త కార్యక్రమం
- వీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- 120 మంది మహిళా వ్యాపారవేత్తల ఎంపిక
- గ్రామీణ మహిళలకు నగరంలో వ్యాపార నైపుణ్యాలపై శిక్షణ
- వీ రీచ్‌ను అభినందించిన కలెక్టర్ హరిచందన



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో ఉన్న వ్యాపార సామర్థ్యాన్ని వెలికితీయడం, దానిని ప్రోత్సహించడమే లక్ష్యంగా నగరంలోని 'వీ హబ్' (ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ హబ్) మరో సరికొత్త కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. ఇందులో భాగంగా వ్యాపారం నిర్వహించాలనుకునే మహిళల స్టార్టప్ ప్రయాణానికి దోహదపడే ప్రీ-ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ 'వీ రీచ్' గురువారం హబ్ వేదికగా అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హరిచందన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీ రీచ్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వ్యాపార ఔత్సాహికులైన మహిళలకు ఈ ఆధునిక వ్యవస్థకు అనుగుణంగా విభిన్న అంశాల్లో అవగాహన కల్పించనున్నారు. దీని కోసం రాష్ట్ర వ్యాప్తంగా టైర్-2, టైర్-3 ప్రాంతాల్లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ బూట్ క్యాంప్‌ల ద్వారా 120 మంది మహిళలను ఎంపిక చేసి పారిశ్రామికవేత్తలుగా రెండు బ్యాచ్‌లుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం వ్యాపార ఆలోచనకు అంకుర దశ నుంచీ వ్యాపారం స్థాపించే దశ వరకూ సమగ్ర మద్దతు అందించేందుకు రూపొందించారు. ఇందులో బిజినెస్ స్కిల్స్‌పై శిక్షణ, ఆర్థిక-డిజిటల్ లిటరసీ, మెంటార్‌షిప్, ఎక్స్‌పోజర్ విజిట్‌లు, ఎమ్ఎస్ఎమ్ఈ ఫార్మలైజేషన్‌కు అవసరమైన సహకారాన్ని అందించడం వంటి కార్యక్రమాలుంటాయి. వీటివల్ల మహిళలు తమ సొంత వ్యాపారాన్ని స్థాపించి దాన్ని స్థిరంగా అభివృద్ధి చేసుకునే అవకాశాలు పొందుతారు.

### దీర్ఘకాలిక మార్పుకు నాంది.. వీ రీచ్.



వీ రీచ్ కార్యక్రమ ప్రారంభోత్సవం సందర్భంగా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కలిగించడం, వారి సమగ్ర అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. 'వీ రీచ్' వంటి కార్యక్రమాలు మహిళలకు ఆర్థిక అవకాశాలు కల్పించడమే కాకుండా, సమాజంలో దీర్ఘకాలిక మార్పుని తీసుకురాగల సామర్థ్యం కలవని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇలాంటి సహకార కార్యక్రమాలు పెరగాల్సిన అవసరముందన్నారు. వీహబ్ సీఈఓ సీత పల్లచొల్ల మాట్లాడుతూ.. ఈ మూడు నెలల ప్రోగ్రాంలో వ్యాపార నైపుణ్యాలు పెంపొందించుకున్న మహిళలు అవసరమైన బిజినెస్ రిజిస్ట్రేషన్లు సమకూర్చుకొని తమ వ్యాపార యూనిట్లను లాంఛనప్రాయంగా ప్రారంభించి ఆర్థిక పరిపుష్టివైపు బాటలు వేస్తారని పేర్కొన్నారు. వీ హబ్ దేశంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన మొట్టమొదటి ఇంక్యుబేటర్, నోడల్ సంస్థ అని అన్నారు.

# టీవీలకు కనెక్ట్ అవుతున్నారు!



'ఓటీటీలో కొత్తగా ఏ సినిమాలు, వెబ్ సిరీస్ వచ్చాయో?'.. 'ఆ హీరో, హీరోయిన్ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నా'.. ఎవరి నోట విన్నా ఇప్పుడు ఇవే మాటలు. ఇంటర్నెట్‌తో పనిచేసే కనెక్టెడ్ టీవీ ఉంటే చాలు.. ఎంచక్కా ఇంట్లో కూర్చుని నచ్చిన సినిమాను, సిరీస్‌ను తమకు అనుకూలమైన సమయంలో ఆస్వాదిస్తున్నారు. ఈ కనెక్టెడ్ టీవీలు ఇప్పుడు పల్లెలకూ విస్తరిస్తున్నాయి. 2025 జనవరి-మార్చిలో కొత్తగా 3.5 కోట్ల కనెక్టెడ్ టీవీ వ్యూయర్లు పెరిగారని కాంటార్ మీడియా కంపాస్ నివేదిక వెల్లడించింది. ప్రతి నలుగురు భారతీయుల్లో ఒకరు ఇప్పుడు కంటెంట్ కోసం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడుతున్నారట. - సాక్షి, స్పెషల్ డెస్క్

ఇంటర్నెట్ విస్తృతి మనదేశంలో కేవలం స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగేందుకే పరిమితం కాలేదు. కనెక్టెడ్ టీవీల జోరుకూ దోహద పడుతోంది. దాంతో సంప్రదాయ టీవీ వీక్షణ నుంచి డిజిటల్ వైపు జనం మళ్లుతున్నారు. దేశవ్యాప్తంగా మూడు నెలల్లోనే కనెక్టెడ్ టీవీ వీక్షకులు కొత్తగా 3.5 కోట్ల మంది తోడవడమే దీనికున్న క్రేజుకు నిదర్శనం. యువ వీక్షకులు సంఖ్య అంతకంతకూ పెరుగుతుండడం, ఓవర్ ద టాప్ (ఓటీటీ) జోరు, టెలికం కంపెనీల చవక బ్రాడ్‌బ్యాండ్ ప్యాక్స్, స్మార్ట్ టీవీలు అందుబాటు ధరలో లభించడం.. వెరసి కనెక్టెడ్ టీవీల సంఖ్య దేశంలో దూసుకుపోతోంది.

### తీరిక సమయంలో చూసేస్తున్నారు

అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, ఆహా, జియో హాట్‌స్టార్ వంటి ఓటీటీ యాప్స్ ద్వారా ఆన్-డిమాండ్ కంటెంట్‌ను ఆస్వాదించేందుకు కనెక్టెడ్ టీవీ వీలు కల్పిస్తుంది. ఇంటర్నెట్ ఆధారిత కనెక్టెడ్ టీవీల్లో వీక్షకులు తమకు వీలున్న సమయంలో నచ్చిన కంటెంట్‌ను వీక్షించే సౌలభ్యం ఉంటుంది. భారత్‌లో పూర్తి డిజిటల్ టీవీ వీక్షకులు 23 శాతం ఉన్నారు. సంప్రదాయ టీవీకి వీరు దూరం. కేబుల్, ఉపగ్రహం, ఓవర్ ద ఎయిర్ సిగ్నల్స్ ద్వారా నిర్దిష్ట సమయం ప్రకారం ప్రసారమయ్యే కార్యక్రమాల వీక్షణకే సంప్రదాయ టీవీ పరిమితం అవుతుంది. 58% మంది భారతీయులు ఇప్పటికీ ప్రతి నెలా సంప్రదాయ టీవీ వీక్షణపై ఆధారపడుతున్నారు. పాత తరం జనాభాలో సంప్రదాయ టీవీకి ఇప్పటికీ ప్రజాదరణ కొనసాగుతోంది.

### ఏడాదిలో 30 శాతం జంప్

దేశంలో ఇంటర్నెట్‌తో పనిచేసే కనెక్టెడ్ టీవీల సంఖ్య 2024లో దాదాపు 3 కోట్లకు చేరింది. 2023 డిసెంబర్ నాటికి ఈ సంఖ్య 2.3 కోట్లు ఉందని భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ) - ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) మీడియా, వినోదరంగ నివేదిక - 2025 వెల్లడించింది. అంటే ఏడాదిలో కనెక్టెడ్ టీవీల సంఖ్య 30 శాతంపైగా పెరిగిందన్నమాట. ఎగువ మధ్య తరగతి, సంపన్న ప్రేక్షకులను కనెక్టెడ్ టీవీలు బాగా ఆకర్షిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 2024లో యాక్టివ్ స్మార్ట్ టీవీల సంఖ్య 27% పెరిగింది. సగటున నెలకు 40 గంటలకు పైగా కంటెంట్‌ను ఆస్వాదిస్తున్నారు. సంప్రదాయ టీవీ వీక్షకుల్లో స్త్రీ, పురుషుల సంఖ్య సమంగా ఉంటే.. డిజిటల్‌కు మాత్రమే పరిమితమైన వీక్షకులు, కనెక్టెడ్ టీవీ వ్యూయర్స్‌లో పురుషుల సంఖ్య 57 శాతంగా ఉంది.

**3 కోట్లకు చేరిన కనెక్టెడ్ టీవీల సంఖ్య**

- ఏడాదిలో **30** శాతం పెరిగిన వైనం
- కొత్తగా తోడైన **3.5** కోట్ల వీక్షకులు
- పూర్తి డిజిటల్ టీవీ వీక్షకులు **23%**
- డిజిటల్ కంటెంట్‌కు మళ్లుతున్న జనం

### యువతరం డిజిటల్‌కు..

మీడియా ప్రాధాన్యతలలో తరాలనుబట్టి అంతరం స్పష్టంగా కనిపిస్తోంది. 15-34 సంవత్సరాల వయస్సు గలవారిలో.. అంటే జనరేషన్ జెడ్ (13-28 ఏళ్ల మధ్య ఉన్నవారు), యంగ్ మిలీనియల్స్ (29-34 ఏళ్ల మధ్య ఉన్నవారు) డిజిటల్, ఓటీటీని 55%, సోషల్ మీడియాను 57% మంది ఇష్టపడుతున్నారు. 45 ఏళ్లకుపైగా వయసున్న వారిలో 44% మంది ఇంటర్నెట్ ఆధారిత ఇతర కార్యక్రమాల కంటే సంప్రదాయ టీవీ వీక్షణకే మొగ్గు చూపుతున్నారు. కుటుంబంతో కలిసి చూడగలిగే ఆరోగ్యకర షోలను లక్ష్యంగా చేసుకునే వీడియో స్ట్రీమింగ్ కంపెనీల కంటెంట్, మార్కెటింగ్ వ్యూహాలను పట్టణ ప్రాంతాల్లో కనెక్టెడ్ టీవీ సెట్ల పెరుగుదల ప్రభావితం చేస్తోంది.

### గ్రామీణ భారతం హవా

గ్రామీణ వాసులు సంప్రదాయ టీవీనే చూస్తున్నారనుకుంటే పొరపాటే. గ్రామీణ భారతం ఒక మీడియా పవర్‌హౌస్‌గా అవతరించింది. పాత అంచనాలను బద్దలు కొడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ వీక్షకులు 74%, సంప్రదాయ వీక్షకులు 75% ఉన్నారు. కనెక్టెడ్ టీవీ మెట్రోలకే పరిమితం కాలేదని.. పట్టణ, గ్రామీణ ప్రేక్షకులను సమానంగా చేరుకుంటోందని కాంటార్ నివేదిక స్పష్టం చేసింది. ఇక ప్రకటనల విషయానికొస్తే విభిన్న ప్రేక్షకులను వేర్వేరు సందేశాలతో చేరుకోవడానికి కనెక్టెడ్ టీవీ ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుందని వినోద పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సమేతంగా ఈ కనెక్టెడ్ టీవీలో సినిమాలూ, వెబ్ సిరీస్‌లూ చూడటం కూడా పెరిగింది. ముఖ్యంగా పండుగలు, సెలవు రోజుల్లో కనెక్టెడ్ టీవీ గ్రామీణ ప్రాంతాల్లోనూ వినోద కేంద్రంగా మారిందని వారు అంటున్నారు.

## గుడ్ల సరఫరా టెండర్లపై నిర్ణయం తీసుకోండి

### సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా నిమిత్తం జారీ చేసిన టెండర్లను వీలైనంత త్వరగా ఖరారు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. టెండరు కాలపరిమితిలో రెండున్నర నెలలు గడచిపోయినందున త్వరగా నిర్ణయం తీసుకుని ఖరారు చేయాలని చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా నిమిత్తం మార్చి 30న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం టెండర్లను ఖరారు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని సిరి ఫామ్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 10 చివరి తేదీ అని, తరువాత పలు దఫాలుగా పొడిగిస్తూ జూన్ 16ను నిర్ణయించిందన్నారు. మరోసారి దీన్ని పొడిగించకుండా టెండర్లను ఖరారు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ వివిధ పథకాల కింద ప్రభుత్వం గుడ్లను సేకరణ చేపడుతోందని, పారదర్శకంగా గుడ్ల సరఫరాకు ప్రత్యేక విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి టెండరు నోటిఫికేషన్‌పై దాఖలైన పిటిషన్‌ను అనుమతించలేమంటూ తేల్చి చెప్పారు. అయితే టెండరు కాలవ్యవధిలో ఇప్పటికే రెండున్నర నెలలు గడచిపోయినందున వీలైనంత త్వరగా చట్టప్రకారం ఖరారు చేయాలని సూచిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేశారు.

# బాండ్లు చూపి బాబును నిలదీయండి



**ఏపీ ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు**

**సూపర్ సిక్స్ సహా 143 హామీలు అమలు చేశానంటూ చంద్రబాబు పచ్చి అబద్ధాలు**

- ఆ అబద్ధాలు, మోసాలపై ఎవరైనా ప్రశ్నిస్తే నాలుక మందమంటూ దబాయింపు
- ఏడాది పాలనపై గొప్పలు చెప్పుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలను, కార్యకర్తలకు ఇంటింటికీ పంపిస్తాడట

**ఇన్నిన్ని అబద్ధాలు, మోసాలు చేస్తున్న ఈ పెద్దమనిషి ఇప్పుడు ప్రతి ఇంటికీ తన ఎమ్మెల్యేలను, తన పార్టీకి సంబంధించిన నాయకులను పంపిస్తాడట. అప్పుడు ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన మేనిఫెస్టోను, చంద్రబాబు ఇచ్చిన బాండ్లను అందరూ దగ్గర పెట్టుకుని చూపించండి. ఆ మేనిఫెస్టో ప్రకారం ఏడాదిగా మీకు రావాల్సిన సొమ్మును వడ్డీతో సహా చెల్లించాలని గట్టిగా డిమాండ్ చేస్తూ నిలదీయండి. మీ వద్ద ఆ మేనిఫెస్టో లేకపోతే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డౌన్‌లోడ్ చేసుకునేలా వైఎస్సార్‌సీపీ త్వరలో రిలీజ్ చేస్తుంది. దాన్ని దగ్గర పెట్టుకుని మీకు ఏమేం రావాలో చెబుతూ ప్రశ్నించండి. కనీసం వారికి అప్పుడైనా సిగ్గు వచ్చి అమలు చేస్తారేమో చూద్దాం.**

**రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామన్నారు. ఓటర్ల జాబితా ప్రకారం 18 ఏళ్లు నిండిన 2,10,58,615 మంది మహిళలు ఉన్నారు. వీళ్ల అడ్రస్‌లతో సహా వివరాలు ఎన్నికల సంఘం దగ్గర ఉన్నాయి. ఇందులో 60 ఏళ్లు నిండిన వాళ్లను తీసేస్తే.. 1.80 కోట్ల మంది మహిళలు ఉంటారు. వీళ్లందరిలో ఎంత మందికి ఏడాదికి రూ.18 వేలు చొప్పున ఇచ్చారు? తొలి ఏడాది ఎగ్గొట్టాక.. ఇప్పుడు పీ-4 జపం చేస్తున్నాడు. నువ్వు ఇవ్వాల్సింది పోయి ఎవరో శ్రీమంతులతో ఒకరికో ఇద్దరికో ఇప్పిస్తానని డ్రామాలు చేయడానికి సిగ్గులేదా?**

సాక్షి, అమరావతి: 'ఎన్నికల్లో సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ చంద్రబాబు చేసిన వాగ్దానాలను కనీసం రిబ్బన్ కూడా కత్తిరించకుండానే.. మొత్తం హామీలు అమలు చేసేశానని చెబుతున్నాడు. అబ్రకదబ్ర.. ఛూమంతర్ అంటూ.. సూపర్ సిక్స్, సూపర్ సెవన్ సహా 143 హామీలు అమలు చేసేశానని ఊదరగొడుతున్నాడు' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్, సూపర్ సెవన్‌పై ఎవరైనా ప్రశ్నిస్తే నాలుక మందం అంటూ ముందే బెదిరిస్తున్నాడంటూ ఎత్తి చూపారు. ఎల్లో మీడియా, సోషల్ మీడియా కూడా చంద్రబాబు చెబుతున్న పచ్చి అబద్ధాలను.. నిజాలుగా నమ్మించేలా ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని అబద్ధాలు చెప్పి, మోసం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు ఏడాదిగా తాను ఏం చేశానన్నది చెప్పేందుకు ఇంటింటికీ తన ఎమ్మెల్యేలు, నాయకులను పంపుతానంటున్నాడని దుయ్యబట్టారు. 'ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టోను, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో టీడీపీ నాయకులు ఎన్నికలకు ముందు మీకు ఇచ్చిన బాండ్లను దగ్గర పెట్టుకుండి.. వాటిని చూపి ప్రభుత్వం మీకు ఎంత బాకీ ఉందో వడ్డీతో సహా చెల్లించాలని నిలదీయండి' అని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రీకాలింగ్ ఆఫ్ చంద్రబాబు మేనిఫెస్టో..' అంటే చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెచ్చుకుందాం' అంటూ వైఎస్సార్‌సీపీ దాన్ని మీకు అందుబాటులోకి తెస్తుందని.. దాని కోసం మీరు క్యూఆర్ కోడ్ వినియోగిస్తే చాలు డౌన్‌లోడ్ అవుతుందని ప్రజలకు సూచించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవన్ సహా అన్ని హామీలు 2024 జూన్ నుంచి అమలు అవుతాయని.. మీ ఖాతాలో డబ్బులు జమ అవుతుందని చంద్రబాబు త్రికరణ శుద్ధిగా ప్రమాణం చేసి చెబుతూ మీకు ఇచ్చిన బాండ్లను.. మీ ఇంటికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాగానే చూపి.. అవి తమకు ఎప్పుడిస్తారని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం సిగ్గు తెచ్చుకుని హామీలను అమలు చేస్తుందేమో చూద్దామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే.. మీ తరఫున మీతో కలిసి పోరాడటానికి వైఎస్సార్‌సీపీ, తాను సిద్ధమని స్పష్టం చేశారు. హామీలు అమలు చేయాలంటూ కలెక్టరేట్‌లను ముట్టడించే కార్యక్రమానికి ప్రణాళిక రచిద్దామని ప్రజలను చైతన్య పరిచారు. మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

### ఉన్న పథకాలను భ్రష్టు పట్టించారు

- ఒకవైపున ఉన్న పథకాన్ని భ్రష్టు పట్టించారు. అప్పట్లో ప్రతి తల్లికి అమ్మ ఒడి పేరుతో సాయం అందించి, పిల్లలను బడులకు పంపించేలా ప్రోత్సహించాం. 43 లక్షల మంది తల్లులకు అమ్మ ఒడి ఇచ్చి 83-84 లక్షల మంది పిల్లలను బడుల బాట పట్టించాం. ఇప్పుడు నిబద్ధత లేకుండా మోటివేషన్ కార్యక్రమాలను భ్రష్టు పట్టిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ విద్యా రంగాన్ని దెబ్బ తీసి, మా ప్రభుత్వంలో తీసుకొచ్చిన సంస్కరణలు నాశనం చేశాడు.
- మా ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఇంగ్లిష్ మీడియం బడులు, 3వ తరగతి నుంచి టోఫెల్ చెప్పే పీరియడ్లు పోయాయి. సబ్జెక్టు టీచర్ విధానం, రోజుకొక రుచికరమైన మెనూ, చిక్కీతో సహా ఇచ్చే గోరుముద్ద పోయింది. నాడు-నేడు పనులు ఆగిపోయాయి. ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్సీ, అక్కడి నుంచి ఐబీ వరకు ప్రయాణం నిలిచిపోయింది. పిల్లల చేతుల్లో ట్యాబులు కనిపించేవి. ఇప్పుడు అవీ లేవు. తొలిసారిగా మా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బడులు ప్రైవేటు బడుల కంటే మెరుగైనవిగా నిలిచాయి. స్కూళ్లలో నో వేకెన్సీ బోర్డులు కనిపించేవి. విద్యా రంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారు. చివరికి పదో తరగతి పరీక్షల పేపర్లు సక్రమంగా దిద్దలేని అధ్వాన పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోంది.
- మా ప్రభుత్వ హయాంలో పెద్ద చదువులు చదువుతున్న పిల్లలకు ప్రతి త్రైమాసికం ముగిసిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చే వాళ్లం. ప్రతి ఏప్రిల్‌లో వసతి దీవెన అందించేవాళ్లం. ఇదంతా క్రమం తప్పకుండా జరిగేది. చంద్రబాబు సీఎం అయినప్పటి నుంచి ఈ జూన్ దాటితే ఆరు త్రైమాసికాలు బకాయిలు పెట్టారు. ఎన్నికల కోడ్‌తో పెండింగ్ పడినప్పటి నుంచి ఆరు త్రైమాసికాలు రూ.4,200 కోట్లు, ఏప్రిల్ (2024)లో ఇవ్వాల్సిన వసతి దీవెన రూ.1100 కోట్లు, ఈ ఏడాదికి మరో రూ.1,100 కోట్లు మొత్తం రూ.2,200 కోట్లు వెరసి రూ.6,400 కోట్లు చెల్లించాల్సి ఉంటే.. ఇచ్చింది కేవలం రూ.750 కోట్లు మాత్రమే.
- ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించాం. ఆరోగ్యశ్రీ ప్రొసీజర్స్‌ను వెయ్యి నుంచి 3,300కు పెంచి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని, మల్టీ స్పెషాలిటీ వైద్యాన్ని దరి చేర్చాం. మధ్య తరగతి ప్రజలు అప్పుల పాలవ్వాల్సిన పరిస్థితి లేకుండా వార్షిక ఆదాయం రూ.5 లక్షలు ఉన్నప్పటికీ ఆరోగ్యశ్రీని వర్తింపజేశాం. నెలకు ఆరోగ్యశ్రీ కింద రూ.300 కోట్లు ఖర్చు అవుతుంది. అయితే, చంద్రబాబు వచ్చిన ఏడాదిలో రూ.3,600 కోట్లు పెండింగ్ పెట్టేశారు. ఆరోగ్య ఆసరా కింద పేషెంట్ ఆపరేషన్ అనంతరం విశ్రాంతి తీసుకునే సమయంలో నెలకు రూ.5 వేలు ఇచ్చే వాళ్లం. దీనికి మరో రూ.400 కోట్లు అవుతుంది. ఇలా.. చంద్రబాబు ఏడాదిలో రూ.4 వేల కోట్లు పూర్తిగా ఎగ్గొట్టేశారు. నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్యం చేయలేక చేతులు ఎత్తేశాయి. ఇప్పుడు పేదలకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్లే పరిస్థితి లేదు. ఇవన్నీ ఇవ్వకుండానే చంద్రబాబు.. అబ్రక దబ్రా అంటూ మాయ చేస్తున్నాడు. గట్టిగా అడిగితే నాలుక మందం అంటూ బెదిరిస్తున్నాడు.

### బాబు బాదుడే బాదుడు..

చంద్రబాబు నిజంగా కొన్ని చేశారు. ఏడాదిలో రూ.15 వేల కోట్లు కరెంటు చార్జీలు బాదాడు. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను చంపేసి తద్వారా ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో ఫీజులు పెంచి పేదలను బాదేశాడు. అన్ని పన్నులు పెంచడంతో ఇంటి అద్దెల బాదుడు.. హెరిటేజ్ కోసం అమూల్‌ను చంపేసి పాలరేట్ల బాదుడు.. ఇంటింటికీ రేషన్ అందించే వాహనాలు తీసేసి.. సబ్సిడీకే కందిపప్పు ఇచ్చే కార్యక్రమం మానేశాడు. ఫలితంగా పప్పుల ధరలు పెరగడంతో.. రకరకాలుగా బాదుడే బాదుడు కార్యక్రమాన్ని మొదలెట్టాడు. చంద్రబాబు దెబ్బకు పంటలకు ధరలు లేక రైతులు అల్లాడిపోతుంటే.. నిత్యావసరాల ధరలు, జీవన వ్యయం పెరిగి ప్రజలు కిందాపైనా పడుతున్నారు. ఏడాదిలో కొత్త ఉద్యోగాలు ఇవ్వడం దేవుడెరుగు.. ఏకంగా 3 లక్షలకుపైగా ఉద్యోగాలు తీసేశాడు. 2.60 లక్షల మంది వలంటీర్లు, 20 వేల మంది రేషన్ వాహనాల ఆపరేటర్లు, హెల్పర్ల ఉద్యోగాలు ఉష్ కాకి! బెవరేజస్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న 15 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు పోయాయి.

**జగన్ కంటే ఎక్కువ ఇస్తానని మోసం చేస్తావా?**

చంద్రబాబు ఎన్నికలకు ముందు జగన్ చేస్తున్నవే కాకుండా అంత కంటే ఎక్కువ చేస్తామన్నారు. 'మీకు ఒక్కటే హామీ ఇస్తున్నా.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ఏవీ ఆగిపోవు. ఇంకా మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చి మిమ్మల్ని ముందుకు తీసుకెళ్తామని హామీ ఇస్తున్నాను'' అంటూ 2024 ఏప్రిల్ 11న చంద్రబాబు హామీ ఇచ్చారు (చంద్రబాబు మాట్లాడిన వీడియోను ప్రదర్శించి చూపారు). ఇప్పుడు వాటన్నింటినీ అమలు చేసేశానని చెబుతున్నాడు.

**నిరుద్యోగ భృతి ఎంతమందికి ఇచ్చారు?**

నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు నిరుద్యోగ భృతిగా ఇస్తామన్నారు. ఎంత మందికి ఇచ్చారు? రాష్ట్రంలో ఉపాధి లేని వారు 1.56 కోట్ల మంది ఉన్నారని టీడీపీ అఫీషియల్ గెజిట్ 'ఈనాడు'లో 2025 ఏప్రిల్ 17న కథనాన్ని ప్రచురించారు. కోటిన్నరకు పైగా ఉపాధి లేని యువత ఉంటే.. వారికి ఒక్కపైసా కూడా ఇవ్వకుండా అన్నీ చేసేశానని చెప్పడం మోసం కాదా?

**ఆడబిడ్డ నిధి ఎగ్గొట్టారు.. దీపం పథకం బోగస్**

18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని ఎగ్గొట్టలేదా? దీపం, ఉచిత బస్సు అనేవి చిన్న పనులు. కేంద్ర గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 1.59 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీళ్లందరికీ ఉచిత గ్యాస్ ఇవ్వాలి అంటే సిలిండర్‌కు రూ.877 చొప్పున మూడు సిలిండర్లకు రూ.4,109 కోట్లు ఖర్చు అవుతుంది. తొలి ఏడాది బడ్జెట్ కేటాయింపు రూ.865 కోట్లు మాత్రమే. మిగిలిన రూ.3,244 కోట్లు ఇవ్వకుండా మోసం చేయలేదా? అక్కడా మళ్లీ మోసమే.. కనీసం ఒక్క సిలిండర్కైనా పూర్తిగా ఇవ్వాలంటే రూ.1,370 కోట్లు అవుతుంది. అలాంటిది రూ.865 కోట్లే ఇచ్చారు. ఒక్క సిలిండర్‌ను కూడా సరిగా ఇవ్వలేదు. దీపం పథకం బోగస్!

**ఉచిత బస్సు కోసం ఎదురు చూపులే..**

మహిళలకు ఉచిత బస్సు అన్నింటి కంటే చాలా సులభం. నెలకు రూ.275 కోట్లు ఆర్టీసీ వాళ్లకు ఇస్తే ఏడాదికి రూ.3 వేల కోట్లతో పథకం అమలవుతుంది. మా కడపలో మహిళలు విశాఖపట్నం వెళ్లి చూసి రావచ్చని ఉచిత బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. పండుగ పేర్లు మారిపోతున్నాయి తప్ప బస్సు రావట్లేదు. గతేడాది ఉగాది నుంచి ఈ ఏడాది ఉగాది వరకు పండుగలు వెళ్లిపోతే.. ఇప్పుడు ఆగస్టు 15 అంటున్నాడు. ఉచిత బస్సు అమలుకు అధ్యయనంతో పనేం ముంది? ఆర్టీసీకి డబ్బులు ఇస్తే సరిపోతుంది కదా? అప్పుడు కడప వాళ్లు విశాఖ వెళ్తారు.. అనంతపురం వాళ్లు అమరావతి చూసుకోవడానికి విజయవాడకు వస్తారు. దుర్గమ్మ దర్శనం చేసుకుని వెళ్తారు. ఇంకేమైనా పర్యాటక ప్రాంతాలకు వెళ్లి ఇటు రాయలసీమ వాళ్లు, అటు ఉత్తరాంధ్ర వాళ్లు కొంచెం సేద తీరుతారు.

**50 ఏళ్లకే పెన్షన్.. ఎగనామమే..**

50 ఏళ్లకే పెన్షన్ అన్నారు. రాష్ట్రంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలు 20 లక్షల మంది ఉన్నారు. నెలకు రూ.4 వేలు చొప్పున ఏడాదికి రూ.9,600 కోట్లు అవుతుంది. తొలి ఏడాది ఎగ్గొట్టారు. రెండో ఏడాది కూడా ఎగ్గొడుతున్నారు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్నవి పీకేశారు. చంద్రబాబు ఎన్నికలకు వెళ్లే నాటికి మార్చిలో 66,34,742 పింఛన్లు ఉంటే.. ఈ నెలలో ఇచ్చింది 61.48 లక్షల మందికి మాత్రమే. సంవత్సరం తిరిగే లోగా 5 లక్షల పింఛన్లు తగ్గించేశారు. వీటికి అదనంగా 50 ఏళ్లు నిండిన వాళ్లకు పింఛన్లు ఇస్తామని ఎన్నికల్లో చెప్పి మహిళలను మోసం చేశారు.

**రైతులకు 20 వేలు అని చెప్పి.. మోసం**

ప్రధాన మంత్రి పీఎం కిసాన్ పథకంతో సంబంధం లేకుండా ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. మడమ తిప్పను.. మాట తప్పను అన్నావు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తుంది కాబట్టి నేను రూ.6,500 ఇస్తానని చెప్పావు. ఇది ఆ రోజు ఎందుకు చెప్పలేదు? మేము సంవత్సరానికి ఇప్పుడిచ్చేది కాకుండా రూ.20 వేలు ఇచ్చేలా తెలుగుదేశం పార్టీలో నిర్ణయం చేశామని చంద్రబాబు చెప్పాడు. (చంద్రబాబు మాట్లాడిన ప్రసంగం వీడియోను ప్రదర్శించారు). కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు అదనంగా రూ.20 వేలు ఇస్తానని ఊదరగొట్టి ఏడాదిలో ఒక్కపైసా ఇవ్వలేదు.

**తల్లికి వందనానికి షరతులు పెట్టమని చెప్పి..**

తల్లికి వందనం పేరిట తల్లులను వంచన చేస్తున్నారు. ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్నాడు. ఈ పథకానికి ఎలాంటి షరతులు పెట్టబోమని ఎన్నికల్లో పదేపదే చెప్పారు. 'ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికీ రూ.15 వేలు.. ఆంక్షలు లేవు.. కటింగ్ లేదు.. పూర్తిగా ఇచ్చే బాధ్యత మాది అన్నారు (చంద్రబాబు ఈ మేరకు మాట్లాడిన వీడియో ప్రదర్శించారు). కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్ యూడైస్ డేటా ప్రకారం రాష్ట్రంలో 2023-24లో 87,41,885 మంది విద్యార్థులు ఉన్నారు. మరి 87.41 లక్షల మంది పిల్లలకు రూ.15 వేల చొప్పున రూ.13,111 కోట్లు ఇవ్వాలి. ఇస్తామంటోంది కేవలం రూ.8,700 కోట్లు. అందరికీ ఇచ్చిన తర్వాత గాని తెలియదు ఎంత మందికి ఇచ్చారో.. ఎంత మందికి ఎగనామం పెట్టారో. ఈ లెక్కలు చూసినా 30 లక్షల మందికి కోత పెట్టారు. మేము గట్టిగా నిలదీస్తే రూ.15 వేలు కాదు రూ.13 వేలే ఇచ్చేది.. అందులో 67 లక్షల మందికి ఇస్తున్నామని ప్లేటు ఫిరాయించారు. మళ్లీ 67 లక్షల్లో ప్రస్తుతానికి 54 లక్షల మందికే ఇస్తున్నామంటున్నాడు. ఎన్నికలప్పుడు చెప్పిన నీకు రూ.15 వేలు..నీకు రూ.15 వేలు..నీకు రూ.15 వేలు పోయింది. ఇప్పుడు కొందరికి మాత్రమే రూ.13 వేలు అని తేలింది. ఇది మోసం కాదా చంద్రబాబూ? ప్రశ్నిస్తే నాలుక మందమంటావా?

**ఉద్యోగులకు రూ.20 వేల కోట్ల బకాయి**

ప్రభుత్వ ఉద్యోగస్తులకు మేలు జరిగిందా అంటే అదీ లేదు. వస్తూనే ఐఆర్ ఇస్తానన్నాడు. అదీ పాయే. ఉన్న పీఆర్సీని రద్దు చేశాడు. కొత్త పీఆర్సీ వేయలేదు. కొత్త పీఆర్సీ వస్తే జీతాలు పెంచాల్సి వస్తుందని సాగదీస్తూ వస్తున్నాడు. ఇప్పటికే మూడు డీఏలు పెండింగ్ పెట్టాడు. జూలై 1వ తేదీ వస్తే నాల్గో డీఏ పెండింగ్. వైఎస్సార్‌సీపీ హయాంలో తీసుకొచ్చిన గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్‌ను తీసేసి ఓపీఎస్ తీసుకొస్తా అన్నాడు. ఆ విషయంలోనూ వెన్నుపోటు పొడిచాడు. ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన బకాయిలే రూ.20 వేల కోట్లకు పైగా ఉన్నాయి. ఎవరైనా అడిగితే తోకలు కత్తిరిస్తా.. భూ స్థాపితం చేస్తా అంటున్నాడు. ప్రజలకు తానిచ్చిన వాగ్దానాలను ఎగవేయడానికి మాత్రం ఆయన, ఆయన ఎల్లో మీడియా రకరకాల స్కెచ్‌లు వేస్తున్నారు.

## మళ్లీ పొడిగింపు..

### అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరాకు టెండర్లు వేసేందుకు ఈ నెల 30 వరకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టు ఎంపిక ప్రక్రియ మళ్లీ వాయిదా పడింది. ఈనెల 30వ తేదీ వరకు టెండరు దరఖాస్తు సమర్పించేందుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సవరణ నోటిఫికేషన్‌ను వెబ్‌సైట్‌లో ప్రవేశపెట్టింది. 2025-26 వార్షిక సంవత్సరంలో ఏడాది పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కోసం ఈ ఏడాది మార్చి 30న టెండర్లు పిలిచారు. అప్పట్నుంచీ వివిధ కారణాలతో పలుమార్లు గడువును పొడిగించారు. అయితే టెండర్లు తెరిచే తేదీని ప్రకటించకపోవడాన్ని పౌల్ట్రీ రైతులు తప్పుబడుతున్నారు. మళ్లీ గడువును పొడిగించే పరిస్థితి కనిపిస్తోందని విమర్శిస్తున్నారు.

## వారు విస్మరించారు.. మేము తీర్చిదిద్దుతున్నాం

- వాసాలమర్రి గ్రామాన్ని కేసీఆర్ దత్తత తీసుకుని ఆగం చేశారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వాసాలమర్రి గ్రామంలో ఆకుల ఆగవ్వకు ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**తుర్కపల్లి:** దేశానికి మార్గదర్శకుడిని అని చెప్పుకుంటున్న కేసీఆర్.. ఆయన దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని, గ్రామాన్ని ఆగం చేశారని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో గురువారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం విస్మరించారని అన్నారు. కానీ తమ ప్రభుత్వం వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతుందని ఈ నెల 6న తిర్మాలపురంలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఆ మేరకు మొదటగా ఇందిరమ్మ గృహాలు నిర్మించాలని నిర్ణయించి, 205 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్నామని చెప్పారు. వాసాలమర్రి గ్రామంలో కేసీఆర్ అప్పట్లో సహపంక్తి భోజనాలు చేసి.. గ్రామస్తురాలు ఆకుల ఆగవ్వకు ఎన్నో హామీలు ఇచ్చారని, అయితే వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. తాము ఆకుల ఆగవ్వ చెప్పింది విన్నామని, వాసాలమర్రిని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీ తప్పులు ఎత్తిచూపితే భూస్థాపితం చేస్తారా?

**సీఎం స్థాయిలో ఉన్న 76 ఏళ్లున్న వ్యక్తి అనాల్సిన మాటలేనా ఇవి?**

**సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆగ్రహం**

**ఏడాదికే చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత**

- 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన విశేష స్పందనే ఇందుకు నిదర్శనం.. ప్రజల దృష్టి మళ్లించడానికే తప్పుడు వాంగ్మూలాలతో అక్రమ కేసులు
- కొమ్మినేని కేసులో సుప్రీంకోర్టు చంద్రబాబు చెంప చెళ్లుమనిపించేలా తీర్పునిచ్చింది.. అదే కేసులో సాక్షి కార్యాలయాలన్నింటిపై దాడికి చంద్రబాబు బాధ్యుడు కాదా?

## ఇది ప్రజాస్వామ్యమేనా?

**సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం**

- మా పార్టీ వాళ్ల ఇంటికి నేను వెళ్లడం తప్పా?
- కర్ఫ్యూ వాతావరణం తీసుకురావడం తప్పు కాదా?
- శాంతి భద్రతల సమస్య ఎవరు సృష్టిస్తున్నారు?
- అబద్ధాలు, మోసాలతో అందరి ఉసురు పోసుకుంటున్నావ్
- కాబట్టే నీ ముఖం చూడటానికి ఎవరూ రావడం లేదు
- చెప్పిన మాట నిలబెట్టుకుని.. అందరికీ మేం మంచి చేశాం.. అందుకే అందరికీ మా పార్టీ మీద ప్రేమ ఎక్కువై వస్తున్నారు
- వాళ్లకు లేని బాధ నీకెందుకు?
- పుష్ప సినిమా డైలాగ్‌లు పెట్టినా తప్పేనా?

వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 20-6-2025

ఫ్యాషన్



గాజులది ఆభరణాలను మించిన స్థాయి.
సంప్రదాయం, వేడుక ఏదైనా మణికట్టు చుట్టూ మెరిసే వ్యక్తిగత శైలి.
వివాహిత మహిళలకు గాజులలో శ్రేయస్సు, ప్రేమ మెండుగా కలిసి ఉంటాయి.
అందుకే, పాత మట్టి గాజులైనా వాటి స్థానాన్ని వీడి పోవు.
ఆధునిక మహిళ ఆ గాజులను కొత్త అల్లికలు, రంగులు, శైలులతో మణికట్టును కనికట్టు చేస్తోంది.
వేడుకల కోసం రకరకాల ఆభరణాలతో వార్డ్‌రోబ్‌ను కొంగొత్తగా నిర్మిస్తున్నా
రాబోయే పండుగ రోజుల్లో చేతుల లుక్‌ను పెంచుకోవాలనుకునే వారికి
సేకరణలో పూర్తిగా చోటు సంపాదించడానికి కావల్సినన్ని జతల గాజులు దొంతర్లుగా సిద్ధంగా ఉన్నాయి.
వాటిలో ట్రెండ్‌లో ఉన్న ముఖ్యమైన ఐదు రకాలు
గాజుల పెట్టెలో తప్పక ఉండాల్సిందే!

# మణికట్టు... కనికట్టు









**ప్రతిరోజు గ్లామర్ ... మినిమలిస్ట్ గోల్డ్ కడా బ్యాంగిల్**

బంగారు కడా గాజులు నిన్నటి తరం తప్పని ఆభరణం. బరువైన, చంకీ కడాలు ఇప్పుడు అందరికీ నచ్చడం లేదు. కొత్త తరం వెర్షన్ సొగసైనది, తేలికగా ఉండేది కోరుకుంటుంది. ఆధునిక టచ్‌తో కూడిన సాధారణ, లైట్‌వెయిట్ బంగారు కడాలను ఎంపిక చేసుకోవచ్చు. అల్లికలు, చివరలు ఓపెన్‌గా ఉండేవి, ఒకటి లేదా రెండు రేఖాగణిత నమూనాలు ఉన్నవి.. రోజువారీ దుస్తులకు సరైనవి. పూజల నుండి సంప్రదాయ శైలి వరకు కొన్ని సన్నని గాజులు, బోల్డ్ సింగల్ కడా ధరిస్తే రెండు విధాలుగా ఆకట్టుకుంటుంది. రిచ్ లుక్ కోసం ఒక మందపాటి కడాను రెండు సున్నితమైన బంగారు గాజులతో జత చేయవచ్చు. ఫ్యామిలీ ఈవెంట్స్, కార్యాలయ పూజలు, రోజువారీ సల్వార్ సూట్‌కు కూడా ఇవి బాగుంటాయి.

**పోల్కీ గాజులు - భారతీయ వివాహానికి తప్పనిసరి**

బాలీవుడ్ వధువుల ఎంపికతో పోల్కీ బ్యాంగిల్స్ తిరిగి వచ్చాయి. గతంలో కంటే మరింత పెద్ద స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయి. అన్‌కట్ డైమండ్స్‌తో హెరిటేజ్ ఆకర్షణతో కూడిన ఈ గాజులు రాచకళను సృష్టిస్తున్నాయి. వివాహ వేడుకలకు ఇవి ప్రత్యేకం అని చెప్పవచ్చు. వేడుకలో ఎంచుకున్న డ్రెస్‌కు తగిన కలర్, డిజైన్‌ను బట్టి గాజుల తయారీ ఉంటుంది. ఇవి ఎప్పటికీ ఎవర్‌గ్రీన్ సెట్స్ అని చెప్పవచ్చు. వారసత్వ సంపదకు అర్థమైనవి. ఏదైనా పండుగ దుస్తులకు తక్షణ గ్లామ్‌ను జోడిస్తాయి. పోల్కీ గాజులను మెరిసేలా అలంకరించాలి. దీనికి కాంబినేషన్‌గా పోల్కీ చోకర్, చెవిపోగులతో జత చేయచ్చు. వివాహాలు, కర్వా చౌత్, యానివర్సరీ పార్టీలు, రాణిలా భావించాలనుకునే ఏదైనా కార్యక్రమంలో ఈ పోల్కీ గాజులను ధరించవచ్చు.

**మీనాకారీ గాజులు - రంగుల ఆనందం**

రంగుల రంగులతో ఉండే గాజులను ఎవ్వరైనా ఇష్టపడతారు. మీనాకారీ గాజుల ప్రకాశవంతమైన ఎనామిల్ వర్క్, అద్భుతమైన డిజైన్‌లకు పేరొందాయి. పూల నుండి నెమళ్ల వరకు ఇవి సంస్కృతి, రంగుల పరిపూర్ణ మిశ్రమం. దుస్తుల రంగులకు తగినవి ఎంపిక చేసుకోవాలంటే మీనాకారీ గాజులు సరైన ఎంపిక. పండుగలు, వేడుకలలో అలంకరణ బోరింగ్‌గా ఉండకుండా ఇవి సంప్రదాయ శక్తిని తెస్తాయి. లెహంగా లేదా చీర బార్డర్ కి సరిపోయే రంగు గాజులను ఎంచుకోవచ్చు. బోనాలు, నవరాత్రి, దీపావళి, తీజ్, హల్దీ ఫంక్షన్ల సమయాల్లో ధరించే దుస్తులకు ఈ గాజులు అదనపు ఆకర్షణను తెస్తాయి. వీటిలో వేడుకను బట్టి, ఫొటో బ్యాంగిల్స్ జత చేయడం మరో ఆకర్షణ.

**స్టేట్‌మెంట్ కఫ్ బ్యాంగిల్స్ - ఆధునిక శైలి**

ప్రతి గాజూ సంప్రదాయకంగా ఉండనవసరం లేదు. మీదైన స్టైల్ స్టేట్‌మెంట్ చూపించాలనుకున్నప్పుడు కఫ్ బ్యాంగిల్స్ సరైనవి. వీటిలో ముత్యాలు, స్టోన్స్, ఎనామెల్ లేదా వెడల్పుగా మెటల్ కఫ్‌లను ఎంచుకోవచ్చు. ఇండో-వెస్ట్రన్ శైలికి ఇవి మీకు అనుకూలంగా ఉంటాయి. స్పెషల్‌గా, సాధారణ దుస్తులను కూడా ఫ్యాషన్-ఫార్వర్డ్‌గా కనిపించేలా ఈ కఫ్ బ్యాంగిల్స్ చేస్తాయి. మణికట్టు మీద చంకీ కఫ్ ధరించి, మరొకటి సాధారణమైనది వేసుకోవాలి. ఇది స్టైల్‌ను బ్యాలెన్స్ చేస్తుంది. స్టేట్‌మెంట్ పీస్‌గా మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది. కాక్‌టెయిల్ పార్టీలు, ఫ్యూజన్ దుస్తులు లేదా మీరు మీ స్టైల్ గేమ్‌ను ప్రదర్శించాలనుకునే ఆఫీస్ గ్యాదరింగ్స్ కూడా ఈ కఫ్ బ్యాంగిల్స్ సరైన ఎంపిక.

ట్రెండ్స్ మారుతాయి. కానీ గాజులు ఎప్పటికీ ఉంటాయి. వివాహ జ్ఞాపకాలలో, పండుగలలో, రోజువారీ ఆచారాలలో, వ్యక్తిగత ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌లో కూడా భాగంగా నిలుస్తాయి. చక్కగా అలంకరించిన గాజుల చేతులు అద్భుతంగా కనిపించడమే కాదు, అవి మీదైన ప్రత్యేకతను ఎదుటివారికి పరిచయం చేస్తాయి. ఇక ఇప్పుడు మీరు గాజులు ధరించడానికి వివాహిత మహిళ మాత్రమే కాదు, నేటి అభివృద్ధిలో వెలిగే ఒక స్టైల్ ఐకాన్ కూడా!

---

# ఆర్ట్ విత్ హార్ట్

**సృజన, సేవ రెండూ కలిస్తే సుష్మ తోట!**

ఒకదానికొకటి ఉపయోగపడాలని నమ్ముతారు ఈ హాబీ ఆర్టిస్ట్! అందుకే పేద, అనాథ పిల్లలకు చదువుచెబుతున్న నచికేత తపోవన్ స్కూల్ కోసం ఈ రోజు హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని కలినరీ లాంజ్‌లో 'పరోపకార్' పేరుతో రెండు రోజుల ఫండ్ రైజింగ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించబోతున్నారు ఆమె. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ఈ ఎగ్జిబిషన్ గురించి చెప్పే ముందు నచికేత తపోవన్ స్కూల్ గురించి చెప్పాలి. ఇది హైదరాబాద్‌లోని కావూరి హిల్స్‌లో 1999లో స్టార్ట్ అయింది. పేద,అనాథ పిల్లలకు ఉచితంగా చదువు చెబుతుంది. పదవ తరగతి వరకు చెప్పించి తమ బాధ్యత అయిపోయిందని అనుకోరు స్కూల్ నిర్వాహకులు. పై చదువులకూ సాయం చేస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ పిల్లలు జీవితంలో స్థిరపడే వరకు వీళ్లు గైడెన్స్ ఇస్తారు. తెలంగాణలోని జడ్చర్లలోనూ ఈ స్కూల్‌కి ఒక బ్రాంచ్ ఉంది. ఈ రెండిట్లో కలిపి మొత్తం 650 మంది స్టూడెంట్స్ ఉంటారు. ఈ స్కూల్లో చదివి, ఉన్నత హోదాల్లో స్థిరపడిన విద్యార్థులు వందల్లో ఉన్నారు. వాళ్లంతా మోటివేషన్, ఫండ్ రైజింగ్, వలంటీరింగ్ వంటివాటితో ఈ స్కూల్‌తో తమ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. విలువలతో కూడిన చదువే ఈ బడి కరిక్యులమ్. అందుకే దీన్ని బడిగా కాదు లైఫ్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఆర్గనైజేషన్‌గా చూస్తాన్నేను.

**పరోపకార్ ఆర్ట్ ఎగ్జిబిషన్**

ఈ స్కూల్ నిర్వహణకు ఫండ్స్ అవసరమవుతుంటాయి. అందుకే ఆరేళ్లుగా 'పరోపకార్' పేరిట ఫండ్ రైజింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఇది ఏడవ సంవత్సరం. అయితే ఇంతకుముందంతా తెలిసిన వాళ్లనే పిలుస్తూ వచ్చాం. దీనివల్ల కొత్తవాళ్లకు ఈ స్కూల్ గురించి తెలిసే అవకాశం లేకుండాపోయింది. ఈసారి ఈ కార్యక్రమాన్ని కాస్త పెద్ద ఎత్తున నిర్వహించి.. నచికేత తపోవన్‌ను దేశవ్యాప్తంగా పరిచయం చేయాలనిపించింది. ఇంకెక్కువ మంది పిల్లలు ప్రయోజనం పొందేలా! ఈ స్కూల్ లక్ష్యాల మీద నాకెంత గౌరవమో ఆర్ట్ అంటే అంతే ఇష్టం. సృజన, సేవ రెండూ ఒకదానికొకటి ఉపయోగపడాలి. ఒకే వేదిక మీద ఈ స్కూల్, హైదరాబాద్ ఆర్ట్ రెండూ ప్రమోట్ కావాలనుకుని ఈ ఎగ్జిబిషన్ గురించి ఆలోచించాను. స్కూల్ కోర్ మెంబర్స్‌తో షేర్ చేసుకున్నాను. బాగుందని ఎంకరేజ్ చేశారు. దాంతో 'పరోపకార్' ఫండ్ రైజింగ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశాను. దీనికి నేను, మా వారు రాజ్.. ఇద్దరం క్యురేటర్స్‌మి. ముంబైలోని ఇండియా ఫైన్ ఆర్ట్ గ్యాలరీ కూడా ఇందులో పాల్గొంటోంది. జడ్చర్లలో ఉన్న నచికేత తపోవన్‌కి అత్యంత అధునాతన సదుపాయాలతో బిల్డింగ్ కట్టాలనుకుంటున్నాం.. చుట్టుపక్కల ఉన్న గవర్నమెంట్ స్కూల్ పిల్లలకూ ఉపయోగపడేలా! ఈ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఫండ్‌లో కొంత దానికీ వెచ్చించాలనుకుంటున్నాం.



**ఈ స్కూల్‌తో నా ప్రయాణం**

నేను పుట్టింది హైదరాబాద్‌లో. చదువుకుంది పుట్టపర్తి సత్యసాయి స్కూల్లో. చిన్నప్పటి నుంచీ ఆర్ట్ అంటే ఇష్టం. హాబీ ఆర్టిస్ట్‌ని. అదృష్టవశాత్తు సుప్రసిద్ధ ఆర్టిస్ట్ తోట వైకుంఠం గారికి కోడలినయ్యాను. మా అత్తింటి వాతావరణం ఆర్ట్‌ను మరింత అర్థం చేసుకోవడానికి హెల్ప్ అయింది. ఆ ప్రేరణతోనే ఆర్ట్ అప్రిసియేషన్ కోర్స్ చేశాను. నాలో సేవాగుణం పెంపొందడానికి సత్యసాయి స్కూల్ ఒక రీజన్ అయితే, మా అమ్మ (అరుణ) చేసే సేవాకార్యక్రమాలు మరో కారణం. ఆ స్ఫూర్తితోనే నచికేత తపోవన్‌లో చేరాను. నిజానికి నేను చదివింది బయోటెక్నాలజీ. కొన్నాళ్లు జాబ్ కూడా చేశాక.. దీనికన్నా నేను చేయాల్సింది ఇంకేదో ఉందనిపించి రిజైన్ చేశాను. అకడమిక్స్‌లో మంచి పట్టు, చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నాయని నన్ను మెచ్చుకునేవారు తెలిసిన వాళ్లంతా. పదిమందికి ఉపయోగపడితేనే కదా ఆ ప్రతిభకు సార్థకత! అందుకే ఏదైనా ట్రైనింగ్ సెంటర్ పెడదామా అని ఆలోచిస్తున్నప్పుడు కనిపించింది నచికేత తపోవన్. వలంటరీ టీచర్‌గా జాయిన్ అయ్యాను. పద్నాలుగేళ్లుగా ఆ స్కూల్‌తో నా ప్రయాణం సాగుతూనే ఉంది. ప్రస్తుతం కోర్ మెంబర్‌గా ఉన్నాను. ఇంకోవైపు ఆర్ట్ బ్రాండింగ్ కోసమూ వర్క్ చేస్తున్నాను.

సుష్మ తోట

---

బడి గంట

పిల్లలకు కొత్త యూనిఫామ్, బ్యాగు, పుస్తకాలు కొనిస్తే చాలనుకుంటారు తల్లిదండ్రులు. పాత క్లాస్ నుంచి కొత్త క్లాస్‌కు వచ్చాం. రోజూ స్కూలుకు వెళ్లి కూచోవడమేగా అనుకుంటారు పిల్లలు. కాని ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు వచ్చిన పిల్లలను బడికి సిద్ధం చేయాలి. గత సంవత్సరం వారి చదువులోని మంచి చెడ్డలను బేరీజు వేసి ఈ క్లాసులో మరింత మెరుగ్గా ఎలా చదవాలో అవగాహన కలిగించాలి. స్కూల్లో, ఇంట్లో వారిని మార్చాలి... తల్లిదండ్రులు మారాలి... ఎలాగో ఇక్కడ తెలుసుకుందాం.

# తర్వాతి క్లాస్‌కు సిద్ధం చేశారా?



పిల్లలు స్కూల్‌కు వెళ్లడం అంటే మరో తరగతిని చదవడమే అని భావిస్తారు. స్కూల్ రీఓపెన్ అయ్యాక పాత తరగతిని ఒదిలి పై తరగతికి వెళ్లడం వీరికి ఉత్సాహంగా ఉంటుంది. మనం కొంచెం ఎదిగాం అనుకుంటారు. గత సంవత్సరం చదివినట్టుగానే ఈ సంవత్సరం చదివేయాలి అని భావిస్తారు. ఇవన్నీ ప్రతి విద్యార్థికీ రొటీన్‌గా అనిపించవచ్చుగాని తరచి చూస్తే తల్లిదండ్రుల ప్రమేయంతో పిల్లలకు సహాయపడాల్సిన అంశాలు చాలా ఉంటాయి.

**1. సెక్షన్ పరేషాన్**

చాలా స్కూళ్లలో కొత్త విద్యా సంవత్సరానికి స్టూడెంట్స్‌ను షఫుల్ చేయడం ఉంటుంది. అంటే గత సంవత్సరం చదివిన సెక్షన్ కాకుండా కొత్త సెక్షన్ వేస్తారు. గత క్లాసులోని ఫ్రెండ్స్ ఈ క్లాసులో ఉండొచ్చు... ఉండక పోవచ్చు. దాంతో కొందరు పిల్లలు అప్‌సెట్ అవుతారు. ఫ్రెండ్స్ ఉన్న సెక్షన్‌లోకి వెళతామంటారు. ఇందుకు స్కూల్ వారు ఒప్పుకోరు. కొత్త సెక్షన్‌లో వేయడం వల్ల మొదట కష్టంగా ఉన్నా తర్వాత తర్వాత బాగుంటుందనీ, కొత్త ఫ్రెండ్స్ అవుతారని, ఈ మార్పుకు అలవాటు పడటం ముందు ముందు మంచి చేస్తుందని పిల్లలకు తల్లిదండ్రులు నచ్చజెప్పాలి. తేలిగ్గా వదిలేయకుండా అలవాటు పడేవరకు రోజు క్లాసు విశేషాలు మాట్లాడుతూ, 'అరె... ఈ సెక్షనే బాగుందే' అని ఉత్సాహపరుస్తూ పాత బెంగను మరువనివ్వాలి. కొత్త క్లాసు టీచర్లను కలిసి, సంగతి చెప్పి, పిల్లాడిని వాళ్ల దగ్గర తీసేలా చేయాలి. ఇక తర్వాత చదువు అదే కొనసాగుతుంది.

**2. సిలబస్ చదివారా?**

పిల్లలకు ఏడు వరకు చదువు ఒక విధంగా ఎనిమిది నుంచి మరో విధంగా సాగుతుంది. తల్లిదండ్రులు పిల్లలకు కొత్త పుస్తకాలు కొనిస్తారుగాని తెరిచి చూడరు. తల్లిదండ్రులు తప్పనిసరిగా 8, 9, 10... ఏ క్లాసైతే ఆ క్లాస్ టెక్స్ట్ బుక్స్ అన్నీ తిరగేయాలి. ఎంత సిలబస్ ఉంది... చాప్టర్‌లు ఏమిటి పరిశీలించాలి. గత సంవత్సరం వచ్చిన మార్కులను బట్టి, విద్యార్థితో చర్చించాలి. ఉదాహరణకు విద్యార్థి ఇంగ్లిష్‌లో తప్ప మిగిలిన సబ్జెక్ట్స్‌లో బాగుంటే ఈ సంవత్సరం ఆ సబ్జెక్ట్ సులువుగా ఎలా చదువుకోవచ్చో విద్యార్థికి అవగాహన కలిగించాలి. లేకుంటే విద్యార్థి తనకు ఇంగ్లిష్ ఇబ్బందిగా ఉందని ఈ సంవత్సరం కూడా చెప్పడు. ఫైనల్ ఎగ్జామ్స్ వేళకు ఇది సమస్యై కూచుంటుంది. అందుకే ఇంగ్లిష్‌ను దాటడం ఈ సంవత్సరపు మొదటి గోల్ అని చెప్పాలి.

**3. దినచర్య/నిద్ర ఖరారు**

పిల్లలు ఎంత గారాల పట్టీలైనా వారికి ఒక దినచర్యను ఖరారు చేయడం క్రమశిక్షణను ఇస్తుంది. క్రమశిక్షణ లేకపోతే ఏ పనీ జరగదు. అందువల్ల స్కూల్‌కు వెళ్లడం దగ్గరి నుంచి రాత్రి నిద్రపోవడం వరకూ తల్లిదండ్రులు, విద్యార్థి కూచుని విద్యార్థి అంగీకారంతో ప్లాన్ చేయాలి. నిద్ర లేచే సమయం, స్కూల్‌కు ప్రిపేర్ అయ్యే సమయం, తిరిగి వచ్చాక రిలాక్స్ అవడానికి ఆటలకు సమయం, తిరిగి చదవే సమయం, హోమ్‌వర్క్ సమయం... ఇవన్నీ తప్పనిసరిగా నిర్ణయించాలి. వారంలో ఏ రోజు ఏ సబ్జెక్ట్‌ను చదవాలో కూడా ప్లాన్ చేయాలి. కష్టమైన సబ్జెక్ట్‌కు ఎక్కువ రోజులు కేటాయించాలి. అలాగే రోజుకు 8 గంటల నిద్ర పిల్లలకు తప్పనిసరి. నిద్రే పిల్లలకు ఆరోగ్యం. ఎనిమిది గంటల నిద్రను ఒదిలి ఇవన్నీ ప్లాన్ చేయాల్సి ఉంటుంది.

**4. చదివే చోటును ఏది?**

కొత్త క్లాసులోకి వచ్చారు సరే... ఇంట్లో రోజూ కూచుని చదువుకునే చోటు ఏది? ఇది విద్యార్థి ఇష్టం ప్రకారం తల్లిదండ్రులు నిశ్చయించాలి. ఇంట్లోని రోజువారీ వ్యవహారాలు వారిని డిస్టబ్ చేయని విధంగా, మంచి గాలి వెలుతురు ప్రశాంతత ఉన్న చోట పిల్లలకు స్టడీ ఏరియా డిసైడ్ చేయాలి. అక్కడ ఏదైనా కొత్త కుర్చీనో, స్టడీ ప్యాడ్‌నో, టేబుల్‌నో కొనివ్వగలిగితే పిల్లలకు ఉత్సాహం వస్తుంది. మంచి చదువుకునే చోటు చూపకుండా పిల్లల్ని బాగా చదవమనడం సరి కాదు.

**5. ధ్యాస మళ్లించే విషయాలు ఏవి?**

కొత్త విద్యా సంవత్సరంలో గత సంవత్సరం టైమ్ వేస్ట్ చేయించిన విషయాలు ఏమిటో తల్లిదండ్రులు, విద్యార్థి కూచుని మాట్లాడుకోవాలి. టీవీ, ఫోన్, కంప్యూటర్, గేమ్స్, సినిమాలు... ఇవి స్టూడెంట్‌ను డిస్ట్రాక్ట్ చేస్తే పెళ్లిళ్లు పేరంటాలని చెప్పి స్కూలుకు డుమ్మాలు కొట్టించడం, ఎక్కువ ప్రయాణాలు... ఇవి పెద్దల వల్ల వచ్చే అంతరాయాలు. ఇద్దరూ కంట్రోల్ చేసుకోవాల్సిందే. గత సంవత్సరం అటెండెన్స్ కంటే ఈ సంవత్సరం అటెండెన్స్ ఎక్కువ ఉండేలా కృషి చేయాలని ఇంటి సభ్యులంతా అనుకోవాలి.

**6. రివ్యూ మీటింగ్**

తల్లిదండ్రులు తప్పని సరిగా ప్రతి ఆదివారం ఉదయం విద్యార్థితో రివ్యూ మీటింగ్ పెట్టుకోవాలి. ఇది దండించడానికో బెదరించడానికో కాక విద్యార్థిని అర్థం చేసుకోవడానికి అన్నట్టుగా ముందు నుంచీ తల్లిదండ్రుల ప్రవర్తన ఉండాలి. ఆ వారం జరిగిన క్లాసులు, స్లిప్ టెస్ట్‌లు, మార్కులు, హోమ్‌వర్కులు... అన్నీ బేరీజు వేసుకుని విద్యార్థికి ఏదైనా సమస్య ఉంటే తెలుసుకొని సరి చేయడానికి ఈ రివ్యూ మీటింగ్‌లు గట్టిగా ఉపయోగపడతాయి.

స్కూల్లో విద్యార్థి చదువుతున్నాడంటే ఇంట్లో తల్లిదండ్రులు కూడా చదువుతున్నట్టే. మా దగ్గర టైమ్ లేదు అంతా స్కూల్‌కే అప్పజెబుదాం అనుకుంటే విద్యార్థి గురించి ఏమీ తెలియకుండా పోతుంది. కొందరు పి.ఎం.ఐలకు కూడా వెళ్లరు. దీని వల్ల టీచర్లు ఇచ్చే సూచనలు మిస్ అవుతారు.

కొత్త తరగతిలో మీ అబ్బాయి/అమ్మాయితో కలిసి మీరూ అడుగుపెట్టండి.

---

● బ్యూటిప్



చేతులు, పాదాల చర్మ కాంతి పెరగాలంటే... మూడు స్పూన్ల బోరాక్స్ పౌడర్, రెండు స్పూన్ల గ్లిజరిన్, రెండు కప్పుల రోజ్ వాటర్‌ను బాగా కలిపాలి. దాన్ని కాళ్లకు, చేతులకు రాసుకొని ఓ 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే అది మంచి స్క్రబ్‌లా పని చేస్తుంది.

**బులియన్** (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 19న ముగింపు రూ.లలో

| | |
|---|---|
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 98,710 |
| బంగారం (22 క్యారెట్లు) | 91,290 |
| వెండి | 1,08,300 |
| **విజయవాడ** | |
| బంగారం (24 క్యారెట్లు) | 1,02,300 |
| బంగారం (22 క్యారెట్లు) | 92,650 |
| వెండి | 1,11,300 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 1,01,800 |
| బంగారం (22 క్యారెట్లు) | 92,650 |
| వెండి | 1,22,000 |
| **రాజమండ్రి** | |
| బంగారం (24 క్యారెట్లు) | 1,02,300 |
| బంగారం (22 క్యారెట్లు) | 95,430 |
| వెండి | 1,08,700 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 98,000 |
| బంగారం (22 క్యారెట్లు) | 90,160 |
| వెండి | 1,07,500 |
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 1,01,070 |
| బంగారం (22 క్యారెట్లు) | 92,650 |
| వెండి | 1,22,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

---

● న్యూస్‌మేకర్

# సాహిత్యమే పిల్లలకు మంచి చెప్పాలి

- సాహిత్య అకాడెమీ బాల సాహిత్య పురస్కార విజేత గంగిశెట్టి శివకుమార్



'మేము చదువుకునే సమయంలో రోజూ మోరల్ ఇన్‌స్ట్రక్షన్ (ఎం.ఐ.) అనే క్లాస్ ఉండేది. పిల్లల్ని కూచోబెట్టి సార్లు ఒక కథ వినిపించి అందులోని నీతి వివరించేవారు. అసలు నేడు పిల్లలకు ఇంటా బయటా మౌలిక భావాలు ఎవరు చెబుతున్నారు? పెద్దవాళ్లకా టైమ్ లేదు. మరి పిల్లలకు పరోపకారం చేయాలని, దేశభక్తి కలిగి ఉండాలని, మూఢ భావాలు ఉండకూడదని, అందరి పట్లా సమ భావన కలిగి ఉండాలని, ఆధునిక భావాలు కలిగి ఉండాలని... ఎవరు చెప్పాలి? బాల సాహిత్యమే చెప్పాలి. పిల్లల చేత పుస్తకాలు చదివిస్తే తప్ప ఇవాళ వారిలో కనిపిస్తున్న దుర్లక్షణాలు పోవు' అన్నారు గంగిశెట్టి శివ. 71 ఏళ్ల శివకుమార్ దాదాపు యాభై ఏళ్లకు పైగానే బాల సాహిత్యం రాస్తున్నారు. 2025 సంవత్సరానికి గాను ఆయన పుస్తకం 'కబుర్ల దేవత'కు బాల సాహిత్యం కేటగిరిలో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం వరించింది. ఈ సందర్భంగా 'సాక్షి ఫీచర్స్ ప్రతినిధి'తో శివకుమార్ సంభాషణ...

● **బాల సాహిత్యంలోకి ఎలా వచ్చారు?**

శివకుమార్: మాది నెల్లూరు జిల్లా రాపూరు. మా నాన్న పోస్టాఫీసులో పని చేసేవారు. తరుచూ బాలమిత్ర, చందమామ ఇంటికి తీసుకొచ్చేవారు. ఆ రోజుల్లో వాటిని చేత్తో తాకడమే పెద్ద సంబరం. 13 ఏళ్ల వయసులో అవి చదివి అలా నేను కూడా కథలు రాయాలనుకునేవాణ్ణి. 14వ ఏట మొదటి కథ పోస్ట్ చేశాను. అప్పటి నుంచి పిల్లల కథలు రాసి పత్రికలకు పంపించడం మొదలుపెట్టాను.

● **కథల్లో పిల్లలకు ఏం చెబుతుంటారు?**

జ: నేను కొడవటిగంటి కుటుంబరావు గారి ఏకలవ్య శిష్యుణ్ణి. ఆయనలాగే పిల్లల్లో ఆలోచన, విచక్షణ పెరిగే సాహిత్యం ఉండాలని కోరుకుంటాను. మంత్రాలు, తంత్రాలు కాకుండా హేతువుకు ప్రాధాన్యం పెరిగేలా రాశాను. బాలసాహిత్యం చదివిన పిల్లలు తమకు తాము మేలు చేసుకోవాలి, సమాజానికి మేలు చేయాలి. ఇవి చేయడానికి వీలు కల్పించని సాహిత్యం మంచి బాల సాహిత్యం కాదు. ఇవాళ్టి పిల్లలు రేపటి పౌరులు మాత్రమే కాదు మహా పురుషులు కావాలి. కాని ఏ మహాపురుషుడి గురించి వీరు తెలుసుకుంటున్నారు... చదువుతున్నారు? మనందరం గాంధీ, నెహ్రూ గాథల నుంచి కదా ఇన్‌స్పైర్ అయ్యింది?

● **కొడవటిగంటి కుటుంబరావు గారిని కలిశారా?**

జ: నేను ఎస్.వి. యూనివర్సిటీలో పిహెచ్.డి. చేస్తూ పిల్లల కథలు రాసి చందమామకు పంపేవాణ్ణి. 1973లోనే వారు కథకు 20 రూపాయలు ఇచ్చేవారు. వాటితో నెల ఖర్చులు వెళ్లేవి. ఆ సమయంలో మద్రాసు వెళ్లి కొ.కు. గారిని కలిస్తే ఆశ్చర్యపోయారు. ఆయన చందమామను ఎడిట్ చేసేవారు కనుక మీ కథలు చదివి మీ వయసు చాలా ఎక్కువగా ఊహించుకున్నాను అన్నారు. చాలా ప్రోత్సహించారు. ఆయన చందమామలో మానేశాక దాసరి సుబ్రహ్మణ్యం గారు ఎడిటర్‌గా ఉన్నప్పుడు ఆర్థిక అవసరాల రీత్యా రెండేళ్లు చందమామలో సబ్ ఎడిటర్‌గా ఉద్యోగం చేశాను. 1980-82 మధ్య కాలంలో అక్కడ నాకు 600 రూపాయలు జీతంగా ఇచ్చేవారు.

● **ఇప్పటి వరకూ ఎన్ని పుస్తకాలు రాశారు?**

జ: పది పుస్తకాలు రాశాను. కథలు వందల కొద్దీ రాశాను. నేను బి.ఎస్సీ చదివి తెలుగు ఎం.ఏలోకి వచ్చాను భాష మీద ప్రేమతో. ఇవాళ ఎంతమంది అలా వస్తున్నారు? భాష, సాహిత్యాలకు బడులలో ప్రాధాన్యం లేదు. మార్కులు, ర్యాంకులు ప్రధానమయ్యాయి తల్లిదండ్రులకు. వ్యక్తిత్వం మార్కులతో, ర్యాంకులతో రాగలదా? వ్యక్తిత్వ నిర్మాణమే దేశ నిర్మాణం అని తెలుసుకోవాలి. ఇవాళ టీచర్ల మీద దాడి చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులను ఆదరించని పిల్లలు ఏ సంస్కృతికి ప్రతిఫలం? ఇలాంటి పిల్లలు గొప్ప సాహిత్యం, నైతిక విలువలు పాదుకొలిపే పుస్తకం ఒక్కటి కూడా చదివి ఉండరు. వీరి చేత చదివించని పెద్దలు వీరి నుంచి మంచి నడవడికను మాత్రం ఆశిస్తారు. అదే విచిత్రం.

● **'కబుర్ల దేవత' పుస్తకానికి మీకు పురస్కారం వచ్చింది. 'కబుర్ల దేవత' కథ పేరు. అందులో ఏముంది?**

జ: కొంతమంది మాటలు చెప్పి బతగ్గలరు. అదొక స్కిల్. అది అందరికీ రావాలని లేదు. అంతమాత్రాన పనిమంతుడికి విలువ తగ్గదు. పని తెలిసినవాడు తన పని తాను చేసుకెళ్లాలి. దానికీ ఫలితం ఉంటుంది. మాట్లాడేవాళ్లను చూసి బెదరిపోవద్దు అనే వ్యక్తిత్వ వికాస కోణంలో ఆ కథ పిల్లలకు చెప్పాను.

● **మీకు నచ్చిన బాల సాహిత్యకారులు?**

జ: కలువకొలను సదానంద గారు మంచి సాహిత్యం రాశారు. పిల్లలకు సులభంగా అర్థమయ్యే శైలి వారిది. కె.సభా కూడా మంచి బాల సాహిత్యం రాశారు.

● **మీ ఇతర వివరాలు**

జ: నేను నెల్లూరు జిల్లాలోనే వివిధ చోట్ల ఉపాధ్యాయునిగా పని చేసి రిటైర్ అయ్యాను. మ అబ్బాయి చెన్నైలో, అమ్మాయి నెల్లూరులో స్థిరపడ్డారు. రిటైరయ్యాక కూడా ఒక స్కూల్ బాధ్యతలు చూస్తున్నాను. పిల్లలను కంట్రోల్ చేయడం ఎంత కష్టంగా ఉందో చెప్పలేను. పిల్లలు ఇలా ఎందుకు ఉన్నారో అందరూ కలిసి ఆలోచించాలి. పిల్లల బాధ్యత సమాజం బాధ్యత అనుకోనంత వరకూ బాలల వికాసం పరిపూర్ణంగా జరగదు.

వేగంగా మారుతున్న యుగంలో యువత ఎంతో ఒత్తిడి, అపరిమిత ఆందోళనల మధ్య జీవించాల్సి వస్తోంది. విద్య, ఉద్యోగ పోటీలు, డిజిటల్ లైఫ్, సామాజిక ఒత్తిళ్ల మధ్య మానసిక, శారీరక ప్రశాంతత కోల్పోతుంటారు. 'యువత జీవనవిధానంలో ఏర్పడిన భావోద్వేగ బ్లాకేజీలను ఎలా తొలగించుకోవాలో తెలియక చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో యోగ ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుంది' అని వివరిస్తారు **యోగా ట్రైనర్ స్వప్న యోగాన్వేష్.**

యువర్స్



# YOGA YOUTH

జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం

# భావోద్వేగాల బ్యాలెన్స్

'**లం**డన్‌లో ఎంబీయే చేసి, కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి, యోగాతో నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకున్నాను' అని తెలిపిన స్వప్న హైదరాబాద్‌లో ఐదేళ్లుగా యోగా ట్రైనర్‌గా రాణిస్తున్నారు. ''ఇండియాకు వచ్చి, రిషీకేష్ వంటి యోగిక్ ప్లేస్‌లన్నీ సందర్శించాను. వారాంతంలో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి విద్యార్థులకు ఉచితంగా యోగా శిక్షణా తరగతులు తీసుకుంటుంటాను. సాధారణంగా యువతలో చాలా మంది జిమ్‌లకు వెళ్లడానికి ఆసక్తి చూపుతారు. అది శారీరక ఫిట్‌నెస్ కోసం ఉపయోగపడుతుంది. యోగా వ్యాయామం మాత్రమే కాదు. శరీరం, మనస్సు, ఆత్మ మూడింటినీ సమతుల్యంగా ఉంచే జీవన విధానం. ఈ కాలంలో యువత ఎక్కువ శాతం డిజిటల్ మీద డిపెండ్ అయి ఉంటున్నారు. అన్ని విషయాల మీద చాలా నాలెడ్జ్ వచ్చింది. కానీ, చిన్ననాటి నుంచి రకరకాల ఎమోషనల్ బ్లాకేజీలు అంతర్గతంగా ఏర్పడి, వారితో పాటు ఎదుగుతుంటాయి. వీటి నుంచి రిలాక్స్ అవడానికి యోగా ఒక సాధనంలా ఉపయోగపడుతుంది. యోగా ప్రాచీన భారత సంప్రదాయంలో భాగంగా వేల సంవత్సరాలుగా అభివృద్ధి చెంది ఉంది. పతంజలి వంటి ఎంతో మంది రుషులు, యోగులు యోగాను సాధన చేసినట్టుగా ప్రాచీన భారతం మనకు చూపుతుంది. యోగా వల్ల లాభాలేంటి అని ప్రశ్నించే ఈ తరానికి చెప్పలేనన్ని అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయి..

- యోగాసనాలు శరీరాన్ని బలపరుస్తాయి. రక్తప్రసరణ మెరుగుపడి, హార్మోన్ల సమతుల్యత ఏర్పడుతుంది. మన శరీరంలో ఉన్న ఏడు చక్రాల కుండలిని యాక్టివేట్ చేసి, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.
- పొట్ట, తల, వెన్నెముక ఆరోగ్యంగా ఉంటాయి.
- శ్వాసక్రియ (ప్రాణాయామం) వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.
- డిప్రెషన్, ఆందోళన, అలసట వంటి సమస్యలు తగ్గుతాయి.
- మైండ్‌ఫుల్‌నెస్ (సంపూర్ణ శ్రద్ధతో జీవించడం) అభివృద్ధి చెందుతుంది.
- దృష్టి, ఏకాగ్రత పెరుగుతుంది
- ధ్యాన సాధన క్రమంగా చేస్తే ఏకాగ్రత పెరుగుతుంది. చదువులో, ఉద్యోగ జీవితంలో మెరుగైన ఫలితాలు ఇస్తుంది.

## తరగని గని యోగా!



**మ**నందరిలో ఫిజికల్, సైకలాజికల్ ట్రామా రెండూ ఉంటాయి. దైనందిన జీవనంలో శ్వాస తీసుకోవడం, వదలడం కూడా సరిగ్గా చేయడం లేదు. దీర్ఘ శ్వాస తీసుకోవడం, అంతే దీర్ఘంగా వదలడం వంటివి యోగా చేయడం వల్లే లభిస్తుంది. యోగాలో ప్రతి ఆసనం శ్వాసతో అనుసంధానించి ఉంటుంది. కొన్ని రోజులు క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఉంటే తినే ఆహారం, నిద్రా సమయం కూడా క్రమ బద్ధం అవుతుంది. మొదలుపెట్టేప్పుడు ముందుగా శ్వాస యోగా నుంచి ప్రారంభించాలి. అందుకు కపాలభాతి వంటి శ్వాస యోగాసనాలు ఉన్నాయి. వారంలో రెండు రోజులు, మూడు రోజులు యోగా చేస్తే సరిపోదు. క్రమం తప్పకుండా చేయాలి. దీని వల్ల తలనొప్పి వచ్చినా.. ఎందుకొచ్చింది? ఫిజికల్‌గా, మెంటల్‌గా, ఫుడ్ పరంగా ఎక్కడ మిస్టేక్ అయ్యింది? ఈ సందేహాలకు సమాధానాలు వెంటనే తెలిసిపోతాయి. కోపం, అసహనం, చిరాకు వల్ల బంధాలలో ఇబ్బందులు తలెత్తుతుంటాయి. యోగా సాధన వల్ల వ్యక్తిగత జీవితం, బంధాలు కూడా సెట్ అవుతాయి. అంతర్గత ఆనందం కలిగితే చెడు వ్యసనాల జోలికి ఎంత మాత్రం వెళ్లరు. కపాలబాతి, ప్రాణాయామం.. వంటి శ్వాస వ్యాయామాలు చేయడానికి 8 గంటల ముందు ఆహారం తీసుకోవాలి. అందుకే, యోగాను సూర్యోదయం సమయంలో ఖాళీ కడుపుతో చేయడం వల్ల మంచి ప్రయోజనాలు కలుగుతాయి. మిగతా ఆసనాలకు కనీసం ఆహారం తీసుకోవడానికి మూడున్నర గంటల ముందు తీసుకోవాలి. లంగ్స్, లివర్, స్టమక్, కిడ్నీ, హార్ట్... మనం చేసే పనులలో ఈ ఐదు ఆర్గాన్స్ పనితీరు బాగుండేలా అడ్వాన్స్డ్ మెథడ్స్ ఉంటాయి. బ్రీతింగ్ టెక్నిక్స్ ఉంటాయి. ఇంటర్నల్ హీలింగ్ ద్వారా వీటిని సాధన చేయచ్చు.

**- స్వప్న యోగాన్వేషి,** యోగా ట్రైనర్, హైదరాబాద్

ప్రారంభించడానికి సులభమైన యోగాసనాలు



1 తాడాసనం శరీరానికి బాలెన్స్ నేర్పుతుంది

2 వృక్షాసనం ఏకాగ్రత పెంపుదలకు





3 భ్రమరీ ప్రాణాయామం మానసిక శాంతికి

4 శవాసనం విశ్రాంతికి, ఒత్తిడి నివారణకు

5 నాడి శుద్ధి ప్రాణాయామం శ్వాసలో ఎలాంటి ఆటంకాలు రాకుండా ఉండటానికి

– నిర్మలా రెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

### కేటాయించాల్సిన సమయం...

- యోగాసనాల సాధనకు 45 నిమిషాల నుంచి గంటన్నర సమయం పడుతుంది. ప్రతి రోజు కనీసం 20-30 నిమిషాలు యోగాకు కేటాయించాలి
- యోగా అంటే కష్టమైన ఆసనాలు కాదు అది అందరూ చేయగలిగేది
- సరైన గురువు లేదా యాప్ సహాయంతో శాస్త్రీయంగా ప్రారంభించాలి
- యోగా అనేది యువతకు శారీరక ఆరోగ్యం, మానసిక స్థైర్యం, సామాజిక నైతికత అన్నింటినీ అందించే ఓ సంపూర్ణ మార్గం. యోగాకు వయస్సు అడ్డంకి కాదు, ముందు అడుగు వేయడమే ముఖ్యం.

### సోషల్ మీడియా డీటాక్స్

రోజంతా మొబైల్, స్క్రీన్ ముందు గడిపే యువతకు యోగా ద్వారా స్వీయ ఆత్మ పరిశీలన జరుగుతుంది. ఇది డిజిటల్ డీటాక్స్‌కు సహాయపడుతుంది. యువతలో స్థిరత్వం, ఓర్పు, విలువల పట్ల గౌరవం పెరుగుతుంది.

# సాక్షి సినిమా


## ఐడియా ఉందా?



● కీర్తి సురేష్, సుహాస్

కీర్తి సురేష్, సుహాస్ ముఖ్య తారలుగా, బాబు మోహన్, శత్రు, తాళ్ళూరి రామేశ్వరి ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఉప్పు కప్పురంబు'. వసంత్ మరింగంటి రాసిన కథతో, ఐవీ శశి దర్శకత్వంలో రాధిక లావూ నిర్మించిన ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో జూలై 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం 'ఉప్పు కప్పురంబు' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ''నిన్న మన స్మశానంలో తిరుగుతుంటే నాకో విషయం తెలిసిందండీ... ఇక నాలుగు స్థలాలే ఖాళీగా ఉన్నాయి. అంటే మన ఊర్లో నాలుగు శవాలు పూడ్చిపెట్టడానికి మాత్రమే చోటుంది. అదీ విషయం', 'నాకైతే ఏమీ తెలియదు... మీ దగ్గర ఏమైనా ఐడియా ఉందా?, సమాధి చోటు కోసం ఎవరైనా కొట్టుకుంటారా? అందరూ వచ్చి నాక్కావాలి నాక్కావాలి అంటే..' అన్న డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి. 1990లో చిట్టిజయపురం అనే కల్పిత గ్రామంలో ఈ సినిమా కథనం సాగుతుందని విడుదలైన ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ సందర్భంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ– ''ఉప్పు కప్పురంబు'లో ఆదర్శవాది, దృఢనిశ్చయం గల అపూర్వ అనే అమ్మాయి పాత్రలో నటించాను. గ్రామీణ సంస్కృతుల నేపథ్యంలో ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది'' అని తెలిపారు. ''ఈ సినిమాలో చిన్నా అనే పాత్రలో కనిపిస్తాను. చిన్నా ఒక విచిత్రమైన పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. అదేంటో సినిమాలో చూడండి. ఈ సినిమాలో మంచి భావోద్వేగాలు ఉన్నాయి'' అని అన్నారు సుహాస్.

## రామ్ బుజ్జి బౌలింగ్ వేస్తే..!



● దివ్యేందు

ఇక్కడున్న ఫొటో చూశారుగా..! రామ్ బుజ్జి బాల్ ఎగరేసి, ఎంత కాన్ఫిడెంట్‌గా కనిపిస్తున్నాడో! మరి... రామ్ బుజ్జి బౌలింగ్ వేస్తే ఎలా ఉంటుంది? అతని బౌలింగ్‌లో పెద్ది బ్యాటింగ్ చేస్తే ఏం జరుగుతుంది? అనే సీన్స్‌ను థియేటర్స్‌లో చూడాల్సిందే. రామ్‌చరణ్ టైటిల్ రోల్ చేస్తున్న మల్టీస్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా గురువారం దివ్యేందు శర్మ జన్మదినం సందర్భంగా 'పెద్ది'లో రామ్ బుజ్జి పాత్రలో తను నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. 'మిర్జాపూర్, ది రైల్వేమెన్' వంటి వెబ్ సిరీస్‌లతో పాటు హిందీలో 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ, 2016 ది ఎండ్' వంటి సినిమాల్లో నటించిన దివ్యేందుకు 'పెద్ది' తొలి స్ట్రయిట్ తెలుగు ఫిల్మ్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న రిలీజ్ కానుంది.

## ప్రేక్షకులు ఆదరించేదే పెద్ద సినిమా - అక్కినేని నాగార్జున



''కుబేర' సినిమాలో నాది బిలియనీర్ పాత్ర అని అందరూ అనుకుంటున్నారు. కానీ, నాది మధ్య తరగతి వ్యక్తి ప్రాత. సీబీఐ ఆఫీసర్‌గా కనిపిస్తాను. మంచి చేయాలా? చెడు చేయాలా? అనే సంఘర్షణ మధ్య నా పాత్ర ఉంటుంది. నా క్యారెక్టర్‌ని శేఖర్ కమ్ముల చాలా అద్భుతంగా రాశారు. నా పాత్రలో చాలా ఛాయలుంటాయి.. అదే విధంగా సెటిల్డ్ పెర్ఫార్మెన్స్‌కి మంచి చాన్స్ దక్కింది'' అని అక్కినేని నాగార్జున తెలిపారు. అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా, బాలీవుడ్ నటుడు జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీఎల్ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున పంచుకున్న విశేషాలు.

● 'కుబేర' లాంటి మంచి కథలు రావాలంటే స్టార్ హీరోలు కలిసి పని చేయాలి. ఇంతకుముందు కూడా నేను చాలా సినిమాలు కలిసి చేశాను. గతంలో నాన్నగారు(ఏఎన్ఆర్), ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు గార్లు... ఇలా చాలా మంది కలిసి మల్టీస్టారర్ సినిమాలు ఎన్నో చేశారు. పైగా శేఖర్ కమ్ముల గారితో పని చేయాలని ఎప్పటి నుంచో ఉండేది. 'ఆనంద్' సినిమా నుంచి ఆయన ఏంటో, ఆయన సినిమాలు ఎలా ఉంటాయో మనందరికీ తెలుసు. ఆయన కథల్లో సామాజిక సంబంధిత అంశాలు ఉంటాయి. అందుకే శేఖర్‌గారి సినిమాలు నాకు బాగా ఇష్టం. తన సినిమాల్లో సామాజిక అంశాలతో పాటు ఇతర వాణిజ్య అంశాలు కూడా ఉంటాయి.

● 'కుబేర'లో మంచి యునిక్ పాయింట్ ఉంది. ప్రస్తుత సమాజానికి ఆ పాయింట్ చాలా దగ్గరగా ఉంటుంది. అలాగే అద్భుతమైన సంఘటనలు ఉంటాయి. అవన్నీ కూడా నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాలో మంచోళ్లు ఉన్నారు, చెడ్డోళ్లు ఉన్నారు. బిలియనీర్, మధ్యతరగతి, బిలో పావర్టీ లైన్... ఇలా మూడు సొసైటీల మధ్య క్లాష్ ఈ సినిమాలో ఉంటుంది. వైవిధ్యమైన ఈ కథలో రెగ్యులర్ స్క్రీన్ ప్లే ఉండదు... రొటీన్ క్యారెక్టర్స్ కనిపించవు. ఇందులో ఏ పాత్ర కూడా హీరో, హీరోయిన్ అనడానికి లేదు. తెరపై మేము కాకుండా ప్రేక్షకులకు అన్నీ పాత్రలే కనిపిస్తాయి. ఇలాంటి సినిమాలు చేయడానికి ధైర్యం కావాలి.

● ఈ సినిమాలో నా ఇమేజ్‌కి తగ్గట్టు స్క్రిప్ట్‌లో శేఖర్‌గారు ఎలాంటి మార్పులు చేయలేదు. ఆయన ఏమనుకున్నారో అదే చేశారు. నేను కూడా ఎలాంటి మార్పులు అడగలేదు.. మార్చితే కథ మారిపోతుంది. మా ఫ్యామిలీలో దాదాపుగా అందరూ శేఖర్‌గారితో పని చేశారు. 'కుబేర'లో చేయడానికి ఆయన వర్కింగ్ స్టైల్ గురించి నాగ చైతన్యని అడిగాను. ఎందుకంటే రీసెంట్‌గా తను 'లవ్ స్టోరీ' మూవీ చేశాడు కాబట్టి. 'శేఖర్‌గారి వర్కింగ్ స్టైల్ చాలా బాగుంటుంది. మీరు చాలా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పాడు. 'కుబేర'లో నా బాడీ లాంగ్వేజ్, మాట తీరు, రియాక్షన్స్... అన్నీ కూడా కొత్తగా శేఖర్‌గారి శైలిలో ఉంటాయి. తమిళ్ వెర్షన్‌లోనూ నేనే డబ్బింగ్ చెప్పాను.

● ధనుష్ తన పాత్రలో ఒదిగిపోయాడు.. అద్భుతంగా నటించాడు. సెట్స్‌లో మా బాండింగ్ చాలా బాగుండేది. షాట్ గ్యాప్‌లో సినిమాల గురించి మాట్లాడుకునేవాళ్లం. ఈ చిత్రంలో రష్మికా మందన్న అద్భుతంగా నటించింది. ఫైనల్ కాపీ చూశాక, ఫోన్ చేసి 'కుబేర'లో నువ్వే స్టార్' అని చెప్పాను.. తను చాలా సంతోషపడింది. సునీల్ నారంగ్, రామ్మోహన్‌గార్లు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని ఎక్కడా రాజీ పడకుండా చాలా ప్యాషన్‌తో నిర్మించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ చిత్రానికి చాలా ముఖ్యం. పాటలు కూడా సందర్భానుసారంగా వస్తాయి. కెమెరామేన్ నికేత్ బొమ్మరెడ్డి అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు.

● ప్రస్తుతం చాలా మంది పాన్ ఇండియా సినిమా అంటూ నాలుగైదు భాషల్లో విడుదల చేస్తున్నట్లు పోస్టర్స్ వేసుకుంటున్నారు. నిజం చెప్పాలంటే పాన్ ఇండియా సినిమాలు చేయడం చాలా కష్టమైన పని. అన్ని సినిమాలూ దానికి సరిపోవు. స్టార్ హీరోలు, స్టార్ డైరెక్టర్, బిగ్ ప్రొడక్షన్ హౌస్ కలిసి పెద్ద సినిమా చేసినప్పటికీ కథలో విషయం లేకుంటే ఉపయోగం లేదు. ఈ మధ్య అలాంటి భారీ బడ్జెట్ సినిమాల్ని కూడా ప్రేక్షకులు తిరస్కరించారు. కానీ 'కోర్ట్' లాంటి చిన్న సినిమా సూపర్ హిట్ అయింది. నా దృష్టిలో ప్రేక్షకులు ఆదరించేదే పెద్ద సినిమా. అలాగే మంచి కథ ఉన్నదే పెద్ద సినిమా.

● నా కెరీర్‌లో వందో సినిమాని తమిళ దర్శకుడు కార్తీక్‌తో చేస్తున్నాను. 'కింగ్ 100' అని వర్కింగ్ టైటిల్ పెట్టాం. ఈ చిత్రాన్ని మా అన్నపూర్ణ స్టూడియోస్‌పై నిర్మిస్తాం. అయితే వందో సినిమా వంద కోట్ల బడ్జెట్‌తో రూపొందనుందనే వార్తల్లో నిజం లేదు. అఖిల్ హీరోగా నటిస్తున్న 'లెనిన్' చిత్రంలో నేను నటించడం లేదు. నేను, నాగచైతన్య, అఖిల్ కలిసి పూర్తి స్థాయిలో ఓ సినిమా చేయాలని మా అభిమానులు కోరుకుంటున్నారు. అయితే ఇప్పుడప్పుడే అలాంటి సినిమా వచ్చే పరిస్థితి లేదు. ఎందుకంటే మా ముగ్గురికి సరిపడే కథతో ఇప్పటివరకూ ఎవరూ నన్ను కలవలేదు.

● నటుడిగా దాదాపు నలభై ఏళ్ల కెరీర్ నాది. ఎన్నో పాత్రలు చేశాను. అయితే ఫలానా పాత్ర చేయాలనే కల నాకు లేదు. నాకు నచ్చిన, వైవిధ్యమైన పాత్రలు చేసుకుంటూ వెళుతుంటాను. రజనీకాంత్‌గారి 'కూలీ' సినిమాలో ప్రాపర్ విలన్‌గా కనిపిస్తాను. లోకేశ్ కనగరాజ్ చక్కగా తీశారు. అయితే 'కూలీ'లోలా మళ్లీ విలన్ పాత్ర చేయను. క్యారెక్టర్ నచ్చితే కామెడీ కూడా చేస్తాను. ఏం చేసినా నాకు కొత్తగా అనిపించాలి. నేను నటించిన 'శివ' సినిమాని రీ రిలీజ్ చేయబోతున్నాం. 4కే పనులు పూర్తయ్యాయి. ఇంకా బెటర్ ఎఫెక్ట్స్ కోసం వర్క్ జరుగుతోంది. ఒక రీల్ చూశాను.. క్వాలిటీ అద్భుతంగా ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లలో సినిమాకి చర్చలు జరిగాయి. అదే విధంగా 'బ్రహ్మాస్త్ర 2' లోనూ నా పాత్ర ఉంటుందని డైరెక్టర్ అయాన్ ముఖర్జీ చెప్పారు.


## మధ్యతరగతి సోలోబాయ్



● జ్యోతీ బాయ్, శ్రీరామ్ నాయక్, గౌతమ్ కృష్ణ

గౌతమ్ కృష్ణ, రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సోలో బాయ్'. నవీన్ కుమార్ దర్శకత్వంలో వేణుదారి బేబీ నేహశ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మించిన ఈ చిత్రం జూలై 4న విడుదల కానుంది. భారతదేశం ఇటీవల నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'లో అమరుడైన తెలుగు జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేయించారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ – ''మధ్య తరగతి కుటుంబాలను ఆధారంగా చేసుకుని తీసిన చిత్రం ఇది. నన్ను ఇక్కడి వరకు తీసుకువచ్చింది ప్రేక్షకులే. అందుకే నా వంతుగా ఏదో ఒకటి చేయాలని సమవర్తి అనే ట్రస్టు ద్వారా నాకు వచ్చే ప్రతి సంపాదనలోనూ సగం ఈ ట్రస్టుకు అందజేయాలని నిర్ణయించుకున్నాను. 'బిగ్‌బాస్' షోతో వచ్చిన డబ్బులో సగం ఆ ట్రస్టు ద్వారా ముందుగా ఒక లక్ష రూపాయలు మురళీ నాయక్‌గారి కుటుంబానికి అందజేస్తున్నాను'' అన్నారు. ''ఈ చిత్రం హీరో గౌతమ్ రెమ్యునరేషన్ తీసుకోకపోవడంతో పాటు కొంత డబ్బు పెట్టి, ఈ సినిమాను ముందుకు తీసుకువెళ్లాడు'' అన్నారు నిర్మాత సతీష్. ''మా 'సోలో బాయ్' మధ్యతరగతి కుటుంబాలను ప్రతిబింబించే చిత్రం'' అన్నారు దర్శకుడు నవీన్. ''దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ కుటుంబం కోసం త్వరలో మ్యూజికల్ నైట్ నిర్వహించి, వచ్చే ఆదాయాన్ని వారి కుటుంబానికి అందజేయాలనుకుంటున్నాను'' అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్. ''మా కొడుకు దేశం కోసం ప్రాణాలర్పించడం మాకెంతో గౌరవంగా ఉంది. గౌతమ్ మాట్లాడుతుంటే మా అబ్బాయి మాట్లాడుతున్నట్టే ఉంది'' అన్నారు మురళీ నాయక్ తల్లిదండ్రులు.

## పది కోట్ల పాటలో...



● విరాట్ కర్ణ

'పెదకాపు' చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అన్నది ట్యాగ్‌లైన్. నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కేరళ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లో పాట చిత్రీకరణ జరుగుతోంది. ''ఈ పాటలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య పర్యవేక్షణలో ఈ పాటను చిత్రీకరిస్తున్నాం. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ. 10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. ఈ అద్భుతమైన సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: అభే.

**స్టాక్ మార్కెట్లు** (తొలి రెండు బుధవారం ముగింపు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 83 | 81,362 |
| నిఫ్టీ ▽ | 19 | 24,793 |


| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 19,546 | ▲ | 28 |
| డోజోన్స్ | 42,172 | ▽ | 44 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,792 | ▽ | 52 |
| డాక్స్ | 23,058 | ▽ | 260 |
| షాంఘై | 3,362 | ▽ | 27 |
| నికాయ్ | 38,488 | ▽ | 397 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** (రూ. లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | | 86.10 | 86.97 |
| £ | బ్రిటన్ పౌండ్ | | 114.70 | 117.59 |
| € | యూరో | | 97.93 | 100.67 |
| ¥ | జపాన్ యెన్ (100) | | 58.94 | 60.47 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | | 53.66 | 58.54 |
| S$ | సింగపూర్ డాలర్ | | 65.01 | 69.70 |
| SAR | సౌదీ రియాల్ | | 22.23 | 23.74 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | | 22.72 | 24.50 |
| ¥ | చైనా యువాన్ | | 11.19 | 13.01 |

# బడా ఐపీవోలు వస్తున్నాయ్..!




## హెచ్‌డీబీ ఫైనాన్షియల్ మెగా ఇష్యూ




- ఈ నెల 25 నుంచి 27 వరకు
- రూ. 12,500 కోట్ల సమీకరణపై కన్ను

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 25న ప్రారంభంకానుంది. 27న ముగియనున్న ఇష్యూలో భాగంగా రూ. 2,500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ. 10,000 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది. ఇష్యూ ద్వారా ఎన్‌బీఎఫ్‌సీ మొత్తం రూ. 12,500 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను కేటాయించనుంది. ప్రస్తుతం హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 94.36 శాతం వాటా కలిగి ఉంది. ఈక్విటీ జారీ నిధులను టైర్–1 మూలధన పటిష్టతకు కేటాయించనుంది. తద్వారా బిజినెస్ వృద్ధికి వీలుగా రుణాల విడుదల తదితర భవిష్యత్ పెట్టుబడి అవసరాలకు వినియోగించనుంది. అప్పర్ లేయర్‌లో ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలు మూడేళ్లలోగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకావలసి ఉన్నట్లు 2022 అక్టోబర్‌లో ఆర్‌బీఐ నిబంధనలు ప్రవేశపెట్టిన నేపథ్యంలో కంపెనీ ఐపీవోకు వస్తోంది. కాగా.. గతేడాది ఇందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు ఆమోదముద్ర వేసింది.

## కల్పతరు @ రూ. 387-414


- ఈ నెల 24–26 మధ్య రియల్టీ కంపెనీ ఐపీవో
- ముంబై, హైదరాబాద్, నోయిడాలో ప్రాజెక్టులు



రియల్టీ రంగ కంపెనీ కల్పతరు లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 24న ప్రారంభంకానుంది. 26న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి షేరుకి రూ. 387–414 చొప్పున ప్రకటించింది. దీనిలో భాగంగా రూ. 1,590 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా విద్యుత్ ప్రసారం, పంపిణీ దిగ్గజం కల్పతరు గ్రూప్ కంపెనీ రూ. 1,590 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 23న షేర్లను కేటాయించనుంది. ఇష్యూ నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. లిస్టింగ్ తదుపరి కంపెనీ విలువ రూ. 8,500 కోట్లుగా నమోదయ్యే వీలుంది. ప్రధానంగా ముంబై మెట్రోపాలిటన్ రీజన్(ఎంఎంఆర్)తో కార్యకలాపాలు విస్తరించిన కంపెనీ పుణే(మహారాష్ట్ర), హైదరాబాద్(తెలంగాణ), నోయిడా(ఉత్తరప్రదేశ్)లోనూ ప్రాజెక్టులు చేపడుతోంది. లగ్జరీ, ప్రీమియం, మధ్యాదాయ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 36 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

## ఎలెన్‌బరీ @ రూ. 380-400

- ఈ నెల 24–26 మధ్య పబ్లిక్ ఇష్యూ
- రూ. 853 కోట్ల సమీకరణకు రెడీ



విభిన్న తరహా గ్యాస్‌ల తయారీ కంపెనీ ఎలెన్‌బరీ ఇండస్ట్రియల్ గ్యాసెస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 24న ప్రారంభంకానుంది. 26న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి షేరుకి రూ. 380–400 చొప్పున ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు దాదాపు రూ. 453 కోట్ల విలువైన 1.13 కోట్ల షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. తద్వారా కంపెనీ మొత్తం రూ. 853 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 23న షేర్లను కేటాయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 37 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఇష్యూ నిధులలో రూ. 210 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 105 కోట్లు పశ్చిమబెంగాల్‌లోని ఉలుబేరియా–2 ప్లాంటులో సెపరేషన్ యూనిట్ ఏర్పాటుకు, మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. కంపెనీ విభిన్న ఇండస్ట్రియల్ గ్యాస్‌ల తయారీ, సరఫరాలను చేపడుతోంది. డ్రై ఐస్, సింథటిక్ ఎయిర్, ఫైర్‌ఫైటింగ్ గ్యాస్, మెడికల్ ఆక్సిజన్, ఎల్‌పీజీ, వెల్డింగ్ మిక్స్చర్స్‌సహా పలు స్పెషాలిటీ గ్యాస్‌లను అందిస్తోంది. గతేడాది(2024–25) కంపెనీ ఆదాయం 16 శాతం ఎగసి రూ. 312 కోట్లను అధిగమించగా.. నికర లాభం 84 శాతం జంప్‌చేసి రూ. 83 కోట్లను తాకింది.

## దేశీ విస్తరణపై అమెజాన్ దృష్టి

- రూ. 2,000 కోట్ల పెట్టుబడులకు రెడీ
- నెట్‌వర్క్ విస్తరణ, అప్‌గ్రేడ్ ప్రణాళికలు




**న్యూఢిల్లీ:** ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ దేశీ కార్యకలాపాలను మరింత పెంచుకోవాలని చూస్తోంది. ఇందుకు ఈ కేలండర్ ఏడాది(2025)లో రూ. 2,000 కోట్లు కేటాయించనుంది. ప్రధానంగా నెట్‌వర్క్ విస్తరణ, అప్‌గ్రేడ్‌పై పెట్టుబడులు వెచ్చించనుంది. తద్వారా ఆధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలు, ఉద్యోగుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఒక ప్రకటనలో అమెజాన్ పేర్కొంది. అందుబాటు ధరల్లో స్మార్ట్‌ఫోన్లు, బ్రాడ్‌బ్యాండ్ విస్తరణ, డిజిటల్ చెల్లింపులకుతోడు, వినియోగ వ్యయాలు పెరుగుతుండటం వంటి సానుకూలతల నేపథ్యంలో కంపెనీ కార్యకలాపాలను మరింత అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రణాళికలు వేసింది. ఇటీవల కొన్నేళ్లుగా అమెజాన్‌సహా, రిటైల్ రంగ దిగ్గజం వాల్‌మార్ట్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ తదితర ఆన్‌లైన్ సంస్థలు దేశీయంగా ఈబిజినెస్‌ను పరుగుపెట్టిస్తున్న సంగతి తెలిసిందే. కోట్లకొద్దీ పెట్టుబడులను వెచ్చించడం ద్వారా దేశీయంగా ఈకామర్స్ మార్కెట్‌ను భారీగా విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2030కల్లా ఈకామర్స్ మార్కెట్ 21 శాతం వార్షిక వృద్ధితో 325 బిలియన్ డాలర్లకు చేరనున్నట్లు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా.. తాజా పెట్టుబడులతో అమెజాన్ దేశవ్యాప్తంగా అవకాశమున్న పిన్‌కోడ్‌లకు సర్వీసులను విస్తరించాలని భావిస్తోంది. ఇందుకు కొత్త ప్రాంతాలలో వేర్‌హౌస్‌ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్నవాటిని ఆధునీకరించడం, డెలివరీ నెట్‌వర్క్‌ను వేగవంతం చేయడం తదితర సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టింది.

## మూడేళ్లలో లక్ష ఎంఎస్‌ఎంఈలు

- వాల్‌మార్ట్ వృద్ధి ప్రోగ్రాం లక్ష్యం




**న్యూఢిల్లీ:** అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ భారత్‌లో మరిన్ని చిన్న, మధ్య తరహా సంస్థలతో (ఎంఎస్‌ఎంఈ) కలిసి పని చేసే ప్రణాళికల్లో ఉంది. తమ 'వృద్ధి' ప్రోగ్రాం కింద వచ్చే మూడేళ్లలో భారత్‌లో తమ సరఫరా వ్యవస్థలో మరో లక్ష ఎంఎస్‌ఎంఈలను భాగం చేసుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం చిన్న సంస్థల కార్యకలాపాల విస్తరణకు తోడ్పడే ఐడియాస్ టు ఇంపాక్ట్ ఫౌండేషన్ (ఐ2ఐ)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు వాల్‌మార్ట్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జేసన్ ఫ్రెమ్‌స్టాడ్ తెలిపారు. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్, వాల్‌మార్ట్ మార్కెట్‌ప్లేస్‌ల ద్వారా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో చిన్న సంస్థలను అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. వృద్ధి ప్రోగ్రాం ద్వారా కార్యకలాపాలను విస్తరించుకునేందుకు ఎంఎస్‌ఎంఈలకు అవసరమయ్యే నైపుణ్యాల్లో వాల్‌మార్ట్ మార్గదర్శకత్వం వహిస్తోంది. 2019లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు 70,000 ఎంఎస్‌ఎంఈలకు శిక్షణనిచ్చినట్లు ఫ్రెమ్‌స్టాడ్ వివరించారు. వృద్ధి ప్రోగ్రాం విజయవంతం కావడంతో మెక్సికో, అమెరికాలో కూడా వాల్‌మార్ట్ ఇదే తరహా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. గత 25 ఏళ్లుగా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న వాల్‌మార్ట్ రెండు దశాబ్దాల్లో సుమారు 30 బిలియన్ డాలర్ల విలువ చేసే ఆహారోత్పత్తులు, ఫార్మా, సైకిళ్లు మొదలైనవి కొనుగోలు చేసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సొమ్ము మూడింతలు | ప్రాజెక్ట్ రుణాలకు కొత్త నిబంధనలు

## డ్రీమ్‌ఫోక్స్‌కి బ్యాంకులు గుడ్‌బై?

- ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంకుల యోచన
- గతేడాది లాంజ్ సర్వీసుల్లో అంతరాయమే కారణం



**ముంబై:** గతేడాది పలు ఎయిర్‌పోర్టుల్లో కస్టమర్లు లాంజ్ సర్వీసులను పొందడంలో అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో ట్రావెల్, లైఫ్‌స్టయిల్ సర్వీసుల అగ్రిగేటర్ డ్రీమ్‌ఫోక్స్‌తో ఒప్పందం నుంచి తప్పుకోవాలని పలు బ్యాంకులు, కార్డ్ నెట్‌వర్క్‌లు భావిస్తున్నాయి. ప్రత్యామ్నాయ అవకాశాలను పరిశీలిస్తున్నాయి. ఈ జాబితాలో ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, మాస్టర్‌కార్డ్ మొదలైనవి ఉన్నాయి. మరిన్ని బ్యాంకులు వాటి బాటలో నడిచే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. లిస్టెడ్ కంపెనీ అయిన డ్రీమ్‌ఫోక్స్ దేశీయంగా దిగ్గజ ఎయిర్‌పోర్ట్ లాంజ్ ఆపరేటర్లలో ఒకటిగా కార్యకలాపాలు సాగిస్తోంది. గతేడాది సెప్టెంబర్ 22న సర్వీసుల్లో అంతరాయం కారణంగా పలు విమానాశ్రయాల్లో లాంజ్‌ని ఉపయోగించుకోలేక బ్యాంకులు, కార్డ్ నెట్‌వర్క్‌లకు చెందిన వేల మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. 34 ఎయిర్‌పోర్టుల్లోని 49 లాంజ్ సర్వీసులు అకస్మాత్తుగా నిల్చిపోయాయి.

## మూడో రోజూ నష్టాల ముగింపే..

- వీడని ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ భయాలు
- ఫెడ్ రిజర్వ్ నుంచి ప్రతికూల సంకేతాలు
- సెన్సెక్స్ నష్టం 83 పాయింట్లు



**ముంబై:** ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ భయాలు కొనసాగడంతో పాటు ఫెడరల్ రిజర్వ్ రానున్న రోజుల్లో కఠిన ద్రవ్య పరపతి విధాన అమలు సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్ మూడో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 83 పాయింట్లు పతనమై 81,362 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19 పాయింట్లు కోల్పోయి 24,793 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 254 పాయింట్లు పతనమై 81,191 వద్ద, నిఫ్టీ 79 పాయింట్లు కోల్పోయి 24,733 వద్ద కనిష్టాలు తాకాయి. ఆటో మినహా అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. వ్యాపార విభజన తర్వాత సీమెన్స్ ఎనర్జీ ఇండియా షేరు బీఎస్‌ఈలో రూ.2,850 వద్ద అరంగేట్రం చేసింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే 5% లాభపడి రూ.2,992 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. చివరికి 4% నష్టంతో రూ.2,738 వద్ద స్థిరపడింది.

### రూపాయి 2 నెలల కనిష్టం

వరుసగా మూడో రోజూ నేలచూపులు చూసిన రూపాయి డాలర్ మారకంలో 30 పైసలు బలహీనపడి రెండు నెలల కనిష్టం 86.73 వద్ద స్థిరపడింది. క్రూడాయిల్ ధరల అనూహ్య ర్యాలీ, అమెరికా డాలర్ బలపడటం దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.

# సాక్షి స్పోర్ట్స్

### 'మేమిద్దరం కలిసి సుదీర్ఘ కాలం భారత్‌కు ఆడాలి'

భారత టెస్టు జట్టులో సభ్యులైన కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్ మంచి స్నేహితులు. చిన్నప్పటి నుంచి వివిధ వయో విభాగాల్లో ఈ కర్ణాటక మిత్రులు కలిసి ఆడారు. ఇప్పుడు చాలా ఏళ్ల తర్వాత రాహుల్, నాయర్‌లకు ఒకే టెస్టులో కలిసి ఆడే అవకాశం దక్కింది. టీమ్‌లో రాహుల్ రెగ్యులర్ మెంబర్ కాగా, ఎనిమిదేళ్ల తర్వాత నాయర్ పునరాగమనం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తమ స్నేహం చిరకాలం కొనసాగడంతో పాటు టీమిండియా తరఫున ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం రావాలని కోరుకుంటున్నట్లు రాహుల్ చెప్పాడు. '11 ఏళ్ల వయసులో ఇద్దరం ఒకేసారి క్రికెట్ ఆడటం ప్రారంభించాం. ఈ ప్రయాణం ఇప్పటికీ సాగుతోంది. ఇద్దరి కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు ఉన్నాయి. గత 2–3 ఏళ్లలో అద్భుతంగా ఆడి ఎన్నో ప్రతికూలతలను దాటి నాయర్ పునరాగమనం చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇంగ్లండ్‌లో ఉండే పరిస్థితులు, సవాళ్ల గురించి మేము మాట్లాడుకున్నాం. మేమిద్దరం కలిసి భారత్ తరఫున సుదీర్ఘ కాలం ఆడాలని కోరుకుంటున్నా' అని రాహుల్ తన ఆత్మీయతను ప్రదర్శించాడు.






ఇంగ్లండ్‌లో పరిస్థితులు భిన్నం
భారత జట్టుకు సచిన్ సూచన

# 'అప్పటికప్పుడు ఆటను మార్చుకోవాలి'

**లీడ్స్:** ఇంగ్లండ్ గడ్డపై భారత్ మెరుగైన ఫలితం సాధించాలంటే బ్యాటర్లు ఒకే తరహా శైలికి కట్టుబడి ఉండరాదని భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్ మైదానాల్లో పరిస్థితులు వేగంగా మారిపోతుంటాయని, దానికి అనుగుణంగా తమ బ్యాటింగ్‌ను కూడా మార్చుకోవాలని అతను సూచించాడు. 'నా ఆట ఇలాగే ఉంటుంది. నేను ఇలాగే ఆడతాను అనే వన్‌వే ట్రాఫిక్ ఇంగ్లండ్‌లో పనికి రాదు. ఇక్కడి పరిస్థితులను కొద్దిగా గౌరవించాల్సి ఉంటుంది. వాటికి అనుగుణంగా తమ ఆటను మార్చుకోవాలనే ఆలోచనలు మనసులో సాగుతూనే ఉండాలి. అప్పుటే ఆటపై పట్టు చిక్కి అంతా చక్కబడుతుంది. ఎప్పుడు దూకుడు పెంచాలో, ఎప్పుడు డిఫెన్స్ ఆడాలో తెలియాలి. లేదంటే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది' అని సచిన్ వివరించాడు. అయితే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లలో ఆడిన అనుభవం జట్టులో అందరికీ ఉందని, వాటినుంచి నేర్చుకున్న విషయాలను మెరుగుపర్చుకుంటే ఇక్కడా మంచి ఫలితాలు వస్తాయని అతను అన్నాడు. భారత కెప్టెన్‌గా తొలి సిరీస్ ఆడనున్న శుబ్‌మన్ గిల్‌కు కూడా సచిన్ పలు సలహాలు ఇచ్చాడు. అతను బయటి విషయాలను పట్టించుకోరాదని, తన నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని దిగ్గజ బ్యాటర్ సూచించాడు. 'కెప్టెన్‌గా గిల్‌కు కొంత సమయం ఇవ్వడంతో పాటు అందరూ అతనికి అండగా కూడా నిలవాలి. భారత కెప్టెన్ అంటే తీవ్రమైన ఒత్తిడి ఉండే బాధ్యత. ఇలా చేయాలి అలా చేయాలి అని చాలా మంది చెబుతూ ఉంటారు. అభిప్రాయాలు చెప్పే హక్కు బయటి నుంచి ఎవరికైనా ఉంటుంది. ఇవన్నీ గిల్ పట్టించుకోకూడదు. డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చించిన వ్యూహాలను మైదానంలో అమలయ్యేలా చూడాలి' అని సచిన్ వ్యాఖ్యానించాడు.

**'అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ' ఆవిష్కరణ..**

భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగే టెస్టు సిరీస్‌కు 'అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ'గా పేరు పెట్టారు. ఈ ట్రోఫీని గురువారం ఆవిష్కరించారు. అత్యధిక టెస్టులు ఆడిన ఆటగాళ్లుగా సచిన్ (200), అండర్సన్ (188) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. టెస్టుల్లో అత్యధిక పరుగులు సాధించిన రికార్డు సచిన్ (15,921) పేరిట ఉండగా... అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంతో (704 వికెట్లు) అండర్సన్ కెరీర్ ముగించాడు. వీరిద్దరి పేర్లను ట్రోఫీకి పెట్టి ఈసీబీ, బీసీసీఐ సముచితంగా గౌరవించాయి. మరోవైపు ఇప్పటి వరకు ట్రోఫీకి 'పటౌడీ' పేరు ఉండేది. ఇప్పుడు విజేతగా నిలిచిన జట్టు కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్' అందజేస్తారు. పేరు మార్పు విషయంలో తాను పటౌడీ కుటుంబంతో స్వయంగా మాట్లాడానని ... ఏదో రూపంలో వారి గౌరవం కొనసాగేలా తాను ప్రయత్నిస్తానని వారితో చెప్పినట్లు సచిన్ వెల్లడించాడు.

# భారత్ 'పరీక్ష' మొదలు

## నేటి నుంచి ఇంగ్లండ్‌తో తొలి టెస్టు మ్యాచ్

ఆత్మవిశ్వాసంతో గిల్ బృందం • ప్రతీకారానికి ఇంగ్లండ్ సిద్ధం

మధ్యాహ్నం గం. 3:30 నుంచి సోనీ స్పోర్ట్స్ చానల్స్, సోనీ లైవ్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత టెస్టు క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి తెర లేస్తోంది. సుదీర్ఘ కాలం జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించిన స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, అశ్విన్‌ల రిటైర్మెంట్ తర్వాత జట్టు తొలి సిరీస్ బరిలోకి దిగుతోంది. టెస్టు ఫార్మాట్‌లో కొత్త సారథిగా బాధ్యతలు తీసుకున్న శుబ్‌మన్ గిల్‌కు తొలి సిరీస్‌లో కఠిన పరీక్ష ఎదురవుతోంది. ప్రత్యర్థి గడ్డపై ఇప్పటి వరకు మన రికార్డు, ప్రస్తుత యువ జట్టు అనుభవాన్ని చూస్తే ఇది పెద్ద సవాల్. టీమ్ మెరుగైన ప్రదర్శన ఇవ్వడంతో పాటు కెప్టెన్‌గా, బ్యాటర్‌గా గిల్ తనను తాను నిరూపించుకోవాల్సిన నేపథ్యంలో టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది. అయితే గతంలోనూ పాత చరిత్రను మార్చి సంచలనాలు సృష్టించిన భారత బృందం మరోసారి అదే ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తే అనూహ్య ఫలితాలు ఖాయం.

**లీడ్స్:** భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టుల సుదీర్ఘ పోరుకు సైరన్ మోగింది. 'అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ' సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య హెడింగ్లీ మైదానంలో నేటి నుంచి తొలి టెస్టు జరగనుంది. ఏడాది క్రితం భారత గడ్డపై జరిగిన టెస్టు పోరులో టీమిండియా 4–1తో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఇప్పుడు తమ సొంత మైదానంలో దీనికి ప్రతీకారం తీర్చుకోవాలని స్టోక్స్ బృందం భావిస్తుండగా... అత్యుత్తమ స్థాయి ప్రదర్శన కనబర్చి పైచేయి సాధించాలని భారత్ పట్టుదలగా ఉంది. టెస్టుల్లో భారత్‌కు 37వ కెప్టెన్‌గా గుర్తింపు పొందిన గిల్‌కు ఇది కీలక సిరీస్ కానుండగా... బ్యాటర్‌గా ఇంగ్లండ్ గడ్డపై పేలవ రికార్డు ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా గెలుపుపై గురి పెట్టాడు. గత కొన్నేళ్లుగా ఇంగ్లండ్‌కు స్వదేశంలో మంచి ఫలితాలు అందించిన 'బజ్‌బాల్' శైలి ఆట ఈసారి ఎలాంటి ఫలితాలు అందిస్తుందనేది ఆసక్తికరం.



స్టోక్స్

**ఆరో స్థానంలో ఎవరు?**

తొలి టెస్టులో భారత తుది జట్టు దాదాపుగా ఖాయమైంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఆడనుండగా మూడో స్థానంలో కరుణ్ నాయర్ బరిలోకి దిగుతాడు. ఆస్ట్రేలియా సిరీస్‌లో ఆకట్టుకున్న జైస్వాల్‌తో పాటు రాహుల్ కూడా రాణిస్తే జట్టుకు శుభారంభం లభిస్తుంది. దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న కరుణ్ నాయర్ తన ఇటీవలి దేశవాళీ ఫామ్‌ను కొనసాగించడంతో పాటు జట్టులో స్థానం కాపాడుకునే ఒత్తిడిని కూడా అధిగమించాల్సి ఉంటుంది. నాలుగో స్థానంలో ఆడనున్న గిల్ తన బ్యాటింగ్‌తో అంచనాలు అందుకోవడం కీలకం. ఆసీస్ గడ్డపై విఫలమైన పంత్ మరింత బాధ్యతగా ఆడాల్సిన తరుణమిది. భారత జట్టు విజయావకాశాలు పేసర్ బుమ్రాపై ఆధారపడి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. సొంత మైదానంలో అయినా సరే ఇంగ్లండ్ బ్యాటర్లు అతడిని సమర్థంగా ఎదుర్కోవడం అంత సులువు కాదు. సిరాజ్ కూడా స్వింగ్‌తో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టగలడు. మూడో పేసర్‌గా ప్రసిధ్ కృష్ణ ఆడటం కూడా దాదాపు ఖాయమే. ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ తన సత్తాను ఈ సిరీస్‌లో నిరూపించుకోవాల్సి ఉంది. ఏడో స్థానంలో రవీంద్ర జడేజా స్థానానికి ఢోకా లేదు. అయితే మిగిలిన ఆరో స్థానం కోసమే జట్టులో గట్టి పోటీ ఉంది. ఇక్కడా రెగ్యులర్ బ్యాటర్‌ను ఆడిస్తారా లేక ఆల్‌రౌండర్‌కు అవకాశం ఇవ్వాలా అనే విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. బ్యాటర్ అయితే సాయి సుదర్శన్ అరంగేట్రం చేయవచ్చు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కావాలంటే శార్దుల్ ఠాకూర్ లేదా నితీశ్ కుమార్ రెడ్డిలలో ఒకరికి చాన్స్ దక్కుతుంది. లేదా స్పిన్ ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ రూపంలో ప్రత్యామ్నాయం ఉంది.




గిల్

**బౌలింగ్‌లో అనుభవలేమి...**

దాదాపు రెండు దశాబ్దాల పాటు అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ బలంపైనే ఇంగ్లండ్ పేస్ బౌలింగ్ ఆధారపడుతూ వచ్చింది. వీరిద్దరు కలిసి ప్రత్యర్థులను కుప్పకూలుస్తూ ఎన్నో విజయాలు అందించారు. అయితే ఇప్పటి పేస్ బృందానికి చాలా తక్కువ అనుభవం ఉంది. ఈ బౌలింగ్ దళం ప్రత్యర్థిని ఏమాత్రం భయపెట్టించేలా లేదు. కార్స్ 5, టంగ్ 3 టెస్టులు ఆడగా...అనుభవజ్ఞుడే అయినా అండర్సన్, బ్రాడ్‌లతో పోలిస్తే క్రిస్ వోక్స్ స్థాయి తక్కువ. భారత బ్యాటర్ల కోణంలో చూస్తే స్పిన్నర్ బషీర్ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. అందుకే ఇంగ్లండ్ ఈ సిరీస్‌లో తమ బ్యాటింగ్‌నే నమ్ముకుంది. 13 వేలకు పైగా టెస్టు పరుగులు సాధించిన రూట్ మరోసారి బ్యాటింగ్ బాధ్యత మోస్తున్నాడు. అద్భుత ఫామ్‌లో ఉన్న అతడు భారత బౌలర్లను ఎలా ఎదుర్కొంటాడనేది కీలకం. 'బజ్‌బాల్' వచ్చాక ఎన్నో శుభారంభాలు అందించిన క్రాలీ, డకెట్ నుంచి మరో సారి జట్టు అదే ఆటను ఆశిస్తోంది. పోప్‌తో పాటు ప్రతిభావంతుడైన బ్రూక్‌పై జట్టు బ్యాటింగ్ భారం ఉంది. కెప్టెన్ స్టోక్స్ బ్యాటింగ్‌లో చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడి చాలా కాలమైంది. గత మూడేళ్లుగా అతను సెంచరీనే చేయలేదు. భారత గడ్డపై ఆడిన ఐదు టెస్టుల్లోనూ ఘోరంగా విఫలమైన స్టోక్స్ ఎలాంటి ప్రభావం చూపించగలడనేది కీలకం.

**3** ఇంగ్లండ్ గడ్డపై భారత్ 19 టెస్టు సిరీస్‌లు ఆడింది. ఇందులో 3 సిరీస్‌లను (1971లో, 1986లో, 2007లో) సొంతం చేసుకుంది. 14 సిరీస్‌లను చేజార్చుకుంది. మరో 2 సిరీస్‌లు 'డ్రా'గా ముగిశాయి.

**67** ఇప్పటి వరకు ఇంగ్లండ్ గడ్డపై ఇంగ్లండ్ జట్టుతో భారత్ 67 టెస్టులు ఆడింది. 9 టెస్టుల్లో గెలిచిన భారత్ 36 టెస్టుల్లో ఓడిపోయింది. మరో 22 టెస్టులను టీమిండియా 'డ్రా' చేసుకుంది.

**7** హెడింగ్లీ మైదానంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మొత్తం 7 టెస్టులు జరిగాయి. 2 టెస్టుల్లో భారత్, 4 టెస్టుల్లో ఇంగ్లండ్ గెలుపొందాయి. 1 టెస్టు 'డ్రా'గా ముగిసింది.

### పిచ్, వాతావరణం

హెడింగ్లీ మైదానంలో తొలిసారి ఆరంభంలో పేసర్లకు కాస్త అవకాశం ఉన్నా ఆట సాగిన కొద్దీ బ్యాటింగ్‌కు అనుకూలం కావొచ్చు. ఇంగ్లండ్ కూడా పూర్తిగా బౌలింగ్ పిచ్‌ను ఎంచుకునే సాహసం చేయడం లేదు. భారీ స్కోర్లకు అవకాశం ఉంది. వర్ష సూచన లేదు.

**తుది జట్లు**

**ఇంగ్లండ్:** స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్మిత్, వోక్స్, కార్స్, టంగ్, బషీర్. **భారత్ (అంచనా):** గిల్(కెప్టెన్), జైస్వాల్, రాహుల్, కరుణ్ నాయర్, పంత్, సుదర్శన్/నితీశ్ రెడ్డి, జడేజా, బుమ్రా, సిరాజ్, ప్రసిధ్, కుల్దీప్.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



# తోడబుట్టిన బలగం



- కొట్టుకున్నా.. తిట్టుకున్నా.. వాళ్లుంటే చాలు
- నిరాశ, నిస్పృహ, ఆందోళనలు దరిచేరవు
- మెరుగైన భావోద్వేగాలు, సామాజిక బంధాలు
- అన్ని దేశాల అధ్యయనాల సారాంశం ఇదే

'శత్రువులు ఎక్కడో ఉండరు' అని ఒక సినిమా డైలాగ్. ఇంట్లో టీవీ రిమోట్ కోసం ఫైటింగ్ జరిగేది ఆ 'శత్రువుల'తోనే! ఇంట్లో ప్రతిదానికీ పోటీ ఉండేది ఆ 'శత్రువుల' మధ్యనే! ఇంతగా ఫైటింగ్ చేస్తారా.. ఇంట్లో పెద్దవాళ్లకు తెలియకుండా జాడీ పగలగొట్టేసినప్పుడు, ఆ విషయాన్ని దాచి పెట్టటానికి తోడుదొంగలయ్యేది మళ్లీ ఆ 'శత్రువులే'! వాళ్లెవరంటారా, ఇంకెవరు? తోబుట్టువులు! తాజా పరిశోధన ప్రకారం.. బాల్యంలో ఈ తోబుట్టువులు ఎంత కొట్టుకున్నా... పెరిగి పెద్దవుతున్న కొద్దీ ఒకరికొకరు అండగా, ఆలంబనగా ఉంటారట. మీకో తోబుట్టువు ఉంటే, మీ లోపల మీకు ఎప్పటికీ ఒక తోడు ఉన్నట్లేనని పరిశోధకులు అంటున్నారు. ఇదెలాగంటే - అక్క అమ్మగా మారిపోయి అక్కున చేర్చుకుంటుంది. తమ్ముడు టెక్నాలజీలో కింగ్ అయిపోయి అన్నగారి సందేహాలను తీరుస్తాడు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

## కొండంత ధైర్యం

అమెరికాకు చెందిన బ్రిగమ్ యంగ్ యూనివర్సిటీ 395 కుటుంబాలను కలిసి చేసిన అధ్యయన ఫలితాల్లో అనేక ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత, శ్రద్ధ కరువైనప్పటికీ తోబుట్టువులతో బలమైన బంధాలు ఉంటే, కౌమారదశలో నిరాశ, ఆందోళన, ఒంటరితనం అనేవి ఆవరించే అవకాశం 60 శాతం వరకు తక్కువగా ఉంటుందట. తోబుట్టువులు ఉన్నవారు మనోవ్యథల నుంచి వేగంగా కోలుకుంటారు. మానసిక అనారోగ్యాలకు భయపడిపోకుండా ధైర్యంగా పోరాడతారు. సామాజికంగానూ మెరుగైన సంబంధాలను ఏర్పరచుకుంటారు. అసలు తోబుట్టువులంటూ ఉంటే చాలు.. వాళ్ల బంధం గట్టిగా లేకున్నా వాళ్లు ఉన్నారన్న ధైర్యమే భావోద్వేగాల పరంగా ముఖ్యపాత్ర వహిస్తుందట.

తోబుట్టువులుంటే ఉండే ఆ ధీమా బాల్యంతోనే ఆగిపోదు. యవ్వనం, వృద్ధాప్యం వరకూ కూడా మన వెంట వస్తుంది. ఇల్లినాయ్ విశ్వవిద్యాలయ అధ్యయనం ప్రకారం కనీసం ఒక

## మైగ్రేన్లు, రక్తపోట్లు రావు

తోబుట్టువైనా ఉన్న వ్యక్తులు సామాజికంగా గణనీయమైన సామర్థ్యాలను కలిగి ఉంటారు. బయటి పోటీ ప్రపంచంలో బలమైన వ్యక్తుల మధ్య తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తారు. తోబుట్టువులు మాట్లాడుకుంటారు, విభేదిస్తారు. వాదించుకుంటారు, పోటీ పడతారు, రాజీపడతారు.. ఇవన్నీ కూడా వారికి మేలే చేస్తాయి తప్ప కీడు చేయవు. ఈ సందర్భంగా వచ్చే ఆలోచనలు, మానసిక పరిపక్వత వంటివి భవిష్యత్తులో ఉద్యోగం, వివాహం, స్నేహం తదితర సంబంధాల్లో వచ్చే సమస్యల పరిష్కారానికి తెలివిడి కలిగిన మార్గాన్ని ఏర్పరుస్తాయట. బ్రిటన్‌కు చెందిన 'ఆఫీస్ ఫర్ నేషనల్ స్టాటిస్టిక్స్' పరిశోధన కూడా.. తోబుట్టువులతో దగ్గరి సంబంధాలు ఉన్న పెద్దలు జీవితంలో సంతృప్తిగా ఉన్నట్లు కనుగొంది. తోబుట్టువులతో దృఢమైన అనుబంధాలు కలిగి ఉన్న పెద్దలు మైగ్రేన్లు, అధిక రక్తపోటుతో సహా, ఒత్తిడి సంబంధిత అనారోగ్యాలకు 20–25 శాతం తక్కువగా గురవుతారని 2019 సైకలాజికల్ సైన్స్ అధ్యయనం వెల్లడించింది.

## మన దేశంలోనే కాదు..

ప్రపంచవ్యాప్తంగా కూడా తోబుట్టువుల బాంధవ్యాలకు ప్రాముఖ్యం ఉంది. జర్మనీలో, మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ చేసిన సుదీర్ఘ అధ్యయనాలు – కనీసం ఒక తోబుట్టువు ఉన్న వ్యక్తులు పెద్దయ్యాక చక్కని సామాజిక సంబంధాలను కలిగి ఉండే అవకాశం 45 శాతం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాయి. కుటుంబ గౌరవం, పెద్దల సంరక్షణకు పెద్దపీట వేసే జపాన్‌లో.. తోబుట్టువులు తరచూ సంరక్షణ పాత్రలను పోషిస్తుంటారు. సాధారణంగా తండ్రి లేదా తల్లి లేని సింగిల్ పేరెంట్ కుటుంబాల్లో పిల్లలు అనేక సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. కానీ, అమెరికాలో 'చైల్డ్ డెవలప్‌మెంట్ జర్నల్'లో వచ్చిన పరిశోధనా వ్యాసం – సింగిల్ పేరెంట్ కుటుంబాల పిల్లల్లో.. తోబుట్టువులు ఉన్నవారు ఇలాంటి సమస్యలు లేకుండా ఉన్నారని, తోబుట్టువుల అండే అందుకు కారణమని వెల్లడించింది.

## తోడున్నవాళ్లూ తోబుట్టువులే!

ఇదంతా చదివాక, 'అరే, నాకు తోబుట్టువులు లేరే' అని డీలా పడిపోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే.. తోబుట్టువులు లేని వాళ్లు కూడా –తోబుట్టువులతో ముడిపడి ఉన్న భావోద్వేగ ప్రయోజనాలను, ముఖ్యంగా మెంటల్ సపోర్ట్‌ను.. స్నేహితులు, బంధువులు లేదా దీర్ఘకాలం రూమ్మేట్‌లుగా ఉన్న 'తోబుట్టువుల లాంటి' వారి ద్వారా పొందవచ్చని నిపుణులు అంటున్నారు. ఒకే రక్తాన్ని పంచుకుపుట్టకపోవడం అన్నది ప్రతికూలాంశం ఏమీ కాబోదని, జన్యువులతో సంబంధం లేకుండా కూడా తోబుట్టువులు దొరకొచ్చని కూడా పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ లెక్కన చూస్తే ప్రాణ స్నేహితులు కూడా ఒకరకంగా తోబుట్టువులే.

## తోబుట్టువులు ఉంటే చాలు..

తోబుట్టువులు ఉన్నవారు ఒత్తిడికి గురయ్యే అవకాశాలు **60** శాతం తక్కువ
(బ్రిగమ్ యంగ్ యూనివర్సిటీ)



తోబుట్టువులు ఉన్నవాళ్లకు రాజీపడటం, దీర్ఘకాల అనుబంధాలను కొనసాగించటం వంటి నైపుణ్యాలు అలవడతాయి.
(యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయ్)

తోబుట్టువులతో బాల్యంలో చక్కటి సంబంధాలు ఉన్న పెద్దల్లో ఒత్తిడి సంబంధ అనారోగ్యాలు **20-25** శాతం వరకు తక్కువ
(సైకలాజికల్ సైన్స్)



# పిల్లల సంక్షేమాన్ని ఆలోచించాలి

- విడివిడిగా ఉండే తల్లిదండ్రులకు హైకోర్టు సూచన
- మైనర్ బాలికను నెల రోజులు తండ్రి కస్టడీకి ఇవ్వాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: తల్లిదండ్రులు విడివిడిగా ఉన్నా పిల్లల సంక్షేమం గురించి ఆలోచించాలని హైకోర్టు సూచించింది. కుటుంబ వివాదం కారణంగా కోపతాపాలను వారిపై బలవంతంగా రుద్దడం సరికాదంది. ధిక్కరణ పిటిషన్‌లో మైనర్ బాలికను నెల రోజులపాటు తండ్రి కస్టడీకి ఇవ్వాలని తల్లిని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. బాలికను కొన్ని రోజులు తండ్రి కస్టడీకి ఇవ్వాలని గతేడాది నవంబర్ 18న హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని ఉద్దేశపూర్వకంగా అమలు చేయడం లేదని, ధిక్కార చట్ట ప్రకారం తన భార్య నిఖిత రాజ్‌ను శిక్షించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లికి చెందిన శ్రావణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఆరేళ్ల చిన్నారి ఒక్కతే తండ్రి వద్దకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతోందని, తాను వెంట రావాలని కోరుతోందని తల్లి చెప్పారు. చిన్నారిని కస్టడీకి ఇవ్వకుండా క్రిమినల్ పిటిషన్లు దాఖలు చేస్తున్నారని, బీహెచ్ఈఎల్ నుంచి తండ్రి హిమాయత్‌నగర్ రావడం సాధ్యం కాదని అతని తరఫు న్యాయవాది చెప్పడంపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల కారణంగా పాఠశాలకు వెళ్తున్న ఆరేళ్ల బాలిక ఇబ్బంది పడకూడదని నిఖిత, శ్రావణ్ ప్రస్తుతం ఉంటున్న ఇళ్ల మధ్య దూరం తగ్గేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. బాలిక కస్టడీ కోరుతున్న శ్రావణ్ హిమాయత్‌నగర్‌కు మారాలని ఆదేశించారు. బాలిక బాధ పడేందుకు ఈ కోర్టు అనుమతించదని.. ఓ తండ్రిగా చిన్నారి ఇబ్బందిని అర్థం చేసుకోవాలన్నారు. నిజంగా కూతురుపై ప్రేమ ఉన్న తండ్రి ఏదైనా వదులుకోవడానికి సిద్ధంగా ఉంటారన్నారు. కూతురు కోసం ఇళ్లు మారి వచ్చారంటే మీ చుట్టూ ఉన్న వారు మిమ్మల్ని ప్రశంసిస్తారని తండ్రికి చెప్పారు.



కేంద్రమాజీ మంత్రి సురేశ్‌ప్రభు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జీఎం (సోలార్) జానకీరామ్ (కుడి)

## ఎస్టీపీపీకి మరో రెండు అవార్డులు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్‌పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ) అవార్డులతో రికార్డులు బద్దలుకొడుతోంది. విద్యుదుత్పత్తి, నిర్వహణలో ఇప్పటికే అనేక అవార్డులు సాధించగా.. గురువారం మరో రెండు అవార్డులు అందుకుంది. మహారాష్ట్రలోని రాడిసన్‌బ్లూ హోటల్లో గ్రీన్ ఎన్విరో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రీన్‌ఎన్విరో ఎన్విరాన్‌మెంట్ అవార్డు అండ్ సమ్మిట్–2025 వేడుకలు నిర్వహించారు. ఇందులో ఎస్టీపీపీ గోల్డెన్ అవార్డు ఇన్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్సీ అవార్డుతోపాటు సింగరేణి సౌర విద్యుత్ ప్లాంటుకు సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ అవార్డు లభించింది. కేంద్ర మాజీ మంత్రి సురేశ్‌ప్రభు చేతుల మీదుగా జీఎం (సోలార్) జానకీరామ్ అందుకున్నారు. కాగా ఎస్టీపీపీ ఆయా విభాగాల్లో 52 అవార్డులు దక్కించుకుంది. తాజాగా మరో రెండు అవార్డులు అందుకోవడంపై సీఎండీ బలరాం, డైరెక్టర్ సత్యనారాయణరావు, ఎస్టీపీపీ ఈడీ చిరంజీవులు, జీఎం శ్రీనివాసులు, అధికారులు, ఉద్యోగులను అభినందించారు.

## 'బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలి'

సాక్షి, హైదరాబాద్: తిరుపతి హాథిరామ్ బావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో బీఆర్ నాయుడును కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 



కోహినూరు వజ్రం (ఫైల్)

# కోహినూరు వజ్రం కాకతీయులదే!

## ఓరుగల్లు నుంచి బ్రిటన్‌కు పయనం

- గణపతిదేవ చక్రవర్తి మొదటి యజమాని
- కాకతీయుల వారసత్వ సంపద క్వీన్ విక్టోరియా చేతికి
- నాదిర్‌షా పెట్టిన పేరే కోహినూర్ (కాంతి పర్వతం)
- వజ్రానికి పుట్టిల్లు కృష్ణానది తీరం కొల్లూరు

ఖిలా వరంగల్: కాకతీయుల పాలన స్వర్ణయుగం అంటారు. ఓరుగల్లును రాజధానిగా చేసుకుని గణపతిదేవ చక్రవర్తి 1199 నుంచి 1262 వరకు సుదీర్ఘకాలం పరిపాలించాడు. కళింగ, వేంగి రాజవంశమైన తూర్పు గంగాల నుంచి 13వ శతాబ్దంలో కోహినూరు వజ్రం కాకతీయుల చెంతకు చేరింది. వారికి అత్యంత విలువైన ఆస్తులలో ఒకటిగా నిలిచింది. రాణిరుద్రమదేవి తన తండ్రి నుంచి కోహినూరును వారసత్వంగా పొందింది. ఆమె దానిని తొలుత భద్రకాళి దేవికి అలంకరణ కోసం అంకితం చేయగా.. ఆ తర్వాత కాకతీయులు ఆ వజ్రాన్ని రాజధాని పరిపాలనా భవనంలో ఉంచి తమ శక్తి ప్రతిష్టకు ప్రతీకగా ఉపయోగించారు. కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు క్రీస్తుశకం 1310లో ఢిల్లీ సుల్తాన్ పంపిన మాలిక్‌కాపుర్‌తో సంధి చేసుకుని అపారమైన సంపదతోపాటు కోహినూరు వజ్రాన్ని సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, ప్రస్తుతం పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం కొల్లూరు గనులలో ఓ వితంతువుకు ఆ వజ్రం దొరికిందని, గ్రామ పెద్ద ద్వారా గణపతిదేవ చక్రవర్తి కోహినూరు వజ్రాన్ని బహుమతిగా అందుకొని మొదటి యజమాని అయ్యారని ఓ కథనం. అతడు కాకతీయుల ఆరాధ్య దైవమైన శ్రీభద్రకాళి, తర్వాత కాకతీదేవి విగ్రహానికి నుదుటన అలంకరించి ఆరాధన చేశారని చరిత్ర చెబుతోంది.

**విలువైన వజ్రం..**

ప్రపంచంలోనే విలువైన వజ్రాల్లో కోహినూరు ఒకటి. కోహినూరు వజ్రం కోసం చరిత్రలో ఎన్నో యుద్ధాలు జరిగాయి. కోహినూరు వజ్రం చరిత్ర చుట్టూ కూడా ఎన్నో వివాదాలు ఉన్నాయి. అయితే, భారత్‌లోని తెలుగు నేలపై దొరికిన ఈ వజ్రం ఎన్నో రాజవంశాల చేతులు మారింది. చివరకు భారత్ నుంచి బ్రిటన్ చేరుకుంది. అక్కడి రాజకుటుంబానికి వారసత్వ సంపదగా మారింది. కోహినూరు వజ్రాన్ని తిరిగి భారత్‌కు అప్పగించాలని భారత ప్రభుత్వం గట్టిగా డిమాండ్ చేసింది. అలాంటి కోహినూరు వజ్రం తెలుగు నేలపై ఎక్కడ దొరికింది, ఇది బ్రిటన్ ఎలా చేరింది వంటి వివరాలను ఒకసారి తెలుసుకుందాం..!

**తెలుగు నేలపై ..**

వివాదాస్పద చరిత్ర కలిగిన కోహినూరు వజ్రం మూలాలు మిస్టరీగానే ఉన్నాయి. కోహినూరు వజ్రం సృష్టి.. దాని ప్రారంభ చరిత్ర చుట్టూ అనేక కథనాలు ఉన్నాయి. కోహినూరు అనేది పర్షియన్ పదం.. భాషా పరంగా కోహ్-ఇ-నూర్ అని రాయబడింది. దాని అర్థం కాంతి పర్వతం. కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడికి ఆంధ్రప్రదేశ్‌లోని నేటి గుంటూరు జిల్లా కొల్లూరు గనిలో లభించిన కోహినూర్ వజ్రం బహుమతిగానా లభించింది.

**కాకతీయుల నుంచి ఖిల్జీ చేతికి..**

చాలా మంది చరిత్రకారుల ప్రకారం కోహినూర్ వజ్రం కాకతీయ రాజవంశం పాలనలో కాకతీయుల ఆరాధ్యదైవమైన కాకతీమాత దేవతకు కన్నుగా ప్రతిష్ఠించబడింది. 14వ శతాబ్దం ప్రారంభంలో టర్కిక్ ఖిల్జీ రాజవంశం సైన్యం దోపిడీ కోసం దక్షిణ భారతదేశ రాజ్యాలపై దాడి చేయడం ప్రారంభించింది. 1310లో అల్లావుద్దీన్ ఖిల్జీ తన జనరల్ మాలిక్ కాపుర్ వరంగల్‌పై దాడి చేయగా.. ప్రతాపరుద్రుడు అపార సంపదతోపాటు కోహినూరు వజ్రాన్ని అప్పగించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

**దీనికి మరో కథనం ..**

ప్రతాపరుద్రుడి పాలనలో కోహినూరు వజ్రం గోల్కొండ కోటలో ఉండేది. అయితే కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు క్రీస్తుశకం 1310లో ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ పంపిన మాలిక్ కాపుర్‌తో సంధి చేసుకుని అపారమైన సంపదతోపాటు కోహినూర్ వజ్రాన్ని వారికి సమర్పించారు. అయితే ఆతర్వాత కోహినూరు వజ్రం .. ఒక రాజవంశం నుంచి మరొక రాజవంశానికి చేరి చివరకు మొఘల్‌లకు చేరింది. అక్కడ నుంచి వజ్రం ఎలా చేతులు మారిందనేది చాలా స్పష్టంగా ఉంది. అలా ఢిల్లీ చేరిన వజ్రం పలు రాజవంశాల చేతులు మారుతూ ఇబ్రహీం లోడి చేతికి చేరింది. మొదటి పానిపట్టు యుద్ధంలో మొఘల్ రాజవంశ స్థాపకుడైన బాబర్ చేతిలో ఇబ్రహీంలోడి ఓటమి పాలై మరణించిన తర్వాత మొదటి మొఘల్ పాలకుడు బాబర్ కోహినూరును స్వాధీనం చేసుకున్నాడు. కోహినూరు వజ్రం సింహాసనం పైభాగంలో మెరిసే రత్నపు నెమలి తలపై ఉంచారు.

**మొఘల్ నుంచి పర్షియన్ చేతికి..**


1739లో పర్షియన్ పాలకుడు నాదిర్‌షా మొఘల్ సామ్రాజ్యంపై దండెత్తి ..వారిని ఓడించాడు. అప్పుడు ఢిల్లీని దోచుకున్నాడు. ఢిల్లీ సుల్తానులు, మొఘల్ చక్రవర్తులు శతాబ్దాలుగా పోగు చేసిన అపారమైన సంపదను తన వశం చేసుకున్నాడు. తనతో కోహినూరు వజ్రాన్ని కూడా తీసుకు వెళ్లాడు. నాదిర్‌షా ఆవజ్రాన్ని చూడగానే .. కోహ్-ఇ-నూర్ అని నామకరణం చేశారు. అప్పటి నుంచి ఆ వజ్రానికి కోహినూరు అనే పేరు వచ్చింది.

**అఫ్గాన్ నుంచి సిక్కుపాలకులు..**

నాదిర్‌షా నుంచి కోహినూరు వజ్రం అహ్మద్ ఖాన్ అబ్దాలీతో ప్రస్తుత అఫ్గానిస్తాన్ (1747-1856)లోని దుర్రానీ రాజు చేతికి చేరుకుంది. అతను షా యొక్క కమాండర్. అనంతరం పర్షియన్లతో విడిపోయాడు. తన అధీనంలో ఉన్న కోహినూర్‌తో అతను 1747తో అఫ్గాన్ ప్రజలందరికీ పాలకుడిగా పట్టాభిషిక్తుడయ్యాడు. అహ్మద్ షా అబ్దాలీ పేరును స్వీకరించాడు. అతను 1747లో మొదటి ఆధునిక అఫ్గన్ రాజ్యాన్ని స్థాపించాడు. వజ్రం దాదాపు ఏడు దశాబ్దాల పాటు అక్కడే ఉంది. 1813లో అబ్దాలీ బహిష్కరించబడిన వారసుడు షా షుజా.. ఆశ్రయం కోసం కోహినూరును సిక్కు పాలకుడు మహారాజా రంజిత్‌సింగ్‌కు అప్పగించారు. దీంతో కోహినూరు వజ్రం భారత దేశానికి తిరిగి వచ్చింది. ఈ సమయంలోనే కోహినూరు వజ్రం అంచనా విలువ బ్రిటీష్ వారిని ఆకర్షించింది. 1849లో రెండో ఆంగ్లో సిక్కు యుద్ధంలో సిక్కు ఓటమి తర్వాత రంజిత్‌సింగ్ వారసుడు దులీప్ సింగ్ యుద్ధ ఒప్పందంలో భాగంగా కోహినూరును బ్రిటిష్ వారికి అప్పగించారు.

**1851లో లండన్‌కు..**

కోహినూర్ సిక్కుల చేతి నుంచి బ్రిటిష్ చేతిలోకి వెళ్లింది. 1851లో కోహినూరు లండన్‌లోని గ్రేట్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఆ ప్రదర్శన తర్వాత దాని రూపాన్ని మెరుగుపరచడానికి రాయిని కత్తిరించి పాలిష్ చేశారు. కోహినూరును కత్తిరించి పాలిష్ చేసిన తర్వాత అది కిరీట ఆభరణాల్లో భాగమైంది. క్వీన్ విక్టోరియా దీనిని గౌన్‌కు కుడి వైపున బ్రోచ్‌గా (వజ్రం) ధరించారు. ఆతర్వాత సంవత్సరంలో కోహినూరు వజ్రం.. రాజకుటుంబీకుల కిరీటాల్లో కూడా కనిపించింది. ఈ వజ్రాన్ని రాజకుటుంబం తమ ఇంటి పెద్ద కోడలికి వారసత్వంగా అందజేశారు. ప్రపంచంలో అత్యంత విలువైన కోహినూరు వజ్రాన్ని తిరిగి ఇవ్వాల్సిందిగా బ్రిటన్‌ను భారత ప్రభుత్వం చాలాసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం కనిపించలేదని చరిత్ర చెబుతోంది.





## ఆకాశంలో అద్భుతం

సూర్యుడి చుట్టూ ఏర్పడిన కాంతివలయం కరీంనగర్ జిల్లావాసులను కనువిందు చేసింది. మేఘాల్లో ఉండే మంచు స్ఫటికాల ద్వారా కాంతి ప్రయాణించినప్పుడు అది వక్రీభవనం చెంది వలయంలా పర్యావరణవేత్తలు చెబుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో దీనిని గమనించిన పలువురు ఫొటోలు తీసి సంబరపడ్డారు.

-మెట్‌పల్లి



## కేక్ కటింగ్... సహపంక్తి భోజనాలు

ప్రజాభవన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జోన్‌కు చెందిన జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేక్ కట్ చేశారు. అనంతరం కేక్‌ను కార్మికురాలు మంజుల, కళావతికి భట్టి తినిపించారు. పారిశుధ్య కార్మికులు కూడా భట్టికి కేక్ తినిపించారు. అనంతరం కార్మికులతో కలిసి భట్టి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ సీనియర్ నాయకుడు డాక్టర్ పి.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంతర్గాం పునరావాస నిర్మాణ సమయంలో శరణార్థులు



మూతపడిన కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లు

# ఆరు దశాబ్దాలైనా అందని ద్రాక్షే!

- నేటికీ శరణార్థులకు అందని సామాజిక న్యాయం
- ప్రస్తుతం అధోగతి పాలై జీవిస్తున్న కాందిశీకులు
- అందని పరిహారాలు, అమలుకాని పునరావాసం
- నేడు ప్రపంచ శరణార్థుల దినోత్సవం

రామగుండం: స్వాతంత్ర్యానికి పూర్వం ఉపాధి నిమిత్తం తెలుగు వారు బర్మా (నేటి మయన్మార్), శ్రీలంక దేశాలకు తరలివెళ్లారు. 1962లో బర్మా దేశ అస్థిరత మూలంగా పొరుగు దేశాల నుంచి ఉపాధి నిమిత్తం వచ్చిన శరణార్థులపై శారీరక, మానసిక వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో అప్పటి భారత ప్రధానులు నెహ్రూ, లాల్‌బహదూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీ తదితరులు భారతీయుల భద్రతపై మయన్మార్, శ్రీలంక దేశ ప్రధానులతో సంప్రదింపులు జరిపి బతుకుదెరువు నిమిత్తం వెళ్లిన వారిని తిరిగి స్వదేశానికి తీసుకువచ్చేందుకు కృషి చేశారు. 1964 జూన్ 20న కట్టుబట్టలతో స్వదేశానికి తిరిగి వచ్చిన శరణార్థులకు రాజ్యాంగపరంగా పునరావాసం, సంక్షేమం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే గృహ వసతి, ఉపాధి, సామాజిక న్యాయం, రాజ్యాంగపరమైన హక్కులు కల్పిస్తామని పేర్కొన్న పాలకుల హామీలు.. ఆరు దశాబ్దాలైనా అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరం. నేడు ప్రపంచ శరణార్థుల దినోత్సవంపై ప్రత్యేక కథనం.

**టెక్స్‌టైల్ పునరావాస కేంద్రం పూర్వాపరాలు:** 1964లో స్వదేశానికి తిరిగి వచ్చిన వెయ్యి మంది కాందిశీకుల కుటుంబాల కు ఆనాటి కేంద్ర ప్రభుత్వం రూ.1.20 కోట్ల రుణం మంజూరు చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామగుండం మండల పరిధిలోని గోలివాడ, రాయదండి గ్రామాల శివారులో 502.90 ఎకరాల ప్రభుత్వ భూమి సేకరించి అందులో కాందిశీకులకు స్థిర నివాసం ఏర్పాటుకు అవకాశం కల్పించారు. కేంద్రం అందించిన రుణానికి కాందిశీకులను షేర్ హోల్డర్లు గా ప్రకటించి దేశంలోనే తొలి సహకార వీవింగ్ సొసైటీగా గుర్తించింది. దీని ఆధ్వర్యంలో మిల్లు స్థాపించి 700 మందికి ఉపాధితో పాటు, నూలు దారం సరఫరా చేసే విభాగంలో 300 మందికి ఉపాధి కల్పించారు. ఆనా టి రాష్ట్ర ప్రభుత్వం స్పిన్నింగ్ మిల్లు స్థాపనకు గోలివాడ శివారులో 51.38 ఎకరాలు కేటాయించి అందులో 300మంది జౌళి కార్మికులకు ఉపాధి కల్పించగా, స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు 1971 జూలై 2న ఉత్పత్తిని ప్రారంభించాయి.



ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్

**కుటుంబాలకు వెయ్యి క్వార్టర్ల నిర్మాణం:** వెయ్యి మంది కాందిశీకుల ఒక్కో పేరు మీద రూ.4,100/- మొత్తంగా రూ.41 లక్షల రుణంతో పది గుంటల విస్తీర్ణంతో వెయ్యి క్వార్టర్లు నిర్మించారు. ఇందులో ఇంటి తోటల పెంపకంతో ఉపాధి పొందుతూ అదే ప్రాంగణంలో స్థిర నివాసంకోసం క్వార్టర్లు నిర్మించుకున్నారు. దీంతో దేశంలోనే శరణార్థుల అతిపెద్ద పునరావాస కేంద్రంగా ఇది అవతరించింది.

**స్థాపించిన అనతికాలంలోనే పతనావస్థలోకి:** తొలి రోజుల్లో మిల్లుల్లో ఉపాధి పొందుతున్న శరణార్థుల కాలనీలో ఎంతో సందడిగా ఆనందంగా జీవనం సాగింది. 1971లో మరమగ్గాలపై నేసిన వస్త్రాలకు డిమాండ్ అధికంగా ఉండేది. 1976 వరకు మిల్లుల పర్యవేక్షణ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో కొనసాగిన కాలంలో లాభాల బాటలో నడిచాయి. ఎప్పుడైతే ప్రైవేటు వ్యక్తులకు బాధ్యతలు అప్పగించారో అప్పటి నుంచి క్రమంగా మిల్లులు పతనావస్థకు చేరి క్రమంగా నష్టాల ఊబిలోకి చేరడంతో 1985 జూన్ 9న వీవింగ్, 1991 నవంబర్ ఒకటిన స్పిన్నింగ్ మిల్లులు లాకౌట్ ప్రకటించారు. ఫలితంగా కాందిశీకులకు ఉపాధి కరువైంది. 1987 డిసెంబర్‌లో వెలుగాల మహాలక్ష్మి ఆకలితో మృతిచెందడం అప్పట్లో సంచలనం కలిగించింది. నేటి వరకు సుమారు రెండు వందల మంది మృత్యు ఒడిలోకి చేరారు.

**దశాబ్దాలు గడుస్తున్నా అందని పరిహారం:** పదుల సంఖ్యలో ప్రభుత్వాలు మారినా తమ తలరాత మారడం లేదని బర్మా, కాందిశీక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికీ తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోవడం, క్వార్టర్లు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయకపోవడం, పునరావాసం కల్పించకపోవడంతో వందలాది కుటుంబాలు అయోమయంలో ఉన్నాయి.


### రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించాల్సిన అవసరం ఉంది



శరణార్థులకు కల్పించాల్సిన రాజ్యాంగ బద్ధ హక్కులను అమలు చేయాలి. తాము నివాస మున్న క్వార్టర్లకు ఓనర్ షిప్ కల్పించాల్సిన బాధ్య త ప్రభుత్వంపై ఉంది. మిల్లులో పనిచేసిన కాలా నికి రావాల్సిన పరిహారాలు చెల్లించి శరణార్థులు గా తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నా.

– జమ్ముల రామారావు, కాందిశీకుల సంఘం అధ్యక్షుడు

### మిల్లు మూతపడే వరకు పని చేశాను



1970-91 కాలంలో మిల్లు మూతపడే వరకు కార్మికురాలిగా పని చేశాను. నేను నివాసముంటున్న క్వార్టర్ పూర్తిగా శిథిలావస్థకు చేరి 1984లో ఈదురుగాలులకు, అకాల వర్షాలకు కూలిపోవడంతో అక్కడే రేకుల షెడ్డు వేసుకొని నివాసం ఉంటున్నాను. పనిచేసిన కాలానికి రావాల్సిన బకాయిలు నేటికీ రాలేదు. మాకు చెందాల్సిన క్వార్టర్‌పై ఓనర్‌షిప్ చేయడం లేదు.

– బి.లక్ష్మి, స్పిన్నింగ్ కార్మికురాలు




## గాంధీభవన్‌లో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో గురువారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ, రాబోయే తరానికి రాహుల్‌గాంధీ దిక్సూచి అని, ఆయన సూచనల మేరకే కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేశామని చెప్పారు. లక్ష్మణ్ మాట్లాడుతూ, దేశ ప్రజల కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర చేశారన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకే కాంగ్రెస్‌లో యువతకు పెద్దపీట వేస్తున్నారని ఎంపీ అనిల్ తెలిపారు.



# రాష్ట్రాల మధ్య తోతాపురి మామిడ్డీ!

## పొరుగు రాష్ట్రాల తోతాపురి కాయలపై ఆంక్షలు


చిత్తూరులోని మార్కెట్‌కు వచ్చినతోతాపురి మామిడి

- ఇక్కడి రైతులకు కలిసొస్తుందంటూ గుడ్డి ఆదేశాలు
- చిత్తూరు జిల్లా నుంచి కర్ణాటకకు పట్టుగూళ్లు
- తమిళనాడుకు ఇక్కడి టమాటాలు ఎగుమతి
- వీటికి ఆ రాష్ట్రాలు అడ్డుకట్ట వేస్తే పరిస్థితేంటి?
- మామిడి సీజన్ మూడు నెలలే
- పట్టుగూళ్లు, టమాటాలకు ఏడాదంతా మార్కెట్

పలమనేరు: చిత్తూరు జిల్లాలో మామిడి సీజన్ నడుస్తున్న నేపథ్యంలో మామిడి ధరలు నిలకడగా ఉండాలని పొరుగు రాష్ట్రాల నుంచి తోతాపురి మామిడిని జిల్లాలోకి రాకుండా అధికార యంత్రాంగం ఇప్పటికే ఆంక్షలను విధించింది. తాజాగా చిత్తూరుకొచ్చిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సైతం పొరుగు రాష్ట్రాల నుంచి మామిడి ఇక్కడికి రాకూడదని అధికారులను ఆదేశించడం గమనార్హం. ఈ విషయం ఇప్పుడు పొరుగు రాష్ట్రాలకు మనకు ఇబ్బందికర వాతావరణం కల్పించే ఆస్కారం కనిపిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి సీజన్‌తో సంబంధం లేకుండా పట్టుగూళ్లు కర్ణాటకలోని పలు మార్కెట్లకు వెళ్తుంటాయి. ఇక్కడి టమాటాలు కర్ణాటకతోపాటు తమిళనాడుకు ఎగుమతి అవుతాయి. ఆ రాష్ట్రాల నుంచి జిల్లాలోని గుజ్జు పరిశ్రమలకు వచ్చే తోతాపురిని మనం అడ్డుకుంటే వారు పట్టుగూళ్లు, టమాటాలపై ఆంక్షలు విధించే ఆస్కారం ఉంది. ఇది మూడు రాష్ట్రాల మధ్య రగడ రాజేస్తుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానికంగా తోతాపురికి గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల మన రైతులు నష్టపోతున్నారని, అందువల్లే పొరుగురాష్ట్రాల నుంచి మామిడి రాకుండా ఆంక్షలు పెట్టామని అధికారులు చెబుతున్నారు. అయితే దీనిపై కర్ణాటక ప్రభుత్వం ఘాటుగా స్పందించింది. మన రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసింది. మామిడి సీజన్ మూడునెలలే అని, ఇక్కడి నుంచి టమాట, పట్టుగూళ్లు ఏడాది పొడవునా తమిళనాడు, కర్ణాటకకు ఎగుమతి అవుతాయని, ఇప్పుడు వారిపై ఆంక్షలు విధిస్తే మనకే నష్టమన్న వాదన సర్వత్రా వ్యక్తమవుతోంది.


కర్ణాటకలోని కోలారు టమాట మార్కెట్


కర్ణాటకలోని కోలారు పట్టు గూళ్ల మార్కెట్

### ఆ రాష్ట్రాలు మెలిక పెడితే నష్టాలే

జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో ఎక్కువగా పట్టుగూళ్లు, టమాటా సాగవుతోంది. ప్రస్తుతం 36 వేల ఎకరాల్లో 22 వేల మంది రైతులు మల్బరీని సాగుచేస్తున్నారు. ఏటా 15 వందల టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో 20 శాతంపైగా కర్ణాటక మార్కెట్లకు వెళ్తుంది. ఇక టమాటాలు కూడా కర్ణాటక, తమిళనాడుకు వెళ్తుంటాయి. వీటిపై ఆ రాష్ట్రాలు మెలిక పెడితే పట్టుగూళ్లు, టమాటాల రైతులు తీవ్రంగా నష్టపోవడం ఖాయంగా కనిపిస్తోంది. దీనిపై అధికారయంత్రాంగం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.


### పట్టుగూళ్లను కర్ణాటక తీసుకెళ్తాం



ఎన్నో ఏళ్లుగా పట్టుగూళ్లను కర్ణాటకలోని పలు మార్కెట్లకు తీసుకెళుతున్నాం. ఎందుకంటే ఇక్కడి మార్కెట్లలో కంటే అక్కడ కేజీపై రూ.40,50 ఎక్కువ ధర పలుకుతోంది. ఇక్కడ తక్కువ ధరలకు అమ్మి ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం కంటే అక్కడ అమ్మితే ఎక్కువగా దక్కుతుంది.

– రెడ్డెప్పరెడ్డి, పట్టు రైతు, టీఎస్ అగ్రహారం, పలమనేరు

### మన దగ్గర ఆశించిన ధర ఉండదు



నేను ఏటా సీజన్‌తో సంబంధం లేకుండా పదెకరాల్లో హైబ్రిడ్ టమాటా సాగుచేస్తా. ఈ సరుకు ఇక్కడి మార్కెట్‌లో ఆశించిన ధరతో అమ్ముడుపోదు. అందుకే కర్ణాటకలోని కోలారు టమాటా మార్కెట్‌కు తీసుకెళ్తాం. ధర బాగా వస్తుంది.

– గోవిందురెడ్డి, టమాటా రైతు, బేరుపల్లి, పలమనేరు మండలం

---

## క్లుప్తంగా...

### పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు!

**ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్**

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరగాలని గ్రామ,వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ భీమిరెడ్డి అంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ పలుకుబడి ఉన్న వాళ్లకు అనుకూలంగా బదిలీలు జరుగుతాయన్న ఆందోళనలు ఉద్యోగుల్లో నెలకొన్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగుల 11 డిమాండ్లు నెరవేర్చాలి

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల 11 ప్రధాన డిమాండ్లను తక్షణం నెరవేర్చాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు.. ఆ సంస్థ ఈడీ (అడ్మిన్) రవివర్మతో విజయవాడలో గురువారం సమావేశమయ్యాయి. 11 డిమాండ్లపై చర్చించాయి. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న పదోన్నతులు, రిటైరైన ఉద్యోగులకు ఈహెచ్ఎస్‌తోపాటు ఆర్టీసీ డిస్పెన్సరీలలో వైద్య సేవలు తదితర డిమాండ్లు వీటిలో ఉన్నాయి.

### పాలనా బాధ్యతల విభజనపై అధ్యయనం

సాక్షి, అమరావతి: మంత్రులు, కార్యదర్శులు, సచివాలయ మధ్య స్థాయి అధికారులు, ఉద్యోగుల మధ్య బాధ్యతలు, ఫైల్ ప్రాసెసింగ్ తత్సంబంధ అంశాలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సరళతరం చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనిపై అధ్యయనానికి సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్) ప్రత్యేక సీఎస్ అధ్యక్షతన వివిధ శాఖలకు చెందిన ఏడుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

### పాత్రికేయుని కేసులో పూర్తి వివరాలు సమర్పించండి

**పోలీసులకు హైకోర్టు ఆదేశం**

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి విషయంలో సీనియర్ పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజుపై నమోదు చేసిన కేసులో పూర్తి వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు గురువారం పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఉత్తర్వులు జారీ చేశారు. తనపై పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలంటూ కృష్ణంరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

### ఈ-బస్సు కొనుగోళ్లకు కమిటీ

సాక్షి, అమరావతి: పీఎం ఈ-బస్సు సేవా పథకం కింద బస్సుల కొనుగోలు ప్రతిపాదనలను ఖరారు చేసేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, ఆర్టీసీ ఎండీ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో రవాణా, ఇంధన, ఆర్థిక, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు.

### వెల్డర్లకు దోహాలో ఉద్యోగావకాశాలు

సాక్షి, అమరావతి: ఖతార్‌లోని దోహాలో వెల్డర్లుగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న ఐటీఐ విద్యార్థులను ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆహ్వానిస్తోంది. ఐటీఐ, ఐటీసీలో వెల్డర్ సర్టిఫికెట్, నాలుగేళ్ల అనుభవం ఉన్న 24- 45 ఏళ్ల వయసు ఉన్నవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. రెండేళ్ల కాంట్రాక్టు మీద పనిచేసే విధంగా మ్యాట్రిక్స్ ఓవర్సీస్ సంస్థ ఈ నియామకాలను చేపడుతోందని తెలిపింది. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 29లోగా https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్ లేదా skillinternational@apssdc.in కుమెయిల్ చేయాలని లేదా 9988853335 అనే నంబర్‌ను సంప్రదించాలని కోరింది.

### బనకచర్లపై చంద్రబాబు ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

సాక్షి, అమరావతి: గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణంపై సీఎం చంద్రబాబు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. ప్రాజెక్టుపై చర్చించేందుకు అఖిలపక్ష నాయకులు, నిపుణులు, రైతు సంఘాలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

---

# పులుల ఎన్‌క్లోజర్ పనులకు ఆదిలోనే హంసపాదు!


నిరుపయోగంగా ఎన్‌క్లోజర్ల కోసం తెచ్చిన సామగ్రి

- ఉన్నతాధికారుల బదిలీలతో పనుల నిలిపివేత
- నెరవేరని పులి పిల్లల సంరక్షణ బాధ్యత
- ఇప్పటికే పెరిగి పెద్దవిగా మారిన బెబ్బులులు

పెద్దదోర్నాల: తల్లి నుంచి విడిపోయి తిరుపతి జూ పార్క్‌లో పెరుగుతున్న పులి పిల్లలను, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్‌లో ఉంచి సంరక్షించాలన్న అధికారుల లక్ష్యం నెరవేరకుండా పోయింది. తల్లి నుంచి విడిపోయి వేటాడటం తెలియని పులి పిల్లలకు వేట నేర్పేందుకు నల్లమల అభయారణ్యంలో ఏర్పాటు చేస్తున్న భారీ టైగర్ ఎన్‌క్లోజర్ పనులకు ఉన్నతాధికారుల బదిలీలతో పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడింది. దాదాపు రెండేళ్ల క్రితం నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడాపురంలో నాలుగు ఆడపులి పిల్లలు తల్లి నుంచి విడిపోయి దిక్కుతోచని స్థితిలో స్థానికుల కంటపడ్డాయి. ఈ క్రమంలో అవి పెరిగి పెద్దవవుతుండటంతో వాటిని అటవీ ప్రాంత వాతావరణంలో వదిలి పెట్టేందుకు అటవీశాఖ గతంలో నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో రెండేళ్ల క్రితం అధికారులు ప్రకాశం జిల్లా నెక్కంటి రేంజ్‌లో పెద్దపెంట, ఆరపెంట, గంగారంపెంట, పెద్దదోర్నాల మండలంలోని తెట్టుగూడెంల పరిధిలో దాదాపు రూ.2 కోట్లతో టైగర్ ఎన్‌క్లోజర్‌తో పాటు నర్సరీ, హెర్బివోర్స్(జింకలు, దుప్పులు) ఎన్‌క్లోజర్ పనులు చేపట్టారు.

### సొంతంగా వేటాడగలిగేలా..

మొదటగా నర్సరీ ఎన్‌క్లోజర్‌లతో ఉంచిన పులి పిల్లలను టైగర్ ఎన్‌క్లోజర్‌లలోకి మార్చి, వ్యక్తిగతంగా ఆహారం కోసం అవి 50 వన్యప్రాణులను సొంతంగా వేటాడగలిగినప్పుడే వాటిని అభయారణ్యంలోకి వదులుతారు. ఇందుకోసం ఆయా ఎన్‌క్లోజర్‌లలో రూ.2.50 లక్షలతో సోలార్ బోరుతో పాటు, ఎన్‌క్లోజర్‌లోకి పైప్‌లైన్ సదుపాయం, జింకల అవసరాలు తీర్చేందుకు సాసర్ పిట్లు, సహజ సిద్ధంగా ఉండే నీటి గుంతలను సైతం ఏర్పాటు చేశారు. సాధారణంగా కొద్ది రోజుల పాటు వాటిని సంరక్షించి అనంతరం పులుల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్లలో వదలటం ద్వారా పులులకు వేటాడటాన్ని అలవాటు చేస్తారు. వేటలో వాటి శక్తి యుక్తులను గుర్తించి తదుపరి చర్యలను తీసుకుంటారు. అయితే ఇవేమీ జరగకుండానే టైగర్ ఎన్‌క్లోజర్ పనులు మందగించాయి.

### ఎన్‌క్లోజర్ పనులకు కొత్తగా టెండర్లను పిలుస్తున్నాం



అధికారుల బదిలీలు, గతంలో భారీ వర్షాల కారణంగా పనులు కొంత మేర మందగించాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయితే పనులు చురుగ్గా జరిగే అవకాశం ఉంది. కొత్తపల్లి పులి పిల్లలు పెద్దవి కావటంతో వాటిని తీసుకొచ్చే అంశం పరిశీలనలో ఉంది.

– ప్రసన్నజ్యోతి, ఫారెస్ట్ రేంజ్ అధికారి, కొర్రప్రోలు



### మందగించిన నిర్మాణ పనులు

నల్లమల అభయారణ్య పరిధిలోని కొందరు ఉన్నతాధికారుల బదిలీలతో పాటు మరి కొన్ని కారణాలతో టైగర్ ఎన్‌క్లోజర్ పనులతో పాటు నర్సరీ, హెర్బివోర్స్‌ల ఎన్‌క్లోజర్ పనులు నిలిచిపోయాయి. దీంతో తిరుపతి జూలో పెరుగుతున్న పెద్దపులులు సహజ సిద్ధంగా వాటి ఆహారాన్ని అవే వేటాడగలిగేలా చేయటంతో పాటు, పెద్దపులులలో అనాథలు, తీవ్ర గాయాల పాలైన వాటిని ఇక్కడ నర్సరీ ఎన్‌క్లోజర్‌లలో పెట్టి సంరక్షించేందుకు అధికారులు తీసుకున్న నిర్ణయం ఆదిలోనే హంసపాదుగా మారింది.

---

# గడువు దాటితే ముప్పే

## వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
## గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

అంబాజీపేట: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో... సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాల పరిమితి ఉంటుందని, దానిని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతీ సిలిండర్‌పై గడువు తేదీ, కోడ్ విధానంలో మెటల్ ప్లేటుపై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుకున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకొని వినియోగించాలి. ఇలా గుర్తించాలి..

సిలిండర్ మెటల్ ప్లేటుపై ఏ-25, బీ-25 అని ఉంటే ఆ సిలిండర్ 2025 మార్చి-జూన్‌కి గడువు ముగుస్తుందని అర్థం. 25 అంటే 2025 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. 'ఏ' అక్షరం జనవరి నుంచి మార్చి వరకు 'బి' అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, 'సీ' అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, 'డీ' అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది. సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేటుపై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దానిని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.



### సిలిండర్‌కు 10 ఏళ్ల గడువు..

సిలిండర్ తయారైనప్పటి నుంచి 10 ఏళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తర్వాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

### వినియోగదారుల హక్కులు..

గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు హక్కులు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు. కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు. కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. అయితే డీలర్ వద్ద కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు.

---

# గిరిజన ఔట్ సోర్సింగ్ టీచర్లపైనా కక్షే!

- డీఎస్సీలో ఈ పోస్టులు ప్రకటించడంతో వారు గగ్గోలు
- గురుకులాలు తెరిచి పదిరోజులవుతున్నా 1,659 మంది రెన్యువల్‌లో జాప్యం
- జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశించినా కనికరించని టీడీపీ కూటమి సర్కారు
- 'తల్లికి వందనం'లోను వీరికి అన్యాయమే

సాక్షి, అమరావతి : ప్రశ్నిస్తే పగబట్టినట్లుగా వేధిస్తున్న రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం చివరికి గిరిజన గురుకులాల్లో చిరుద్యోగులైన ఔట్‌సోర్సింగ్ టీచర్లపైనా తన ప్రతాపం చూపిస్తోంది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరిన పాపానికి వారిపైనా కక్షగట్టి ఇబ్బందులకు గురిచేస్తోంది. గురుకులాలు తెరిచి పది రోజులు కావస్తున్నప్పటికీ 1,659 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నిబంధనల ప్రకారం రెన్యువల్ చేసే ప్రక్రియలోను తీవ్ర జాప్యం చేస్తోంది. దీంతో టీచర్లు రాక గిరిజన పిల్లలు ఇబ్బందులు పడుతున్నా సర్కారుకు పట్టడంలేదు. మరోవైపు.. డీఎస్సీ నుంచి వీరిని మినహాయించి వారికి ఉద్యోగ భద్రత లేకుండా చేసింది.

రాష్ట్రంలోని 199 గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల (ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)ల్లో 1,659 మంది టీచర్లు ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. ఎన్నికల ముందు వారిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని టీడీపీ కూటమి నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్, గుమ్మిడి సంధ్యారాణి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం హామీ నెరవేర్చకపోగా మెగా డీఎస్సీ ద్వారా గిరిజన గురుకులాల ఔట్ సోర్సింగ్ పోస్టులకు ఎసరుపెట్టింది. మొత్తం 1,659 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో జేఎల్స్, ఆర్ట్-క్రాఫ్ట్ పోస్టులను మినహాయించి 1,143 పోస్టులను మెగా డీఎస్సీలో చూపించడంతో వారంతా రోడ్డునపడే పరిస్థితి వచ్చింది. దీంతో ఆందోళన చెందిన ఔట్ సోర్సింగ్ టీచర్లు తమ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలని, కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పవన్‌కళ్యాణ్, లోకేశ్, సంధ్యారాణితోపాటు అధికారులకు విన్నవించుకున్నారు. ఫలితంలేకపోవడంతో ఈ ఏడాది ప్రారంభంలో దాదాపు 46 రోజులపాటు నిరవధిక సమ్మె చేశారు. అయినా, ప్రభుత్వం మనసు కరగకపోవడంతో జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ ఏపీలో గిరిజన ఔట్ సోర్సింగ్ టీచర్ల న్యాయమైన డిమాండ్లను అమలుచేయాలని కూటమి ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పుచెప్పింది. గిరిజన ఔట్‌సోర్సింగ్ పోస్టులను డీఎస్సీలో చూపించడం సరికాదని.. వాటిని డీఎస్సీ నుంచి మినహాయించి, కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి ఔట్‌సోర్సింగ్ టీచర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. అయినా, కూటమి ప్రభుత్వంలో స్పందనలేదు.

### రెన్యువల్‌లోనూ జాప్యం..

ఇదిలా ఉంటే.. గిరిజన గురుకులాల్లో పనిచేసే 1,659 ఔట్ సోర్సింగ్ టీచర్లను ఏటా గురుకులాలు తెరిచేనాటికి వారిని కొనసాగించేలా రెన్యువల్ చేయాల్సి ఉంది. అయితే, ఈనెల 12న గిరిజన గురుకులాలు తెరిచినప్పటికీ ప్రభుత్వం ఇంతవరకు వారిని రెన్యువల్ చేయలేదు. ప్రభుత్వ జాప్యం కారణంగా గిరిజన పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వం తక్షణం వారిని రెన్యువల్ చేసి గురుకులాలు సక్రమంగా నిర్వహించేలా చర్య తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య కోరారు.



### తల్లికి వందనం లేదు..

ఇక గిరిజన గురుకులాల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ టీచర్లకు 'తల్లికి వందనం' కూడా ప్రభుత్వం ఇవ్వట్లేదు. పీటీటీలకు నెలకు రూ.10,500లు, టీచర్లకు రూ.12,918 చొప్పున ప్రభుత్వం ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు మాదిరిగా సీఎంఎఫ్ఎస్ ఐడీ ద్వారా జీతాలు ఇవ్వడం వల్లే తల్లికి వందనం స్కీమ్‌కు అనర్హులుగా ప్రకటించినట్లు చెబుతున్నారని వారు వాపోతున్నారు.

---

### జూలై 9న కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా జూలై 9న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర విస్తృత సమావేశం పిలుపునిచ్చింది. విజయవాడలో 2 రోజులపాటు జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశాలు గురువారం ముగిశాయి. ఇందులో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, వాసుకి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి, లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే, కర్నూలు జిల్లా ఆదోనిలో ఈ నెల 16న జరిగిన అధికారిక కార్యక్రమంలో దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను వేదికపైకి పిలవకుండా అవమానించిన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. సర్పంచ్‌ను వేదికపైకి పిలవాలని మొదట ప్రతిపాదించిన ఎమ్మెల్యే పార్థసారథి ఆ తరువాత అతను దళితుడని తెలియగానే అవమానించడం హేయంగా పేర్కొంది. ఇటువంటి అనాగరిక చర్యకు పాల్పడిన పార్థసారథికి ఎమ్మెల్యే పదవిలో కొనసాగే అర్హత లేదని తెలిపింది.

---

# కాసుల ఇంజినీరింగ్ మొదలు!

- బీటెక్ సీట్లకు బేరసారాలు
- కౌన్సెలింగ్‌కు ముందే భర్తీకి చర్యలు
- కంప్యూటర్ సైన్స్‌కు విపరీతమైన డిమాండ్
- కన్వీనర్ కోటా మేలంటున్న విద్యానిపుణులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ ప్రవేశాలకు త్వరలో షెడ్యూల్ విడుదల చేయనున్న నేపథ్యంలో ఈఏపీ సెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అడ్మిషన్లకు సిద్ధమవుతున్నారు. ప్రైవేట్ కళాశాలలు సీట్లు భర్తీ చేసుకునే పనిలో బిజీగా ఉన్నాయి. సమయం దగ్గర పడటంతో కళాశాలల యాజమాన్యాలు మరింత స్పీడ్ పెంచాయి. తమ కళాశాలల్లో చేరండంటూ విద్యార్థులకు ఫోన్లు చేస్తున్నారు. కొంచెం పేరున్న కళాశాలల్లో చాలా వరకూ కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచ్‌లలో సీట్లు లేవని తెలుస్తోంది. సీట్లు పొందడానికి సిఫారసులు సైతం చేసుకునే పనిలో విద్యార్థులు ఉన్నారు. మొత్తం మీద ఇంజినీరింగ్ ప్రవేశాలకు అప్పుడే విద్యార్థులు ఎగబడుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రెండు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో 950 సీట్లతో పాటు 26 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో దాదాపు 14,500 సీట్లు ఉన్నాయి. ఇటీవలే విడుదలైన ఎంసెట్-2025 ఫలితాల్లో కాకినాడ జిల్లాలో 6,343, కోనసీమ జిల్లాలో 2,866, తూర్పుగోదావరి జిల్లాలో 6,011 మంది ఉత్తీర్ణత సాధించారు. దీన్ని బట్టి కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ లభిస్తుంది.

### కన్వీనర్ కోటాకే ప్రభుత్వ సహాయం




కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తిస్తాయి. బీటెక్‌లో అన్ని బ్రాంచ్‌లు ముఖ్యమైనవే. విద్యార్థుల ఇష్టం మేరకూ కోర్సు ఎంచుకుని కన్వీనర్ కోటాలో చేరవచ్చు. జేఎన్‌టీయూకే పరిధిలో 160 కళాశాలల్లో దాదాపు 25 నుంచి 30వేల సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయి. ఎంసెట్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలి.

– డాక్టర్ వీవీ సుబ్బారావు, ఏపీ ఎంసెట్ కన్వీనర్

### సీట్లు దొరకవనే ప్రచారం

ఎంసెట్ ఫలితాల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుందామని వేచి చూస్తే కోరుకున్న కళాశాలలో సీటు దొరక్కపోవచ్చనే ప్రచారం అప్పుడే జరుగుతోంది. సీటు విషయమై ఒక అంచనాకు వస్తే బాగుంటుందని, ముందస్తుగా కొంత అడ్వాన్స్ ముట్టజెప్పాలని ఆయా కళాశాలలు కోరుతున్నాయి. మంచి కళాశాలలో సీట్లు దొరకవనే ప్రచారంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ర్యాంకులతో సంబంధం లేకుండా సీట్లు ఖరారు చేసుకుంటున్నారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్, ఎన్నారై ఇలా పలు విధాలుగా సీట్లు భర్తీ చేసుకుంటున్నారు. ఐదేళ్లుగా అంతర్జాతీయంగా ఐటీకి డిమాండ్ రావడం, సాఫ్ట్‌వేర్ కంపెనీలు భారీగా కొలువులను ఆఫర్ చేస్తుండడంతో చాలా వరకూ సీఎస్ఈ, దానికి అనుబంధంగా ఉండే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర బ్రాంచ్‌లకు డిమాండ్ ఏర్పడింది. కాకినాడ జిల్లాలో బాగా పేరొందిన ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ సీటుకు డొనేషన్ రూ.10 లక్షల వరకూ ఇవ్వడానికి వెనకాడటం లేదంటే ఎంత డిమాండ్ ఉందో అర్థమౌతుంది. ఓ మోస్తరు కళాశాల అయితే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఇస్తామని, సీటు రిజర్వ్ చేయాలని కోరుతున్నారు. కౌన్సెలింగ్ ప్రారంభమై కోరుకున్న కళాశాలలో సీటు రాకపోతే.. అప్పుడు బాధపడినా ప్రయోజనం ఉండదని, ముందుగా యాజమాన్యాలతో మాట్లాడి ర్యాంకు వస్తే ఆ కోటాలో సీటు ఖరారు చేసుకోవచ్చని, లేకపోతే దాన్ని మేనేజ్‌మెంట్ కోటా లేదా ఎన్నారై కోటాకు మార్చుకోవడానికి అవకాశం కల్పిస్తామని చెప్పి యాజమాన్యాలు ప్రస్తుతం సీట్లు భర్తీ చేసుకుంటున్నాయి.




● దీపికా పదుకోన్

● రాణీ ముఖర్జీ



● కియారా అద్వానీ



# హీరోయిన్ యాక్షన్

● తగ్గేదే లే అంటూ ఫైట్ చేస్తున్న హీరోయిన్లు


● శార్వరి, ఆలియా

**ఒకరు తుపాకీ పట్టుకున్నారు....**
**మరొకరు ఖడ్గం అందుకున్నారు...**
**ఇంకొకరు చేతికి దొరికిన ఆయుధం తీసుకున్నారు...**
**చూడ్డానికి సున్నితంగా కనిపించే ఈ భామలందరూ ఇలా 'వెపన్స్' పట్టుకున్నది విలన్లను రఫ్ఫాడించడానికే. ప్రస్తుతం బాలీవుడ్ పాపులర్ హీరోయిన్లు కొందరు 'యిన్ యాక్షన్' అంటూ యాక్షన్ రోల్స్ చేస్తున్నారు. సిల్వర్ స్క్రీన్‌పై మెరుపు తీగల్లా కనిపించే ఈ తారలు మెరుపు వేగంతో ఫైట్స్ చేయడానికి 'సై' అన్నారు. ఆ పోరాటాల్లోకి వెళదాం.**

## శివానీ రిటర్న్స్

శివానీ శివాజీ రాయ్‌ని తొలిసారి ప్రేక్షకులు 'మర్దానీ' (2014) చిత్రంలో చూశారు. ఈ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రను రాణీ ముఖర్జీ అద్భుతంగా చేశారు. ఆ సినిమాకి సీక్వెల్‌గా వచ్చిన 'మర్దానీ 2' (2019)లోనూ పోలీస్‌గా విజృంభించారు రాణి. ఈ చిత్రం కూడా ఘనవిజయం సాధించింది. మరోసారి శివానీ శివాజీ రాయ్‌గా 'మర్దానీ 3'లో కనిపించనున్నారు రాణీ ముఖర్జీ. ప్రదీప్ సర్కార్ దర్శకత్వంలో తొలి భాగం 'మర్దానీ'ని, రెండో భాగాన్ని గోపీ పుదిరన్ దర్శకత్వంలో నిర్మించిన యశ్ రాజ్ ఫిల్మ్స్ మూడో భాగం 'మర్దానీ 3'ని అభిరాజ్ మినావాలా దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తొలి, మలి భాగాల్లో సిన్సియర్ పోలీస్ ఆఫీసర్‌గా చేసిన రాణీ ముఖర్జీ 'మర్దానీ 3'లోనూ ఆ పాత్ర చేస్తున్నారు. కాగా ఈ చిత్రం టీజర్, ట్రైలర్స్‌లో రాణి చేసిన యాక్షన్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. పదేళ్ల క్రితం ఫస్ట్ పార్ట్‌లో ఎంత ఎనర్జిటిక్‌గా కనిపించిందో ఇప్పుడూ అలానే కనిపిస్తోందనే కితాబులు ఆమెకు దక్కాయి. ఇక సినిమాలో ఏ రేంజ్‌లో విజృంభించారో చూడాలంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి 27 వరకూ ఆగాల్సిందే. ''చెడుపై పోరాటం చేసే శివానీ శివాజీ రాయ్‌ని తెరపైకి తీసుకురావడానికి హోలీ కన్నా మంచి సమయం ఏం ఉంటుంది. 2026 మార్చి 4న హోలీ. ఓ వారం ముందే ఫిబ్రవరి 27న మా శివానీ థియేటర్స్‌కి వస్తుంది'' అని యశ్ రాజ్ సంస్థ ఓ సందర్భంలో పేర్కొంది.

## వారియర్ క్వీన్

సిల్వర్ స్క్రీన్‌పై మెరుపు తీగలా కనిపించే దీపికా పదుకోన్ మెరుపు వేగంగా ఫైట్ చేయడం కూడా చూశాం. అందుకు ఉదాహరణగా ఈ మధ్య వచ్చిన చిత్రాలు 'పఠాన్, ఫైటర్, సింగమ్ ఎగైన్'లను చెప్పుకోవచ్చు. ఇప్పుడు సౌత్ సినిమాలో తన యాక్షన్‌ని చూపించడానికి రెడీ అయ్యారు దీపికా పదుకోన్. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియన్ మూవీ 'ఎఎ22 ఎ6' (వర్కింగ్ టైటిల్)లో దీపికా పదుకోన్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ఆమె వారియర్ క్వీన్‌గా కనిపించనున్నారు. ఈ పోరాట యోధురాలికి సంబంధించిన లుక్‌ని ఇటీవల విడుదల చేయగా, దీపిక ఆ లుక్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించారు. అట్లీ దర్శకత్వంలో రూపొందిన 'జవాన్'లో దీపికా పదుకోన్ కీలక పాత్రలో కనిపించారు. ఇప్పుడు 'ఎఎ22 ఎ6'లో పూర్తి స్థాయి కథానాయికగా వారియర్ క్వీన్‌గా నటిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోందని సమాచారం.

## షాపింగ్ మాల్‌లో ఫైట్

ఎన్టీఆర్–హృతిక్ రోషన్ కాంబినేషన్‌లో రూపొందిన 'వార్ 2'పై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ మాస్ హీరోలిద్దరూ సిల్వర్ స్క్రీన్‌పై పోటా పోటీగా చేసిన వార్‌ని చూడ్డానికి ఇద్దరి అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. కాగా... ఈ చిత్రంలో మరో లీడ్ రోల్‌లో నటించిన కియారా అద్వానీ కూడా ఫైట్ చేశారట. నిజానికి 'వార్ 2' టీజర్‌లో కియారా ఎల్లో కలర్ బికినీలో గ్లామరస్‌గా కనిపించి, హాట్ టాపిక్ అయ్యారు. అయితే ఇంత హాట్‌గా కనిపిస్తూనే మరోవైపు ఇదే సినిమాలో ఓ షాపింగ్ మాల్‌లో డైనమిక్ ఫైట్‌లోనూ కుర్ర కారు గుండె లబ్ డబ్ పెంచనున్నారు. ఈ ఒక్క ఫైట్ మాత్రమే కాదు... మరికొన్ని ఫైట్ సీన్స్ కూడా చేశారట. 'ఎట్రాక్షన్ మాత్రమే కాదు యాక్షన్' కూడా అన్నమాట. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఆగస్టు 14న ఈ చిత్రం విడుదల కానుంది.


● కృతీ సనన్ ● త్రిప్తీ దిమ్రి


● సుహానా ఖాన్

## లేడీ డాన్

కృతీ సనన్ వెండితెరపై తొలిసారి ఓ రేంజ్‌లో ఫైట్స్‌లో విజృంభించిన చిత్రం 'గణపత్' (2023). ఈ చిత్రంలో చేసిన జస్సీ సింగ్ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా ట్రైనింగ్ తీసుకున్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఓ కళ అయిన 'నన్‌చాకు'ని నేర్చుకున్నారు. ఇప్పుడు రెండేళ్లకు మరోసారి ఫైట్స్‌లో స్పెషల్‌గా ట్రైనప్ అవుతారట. కృతీ సనన్‌కి వచ్చిన ఆఫర్ లాంటిది మరి. ఈ బ్యూటీ లేడీ డాన్‌గా కనిపించనున్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. ఈ క్యారెక్టర్ కోసమే శిక్షణ తీసుకోనున్నారట. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో షారుక్ ఖాన్ టైటిల్ రోల్‌లో వచ్చిన 'డాన్, డాన్ 2' చిత్రాలకు ఉన్న క్రేజ్ తెలిసిందే. అయితే ఈ సిరీస్‌లో భాగంగా రూపొందనున్న 'డాన్ 3'లో ఈసారి రణ్‌వీర్ సింగ్ డాన్‌గా కనిపించనున్నారు. లేడీ డాన్‌గా కియారా అద్వానీని ఖరారు చేశారు. కానీ ఆ తర్వాత కియారా ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ కావడంతో ఆమె ఈ సినిమా నుంచి తప్పుకున్నారు. అప్పట్నుంచి ఈ పాత్రకు పలువురు కథానాయికల పేర్లు వినిపించాయి. ఆ పేర్లలో కృతీ సనన్ పేరు కూడా ఉంది. ఫైనల్లీ కృతీ సనన్‌నే ఫిక్స్ చేశారట చిత్ర దర్శక–నిర్మాత ఫర్హాన్ అక్తర్. ఈ ఏడాదే ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుంది.

## మహిళా గూఢచారుల కథ

ఇద్దరు మహిళా గూఢచారులు బరిలోకి దిగారు. ఈ ఇద్దరూ ప్రమాదకరమైన మిషన్లు ఎదుర్కొంటారు. తగ్గేదే లే అంటూ సాహసాలు చేస్తారు. ఈ ఇద్దరూ చేసిన సాహసాలేంటి? అనేది 'ఆల్ఫా' చిత్రంలో చూడాల్సిందే. ఆలియా భట్, శార్వరీ ఏజెంట్స్‌గా నటిస్తున్న చిత్రం ఇది. శివ్ రావైల్ దర్శకత్వం వహిస్తున్నారు. వైఆర్ఎఫ్ (యశ్ రాజ్ ఫిల్మ్స్) యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న చిత్రం 'ఆల్ఫా'. ఈ యూనివర్స్‌లో భాగంగా వచ్చిన గూఢచారుల చిత్రాల్లో హీరోలు లీడ్ రోల్స్ చేశారు. అయితే ఈ స్పై యూనివర్స్‌లో మహిళా గూఢచారులే ప్రధాన పాత్రలుగా వైఆర్ఎఫ్ నిర్మిస్తున్న తొలి చిత్రం కావడంతో 'ఆల్ఫా'పై భారీ అంచనాలు ఉన్నాయి. పైగా ఆలియా, శార్వరీ రిస్కీ స్టంట్స్ చేశారట. ఈ సినిమా షూటింగ్ ఆరంభించే ముందు ఇద్దరు నాయికలకు ఫైట్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ చిత్రంలో అనిల్ కపూర్, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాబీ, ఆలియా పాల్గొనగా హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ల నేతృత్వంలో భారీ పోరాట సన్నివేశం చిత్రీకరించారని, ఇంకా బోలెడన్ని రిస్కీ ఫైట్స్ ఉన్నాయని బాలీవుడ్ టాక్. ఇదిలా ఉంటే... ఈ చిత్రంలో ఆలియా భట్ గురువు పాత్రలో స్టార్ హీరో హృతిక్ రోషన్ కనిపించనున్నారట. ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళ భాషల్లో డిసెంబరు 25న విడుదల కానుంది.

## పగ తీర్చుకోవడానికి...

సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన 'యానిమల్' చిత్రంలో బోల్డ్ క్యారెక్టర్‌లో ఎలాంటి హద్దులు పెట్టుకోకుండా నటించారు త్రిప్తీ దిమ్రి. తనలో మంచి గ్లామరస్ నటి ఉందనే విషయాన్ని నిరూపించుకున్నారామె. మళ్లీ సందీప్ రెడ్డి దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారీ బ్యూటీ. అయితే ఈ చిత్రంలో త్రిప్తి పాత్ర ఏంటనే వివరాలు బయటకు రాలేదు. కాగా తనలో మంచి యాక్షన్ హీరోయిన్ ఉన్న విషయాన్ని నిరూపించుకోవడానికి రెడీ అయిపోయారు ఈ హీరోయిన్. ఓ హిందీ చిత్రంలో త్రిప్తి యాక్షన్ రోల్ చేస్తున్నారు. విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. షాహిద్ కపూర్ హీరోగా నటిస్తున్నారు. 'కమీనే, హైదర్, రంగూన్' వంటి విశ్లేషకుల ప్రశంసలూ దక్కించుకున్న చిత్రాల తర్వాత మళ్లీ షాహిద్ కపూర్–విశాల్ భరద్వాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. ఈ ఫుల్ ప్యాక్డ్ యాక్షన్ మూవీలో త్రిప్తీ దిమ్రి పగ తీర్చుకునే పాత్రలో కనిపిస్తారట. ఎవరిపై పగ? ఏంటా కథ అనేది తెలియాల్సి ఉంది. రివెంజ్ తీర్చుకునే క్రమంలో పోరాటాలు చేస్తారట. ఈ పాత్ర కోసం త్రిప్తి ప్రత్యేకంగా ప్రిపేర్ అయ్యారని సమాచారం. ఇక ఈ చిత్రంలో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారట షాహిద్ కపూర్. ఈ పాత్ర రిస్కీ ఫైట్స్ చేస్తుందని టాక్. ఈ నేపథ్యంలో ఫైట్స్ కోసం షాహిద్, త్రిప్తి ఒకేసారి శిక్షణ తీసుకున్నారని బాలీవుడ్ ఖబర్. ఈ ఏడాది డిసెంబరు 5న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

## యాక్షన్‌తో ఇంట్రడక్షన్

సిల్వర్ స్క్రీన్‌పై ఫస్ట్ టైమ్ కనిపించడం కనిపించడమే ఓ యాక్షన్ రోల్‌లో కనిపించనున్నారు షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్. తండ్రి కాంబినేషన్‌లో ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో షారుక్ ఖాన్ డాన్ క్యారెక్టర్ చేస్తున్నారు. ఈ చిత్రం ప్రధానాంశం గురు–శిష్యుల నేపథ్యంలో ఉంటుందని సమాచారం. తండ్రీ కూతురు షారుక్–సుహానా వెండితెరపై గురు–శిష్యులుగా కనిపిస్తారట. గురువు క్యారెక్టర్ నెగటివ్ షేడ్స్‌తో ఉంటుందని భోగట్టా. అంటే... షారుక్ గ్రే షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారని స్పష్టం అవుతోంది. నైపుణ్యం గల హంతకుడిగా ఈ గురువు తన శిష్యురాలికి పోరాటాల్లో శిక్షణ ఇస్తాడట. ఇద్దరూ కలిసి అత్యంత ప్రమాదకరమైన మిషన్‌ని ఛేదిస్తారట. ఈ యాక్షన్ రోల్ కోసం సుహానా ఫైట్స్‌లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. వచ్చే ఏడాది అక్టోబరు 2న ఈ చిత్రం విడుదలయ్యే అవకాశం ఉంది. మరి... యాక్షన్ రోల్‌తో ఇంట్రడ్యూస్ కానున్న సుహానా ఖాన్ ఎన్ని మార్కులు తెచ్చుకుంటారో చూడాలి.

**ఇంకా సోనాక్షీ సిన్హా, తాప్సీ తదితర తారల డైరీలో యాక్షన్ మూవీస్ ఉన్నాయి. హీరోయిన్లంటే గ్లామర్ మాత్రమే కాదు... చాన్స్ వస్తే తమలోని ఫైర్‌ని బయటికి తీస్తామని యాక్షన్ మూవీస్ ద్వారా నిరూపించుకుంటుంటారు. అయితే ఒకేసారి ఈ తారలందరూ యాక్షన్ రోల్స్ చేయడం మంచి పరిణామం. కథానాయికల ప్రాధాన్యత పెరుగుతోందనడానికి ఇదో నిదర్శనం.**


**– డి.జి. భవాని**

# డ్రిల్ మాస్టర్?

కాలేజ్ లెక్చరర్‌గా చిరంజీవి ఆడియన్స్‌ను ఎలా ఎంటర్‌టైన్ చేశారో 'మాస్టర్' (1997) సినిమాలో చూశాం. మరి... స్కూల్‌లో డ్రిల్ మాస్టర్‌గా ప్రేక్షకులను ఎలా మెప్పించనున్నారో వచ్చే సంక్రాంతికి థియేటర్స్‌కి వెళ్లి చూడొచ్చట. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో నయనతార కథానాయికగా నటిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుష్మితా కొణిదెల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాల్లో స్కూల్ డ్రిల్ మాస్టర్ శివశంకర వరప్రసాద్‌గా చిరంజీవి కనిపించనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. అలాగే గురువారంతో ముస్సోరీలో పూర్తయిన ఈ సినిమా రెండో షూటింగ్ షెడ్యూల్‌లో స్కూల్ నేపథ్యంలోని సన్నివేశాలను చిత్రీకరించారట అనిల్ రావిపూడి. ఈ సీన్స్‌లో చిరంజీవి, నయనతారతో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొన్నట్లుగా తెలిసింది. ఇంకా ఈ సినిమాలోని ఓ అతిథి పాత్రలో వెంకటేశ్ నటిస్తారని, నటి క్యాథరీన్ మరో కీలక పాత్రలో కనిపిస్తారని టాక్. ఇక ఈ చిత్రాన్ని వచ్చే సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే.


● చిరంజీవి

# గ్రామీణ నేపథ్యంలో...


● 'కాళీధర్ లాపతా' పోస్టర్

అభిషేక్ బచ్చన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కాళీధర్ లాపతా'. మధుమిత దర్శకత్వం వహించారు. దైవిక్ భగేలా, జీషన్ అయూబ్ కీలక పాత్రలు పోషించారు. జీ స్టూడియోస్, ఎమ్మాయ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో జీ 5 ఒరిజినల్‌పై మోనీషా అద్వానీ, మధు భోజ్వానీ, నిఖిల్ అద్వానీ నిర్మించారు. ఈ సినిమాని థియేటర్లో కాకుండా డైరెక్టుగా జీ5 ఓటీటీలో జులై 4న విడుదల చేస్తున్నారు మేకర్స్. ఈ విషయాన్ని అభిషేక్ బచ్చన్ సోషల్ మీడియా వేదిక ద్వారా స్పష్టం చేసి, 'కాళీధర్ లాపతా' పోస్టర్‌ను షేర్ చేశారు. ''గ్రామీణ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. తన కుటుంబం తనను వదిలించుకోవాలని చూస్తున్న విషయం తెలుసుకున్న ఓ వృద్ధుడి నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. కుటుంబానికి దూరంగా పారిపోవాలనే ప్రయత్నం చేస్తున్న సమయంలో ఎనిమిదేళ్ల అనాథ అయిన బల్లూతో పరిచయం తన జీవితాన్ని ఎలా మార్చింది? అన్నది ఈ కథలో ఆసక్తిగా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

# మూఢ నమ్మకాల మీద పోరాటం


● చరణ్, అభిజ్ఞ

అభిజ్ఞ ఊతలూరు, చరణ్ లక్కరాజు లీడ్ రోల్స్‌లో కృష్ణ పోలూరు దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్'. సౌత్ ఇండియన్ స్క్రీన్స్ బ్యానర్‌పై కేవీ శ్రీరామ్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 27నుంచి జీ5లో ప్రీమియర్ కానుంది. గురువారం నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన నటుడు నవీన్ చంద్ర, ట్రైలర్‌ని విడుదల చేసి, మాట్లాడుతూ– ''రెక్కీ' నాకు చాలా ఇష్టమైన వెబ్ సిరీస్. ఆ సిరీస్ తీసిన కృష్ణగారు 'విరాటపాలెం' తీయడం సంతోషంగా ఉంది. ఈ సిరీస్‌లో నాకు కూడా అవకాశం ఇస్తే బాగుండేది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''రెక్కీ' తర్వాత పదిహేను కథలు విన్నా, నచ్చలేదు. కానీ దివ్యగారి 'విరాటపాలెం' నన్ను చాలా వెంటాడటంతో ఈ సిరీస్ తీశాను'' అని పేర్కొన్నారు. ''ఈ ప్రాజెక్ట్‌కి దివ్యగారు కథను అందించారు. 'రెక్కీ'లానే ఈ ప్రాజెక్ట్ కూడా అందర్నీ ఆకట్టుకుంటుంది'' అన్నారు కృష్ణ పోలూరు. ''మూఢ నమ్మకాల మీద పోరాడే ఈ కథ అద్భుతంగా ఉంటుంది. మా సిరీస్ అందర్నీ ఆకట్టుకుంటుంది'' అని అభిజ్ఞ ఊతలూరు, చరణ్ లక్కరాజు తెలిపారు. ఈ ఈవెంట్‌లో కెమెరామేన్ మహేశ్ కె. స్వరూప్, కథా రచయిత్రి దివ్య, జీ5 కంటెంట్ హెడ్ సాయి తేజ్ మాట్లాడారు.

## ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్‌తో వొడాఫోన్ ఒప్పందం

**స్మార్ట్‌ఫోన్ల ద్వారా శాట్‌కామ్ సేవలు**

**న్యూఢిల్లీ:** ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా కొత్తగా స్మార్ట్‌ఫోన్లతో నేరుగా శాటిలైట్ కమ్యూనికేషన్ (శాట్‌కామ్) సర్వీసులను అందించేందుకు ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా టెలికం సేవలు లేని ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీని పెంచేందుకు ఇది దోహదపడుతుందని కంపెనీ తెలిపింది. ప్రామాణిక మొబైల్ ఫోన్‌ని ఉపయోగించి అంతరిక్షం నుంచి తొలిసారిగా వాయిస్, వీడియో కాల్‌కు వీలు కల్పించడం ద్వారా ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ చరిత్ర సృష్టించిందని పేర్కొంది. అమెరికన్ దిగ్గజం ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్‌ఎక్స్‌కి ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ పోటీ కంపెనీ. స్పేస్‌ఎక్స్ కూడా ఇదే తరహా సర్వీసులు అందించేందుకు రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంది. భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం టెలికం శాఖ నుంచి లైసెన్సు కూడా దక్కించుకుంది.




# టర్మ్ ప్లాన్ సమగ్రంగా ఉండాలి..!

- పిల్లల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న తల్లులు
- వారి భవిష్యత్తుకు భరోసా ఉండాలన్న ఆకాంక్ష
- క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ పట్ల అధిక ఆసక్తి
- బజాజ్ అలియాంజ్ లైఫ్ సర్వేలో వెల్లడి



**పుణె:** మహిళల ఆర్థిక ప్రాధాన్యతల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నట్టు బజాజ్ అలియాన్జ్ లైఫ్ ఇన్సూరెన్స్ నిర్వహించిన ''ఉమెన్ టర్మ్ సర్వే 2025''లో వెల్లడైంది. పిల్లల భవిష్యత్తు, వారి విద్య, ఆరోగ్య పరిరక్షణకు వారు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటి విషయంలో ఎక్కువ ఆందోళన చెందుతున్నారు. పిల్లల భద్రత దృష్ట్యా టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా, 53 శాతం మహిళలు అనుకోని వైద్య ఖర్చులు తమ కుటుంబ పొదుపులపై ప్రభావం చూపుతాయని ఆందోళన చెందుతున్నారు. అందుకే 87 శాతం మహిళలు క్రిటికల్ ఇల్‌నెస్ కవర్‌ను అత్యంత అవసరంగా భావిస్తున్నారు. అంతేగాక, 50 శాతం మంది మహిళలు టర్మ్ ప్లాన్‌లో ఆరోగ్య సేవలు కూడా ఉండాలని సర్వేలో తెలిపారు. దీనికితోడు తమకు ఏదైనా జరగానిది జరిగితే పిల్లల విద్యా అవసరాలను తీర్చే రక్షణ కూడా టర్మ్ ప్లాన్లలో భాగంగా ఉండాలని మహిళలు భావిస్తున్నారు.

**సర్వేలో ముఖ్యాంశాలు**

- ఏదైనా ఊహించని పరిస్థితులు ఎదురైతే పిల్లలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని 61 శాతం మంది మహిళలు భావిస్తున్నారు.
- 61 శాతం మంది ఆదాయ స్థిరత్వానికి, 53 శాతం మంది వైద్య వ్యయాలకు, 54 శాతం మందికి రిటైర్మెంట్ ప్రణాళిక, 57 శాతం మంది మహిళలు విద్యకు తొలి ప్రాధాన్యమని సర్వేలో చెప్పారు.
- 46 శాతం మంది మహిళలు పిల్లల భవిష్యత్ భద్రత కోసం టర్మ్ ఇన్సూరెన్స్‌లో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు.
- 87 శాతం మహిళలు క్రిటికల్ ఇల్‌నెస్ కవర్‌ను అత్యవసరంగా భావిస్తున్నారు.
- 93 మంది టర్మ్ ప్లాన్‌లో 'పిల్లలకు ఆదాయ భద్రత' సదుపాయాన్ని ఆకర్షణీయంగా చూస్తున్నారు.
- 51 శాతం మహిళలు జీవిత బీమా కవరేజీ పెంచుకునే సదుపాయాన్ని కోరుకుంటున్నారు.
- 33 శాతం పిల్లల విద్యా భవిష్యత్తుకు సంబంధించిన ప్రయోజనాలు టర్మ్ ప్లాన్‌లో తప్పనిసరిగా ఉండాలని కోరుకుంటున్నారు.
- బీమా కవరేజీని సవరించుకునే సౌలభ్యం లేకపోవడాన్ని లోపంగా చూస్తున్నారు.

> **సమగ్ర పరిష్కారంగా చూస్తున్నారు..**
>
> టర్మ్ ఇన్సూరెన్స్‌ను కేవలం జీవిత బీమా రక్షణగానే మహిళలు చూడడం లేదని సర్వే ఫలితాలు తెలియజేస్తున్నాయి. తమ ఆర్థిక ప్రాధాన్యతలకు సరితూగే సమగ్రమైన పరిష్కారంగా చూస్తున్నారు. మహిళల అవసరాలకు అనుకూలమైన ఉత్పత్తులను ఆవిష్కరించే దిశగా ఈ సర్వే ఫలితాలు మాకు ప్రేరణనిస్తాయి. **- తరుణ్ ఛుగ్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఈవో**

### ఐపీవో స్ట్రీట్

## క్యాపిల్లరీ టెక్నాలజీస్ రెడీ..

**సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు**




**న్యూఢిల్లీ:** సాస్(ఎస్ఏఏఎస్) సేవల కంపెనీ క్యాపిల్లరీ టెక్నాలజీస్ ఇండియా పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 430 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.83 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 120 కోట్లు క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యయాలకు, ప్రొడక్టులు, ప్లాట్‌ఫామ్ సంబంధ రీసెర్చ్, డిజైనింగ్, డెవలప్‌మెంట్‌కు రూ. 152 కోట్లు చొప్పున వెచ్చించనుంది. రూ. 10 కోట్లు కంప్యూటర్ సిస్టమ్స్ కొనుగోలుకి, మరికొన్ని నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. ఇంతక్రితం 2021 డిసెంబర్‌లో కంపెనీ సెబీకి దరఖాస్తు చేసినప్పటికీ అనుమతి లభించలేదు. కంపెనీ ప్రధానంగా ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లకు ఏఐ ఆధారిత క్లౌడ్‌నేటివ్ సాస్ ప్రొడక్టులు, సొల్యూషన్లు అందిస్తోంది. గతేడాది(2024–25) కంపెనీ ఆదాయం 14 శాతం పుంజుకుని రూ. 598 కోట్లను తాకింది. టర్న్‌అరౌండ్ సాధించి రూ. 13 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది రూ. 59 కోట్ల నష్టాలు ప్రకటించింది.

## పీఎన్‌జీఎస్ రెవా డైమండ్ సెబీకి దరఖాస్తు




**న్యూఢిల్లీ:** రిటైల్ జ్యువెలరీ కంపెనీ పీఎన్‌జీఎస్ రెవా డైమండ్ జ్యువెలరీ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 450 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో దాదాపు రూ. 289 కోట్లు కొత్త స్టోర్ల ఏర్పాటుకు వినియోగించనుంది. 2028కల్లా కొత్తగా 15 స్టోర్లను తెరిచే ప్రణాళికల్లో ఉంది. ఈ బాటలో ప్రధాన బ్రాండు 'రెవా' మార్కెటింగ్, ప్రమోషనల్ కార్యక్రమాల కోసం రూ. 35 కోట్లకుపైగా వెచ్చించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. ప్రమోటర్ పీఎన్ గాడ్గిల్ అండ్ సన్స్ స్లంప్ సేల్ ద్వారా డైమండ్ బిజినెస్‌ను విక్రయించడంతో కంపెనీ ఆవిర్భవించింది. దీంతో పీఎన్‌జీఎస్ రెవా ప్రత్యేక కంపెనీగా సొంత గుర్తింపుతో డైమండ్ జ్యువెలరీ మార్కెట్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2025 మార్చి31కల్లా మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటకల్లో 33 స్టోర్లను కలిగి ఉంది. గతేడాది(2024–25) ఆదాయం 32 శాతం ఎగసి రూ. 258 కోట్లను తాకగా.. నికర లాభం 40 శాతం జంప్‌చేసి రూ.59 కోట్లను అధిగమించింది.

# స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సొమ్ము మూడింతలు




- 2024 చివరికి రూ.37,600 కోట్లు
- వ్యక్తిగత ఖాతాల్లో రూ.3,675 కోట్లు

**న్యూఢిల్లీ/జ్యూరిచ్:** స్విస్ బ్యాంకుల్లోని భారతీయుల నిధులు (డిపాజిట్లు, సెక్యూరిటీలు సహా) మూడింతలకు పైగా పెరిగి 2024 చివరికి 3.5 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్‌కు (రూ.37,600 కోట్లు) చేరాయి. 2021 తర్వాత స్విస్ బ్యాంకుల్లో భారత నిధులు గరిష్ట స్థాయికి చేరుకోవడం మళ్లీ ఇదే కావడం గమనార్హం. 2021లో ఈ మొత్తం 3.83 స్విస్ ఫ్రాంక్స్‌గా ఉన్నాయి. ఈ వివరాలను స్విస్ నేషనల్ బ్యాంక్ (ఎస్ఎన్‌బీ) గురువారం విడుదల చేసింది. బ్యాంక్ ఛానళ్లు, ఇతర ఆర్థిక సంస్థల రూపంలో జమ అయిన నిధులు ఇవి. ఇక స్విస్ బ్యాంకుల్లోని భారత క్లయింట్ల ఖాతాల్లోని డిపాజిట్లు 11 శాతం పెరిగి 346 మిలియన్ స్విస్ ఫ్రాంక్స్ (రూ.3,675 కోట్లు)గా ఉన్నాయి. మొత్తం నిధుల్లో క్లయింట్ల ఖాతాల్లో ఉన్నవి 10 శాతమేనని తెలుస్తోంది. విడిగా చూస్తే.. 3.02 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ ఇతర బ్యాంకుల రూపంలో ఉంటే, 346 మిలియన్ల ఫ్రాంక్స్ కస్టమర్లకు చెందిన వ్యక్తిగత ఖాతాల్లో ఉన్నాయి. 41 మిలియన్లు ఫిడూషియరీలు లేదా ట్రస్టుల రూపంలో, 135 మిలియన్ల ఫ్రాంక్స్ బాండ్లు, ఇతర సెక్యూరిటీల రూపంలో ఉన్నట్టు ఎస్ఎన్‌బీ వెల్లడించింది. నిజానికి స్విస్ బ్యాంకుల్లోని భారతీయుల డిపాజిట్లు 2023లో 70 శాతం క్షీణించి 1.04 ఫ్రాంక్స్‌గా ఉండడం గమనార్హం. ఆ తర్వాత రెండేళ్లలో ఇవి గణనీయంగా పెరిగినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ, 2026లో స్విస్ బ్యాంకుల్లోని భారతీయుల డిపాజిట్లు 6.5 బిలియన్ల ఫ్రాంక్స్ కంటే తక్కువే. బ్యాంకులు అందించిన సమాచారంగా ఎస్ఎన్‌బీ విడుదల చేసిన గణాంకాలు ఇవి. ఇందులో నల్లధనం వివరాల్లేవు. అలాగే, ఏ సంస్థల పేరు మీద ఖాతాలున్నాయనే వివరాలను కూడా వెల్లడించలేదు.

**నల్లధనంగా చూడరాదు..**

భారతీయులు స్విట్జర్లాండ్‌లో కలిగి ఉన్న ఆస్తులను 'నల్లధనం'గా పరిగణించకూడదన్నది స్విస్ అధికారుల వాదన. ''పన్ను మోసాలు, పన్ను ఎగవేతలకు వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి స్విట్జర్లాండ్ మద్దతుగా నిలుస్తుంది. 2018 నుంచి భారతీయుల డిపాజిట్ల వివరాలను ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ మార్గంలో అందజేస్తున్నాం. మొదటిగా 2019లో డేటా బదిలీ చేయగా.. అప్పటి నుంచి ఏటా ఇది కొనసాగుతూనే ఉంది. ఆర్థిక అవకతవకలకు సంబంధించి అనుమానం ఉన్న ఖాతాల వివరాలు కూడా అందిస్తూనే ఉన్నాం''అని స్విస్ అధికారులు తెలిపారు. ఇక స్విస్ బ్యాంకుల్లో మొత్తం విదేశీ క్లయింట్ల నిధులు 2024లో 977 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌కు తగ్గాయి. అంతకుముందు ఏడాదిలో ఇవి 983 బిలియన్ ఫ్రాంక్స్‌గా ఉన్నాయి. స్విస్ బ్యాంకుల్లో ఉన్న విదేశీ ఫండ్స్‌లో దేశాల వారీగా చూస్తే భారత్ 48వ స్థానంలో ఉంది. గతేడాది 67వ స్థానం నుంచి పుంజుకుంది. అంతర్జాతీయంగా చూస్తే స్విస్ బ్యాంకుల్లోని విదేశీ క్లయింట్ల నిధుల్లో 222 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ యూకే నుంచే ఉండడం గమనార్హం. 89 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ యూఎస్, 68 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ వెస్టిండీస్ క్లయింట్లకు చెందినవి. పాకిస్థాన్ క్లయింట్లకు సంబంధించి 272 మిలియన్ ఫ్రాంక్స్, బంగ్లాదేశ్ క్లయింట్లకు సంబంధించి 589 మిలియన్ ఫ్రాంక్స్ కూడా ఉన్నాయి.

# ప్రాజెక్ట్ రుణాలకు కొత్త నిబంధనలు

- విడుదల చేసిన ఆర్‌బీఐ
- ప్రొవిజన్లు గరిష్టంగా 1.25%
- అక్టోబర్ 1 నుంచి అమల్లోకి



**ముంబై:** మౌలిక రంగ ప్రాజెక్టులు, మౌలికేతర ప్రాజెక్టులకు బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఇతర నియంత్రిత సంస్థలు మంజూరు చేసే రుణాలకు సంబంధించి ఆర్‌బీఐ కొత్త నిబంధనలను విడుదల చేసింది. వీటి ప్రకారం ప్రాజెక్టులు వాణిజ్య కార్యకలాపాల ప్రారంభించే తేదీ (డీసీసీవో) విషయంలో వెసులుబాటు కల్పించింది. ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు మూడేళ్లు, నాన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు రెండేళ్ల పాటు డీసీసీవో పొడిగింపు పరిమితికి అవకాశం ఇచ్చింది. కొత్త మార్గదర్శకాల అమలుకు ప్రాజెక్టులను స్థూలంగా.. డిజైన్, నిర్మాణం, కార్యకలాపాల దశలుగా వర్గీకరించారు. ''నిర్మాణ దశలోని ప్రాజెక్టులకు బ్యాంక్‌లు లేదా ఎన్‌బీఎఫ్‌సీల రుణ వితరణ గరిష్టంగా రూ.1,500 కోట్లను మించకూడదు. విడిగా ఒక్కో రుణ దాత ఎక్స్‌పోజర్ ఇందులో 10 శాతానికి తక్కువ కాకుండా ఉండాలి. రూ1,500 కోట్లకు మించిన ప్రాజెక్టు రుణాల్లో ఒక్కో రుణదాత వారీ వాటా కనీసం 5 శాతం లేదా రూ.150 కోట్లు ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే అది వర్తిస్తుంది. రుణాన్ని ఖరారు చేయడానికి ముందే సంబంధిత ప్రాజెక్టుల నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు/ క్లియరెన్స్‌లు వచ్చినట్టు ధ్రువీకరించుకోవాలి. పర్యావరణ, చట్టబద్ధమైన, నియంత్రణ సంస్థల అనుమతులు ఇందులో భాగంగా ఉంటాయని ఆర్‌బీఐ తెలిపింది. రుణం మంజూరు చేసిన తర్వాత కూడా బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ ప్రాజెక్టుల పనితీరును పర్యవేక్షిస్తూ ఉండాలి. సంబంధిత ప్రాజెక్టు సమస్యల్లో పడుతుందన్న సంకేతాలు కనిపిస్తే ముందస్తుగానే పరిష్కార ప్రణాళికకు చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. 2025 అక్టోబర్ 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి. వాణిజ్య రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు రుణాలకు సంబంధించి 1.25% ప్రొవిజన్ చేయాల్సి (పక్కన పెట్టడం) ఉంటుంది. వాణిజ్య-నివాస రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు ఇది ఒక శాతంగా ఉంటుంది. ఇతర ప్రాజెక్టుల రుణాలకు సైతం ఒక శాతం ప్రొవిజన్లు కేటాయించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులు కార్యకలాపాల దశలోకి వచ్చిన తర్వాత వీటికి సంబంధించిన కేటాయింపులు వరుసగా 1%, 0.75%, 0.40 శాతంగా ఉండనున్నాయి. నిజానికి గతంలో విడుదల చేసిన ముసాయిదా నిబంధనల్లో ప్రాజెక్టు రుణాలకు సంబంధించి.. నిర్మాణ దశలో ఉన్న వాటికి 5 శాతం, కార్యకలాపాలు మొదలు పెట్టిన తర్వాత ఒక శాతం కేటాయింపులు నిర్వహించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించడం గమనార్హం.

## కొనుగోళ్ల వైపు టాటా కన్జూమర్ చూపు

- ఇతర కంపెనీలపై కన్ను
- గతేడాది క్యాపిటల్ ఫుడ్స్, ఆర్గానిక్ ఇండియా కొనుగోలు

**న్యూఢిల్లీ:** ఎఫ్ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ ఇతర కంపెనీలను కొనుగోలు చేసే అవకాశాలను అన్వేషిస్తోంది. ఓవైపు సొంతంగా కార్యకలాపాలు విస్తరిస్తూనే టాటా గ్రూప్ కంపెనీ కొంతకాలంగా పలు సంస్థలను సొంతం చేసుకుంటోంది. ఏడాది క్రితం క్యాపిటల్ ఫుడ్స్‌తోపాటు, ఆర్గానిక్ ఇండియాను రూ. 7,000 కోట్ల సంయుక్త విలువలో కొనుగోలు చేసింది. మార్కెట్లో కంపెనీ ఎల్లవేళలా ఇతర సంస్థల కొనుగోలుకి సిద్ధంగా ఉంటుందని టాటా కన్జూమర్ డైరెక్టర్ పీబీ బాలాజీ పేర్కొన్నారు. కంపెనీ పోర్ట్‌ఫోలియోకు సరిపోయే సంస్థ తగిన ధరలో దొరికితే వదిలిపెట్టబోమని తెలియజేశారు. అయితే సొంతంగా కార్యకలాపాలు విస్తరించడానికే తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఐదేళ్ల క్రితం ఆవిర్భవించిన కంపెనీ ప్రధానంగా ఫుడ్ విభాగంలో కొనుగోళ్లకు తెరతీసింది. ఈ బాటలో బెంగళూరు సంస్థ కొట్టారం ఆగ్రో ఫుడ్స్‌ను సైతం చేజిక్కించుకుంది. అత్యంత గరిష్టాలకు చేరిన టీ ధరలు ఇటీవల నిలకడను సంతరించుకుంటున్నట్టు వాటాదారుల వార్షిక సమావేశంలో బాలాజీ పేర్కొన్నారు. వెరసి ఇకపై కంపెనీ మార్జిన్లు, లాభదాయకత మెరుగుపడనున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది తేయాకు దిగుబడి గతేడాదిని మించనున్నట్టు అభిప్రాయపడ్డారు. కాఫీ ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పటికీ ఈ ఏడాది సాధారణ స్థితికి చేరవచ్చని అంచనా వేశారు.

## ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌లోకి బజాజ్ మార్కెట్స్



**న్యూఢిల్లీ:** ఆర్థిక సాధనాలు, సర్వీసుల డిజిటల్ మార్కెట్‌ప్లేస్ బజాజ్ మార్కెట్స్ తాజాగా ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌తో (ఓఎన్‌డీసీ) అనుసంధానమైంది. దీనితో బజాజ్ మార్కెట్స్ యాప్, వెబ్‌ను ఉపయోగించే కస్టమర్లు, ఆ ప్లాట్‌ఫాంలో లభించే సర్వీసులతో పాటు ఇకపై ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌పై కూడా ఎలక్ట్రానిక్స్, ఉపకరణాలు మొదలైన వాటి కోసం షాపింగ్ చేయొచ్చు. బజాజ్ మార్కెట్స్‌కి చెందిన 1.6 కోట్ల యూజర్లకు ఓఎన్‌డీసీ అందుబాటులోకి వస్తుంది.

## ఐసీటీ అకాడెమీతో సైయెంట్ ఫౌండేషన్ జట్టు



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఇంటెలిజెంట్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ సైయెంట్‌లో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) విభాగమైన సైయెంట్ ఫౌండేషన్ తాజాగా ఐసీటీ అకాడమీతో జట్టు కట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఇంజినీరింగ్, ఆర్ట్స్, సైన్స్ విద్యా సంస్థల విద్యార్థుల కోసం ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఆవిష్కరించింది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు చెందిన 2,000 మంది విద్యార్థులకు ఎంట్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలు, పరిశ్రమపై అవగాహన పెంపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఈ కోర్సు 12 నెలల పాటు సాగుతుంది. ఎంపిక చేసిన 1,000 మంది విద్యార్థులకు తదుపరి శిక్షణనిస్తారు. వారిలో టాప్ 100 మంది విద్యార్థులకు వ్యక్తిగత మెంటారింగ్, నిధుల సమీకరణ విషయంలో మార్గదర్శకత్వం, లీడర్‌షిప్, మార్కెట్లోకి ప్రవేశించే వ్యూహాలు మొదలైన వాటిపై శిక్షణ కల్పిస్తారు.

# 'రేర్ ఎర్త్' రీసైక్లింగ్‌పై అటెరో రూ. 100 కోట్ల పెట్టుబడులు



**న్యూఢిల్లీ:** రేర్ ఎర్త్ లోహాల (ఆర్‌ఈఈ) రీసైక్లింగ్ సామర్థ్యాలను వచ్చే ఏడాది, రెండేళ్ల వ్యవధిలో 30,000 టన్నులకు పెంచుకోవాలని ఈ-వేస్ట్ రీసైక్లింగ్ కంపెనీ అటెరో నిర్దేశించుకుంది. ఇందుకోసం రూ. 100 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలు ఉన్నట్లు సంస్థ సీఈవో నితిన్ గుప్తా తెలిపారు. ప్రస్తుతం కంపెనీకి 300 టన్నుల సామర్థ్యం ఉంది. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఇతర టెక్నాలజీ ఉత్పత్తుల తయారీలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ కీలకంగా ఉంటాయి. నియోడైమియం, ప్రసియోడైమియం, డిస్‌ప్రోజియంలాంటి అరుదైన ఖనిజాల వెలికితీతపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు గుప్తా వివరించారు. కీలకమైన ఖనిజాల కోసం దిగుమతులపై ఆధారపడకుండా భారత్ స్వయం సమృద్ధి సాధించాలనేది తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఆర్‌ఈఈ మార్కెట్ 2029 నాటికి ఆర్‌ఈఈ మార్కెట్ ఏటా 12.6 శాతం వార్షిక వృద్ధితో 10.9 బిలియన్ డాలర్లకు చేరుతుందని, ఆర్‌ఈఈ మ్యాగ్నెట్ల మార్కెట్ 2033 నాటికి 30.3 బిలియన్ డాలర్ల స్థాయిని దాటొచ్చని అంచనాలు నెలకొన్నాయి. అటెరోకి 46 గ్లోబల్ పేటెంట్లు ఉన్నాయి. అమెరికా, యూరప్‌లో కార్యకలాపాలను విస్తరించే యోచనలో ఉంది.

**నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)**

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| TATACONSUM | 1,088.00 | 2.14 |
| EICHERMOT | 5,485.00 | 1.71 |
| M&M | 3,089.00 | 1.58 |
| WIPRO | 265 | 1.3 |
| DRREDDY | 1,330.00 | 1.27 |

**నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)**

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ADANIPORTS | 1,338.00 | -2.52 |
| BAJFINANCE | 898 | -2.29 |
| SHRIRAMFIN | 648.3 | -2.08 |
| TECHM | 1,678.00 | -1.91 |
| ADANIENT | 2,414.00 | -1.83 |

**స్టాక్ మార్కెట్ డేటా**

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 5,823 |
| ఎన్ఎస్ఈ | 90,377 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,49,673 |
| ఎఫ్ఐఐ | + 935 |
| డీఐఐ | + 606 |

**ముడిచమురు... (బ్యారెల్)**


| | | | |
|---|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 73.79 | $ | 73.05 |
| బ్రెంట్ | 78.74 | $ | 76.07 |

**కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)**

| 20-6-2025 | |
|---|---|
| విశాఖ | 565–00 |
| చిత్తూరు | 583–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 520–00 |
| విజయవాడ | 540–00 |
| రిటైల్ ధర (డజను) | 78.00 |
| హైదరాబాద్ | 515–00 |
| వరంగల్ | 517–00 |
| రిటైల్ ధర | 5.75 |

# ఇంధన పరివర్తనంలో భారత్‌కు 71వ ర్యాంక్

- గతేడాదితో కంటే 8 స్థానాలు తక్కువ
- నంబర్ 1 స్థానంలో స్వీడన్



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ఇంధన పరివర్తన సూచీలో భారత్ ర్యాంక్ 71వ స్థానానికి దిగజారింది. గతేడాది భారత్ 63వ స్థానంలో ఉండడం గమనార్హం. ఇంధన పరివర్తనంలో అంతర్జాతీయంగా 118 దేశాలతో కూడిన జాబితాలో స్వీడన్ అగ్రస్థానంలో నిలిచింది. ఫిన్లాండ్, డెన్మార్క్, నార్వే, స్విట్జర్లాండ్ టాప్–5లో ఉన్నాయి. చైనా 12వ స్థానం దక్కించుకోగా, యూఎస్ 17వ స్థానంలో నిలిచింది. పాకిస్థాన్ 101 ర్యాంక్‌తో సరిపెట్టుకోగా, కాంగో జాబితాలో అట్టడుగు స్థానంలో ఉంది. ఈ వివరాలను ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసింది. పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో చైనా, భారత్ మెరుగైన పనితీరు చూపించినట్టు డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. ముఖ్యంగా ఇంధనం లభ్యత, పరివర్తనానికి సిద్ధం కావడంలో పురోగతి సాధించినట్టు పేర్కొంది. అంతర్జాతీయంగా ఇంధన పరివర్తనం (సుస్థిర, పర్యావరణ అనుకూల ఇంధనాలు) దశ, దిశలను అంతిమంగా టాప్–5 ఆర్థిక వ్యవస్థలైన చైనా, యూఎస్, ఈయూ, జపాన్, భారత్ నిర్ణయించనున్నట్టు తెలిపింది. ఇంధన లభ్యత, పునరుత్పాదక ఇంధన వనరులు, శుద్ధ ఇంధన సాంకేతిక పరిజ్ఞానంపై పెట్టుబడులు, నియంత్రణలు మెరుగుపరిచే దిశగా గడిచిన దశాబ్ద కాలంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించినట్టు పేర్కొంది. ఇంధన భద్రతలో యూఎస్ అగ్రగామిగా ఉంటే.. ఇంధన సామర్థ్యం, పెట్టుబడుల పరంగా భారత్ ముందడుగు వేసినట్టు తెలిపింది. 2024లో పర్యావరణ అనుకూల శుద్ధ ఇంధన రంగంలో 2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినప్పటికీ.. అదే ఏడాది 37.8 బిలియన్ టన్నులకు కర్బన ఉద్గారాలు పెరిగినట్టు పేర్కొంది.

# డిజిటల్ అరెస్ట్‌ల నిరోధానికి పరిష్కారాలు చూడండి

- ఫిన్‌టెక్‌లకు ఆర్థిక మంత్రి సీతారామన్ పిలుపు
- ఎంఎస్ఎంఈలకూ రుణాలందించాలని సూచన



**న్యూఢిల్లీ:** డిజిటల్ అరెస్ట్‌లు, ఇతర సైబర్ మోసాలు పెరిగిపోతున్న తరుణంలో వీటికి కళ్లెం వేసేందుకు సరైన పరిష్కారాలతో ముందుకు రావాలని ఫిన్‌టెక్ స్టార్టప్‌లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయడంలో, మారుమూల ప్రాంతాలకూ చెల్లింపుల సేవలను విస్తరించడంలో ఫిన్‌టెక్‌లు పోషించిన పాత్రను ఆమె ప్రశంసించారు. డిజిటల్ పేమెంట్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఇంట్లోనే ఉన్నవారిని డిజిటల్‌గా అరెస్ట్ చేయకుండా లేదా నైట్ ఆపరేటర్ల ద్వారా డబ్బులు మోసపోకుండా పరిష్కారాలతో ముందుకు రావాలని స్టార్టప్‌లను కోరారు. ప్రజలకు మరింత నష్టం కలిగిస్తున్న డీప్‌ఫేక్ (నకిలీ)ను అతిపెద్ద ముప్పుగా అభివర్ణించారు. కొత్తగా ఎదురయ్యే సవాళ్లకు తగిన పరిష్కారాలను కనుగొని, వాటిని అందించే ఫిన్‌టెక్ స్టార్టప్‌ల అవసరం ఎంతో ఉందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) రుణ సదుపాయాలను విస్తరించాలని ఫిన్‌టెక్‌లను కోరారు. ఫిన్‌టెక్ ఆవిష్కరణలు ప్రపంచవ్యాప్తంగా ప్రజల వినియోగ వస్తువులుగా మారాలంటూ.. అవి ఇతర వర్ధమాన, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు సైతం ప్రయోజనం కలిగిస్తాయన్నారు. మన సంస్థలకు కొత్త మార్కెట్లు తెరుచుకుంటాయని చెప్పారు. ''విజయవంతమైన నమూనాలను విదేశాలకు తీసుకెళ్లాలి. అంతర్జాతీయ మార్కెట్లను సొంతం చేసుకోవాలి. మనకు నైపుణ్యాలున్నాయి. పెద్ద మార్కెట్‌తోపాటు రుజువైన పరిష్కారాలూ ఉన్నాయి''అని మంత్రి వివరించారు. ప్రపంచంలో ప్రస్తుతం రోజువారీ జరుగుతున్న డిజిటల్ల లావాదేవీల్లో సగం భారత్‌లోనే ఉంటున్న విషయాన్ని ప్రస్తావించారు. దేశ ఫిన్‌టెక్ పరిశ్రమ 2028–29 నాటికి 400 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఇది ఎంతో దూరంలో లేదంటూ.. అవకాశాలకు ఆకాశమే హద్దన్నట్టు మంత్రి చెప్పారు.

# అగ్ర స్థానమే లక్ష్యంగా...

నేడు పారిస్ డైమండ్ లీగ్ బరిలో నీరజ్ చోప్రా



పారిస్: భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో అగ్ర స్థానం లక్ష్యంగా మరో టోర్నీలో బరిలోకి దిగనున్నాడు. ఈ ఏడాది 90 మీటర్ల మార్క్‌ను అందుకున్న ఈ మాజీ ఒలింపిక్, వరల్డ్ చాంపియన్ పారిస్ డైమండ్ లీగ్‌లో టాప్ ర్యాంక్‌పై కన్నేశాడు. జర్మన్ స్టార్ జులియన్ వెబెర్, రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) తదితర హేమాహేమీలంతా ఈ మీట్‌లో ఉండటంతో జావెలిన్ త్రో పోటీ ఆద్యంతం రసవత్తరంగా జరగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పైగా 8 మంది బరిలోకి దిగుతున్న ఫైనల్ ఈవెంట్‌లో ఐదుగురు జావెలిన్ త్రోయర్లు 90 మీటర్ల మార్క్‌ను అధిగమించిన వారే ఉండటం పోటీని దీటుగా మార్చేసింది. భారత కాలమానం ప్రకారం నీరజ్ ఈవెంట్ రాత్రి 1 గంట 12 నిమిషాలకు మొదలవుతంది. గత నెలలో జరిగిన దోహా డైమండ్ లీగ్ మీట్‌లో వెబెర్... నీరజ్ చోప్రాను అధిగమించాడు. వెబెర్ ఈటెను 91.06 మీటర్ల దూరం విసిరి అగ్ర స్థానంలో ... చోప్రా 90.23 మీటర్లతో రెండో స్థానంలో నిలిచారు. అనంతరం జరిగిన పోలాండ్ మీట్‌లో ఇద్దరు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చలేకపోయినా... మళ్లీ తొలి రెండు స్థానాల్లో నిలిచారు.

# దేశానికి ఆడకుంటే...

ఇచ్చిన ప్రోత్సాహకాల్ని తిరిగి రాబడతాం

భారత టెన్నిస్ ఆటగాళ్లకు 'సాయ్' స్పష్టీకరణ




న్యూఢిల్లీ: భారత టెన్నిస్ ఆటగాళ్లు దేశం తరఫున ఆడకపోతే ప్రోత్సాహకాల్ని తిరిగి రాబడతామని భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) స్పష్టం చేసింది. కొంత కాలంగా పేరొందిన ఆటగాళ్లు దేశాన్ని విస్మరించి ఏటీపీ టోర్నీలకే ప్రాధాన్యమివ్వడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'సాయ్'... ఆటగాళ్లలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పథకాలు, ప్రోత్సాహకాల రూపేణా ఆర్థిక సాయం పొందిన ఆటగాళ్లు సహేతుక కారణాలు లేకుండా దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు నిరాకరిస్తే ఇచ్చిన మొత్తాన్ని వెనక్కి తీసుకుంటామని ప్రకటించింది. టార్గెట్ ఒలింపిక్ పాడియం పథకం (టాప్స్) ఎప్పటి నుంచో అమలవుతున్నప్పటికీ... ప్రత్యేకంగా ఆసియా క్రీడల్లో పతకాలే లక్ష్యంగా టార్గెట్ ఆసియా క్రీడల గ్రూప్ (టీఏజీజీ) పథకాన్ని కొత్తగా ఈ ఏడాదే తీసుకొచ్చింది. దీనికింద పలువురు ప్లేయర్లకు విదేశీ కోచ్‌లతో శిక్షణ, విదేశీ పర్యటనల కోసం భారత్ నిధులు మంజూరు చేస్తోంది. ఇలా పథకాలతో ఆర్థిక సాయం, ప్రోత్సాహకాలు పొందిన ఆటగాళ్లు దేశానికి ప్రాతినిధ్యం వహించాలంటే మాత్రం ముఖం చాటేస్తున్నారు. భారత మేటి సింగిల్స్ ఆటగాడు సుమిత్ నగాల్ డేవిస్ కప్ ఆడేందుకు అదేపనిగా ససేమిరా అంటున్నాడు. గతేడాది పాకిస్తాన్, స్వీడన్... ఈ ఏడాది టోగోతో డేవిస్ కప్ మ్యాచ్‌లు ఆడకుండా తప్పించుకున్నాడు. ఇలాగే శశికుమార్ ముకుంద్, యూకీ బాంబ్రీలు కూడా డేవిస్ కప్ పోటీలపై అనాసక్తి కనబరుస్తున్నారు. కానీ ఏటీపీ, గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడేందుకు మాత్రం ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ ముగ్గురితో పాటు రాంకుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, సాకేత్ మైనేని, రిత్విక్ బొల్లిపల్లి, మహిళా ప్లేయర్లు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లి, వైదేహి చౌధరీ, రుతుజా, మాయా రాజేశ్వరన్‌లకు టీఏజీజీ కింద ఆర్థిక అండదండలు లభిస్తున్నాయి. 'సాయ్' తాజా నిర్ణయాన్ని అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) సహా డేవిస్ కప్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్, బిల్లీ జీన్ కింగ్ కప్ కెప్టెన్ విశాల్ ఉప్పల్ స్వాగతించారు.



# సెమీస్‌లో సెంథిల్

కుచింగ్ (మలేసియా): ఆసియా స్క్వాష్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ వెలవన్ సెంథిల్ కుమార్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సెంథిల్ 11-7, 11-6, 11-6తో జోచిమ్ చుయె (మలేసియా)పై గెలుపొందాడు. సెమీఫైనల్ చేరడంతో సెంథిల్‌కు కనీసం కాంస్య పతకం ఖాయమైంది.

# అర్జున్ విజయం



తాష్కెంట్: ఉజ్ చెస్ కప్ అంతర్జాతీయ టోర్నమెంట్ మాస్టర్స్ విభాగంలో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఇరిగేశి అర్జున్ శుభారంభం చేశాడు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో అర్జున్ 26 ఎత్తుల్లో నొదిర్‌బెక్ యాకుబొయేవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందాడు. భారత గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద, అరవింద్ చిదంబరం మధ్య జరిగిన తొలి రౌండ్ గేమ్ 30 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. మొత్తం పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. విజేతగా నిలిచిన ప్లేయర్‌కు 20 వేల డాలర్ల (రూ. 17 లక్షల 34 వేలు) ప్రైజ్‌మనీ లభిస్తుంది.




# జూనియర్ హాకీ ప్రపంచకప్ లోగో ఆవిష్కరణ

ఈ ఏడాది నవంబర్-డిసెంబర్‌లో మెగా ఈవెంట్‌కు భారత్ ఆతిథ్యం

చెన్నై: ఈ ఏడాది భారత్‌లో జరగబోయే జూనియర్ పురుషుల హాకీ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించిన లోగోను గురువారం ఆవిష్కరించారు. చెన్నై, మధురై నగరాల్లో ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు జూనియర్ ప్రపంచకప్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ టోర్నీ అధికారిక లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా హాకీ ఇండియా (హెచ్‌ఐ)తో తమిళనాడు ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఐ కార్యదర్శి భోలానాథ్ సింగ్, కోశాధికారి శేఖర్ మనోహరన్, హెచ్‌ఐ డైరెక్టర్ జనరల్ ఆర్.కె.శ్రీవాస్తవ, తమిళనాడు స్పోర్ట్స్ అథారిటీ (ఎస్‌డీఏటీ) కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి, ఆ రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి అతుల్య మిశ్రా తదితరులు పాల్గొన్నారు. ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ తమ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే మెగా ఈవెంట్ కోసం రూ. 65 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ క్రీడాకారులకు, ఈవెంట్లకు ఎల్లప్పుడు మద్దతుగా నిలుస్తారని అన్నారు. తమిళనాడును క్రీడల రాజధానిగా చేస్తున్నారని... చెస్, హాకీలే కాకుండా ఎలాంటి అంతర్జాతీయ ఈవెంట్లకైనా తమిళనాడు అద్భుతమైన రీతిలో ఆతిథ్యమివ్వగలదని వివరించారు. జూనియర్ ప్రపంచకప్‌కు సంబంధించిన 'డ్రా', పూల్స్ వివరాలను లుసానేలో ఈ నెల 24న జరిగే కార్యక్రమంలో వెల్లడిస్తారు. మొత్తం 24 జట్లు ఇందులో పాల్గొనబోతున్నాయి. గత ఈవెంట్‌తో పోలిస్తే 8 జట్లు పెరిగాయి. 24 జట్లను ఆరు పూల్స్‌గా విభజిస్తారు. భారత్‌లో నిర్వహించే మూడో జూనియర్ కప్ ఇది. గతంలో లక్నో (2016), భువనేశ్వర్ (2021)లలో ప్రపంచకప్‌లు జరిగాయి.

# నిసాంక 187; శ్రీలంక 368/4



గాలె: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక దీటుగా బదులిస్తోంది. ఓపెనర్ పాథుమ్ నిసాంక (187; 23 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీతో కదం తొక్కడంతో మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 93 ఓవర్లలో 4 వికెట్లకు 368 పరుగులు చేసింది. దినేశ్ చండీమాల్ (54; 4 ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించగా... ఏంజెలో మాథ్యూస్ (69 బంతుల్లో 39; 3 ఫోర్లు, 1 సిక్స్), లహిరు ఉడారా (34 బంతుల్లో 29; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కమిందు మెండిస్ (37 బ్యాటింగ్), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓవర్‌నైట్ స్కోరు 484/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 11 పరుగులు జోడించి 495 పరుగులకు ఆలౌటైంది.

## భారత కరాటే సంఘం ఉపాధ్యక్షుడిగా పంకజ్ శుక్లా



సాక్షి, హైదరాబాద్: కరాటే కేవలం క్రీడ మాత్రమే కాదని... అది ఒక జీవన విధానమని ప్రతి ఒక్కరికీ దాని అవసరముందని భారత కరాటే సంఘం (కేఏఐ) ఉపాధ్యక్షుడు పంకజ్ శుక్లా అన్నారు. రెండు దశాబ్దాలుగా సమాజ సేవలో నిమగ్నమై ఉన్న పంకజ్ శుక్లా తాజాగా భారత కరాటే సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా నియమితుడయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'కరాటేతో క్రమశిక్షణ అలవడటంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చిన్నప్పటి నుంచే కరాటే శిక్షణ తీసుకున్న యువకుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పిన విధంగా 'ఖేలో ఇండియా', 'ఫిట్ ఇండియా'లో భాగంగా ప్రతి గ్రామానికి, ప్రతి పాఠశాలకు, ప్రతి యువకుడికి కరాటేను చేరువ చేస్తా. బాలికలకు కరాటే శిక్షణ ద్వారా ఆత్మరక్షణ మెలకువలు నేర్పుతాం. తద్వారా అమ్మాయిలు, మహిళలు ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకు వేయగలరు. ముఖ్యంగా గ్రామీణ భారతాన్ని క్రీడారంగంలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తా' అని అన్నారు.

# నెదర్లాండ్స్, స్లొవేనియాలతో భారత్ 'ఢీ'

బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లే ఆఫ్స్ 'డ్రా' విడుదల

- బెంగళూరులో నవంబర్ 14 నుంచి 16 వరకు టోర్నీ
- విజేత జట్టు 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత

బెంగళూరు: ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ వరల్డ్ టీమ్ మహిళల టెన్నిస్ టోర్నమెంట్ ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది నవంబర్ 14 నుంచి 16 వరకు బెంగళూరులోని ఎస్‌ఎం కృష్ణ టెన్నిస్ స్టేడియంలో ఈ టోర్నీ జరగనుంది. భారత్‌తోపాటు ఇతర దేశాల్లో ఇవే తేదీల్లో ఇతర గ్రూప్‌ల ప్లే ఆఫ్స్ టోర్నీలను నిర్వహిస్తారు. 'ప్లే ఆఫ్స్'కు మొత్తం 21 జట్లు అర్హత పొందాయి. 21 జట్లను ఏడు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో మూడు జట్లకు చోటు కల్పించారు. గ్రూప్ విజేతగా నిలిచే ఏడు జట్లు వచ్చే ఏడాది బిల్లీ జీన్ కింగ్ కప్ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తాయి. 2021 తర్వాత వరల్డ్ గ్రూప్ 'ప్లే ఆఫ్స్'కు అర్హత పొందిన భారత జట్టుకు గ్రూప్ 'జి'లో చోటు దక్కింది. గ్రూప్ 'జి'లోనే నెదర్లాండ్స్, స్లొవేనియా జట్లు కూడా ఉన్నాయి. వచ్చే ఏడాది వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించాలంటే భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాల్సి ఉంటుంది. పుణేలో ఇటీవల జరిగిన ఆసియా జోన్ క్వాలిఫయర్స్ టోర్నీలో టాప్-2లో నిలవడం ద్వారా భారత్, న్యూజిలాండ్ జట్లు 'ప్లే ఆఫ్స్' టోర్నీకి అర్హత పొందాయి. హైదరాబాద్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక అద్భుత ఆటతీరు కనబరిచి తాను ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి భారత్ విజయంలో ముఖ్యపాత్ర పోషించింది. రష్మికతోపాటు సహజ యామలపల్లి, అంకిత రైనా, వైదేహి, ప్రార్థన, మాయా రాజేశ్వరన్ జట్టులో ఇతర సభ్యులుగా ఉన్నారు.

### బిల్లీ జీన్ కింగ్ కప్ వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్స్ గ్రూప్ వివరాలు

గ్రూప్ 'ఎ': కెనడా, డెన్మార్క్, మెక్సికో.
గ్రూప్ 'బి': పోలాండ్, రుమేనియా, న్యూజిలాండ్.
గ్రూప్ 'సి': స్లొవేకియా, స్విట్జర్లాండ్, అర్జెంటీనా.
గ్రూప్ 'డి': చెక్ రిపబ్లిక్, కొలంబియా, క్రొయేషియా.
గ్రూప్ 'ఇ': ఆ్రస్టేలియా, బ్రెజిల్, పోర్చుగల్.
గ్రూప్ 'ఎఫ్': జర్మనీ, బెల్జియం, తుర్కియే.
గ్రూప్ 'జి': నెదర్లాండ్స్, స్లొవేనియా, భారత్.

**గట్టిపోటీ తప్పదు...**

వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు తొలిసారి అర్హత పొందాలంటే భారత్ విశేషంగా రాణించాల్సి ఉంటుంది. భారత్ ప్రత్యర్థులుగా ఉన్న నెదర్లాండ్స్, స్లొవేనియాలతో పోలిస్తే టీమిండియా నుంచి ఒక్కరు కూడా టాప్-300 ర్యాంకింగ్స్‌లో లేకపోవడం గమనార్హం. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) తాజా సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి శ్రీవల్లి రష్మిక (322), సహజ (342), అంకిత రైనా (347), వైదేహి (368) మాత్రమే టాప్-400లో ఉన్నారు. డబుల్స్‌లో మాత్రం భారత్ నుంచి ఇద్దరు టాప్-200లో ఉన్నారు. ప్రార్థన తొంబారే 145వ ర్యాంక్‌లో, అంకిత రైనా 190వ ర్యాంక్‌లో ఉన్నారు. నెదర్లాండ్స్ జట్టులో సింగిల్స్ విభాగంలో టాప్-100లో ఇద్దరు సుజాన్ లామెన్స్ (70), అరంటా రుస్ (91)... డబుల్స్‌లో టాప్-100లో ఇద్దరు డెమీ షుర్స్ (18), ఇసాబెల్లి హవెర్లాగ్ (91) ఉన్నారు. స్లొవేనియా జట్టులో సింగిల్స్ విభాగంలో టాప్-250లో ఇద్దరు వెరోనికా ఎర్జావెక్ (172), తమారా జిదాన్‌సెక్ (206)... డబుల్స్‌లో టాప్-300లో ఇద్దరు కాజా జువాన్ (259), ఇవా ఫాల్క్‌నర్ (219) ఉన్నారు.





# మళ్లీ ఓడిన హంపి

సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, స్టార్ ప్లేయర్ కోనేరు హంపి వరుసగా రెండో పరాజయం చవిచూసింది. ఎనిమిదో రౌండ్‌లో జార్జియాకు చెందిన నినో బత్సియాష్‌విలితో జరిగిన గేమ్‌లో హంపి 61 ఎత్తుల్లో ఓడిపోయింది. మరోవైపు భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో ఐదో 'డ్రా' చేరింది. అలైస్ లీ (అమెరికా)తో జరిగిన గేమ్‌ను హారిక 54 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఎనిమిదో రౌండ్ తర్వాత హంపి, హారిక 4.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు.

# బ్రిస్బేన్ హీట్‌తోనే జెమీమా

మహిళల బిగ్‌బాష్ టి20 లీగ్ డ్రాఫ్టింగ్



మెల్‌బోర్న్: భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యురాలు జెమీమా రోడ్రిగ్స్‌ను మహిళల బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్) ఫ్రాంచైజీ బ్రిస్బేన్ హీట్ తిరిగి తీసుకుంది. ఈ ఏడాది జరగనున్న డబ్ల్యూబీబీఎల్ 10వ సీజన్ కోసం భారత్ నుంచి 15 మంది ప్లేయర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. గురువారం జరిగిన ప్లేయర్ల డ్రాఫ్టింగ్‌లో లీగ్‌లోని మొత్తం 8 ఫ్రాంచైజీలు 23 మంది అంతర్జాతీయ ప్లేయర్లను ఎంపిక చేసుకున్నాయి. జెమీమా రోడ్రిగ్స్‌తో పాటు చినెల్లి హెన్రీ (వెస్టిండీస్), డి క్లెర్క్ (దక్షిణాఫ్రికా)ను బ్రిస్బేన్ ఫ్రాంచైజీ ఎంపిక చేసుకుంది. 'అభిమానులను ఆకట్టుకోగల సత్తా జెమీమాకు ఉంది' అని బ్రిస్బేన్ హీట్ యాజమాన్యం వ్యాఖ్యానించింది. జెమీమాకిది నాలుగో బిగ్‌బాష్ లీగ్ సీజన్ కానుంది. 2021-2022 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున... 2022-2023 సీజన్‌లో మెల్‌బోర్న్ స్టార్స్ తరఫున... 2024-2025 సీజన్‌లో బ్రిస్బేన్ హీట్ తరఫున జెమీమా ఆడింది. ఓవరాల్‌గా బిగ్‌బాష్ లీగ్‌లో జెమీమా 30 మ్యాచ్‌లు ఆడి 644 పరుగులు చేసింది. ఇందులో మూడు అర్ధ సెంచరీలున్నాయి. మరోవైపు శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు, షబ్నిమ్ ఇస్మాయిల్ (దక్షిణాఫ్రికా), హీథెర్ నైట్ (ఇంగ్లండ్)ను సిడ్నీ థండర్ జట్టు తీసుకుంది. సోఫియా డంక్లీ, మ్యాడీ విలియర్స్ (ఇంగ్లండ్), అమేలియా కెర్ (న్యూజిలాండ్)ను సిడ్నీ సిక్సర్స్ జట్టు తీసుకుంది. సోఫీ ఎకిల్‌స్టోన్, టామీ బ్యూమాంట్ (ఇంగ్లండ్) , లౌరా వాల్వార్ట్ (దక్షిణాఫ్రికా)ను అడిలైడ్ స్ట్రయికర్స్ ఎంపిక చేసుకోగా... అమీ జోన్స్, డానీ గిబ్సన్ (ఇంగ్లండ్), మరిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా)ను మెల్‌బోర్న్ స్టార్స్ జట్టు ఎంపిక చేసుకుంది. సోఫీ డివైన్ (న్యూజిలాండ్), స్కొల్‌ఫీల్డ్ (ఇంగ్లండ్), క్లో ట్రియాన్ (దక్షిణాఫ్రికా) పెర్ స్కోచెర్స్ జట్టుకు ఎంపికయ్యారు. డానియల్ వ్యాట్, లిన్సే స్మిత్ హోబర్ట్ హరికేన్స్‌కు ప్రాతినిధ్యం వహించనుండగా... మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున డియాండ్రా డాటిన్, అలీస్ కాప్సీ బరిలోకి దిగనున్నారు.



దక్షిణ కొరియాలోని అన్సన్‌లో బుధవారం డొంగ్‌చూన్ సర్కస్‌లో నిపుణుల సాహస విన్యాసాలు. ఆ దేశంలో మిగిలున్న ఏకైక సర్కస్ కంపెనీ ఇదే



ఫిలిప్పీన్స్‌కు చెందిన వీరంతా సూపర్‌మ్యాన్ అభిమానులు. సూపర్‌మ్యాన్ వరల్డ్ టూర్‌లో భాగంగా వీరు గురువారం ఫిలిప్పీన్స్‌లోని పసిగ్‌లో ఇలా మొదటి ప్రదర్శన ఇచ్చారు.



జార్ఖండ్ రాష్ట్రం ఖుంటిలో భారీ వర్షాల కారణంగా బనై నదిపై వంతెనలో కొంతభాగం తెగిపోయింది. మిగతా భాగంపై ఓ ట్రక్కు ఇలా ఇరుక్కుపోయింది

## మూడేళ్ల జైలు రూ.5 వేల జరిమానా

### జన సమూహాల కట్టడికి కర్ణాటక కొత్త చట్టం యోచన

**బెంగళూరు:** జూన్ 4న బెంగళూరులో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం కొత్త చట్టాన్ని తెచ్చేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసింది. కర్ణాటక క్రౌడ్ కంట్రోల్ బిల్–2025 పేరుతో రూపొందించిన ఈ బిల్లులోని అంశాలపై గురువారం జరిగిన కేబినెట్ భేటీ చర్చించింది. భారీ జనం హాజరయ్యే సభలు, సమావేశాల సమయంలో నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా అనూహ్య ప్రమాదాలకు కారణమైనట్లు తేలితే మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. అయితే, రథోత్సం, పల్లకి ఉత్సవం, తెప్పోత్సవం, ఉర్స్ వంటి మత, సంప్రదాయ ఉత్సవాలను బిల్లు నుంచి మినహాయించారు. క్రీడా ప్రదర్శనలు, సర్కస్ వంటి వాణిజ్య కార్యక్రమాలను నిర్వహించే వారు పోలీసుల అనుమతి తీసుకోకున్నా, జనసమూహాల్ని నియంత్రించడంలో విఫలమైనా, బాధితులకు సాయం అందించకున్నా భారీగా జరిమానా విధించే వీలుంటుంది. ఈ కేసుల్లో మూడేళ్ల వరకు జైలు, రూ.5 లక్షల వరకు జరిమానా లేదా రెండింటినీ విధించొచ్చు. అనుమతుల్లేకుండా చేపట్టిన కార్యక్రమంలో ఎవరైనా మరణించిన సందర్భాలను శిక్షార్హ నేరంగా పరిగణిస్తారు. బాధ్యులకు బెయిల్‌కు వీల్లేని వారెంట్‌ను ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జారీ చేస్తారు. వచ్చే కేబినెట్ సమావేశంలో బిల్లును ఆమోదించవచ్చని భావిస్తున్నారు.

## చెన్నై మెట్రో కాంట్రాక్టర్‌కు రూ.కోటి జరిమానా

**చెన్నై:** చెన్నైలోని నందంబాక్కం ప్రాంతంలో వారం క్రితం మెట్రో బీమ్ కూలిన ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటనలో చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్(సీఎంఆర్ఎల్) కాంట్రాక్టర్‌కు రూ.కోటి జరిమానా విధించింది. ఘటనకు చీఫ్ సేఫ్టీ మేనేజర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సోషల్, హెల్త్ అండ్ సేఫ్టీ(ఈఎస్‌హెచ్ఎస్), సీనియర్ ఈఎస్‌హెచ్ఎస్ మేనేజర్‌లే ఈ విషాదానికి బాధ్యులని సీఎంఆర్ఎల్ పేర్కొంది. ఇందుకు సంబంధించి సేఫ్టీ ఇంజనీర్, సీనియర్ డిప్యూటీ రెసిడెంట్ ఇంజనీర్‌లపై చట్ట పరమైన చర్యలకు ఉపక్రమించింది. కాంట్రాక్టర్, జనరల్ కన్సల్టింగ్ విభాగాలకు చెందిన మొత్తం నలుగురిని విధుల నుంచి తొలగించింది. ఈ నెల 11న రాత్రి 9 గంటల సమయంలో నిర్మాణ పనులు జరుగుతుండగానే భారీ కాంక్రీట్ బీమ్ కుప్పకూలి రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో నాగర్‌కోయిల్‌కు చెందిన రమేశ్ అనే వ్యక్తి అక్కడికక్కడే చనిపోయారు. మృతుడి కుటుంబానికి పనులు చేపట్టిన లార్సెన్ టూబ్రో సంస్థ రూ.20 లక్షలు, సీఎంఆర్ఎల్ రూ.5 లక్షలు పరిహారం ప్రకటించాయి. ఘటనకు దారి తీసిన కారణలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## అమెరికా వీసా పొందడం హక్కు కాదు

- అమెరికా రాయబార కార్యాలయం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** వీసా అనేది ప్రత్యేక సదుపాయం (ప్రివిలేజ్) మాత్రమేనని, అది హక్కు కాదని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం గురువారం స్పష్టంచేసింది. వీసా జారీ చేసిన తర్వాత కూడా స్క్రీనింగ్ పరీక్ష ఎదుర్కోవాల్సి ఉంటుందని వెల్లడించింది. చట్టాన్ని అతిక్రమిస్తే వీసాను ఎప్పుడైనా రద్దు చేసే అధికారం ప్రభుత్వ అధికారులకు ఉందని తేల్చిచెప్పింది. ఈ మేరకు యూఎస్ ఎంబసీ 'ఎక్స్'లో ఒక ప్రకటన జారీ చేసింది. అమెరికాలో విద్యార్థి లేదా పర్యాటక వీసాలపై ఉన్నప్పుడు చట్టవ్యతిరేకంగా ప్రవర్తించడం, నిషేధిత మాదక ద్రవ్యాలు తీసుకోవడం వంటివి చేస్తే వీసా రద్దవుతుందని, భవిష్యత్తులో వీసా పొందడానికి అర్హత కోల్పోతారని వివరించింది. అమెరికా వీసాను పొందడం ఎవరూ హక్కుగా భావించవద్దని సూచించింది. యూఎస్ ఎంబసీ ఈ నెలలో ఇలాంటి ప్రకటన విడుదల చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. చట్టబద్ధంగా అమెరికాలోకి వస్తే తమ ప్రభుత్వం స్వాగతిస్తుందని తెలియజేసింది. చట్టవ్యతిరేకంగా వచ్చినా, అడ్డదారుల్లో వీసాలు పొందినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టంచేసింది. అమెరికాలోని అక్రమ వలసదారులను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం బలవంతంగా వెనక్కి పంపిస్తున్న సంగతి తెలిసిందే.

## కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయని..
# సినిమాను, స్టాండప్ కామెడీని ఆపలేం

- 'థగ్ లైఫ్' విడుదల ఆపడంపై సుప్రీం వ్యాఖ్య
- థియేటర్ల వద్ద భద్రత కల్పిస్తామని కర్ణాటక సర్కారు హామీ

**న్యూఢిల్లీ:** కమల్ హాసన్ స్టారర్ 'థగ్ లైఫ్'సినిమా విడుదలను అడ్డుకునే వారిపై గట్టి చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు గురువారం కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయనే కారణంతో సినిమా, స్టాండప్ కామెడీ లేదా కవితా గోష్ఠి వంటి వాటిని ఆపలేమని స్పష్టం చేసింది. 'మన దేశంలో మనోభావాలను దెబ్బతీసే ఘటనలకు ముగింపు కనిపించడం లేదు. స్టాండప్ కమెడియన్ ఏదో అంటే మనోభావాలు దెబ్బతిన్నాయని, విధ్వంసం, నిరసనలకు దిగుతున్నారు. ఎటు వెళ్తున్నాం మనం? ఏంటి దీనర్థం? నిరసనలు చేపట్టారనే కారణంతో సినిమా, స్టాండప్ కామెడీ షో, కవితా గోష్ఠి వంటి వాటిని ఆపేయాలా?'అంటూ జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించింది. కమల్ హాసన్ వ్యాఖ్యల నేపథ్యంలో విడుదల ఆగిన 'థగ్ లైఫ్'ను కర్ణాటకలో ప్రదర్శించేందుకు ఆదేశాలివ్వాలంటూ మహేశ్ రెడ్డి వేసిన పిల్‌పై గురువారం ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రంలోని థియేటర్లలో ఈ సినిమా ప్రదర్శన సమయంలో తగు భద్రత కల్పిస్తామంటూ కర్ణాటక ప్రభుత్వం ఇచ్చిన హామీకి ధర్మాసనం అంగీకరించింది. ఏ వ్యక్తి గానీ, సమూహం గానీ సినిమా ప్రదర్శనకు అవరోధం కల్పించినా, నష్టపరిచినా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషయానికి ఇంతటితో ముగింపు పలుకుతున్నామంది. తమిళం నుంచి కన్నడ పుట్టిందంటూ చేసిన వ్యాఖ్యలకు గాను క్షమాపణ చెప్పాలంటూ కమల్ హాసన్‌ను కర్ణాటక ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్(కేఎఫ్‌సీసీ) కోరడంపై ధర్మాసనం..'దీనికి మేం అస్సలు అంగీకరించం. ఒక అభిప్రాయం కారణంగా సినిమాను అడ్డుకుంటారా? స్టాండప్ కామెడీని, కవితా పఠాన్ని ఆపేస్తారా?'అని ప్రశ్నించింది. అయితే, తమకు కొన్ని సమూహాల నుంచి బెదిరింపులు వచ్చినందునే కమల్‌ను క్షమాపణ చెప్పాలని ఒక లేఖ ద్వారానే కోరామని, అంతే తప్ప కమల్‌ను బెదిరించలేదని కేఎఫ్‌సీసీ వివరించింది. బెదిరింపుల విషయాన్ని పోలీసుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని కేఎఫ్‌సీసీని ధర్మాసనం ప్రశ్నించింది. సినిమా విడుదల చేస్తే తీవ్ర పరిణామాలుంటాయంటూ వచ్చిన బెదిరింపుల విషయం తెలపగా కేఎఫ్‌సీసీ స్పందించలేదని మహేశ్ రెడ్డి తరపు లాయర్ తెలిపారు. బెదిరించిన వారిపై చర్యలు తప్పక తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ లాయర్ హామీ ఇచ్చారు. కన్నడ సాహిత్య పరిషత్ తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ నూలి వాదనలు వినిపించారు. కమల్ వ్యాఖ్యల నేపథ్యంలో రాష్ట్రంలో కన్నడిగుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కమల్ క్షమాపణ చెబితేనే రాష్ట్రంలో ఆ సినిమా ప్రదర్శన వీలవుతుందని, లేకుంటే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. 'అంటే.. థగ్ లైఫ్ అనధికార బ్యాన్‌ను, థియేటర్లను బుగ్గిపాలు చేసేందుకు మీరు మద్దతిస్తున్నారా?'అని ధర్మాసనం ప్రశ్నించింది. 'క్షమాపణ చెప్పడం ఏమిటి? చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోలేరు. మనోభావాలు గాయపడితే పరువునష్టం కేసు వేయండి..!'అని ధర్మాసనం పేర్కొంది. హింసకు పాల్పడే వారిని తాము ప్రోత్సహించమంటూ కన్నడ సంస్థ తరఫు లాయర్ పేర్కొనగా 'సినిమా విడుదలను కూడా మీరు అడ్డుకోరాదు'అని గట్టిగా వార్నింగ్ ఇచ్చింది.

## వాణిజ్య భాగస్వామ్యంపై అమెరికా అధ్యక్షుడి ఆసక్తి

### ట్రంప్-మునీర్ భేటీ అనంతరం పాక్ సైన్యం వెల్లడి


**ఇస్లామాబాద్:** తమ దేశంతో ఉభయ ప్రయోజనకరమైన వాణిజ్య భాగస్వామ్యం పెంపొందించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతో ఆసక్తి కనబరిచారని పాక్ ఆర్మీ వర్గాలు తెలిపాయి. బుధవారం వాషింగ్టన్‌లో ట్రంప్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌ల మధ్య రెండు గంటలపాటు సమావేశం జరిగింది. అనంతరం పాక్ ఆర్మీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి ఉగ్రవాద వ్యతిరేక చర్యలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిపింది. వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, గనులు, ఖనిజాలు, క్రిప్టో కరెన్సీ, విద్యుత్ వంటి పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారానికి గల అవకాశాలను వీరు పరిశీలించారని పేర్కొంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యం, ఉమ్మడి ప్రయోజనాల ఆధారంగా వాణిజ్య భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవడంపై అధ్యక్షుడు ట్రంప్ ఆసక్తిని వ్యక్తం చేశారని తెలిపింది. మునీర్‌తో పాటు ఐఎస్ఐ చీఫ్ ఆసిమ్ మాలిక్ ట్రంప్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం వైట్‌హౌస్‌లోని కేబినెట్ రూంలో మునీర్‌కు ట్రంప్ విందు ఇచ్చారు. ఈ గౌరవం దక్కిన మొట్టమొదటి పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ కావడం గమనార్హం. అదేవిధంగా, విదేశీ ఆర్మీ చీఫ్‌కు అమెరికా అధ్యక్షుడు విందు ఇవ్వడం అత్యంత అరుదైన విషయం. గతంలో అయూబ్ ఖాన్, జియా ఉల్ హక్, పర్వేజ్ ముషారఫ్ వంటి వారికి వైట్‌హౌస్ నుంచి ఆహ్వానాలు అందాయి. కానీ, వారు దేశాధ్యక్ష బాధ్యతల్లో ఉన్నారు. కాగా, తాజా మునీర్-ట్రంప్ విందులో పాక్ ప్రజాప్రతినిధులెవరూ పాల్గొనకపోవడం కొసమెరుపు. విందు అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. పాక్– భారత్ మధ్య ఇటీవల జరిగిన యుద్ధాన్ని ఆపడంలో సాయపడిన ఫీల్డ్ మార్షల్ మునీర్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకే ఆహ్వానించానన్నారు.

## ఇరాన్ నుంచి భారత్‌కు చేరుకున్న 110 మంది విద్యార్థులు

**న్యూఢిల్లీ:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ నుంచి అర్మేనియాకు తరలించిన 110 విద్యార్థులు గురువారం తెల్లవారుజామున భారత్‌కు చేరుకున్నారు. అర్మేనియా నుంచి ప్రత్యేక విమానంలో వారిని భారత్‌కు తీసుకొచ్చారు. విమానం సురక్షితంగా ఢిల్లీలో ల్యాండ్ కావడంతో వారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఈ విద్యార్థుల్లో జమ్మూకశ్మీర్ నుంచే 90 మంది విద్యార్థులున్నారు. 'నా కుటుంబాన్ని కలవగలిగినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ భావోద్వేగాన్ని మాటల్లో చెప్పలేను. ఇరాన్‌లో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. యుద్ధం మంచిది కాదు. మానవత్వాన్ని చంపుతుంది'అని ఇరాన్ నుంచి వచ్చిన విద్యార్థి అమాన్ అజార్ అన్నారు. కాగా, ప్రభుత్వ ప్రయత్నాలను విద్యార్థుల కుటుంబ సభ్యులు ప్రశంసించారు. 'నా కొడుకు ఇరాన్‌లో ఎంబీబీఎస్ చేస్తున్నాడు. నా కొడుకు ఇంటికి తిరిగి వస్తున్నందుకు సంతోషంగా ఉంది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం వారి కృషికి ధన్యవాదాలు'అని రాజస్థాన్‌లోని కోట నుంచి వచ్చిన ఓ విద్యార్థి తండ్రి తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య వివాదం తీవ్రమవుతున్న తరుణంలో, భారత ప్రభుత్వం తన పౌరులకు, ముఖ్యంగా విద్యార్థులకు భద్రత కల్పించడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. భారత్ అభ్యర్థన మేరకు ఇరాన్ భూ సరిహద్దుల గుండా విద్యార్థులు సురక్షితంగా అజర్‌బైజాన్, తుర్క్‌మెనిస్తాన్, అఫ్ఘనిస్తాన్ దేశాల గుండా బయటకు వెళ్లాలని సూచించింది. కాగా, ప్రస్తుతం ఇరాన్‌లో 4వేల మందికి పైగా భారతీయులు ఉన్నారు. వీరిలో దాదాపు సగం మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు. అక్కడ ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకురావడానికి భారత ప్రభుత్వం ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది.

# వెండి, ఇత్తడి కళాకృతులు.. పెయింటింగ్‌లు

### జీ7 దేశాల నేతలకు ప్రధాని మోదీ ప్రత్యేక కానుకలు



వివిధ దేశాల నేతలకు ప్రధాని మోదీ అందజేసిన కానుకలివే..

**న్యూఢిల్లీ:** ఇతర దేశాల నేతలను కలిసినప్పుడు కానుకలు అందజేయడమనే ఆనవాయి తీని మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనసాగిస్తున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం కెనడాలోని జరిగిన జీ7 శిఖరాగ్ర భేటీలో ఆయన పాల్గొనడం తెల్సిందే. ఈ సందర్భంగా ఆయన ఆతిథ్య దేశ ప్రధాని మార్క్ కార్నీతోపాటు ఆయా దేశాల నేతలకు కలకాలం గుర్తుండిపోయే, మన ఘన వారసత్వాన్ని ప్రతిబింబించే అద్భుత మైన కానుకల్ని అందజేశారు. వీటిలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఇత్తడి, వెండి కళాకృతులతోపాటు ఆకర్షణీయమైన పెయింటింగ్‌లున్నాయి.

కెనడాలోని కననాస్కిస్‌లో జీ7 భేటీ సమయంలో ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీకి ప్రధాని మోదీ ఇత్తడితో రూపొందించిన బోధి చెట్టు కళా ఖండాన్ని కానుకగా అందజేశారు. గౌతమబుద్ధునికి బోధి వృక్షం కిందనే జ్ఞానోదయమైన విషయం తెల్సిందే. జ్ఞానం, శాంతి, ఆధ్యాత్మిక మేల్కొలుపును ప్రతిబింబించేలా బిహార్ కళాకారులు రూపొందించిన కళారూపమిది. అదేవిధంగా, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్‌కు తమిళనాడుకు చెందిన డోక్రా నిపుణులు రూపొందించిన నంది విగ్రహాన్ని బహూకరించారు. పరమ శివుని వాహనం నందీశ్వరుడు. సంప్రదాయ భారతీయ లోహ కళను చాటి చెప్పేలా ఈ విగ్రహం కనిపిస్తుంది. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షిన్‌బామ్ పర్డోకు సంప్రదాయ వర్లి కళాఖండాన్ని కానుకగా ఇచ్చారు. మహారాష్ట్రలోని వర్లి గిరిజనుల జానపద కళ ఇది. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌కు సంప్రదాయ మధుబని పెయింటింగ్‌ను అందజేశారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డోక్రా కళాకృతిలో రూపుదిద్దుకున్న ఇత్తడి గుర్రం బొమ్మను దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాకు ప్రధాని మోదీ బహూకరించారు. పురాతన సంప్రదాయ నైపుణ్యంతో గిరిజన చేతిపనివారు రూపొందించిన బొమ్మ ఇది. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇన్సియో లులా డ సిల్వాకు వెదురుతో తయారు చేసిన హంస ఆకారంలోని పడవ బొమ్మను అందజేశారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌కు కల్హాపురి వెండి పాత్రను బహుమతిగా ఇచ్చారు. స్వచ్ఛమైన వెండితో తయారైన ఈ పాత్రపై చేతిలో రూపొందించిన పూల నగిషీలున్నాయి. మహారాష్ట్రకు చెందిన ఈ కళాకృతి అందంతోపాటు ఘన వారసత్వాన్ని చాటుతోంది. జర్మనీ చాన్సెలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌కు పాలరాతితో రూపొందించిన సూర్య దేవాలయాన్ని గుర్తుకు తెచ్చే కోణార్క్ చక్రం బొమ్మను బహుమతిగా ఇచ్చారు ప్రధాని మోదీ.

## కెనడా గడ్డపై ఖలిస్తాన్ ఉగ్రవాదం నిజమే

### అంగీకరించిన కెనడా ప్రధాన నిఘా సంస్థ

**ఒట్టావా:** కెనడా గడ్డపై ఖలిస్తాన్ ఉగ్రవాదాన్ని ఆ దేశం అంగీకరించింది. భారత్‌లో హింసను ప్రోత్సహించడానికి, నిధుల సేకరణకు, పథకరచనకు ఖలిస్తానీ తీవ్రవాదులు కెనడా గడ్డను ఉపయోగిస్తున్నారని కెనడా ప్రధాన నిఘా సంస్థ కెనడియన్ సెక్యూరిటీ ఇంటలిజెన్స్ సర్వీస్ (సీఎస్ఐఎస్) అధికారికంగా అంగీకరించింది. సీఎస్ఐఎస్ పార్లమెంటుకు ఇచ్చిన తాజా వార్షిక నివేదికలో ఈ వివరాలు పేర్కొంది. కెనడాకు చెందిన ఖలిస్తానీ తీవ్రవాదులు పంజాబ్‌లో స్వతంత్ర సిక్కు రాజ్యాన్ని సృష్టించాలని హింసాత్మక మార్గాల ద్వారా ప్రచారం చేస్తున్నారని గుర్తించినట్లు సీఎస్ఐఎస్ వెల్లడించింది. ఖలిస్తానీల విషయంలో కెనడా 'ఉగ్రవాదం' అనే పదాన్ని ఉపయోగించడం ఇదే మొదటిసారి. అయితే చైనా, రష్యా, ఇరాన్, పాక్‌తో పాటు భారత్ సైతం తమ దేశంలో గూఢచర్యానికి పాల్పడుతోందని కెనడా ఆరోపించింది.

## జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలి

### సిఫార్సు చేసిన విచారణ కమిటీ

**న్యూఢిల్లీ:** జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో పెద్ద మొత్తంలో నగదు దొరికిన విషయం నిజమేనని దర్యాప్తు బృందం తెలిపింది. భారీ స్థాయిలో నోట్ల కట్టలు సాక్షుల కంటబడినా, ఆయన పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని కమిటీ తేల్చింది. కనీసం జ్యుడీషియల్ అధికారులకు నివేదించలేదని వెల్లడించింది. దీనిని అసహజమైన ప్రవర్తనగా అభివర్ణించిన కమిటీ.. ఆయనను విధుల నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. 'అంత పెద్ద మొత్తంలో నగదు చూసి నేను షాక్ అయ్యాను. నా జీవితంలో ఇలాంటిది చూడటం ఇదే మొదటిసారి' అని ఓ సాక్షి తమతో చెప్పినట్లు ప్యానెల్ తెలిపింది. నగదు దొరికిన స్టోర్ రూమ్‌లోకి వెళ్లడానికి జస్టిస్ వర్మ, అతని కుటుంబ సభ్యులకు మాత్రమే అనుమతి ఉందని విచారణలో తేలిందని వెల్లడించింది. ప్రమాదం తరువాత సాక్ష్యాలను నిర్మూలించడం, సంఘటన స్థలాన్ని శుభ్రపరచడంలో వ్యక్తిగత కార్యదర్శి రాజేందర్ సింగ్ కర్కి, వర్మ కుమార్తె దియా పాత్ర ఉందని ప్యానెల్ తెలిపింది.

## 22న యాక్సియం-4 మిషన్: నాసా

### శుభాన్షు శుక్లా అంతరిక్షయాత్రకు తేదీ ఖరారు

**ఫ్లోరిడా:** భారత్‌కు చెందిన శుభాన్షు శుక్లాతో కూడిన వ్యోమగాముల బృందం అంతరిక్ష యాత్రకు నాసా మరో తేదీని ఖరారు చేసింది. ఈ నెల 22వ తేదీన మధ్యాహ్నం 1.12 గంటలకు యాక్సియం-4 మిషన్ ప్రయోగం ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్‌లో చేపడతామని ప్రకటించింది. వాస్తవానికి మే 29వ తేదీన చేపట్టాల్సిన ఈ ప్రయోగం సాంకేతిక లోపాలు, వాతావరణ ప్రతికూలత తదితర కారణాలతో ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఇటీవల పూర్తి చేసిన మరమ్మతుల నాణ్యతను బేరీజు వేసుకునేందుకు అక్కడి వ్యోమగాములకు వీలు కల్పించేందుకు ఈ మేరకు తేదీని మార్చినట్లు నాసా పేర్కొంది. యాక్షియం-4 వాణిజ్య మిషన్‌కు నాసా మాజీ వ్యోమగామి పెగ్గీ వాట్సన్ సారథ్యం వహించనుండగా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా పైలట్‌గా పనిచేయనున్నారు. వీరితోపాటు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రాజెక్టుకు చెందిన పోలండ్ వ్యోమగామి సవోస్జ్ ఉజ్‌నన్స్కి-విస్నియెవ్స్కీ, హంగరీకి చెందిన తిబోర్ కపు సైతం మిషన్‌లో పాలుపంచుకుంటున్నారు. అంతరిక్షంలో వీరంతా కలిసి 60 వరకు శాస్త్రీయ ప్రయోగాలు చేపట్టనున్నారు.

## బంగ్లా 5.. సునెహ్రి బాగ్ రోడ్

### రాహుల్ గాంధీ కొత్త చిరునామా

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గురువారం కొత్తింట్లోకి మారారు. దేశ రాజధానిలోని సునెహ్రి బాగ్ రోడ్డులో ఉన్న ఐదో నంబర్ బంగ్లాను ప్రభుత్వం ఆయనకు కేటాయించింది. రాహుల్ ప్రస్తుతం తల్లి సోనియా గాంధీతో జనపథ్‌లోని 10వ నంబర్ బంగ్లాలో ఉంటున్నారు. తల్లి బంగ్లాలోని ఆయన వస్తుసామగ్రి నూతన నివాసంలోకి తరలించడం గురువారమే మొదలైంది. అయితే, జూలై 21వ తేదీ నుంచి మొదలయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వరకు కొత్త నివాసంలోకి రాహుల్ మారారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్‌కు కేబినెట్ మంత్రి హోదా ఉంటుంది. నిబంధనల మేరకు ప్రభుత్వం ఆయనకు ఎనిమిదో నంబర్ బంగ్లాను కేటాయించింది. రాహుల్ గాంధీ ఎంపీగా ఎన్నికైన నాటి నుంచి తుగ్లక్‌లేన్‌లోని 12వ నంబర్ భవనంలోనే ఉంటున్నారు. అయితే, పరువు నష్టం కేసులో 2023లో కోర్టు ఆయన్ను దోషిగా నిర్ధారించడంతో లోక్‌సభ సభ్యత్వం కోల్పోయారు. ఆ వెంటనే ఆయన అధికార నివాసం వదిలేసి, తల్లితో కలిసి ఉంటున్నారు. తిరిగి లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరించినా ఆయన అక్కడే కొనసాగారు.

## రాహుల్‌కు మోదీ 'హ్యాపీ బర్త్‌డే'!

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ గురువారం 55వ జన్మదినం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రముఖులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయం కోసం నిజమైన పోరాట యోధుడంటూ ప్రశంసలు కురిపించారు. రాజ్యాంగ విలువల పరిరక్షణకు, అణగారిన వర్గాల వారికి గొంతుకయ్యేందుకు అంకిత భావంతో రాహుల్ పనిచేస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే పేర్కొన్నారు. 'లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు అంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో తెలిపారు. డీఎంకే చీఫ్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వంటి ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు సైతం రాహుల్‌కు బర్త్‌డే విషెస్ తెలిపారు. సోదరసమానుడైన రాహుల్ గాంధీ ఆలోచన, వివేచన కలిగిన నాయకుడని అభివర్ణించారు. గురువారం అక్బర్ రోడ్డులోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న రాహుల్ గాంధీకి పార్టీ సీనియర్ నేతలు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పూలగుచ్ఛాలు, స్వీట్లు అందజేశారు. ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ తదితర ప్రముఖులు కూడా రాహుల్ గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్న సోనియా

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రి నుంచి గురువారం ఇంటికి చేరుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో నాలుగు రోజులపాటు చికిత్స పొందారు. కొంతవరకు కోలుకోవడంతో వైద్యులు డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం సోనియా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని హాస్పిటల్ చైర్‌పర్సన్ డాక్టర్ అజయ్ స్వరూప్ చెప్పారు. ఆమె మరికొన్ని రోజులపాటు ఇంట్లోనే చికిత్స పొందాల్సి ఉంటుందని తెలిపారు. కడుపులో ఇన్ఫెక్షన్ తలెత్తడంతో సోనియా గాంధీ ఈ నెల 15న గంగారామ్ హాస్పిటల్‌లోని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో చేరారు.

## మస్క్ సంస్థకు మరో దెబ్బ

- ప్రయోగవేదికపైనే పేలిపోయిన స్టార్‌షిప్ రాకెట్

**ఆస్టిన్(యూఎస్):** రాకెట్ల వరస వైఫల్యాలతో ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ మరోసారి విఫలమైంది. సంస్థకు చెందిన స్టార్‌షిప్ రాకెట్ ప్రయోగవేదికపైనే పేలిపోయింది. భారీ అగ్నిగోళంపై చుట్టూతా మంటలు ఎగసిపడ్డాయి. అయితే ఈ అనూహ్య ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని స్పేస్‌ఎక్స్ సంస్థ ప్రకటించింది. టెక్సాస్ రాష్ట్రంలోని దక్షిణ తీరం వెంట స్పేస్‌ఎక్స్ సంస్థకు 'స్టార్‌బేస్'పేరిట భారీ ప్రయోగకేంద్రం ఉంది. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఈ పేలుడు సంభవించింది. తమ పదో స్టార్‌షిప్‌ను పరీక్షించేందుకు లాంచ్‌ప్యాడ్‌పై సిద్ధంచేయగా హఠాత్తుగా పేలిపోయిందని సంస్థ వెల్లడించింది. ముందుజాగ్రత్తగా లాంచింగ్ ప్యాడ్‌కు దూరంగా సిబ్బందిని పంపించడంలో ప్రాణనష్టం తప్పిందని స్పేస్‌ఎక్స్ తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేసింది.

## సక్రమంగానే 787-8 డ్రీమ్‌లైనర్ నిర్వహణ

- అంతర్జాతీయ సర్వీసులు 15 శాతం తగ్గింపు
- ఎయిర్ ఇండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ వెల్లడి


**ముంబై:** గుజరాత్‌లో అహ్మదాబాద్‌లో ఈ నెల 12న కుప్పకూలిన గురైన బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానం నిర్వహణ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎయిర్ ఇండియా సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ గురువారం వెల్లడించారు. ఈ విమానం నిర్వహణ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగలేదన్నారు. చివరిసారిగా 2023 జూన్‌లో పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్‌లో మళ్లీ తనిఖీలు చేయాల్సి ఉండగా, ప్రమాదానికి గురైందని పేర్కొన్నారు. కుడి వైపు ఇంజన్‌ను ఈ ఏడాద మార్చిలో, ఎడమ వైపు ఇంజన్‌ను ఏప్రిల్‌లో మరమ్మత్తు చేసినట్లు వివరించారు. రెండు ఇంజన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ వచ్చామన్నారు. ప్రయాణానికి ముందు విమానంలో ఎలాంటి సమస్యలు తలెత్తలేదని స్పష్టంచేశారు. తాజా పరిణామాల దృష్టిలో పెట్టుకొని అంతర్జాతీయ విమానాలను 15 శాతం తగ్గించినట్లు క్యాంప్‌బెల్ విల్సన్ చెప్పారు. ఈ చర్య తాత్కాలికమేనని స్పష్టంచేశారు.

# శివుడికి 1000 ఆలయాలను నిర్మించిన రాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



## తొలి మధ్యయుగం

### పాలవంశం

**దేవపాల:** ఇతడిని పాలరాజులందరిలోకి గొప్పవాడిగా పరిగణిస్తారు. ఇతడు ఒరిస్సా, అస్సాంలను జయించడమే కాకుండా ప్రతీహార మిహిరభోజుడి దాడులను విజయవంతంగా తిప్పి కొట్టాడు. దేవపాలుడు నలందలో ఇండోనేషియా రాజు బలపుత్ర దేవుడు నిర్మించిన బౌద్ధ విహారానికి ఐదు గ్రామాలను దానంగా ఇచ్చాడు. ఇతడి ఆస్థాన బౌద్ధ పండితుడు వజ్రదత్తుడు లోకేశ్వర శతకం అనే గ్రంథాన్ని రచించాడు. ఈ కాలంలో భారతదేశాన్ని సందర్శించిన అరబ్ యాత్రికుడు సులేమాన్ పాల రాజ్యాన్ని రూహ్మి అని పేర్కొన్నాడు.

**నారాయణపాల:** దేవపాలుడి తర్వాత రాజ్యానికి వచ్చిన రాజుల్లో ఇతడు ముఖ్యమైనవాడు. ఇతడిని రాష్ట్రకూట రాజు అమోఘ వర్షుడు ఓడించాడు. నారాయణ పాలుడు మాంఘీర్ ప్రాంతంలో ఒక గ్రామాన్ని శైవాలయానికి దానంగా ఇచ్చాడు.

**మహీపాల 1:** నారాయణపాలుడి అనంతరం పాలించిన పాలరాజుల్లో ముఖ్యమైనవాడు మొదటి మహీపాలుడు. చోళరాజు మొదటి రాజేంద్రుడు ఇతడి కాలంలోనే ఉత్తర భారతదేశంపై దండెత్తి మహీపాలుడిని ఓడించి గంగై కొండ అనే బిరుదును పొందాడు.

**మదనపాల:** ఇతడు పాలవంశంలో చివరిరాజు. ఇతడి తర్వాత పాల రాజ్యాన్ని సేన వంశ రాజులు ఆక్రమించి సేన వంశ రాజ్యాన్ని స్థాపించారు.

### సేన వంశం:

తొలి మధ్యయుగంలో తూర్పు భారతదేశాన్ని పాలించిన రెండు రాజవంశాల్లో ముఖ్యమైనది సేన వంశం. పాలవంశం పతనమైన తర్వాత సేన వంశ రాజులు బెంగాల్, బీహార్ ప్రాంతాలను పాలించారు. లక్నౌతిని రాజధానిగా చేసుకొని వీరు దాదాపు 100 సంవత్సరాలపాటు పాలించారు. వీరు తాము కర్ణాటక బ్రాహ్మణులమని పేర్కొన్నారు.

**సామంత సేన:** సేన వంశస్థాపకుడు. ఇతడు బ్రహ్మక్షత్రియుడిగా పేరుగాంచాడు.

**విజయ సేన:** మొత్తం బెంగాల్‌ను జయించడం ద్వారా ఇతడు సేన రాజ్య వాస్తవ స్థాపకునిగా ఖ్యాతిగాంచాడు. ఇతడు అస్సాం, నేపాల్ మొదలైన ప్రాంతాలను జయించాడు. విజయసేనుడు తన విజయాలను గురించి తెలియజేస్తూ దేవపార ప్రశస్తిని జారీ చేశాడు. ఈ శాసనాన్ని రచించిన కవి ధోయి. విజయసేనుడు విజయపురి, విక్రమపుర అనే రెండు రాజధానులను నిర్మించి అక్కడి నుంచి పరిపాలించాడు. గహద్వాల జయచంద్రుడి ఆస్థాన కవి శ్రీహర్షుడు విజయసేనుడి గొప్పతనాన్ని, విజయాలను గురించి తెలుపుతూ విజయ ప్రశస్తి అనే గ్రంథాన్ని రచించాడు.

**బల్లాల సేన:** ఇతడు స్వయంగా నాలుగు గ్రంథాలను రచించాడు. ఇతడి గ్రంథాల్లో ముఖ్యమైనవి దాన సాగర, అద్భుత సాగర.

**లక్ష్మణ సేన:** ఇతడు 60 ఏళ్ల వయస్సులో రాజ్యానికి వచ్చాడు. ఇతడి పాలనకు రాజకీయ ప్రాధాన్యత లేకపోయినప్పటికీ సాహిత్యపరంగా ఇతడి పాలనా కాలం ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఇతడి ఆస్థానంలో ప్రముఖ వైష్ణవ కవి జయదేవుడు గీతగోవిందం అనే గ్రంథాన్ని రచించాడు. మరో కవి ధోయి పవన దూతం అనే గ్రంథాన్ని రాశాడు. గోవర్ధనుడు అనే కవి ఆర్య సప్తశతి అనే గ్రంథాన్ని రచించాడు. లక్ష్మణ సేనుడు తన తండ్రి బల్లాల సేనుడు ప్రారంభించిన అద్భుతసాగర గ్రంథాన్ని తానే స్వయంగా పూర్తి చేశాడు. లక్ష్మణ సేనుడి కాలంలో ఘోరీ మహ్మద్ సేనాని భక్తియార్ ఖిల్జీ బెంగాల్‌పై దాడి చేయగా, ఇతడు యుద్ధం చేయకుండా పారిపోయాడు. దీంతో సేన రాజ్యం ముస్లింల వశమైంది. ఈ సంఘటన గురించి మినహాజుద్దీన్ సిరాజ్ తన తబాకత్-ఇ-నాసిరి అనే గ్రంథంలో వివరించాడు. భక్తియార్ ఖిల్జీ కేవలం 18 మంది అశ్వికుల ద్వారా ఈ విజయం సాధించాడని తెలిపాడు.

### రాష్ట్రకూటులు:

ఉత్తరాన వింధ్య పర్వతాలు, నర్మద నది నుంచి దక్షిణాన కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్న ప్రాంతాన్ని సాధారణంగా దక్కన్ ప్రాంతంగా వ్యవహరిస్తారు. తొలి మధ్య యుగంలో ఈ ప్రాంతాన్ని రెండు రాజవంశాలు ప్రముఖంగా పాలించాయి. అందులో ఒకరు రాష్ట్రకూటులు. మొదట వీరు బాదామి చాళుక్యులకు సామంతులుగా ఉంటూ (రాష్ట్ర పాలకులుగా) పరిస్థితులు అనుకూలించిన వెంటనే స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. వీరి రాజధానులు ఎల్లోరా, మాన్యఖేట్. రాష్ట్రకూటులు సమకాలీన దక్షిణ భారతదేశ రాజులతో, ఉత్తర భారతదేశ పాలకులతో తరచూ యుద్ధాల్లో పాల్గొంటూ తమ రాజ్యాన్ని ఒక బలమైన రాజ్యంగా రూపొందించారు. ఉత్తర భారతదేశంలో ప్రతీహారులు, పాల రాజులు, దక్షిణ భారతదేశంలో వేంగి చాళుక్యులు, పల్లవులు, పాండ్యులు వీరి సమకాలీన రాజులు.

**దంతి దుర్గుడు:** చివరి బాదామి చాళుక్యరాజు రెండో కీర్తివర్మను క్రీ.శ.753లో తొలగించి ఇతడు స్వతంత్ర్య రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు. తన రాజ్యానికి ఇరువైపులా ఉన్న అనేక ప్రాంతాలను ఆక్రమించాడు. ఇందుకు గుర్తుగా హిరణ్య గర్భ దాన యజ్ఞాన్ని నిర్వహించాడు. తన రాజధాని ఎల్లోరాలో దశావతార ఆలయాన్ని నిర్మించాడు.

**మొదటి కృష్ణుడు:** బాదామి చాళుక్యులను అంతం చేసి పశ్చిమ గాంగులను తన సామంతులుగా చేసుకున్నాడు. ఇతడి కాలంలో వేంగీ చాళుక్యులపై తొలి దాడి యువరాజు గోవిందుడి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఇతడు రాజధాని ఎల్లోరాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన కైలాసనాథ గుహాలయాన్ని నిర్మించాడు.

**ధ్రువుడు:** తన సోదరుడు రెండో గోవిందుడిని తొలగించి ఇతడు సింహాసనాన్ని ఆక్రమించాడు. కనౌజ్ కోసం జరిగిన త్రిరాజ్య యుద్ధాల్లో తలదూర్చిన మొదటి రాష్ట్రకూట రాజు ఇతడే. ప్రతీహార వత్సరాజును, పాలరాజు ధర్మపాలుడిని ఓడించాడు. వేంగీ, మైసూర్, కంచి రాజ్యాలపై దాడులు చేసి విజయం సాధించాడు.

**మూడో గోవిందుడు:** ఇతడు కూడా పాలరాజు ధర్మపాలుడిని, ప్రతీహార రెండో నాగభటుడిని ఓడించాడు. దక్షిణ రాజ్యాల కూటమిపై కూడా విజయం సాధించాడు.

**మొదటి అమోఘవర్ష:** ఇతడు 64 సంవత్సరాల సుదీర్ఘకాలంపాటు... క్రీ.శ. 814-878 వరకు పరిపాలించాడు. ఇతడి కాలంలో రాష్ట్ర కూటులు వేంగీని ఆక్రమించి 12 సంవత్సరాలపాటు దీన్ని పరిపాలించారు. అమోఘవర్షుడు యుద్ధాల కంటే లలిత కళలకు అధిక ప్రాధాన్యతనిచ్చాడు. ఇతడు స్వయంగా కవి. కవిరాజ అనే బిరుదును పొందాడు. కన్నడ భాషలో తొలి గ్రంథమైన కవిరాజ మార్గను రచించాడు. ఇతడి ఆస్థానంలో ఉన్న పలువురు కవులు పలు గ్రంథాలను రచించారు. ఇతడి ఆస్థానంలోని ప్రముఖ కవులు... జనసేనుడు, మహావీరాచార్యుడు, శాక్తాయణుడు. రాష్ట్రకూట రాజుల్లో ఎక్కువ మంది శైవ, వైష్ణవ మతాలను ఆదరిస్తే ఇతడు జైన మతాన్ని ఆదరించాడు.

**రెండో కృష్ణుడు:** ఇతడు కూడా తనతండ్రిలాగే జైన మతాన్ని ఆదరించాడు.

**మూడో ఇంద్రుడు:** ఇతడి కాలంలోనే అరబ్ యాత్రికుడు అల్ మసూదీ భారతదేశాన్ని సందర్శించాడు. మూడో ఇంద్రుడిని భారతదేశంలోనే గొప్ప రాజుగా వర్ణించాడు. మూడో ఇంద్రుడు ప్రతీహార మహీపాలుడిని ఓడించి కనౌజ్‌ను ధ్వంసం చేశాడు.

**నాలుగో గోవిందుడు:** ఇతడి దుష్పరిపాలనకు వ్యతిరేకంగా నాయకులు, ప్రజలు తిరుగుబాటు చేయడంతో అధికారాన్ని కోల్పోయాడు.

**మూడో కృష్ణుడు:** ఇతడు ఉత్తర, దక్షిణ భారత దేశంపై విజయవంతంగా దాడులను నిర్వహించాడు. ఇతడు చోళరాజ్యంపై దాడిచేసి కంచి, తంజావూర్‌లను ఆక్రమించాడు. క్రీ.శ.949లో తక్కోలం యుద్ధంలో మొదటి పరాంతక చోళుడిని ఓడించి తంజావూర్ కొండ అనే బిరుదు పొందాడు. చేర, పాండ్య రాజులను ఓడించాడు. ఈ విజయాలన్నింటికీ గుర్తుగా రామేశ్వరంలో విజయ స్తంభాన్ని వేయించాడు. అక్కడ కృష్ణేశ్వర, గండమార్తాండ తీయ అనే దేవాలయాలను నిర్మించాడు. మూడో కృష్ణుడి నిరంతర యుద్ధాల వల్ల సమకాలీన పొరుగు రాజ్యాలన్నింటితో శత్రుత్వం ఏర్పడింది. ఇతడి కాలంలోనే హలాయుధుడు కవి రహస్యం అనే గ్రంథాన్ని రచించాడు.

**ఖొట్టిగ:** ఇతడి కాలంలో పరమార రాజులు మాన్యఖేట్‌పై దాడిచేసి విధ్వంసం సృష్టించారు.

**రెండో కర్క:** ఇతని పాలనాకాలంలో రాష్ట్రకూట సామంతుడు రెండో తైలపుడు క్రీ.శ.974-75లో ఇతడిని తొలగించి స్వతంత్ర కల్యాణి చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు.

### కల్యాణి చాళుక్యులు:

తొలి మధ్యయుగ భారతదేశ చరిత్రలో రాష్ట్రకూటుల తర్వాత దక్కన్‌ను పాలించిన మరో రాజవంశం కల్యాణి చాళుక్యులు. కర్ణాటకలోని కల్యాణి రాజధానిగా వీరు పాలించారు. కాబట్టి వీరిని కల్యాణి చాళుక్యులని, చాళుక్యుల తర్వాత పాలించారు కాబట్టి కడపటి చాళుక్యులు అని పిలుస్తారు.

**రెండో తైలపుడు:** ఇతడు కల్యాణి చాళుక్య వంశ స్థాపకుడు. రాష్ట్రకూట మూడో కృష్ణుడికి సామంతుడిగా ఉంటూ చివరి రాష్ట్ర కూటరాజు రెండో కర్కను తొలగించి తన రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు మాన్యఖేట్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలించాడు. చోళరాజు ఉత్తమ చోళుడిపై దాడి చేయడం ద్వారా చోళ-చాళుక్య శత్రుత్వానికి నాంది పలికాడు. ఇతడి వారసుల కాలంలో చాళుక్యులు చోళులతో అనేక యుద్ధాలు చేయాల్సి వచ్చింది.

**సత్యాశ్రయ:** ఇతడి మరొక పేరు సొల్లిగ. ఇతడి కాలంలో మాన్యఖేట్‌పై రాజేంద్రచోళుడు దాడి చేశాడు.

**రెండో జయసింహ:** వేంగీ వారసత్వ యుద్ధాల్లో తలదూర్చి ఇతడు ఏడో విజయాదిత్యుడికి మద్దతుగా తన సైన్యాన్ని పంపాడు. కానీ రాజేంద్రచోళుడి సహాయంతో వేంగీలో రాజరాజనరేంద్రుడు రాజ్యానికి వచ్చాడు.

**మొదటి సోమేశ్వరుడు:** ఇతడు తన రాజధానిని మాన్యఖేట్ నుంచి కల్యాణికి మార్చాడు. కొప్పం యుద్ధంలో చోళ రాజాధిరాజును వధించాడు. పరమార భోజుడిని ఓడించి తన సామంతుడిగా చేసుకున్నాడు.

**ఆరో విక్రమాదిత్యుడు:** తన సోదరుడు రెండో సోమేశ్వరుడిని వధించి ఇతడు క్రీ.శ.1076లో రాజ్యానికి వచ్చాడు. తాను రాజ్యానికి వచ్చిన సంవత్సరాన్ని పురస్కరించుకుని చాళుక్య విక్రమ శకాన్ని ప్రారంభించాడు. కల్యాణి చాళుక్య రాజులందరిలోకి ఇతడు అత్యంత గొప్పవాడు. ఇతడి రాజ్యం నర్మద నుంచి రాయలసీమ వరకు విస్తరించింది. ఆరో విక్రమాదిత్యుడు తన సామంతులైన హొయసలలు, కాకతీయులు, యాదవులు, కాదంబులతో నిరంతరం యుద్ధాలు చేసి వారిని అణచివేశాడు. ఇతడి ఆస్థానంలోని ఇద్దరు ప్రముఖ కవులు బిల్హణుడు విక్రమాంక దేవచరితం, విజ్ఞానేశ్వరుడు మితాక్షర అనే గ్రంథాలను రచించారు.

**మూడో సోమేశ్వరుడు:** ఇతడి కాలంలో ద్వారసముద్ర సామంతుడు విష్ణువర్ధనుడు స్వతంత్ర హొయసల రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. సోమేశ్వరుడు పరిపాలన కంటే సాహిత్యంపై ఎక్కువ మక్కువ చూపాడు. ఇతడికి సర్వజ్ఞ అనే బిరుదు ఉంది. ఈ బిరుదుకు కారణం ఇతడు రచించిన అభిలషితార్థ చింతామణి అనే గ్రంథం.

**నాలుగో సోమేశ్వరుడు:** మూడో సోమేశ్వరుడి తర్వాత జగదేక మల్ల, మూడో తైలప అనే రాజులు పాలించారు. ఈ వంశంలో చివరివాడు నాలుగో సోమేశ్వరుడు. ఇతడి కాలంలో దేవగిరిని పాలిస్తున్న సామంత రాజు యాదవ బిల్లముడు ఇతడిని ఓడించి కల్యాణి చాళుక్య రాజ్యాన్ని అంతం చేశాడు. స్వతంత్ర యాదవ రాజ్యాన్ని స్థాపించాడు.


### మాదిరి ప్రశ్నలు

1. ప్రయాగ వద్ద త్రివేణి సంగమంలో మునిగి ఆత్మత్యాగం చేసిన చందేల రాజు?
   1) హర్ష 2) విద్యాధర
   3) ధంగ 4) యశోవర్మన్
2. భారతదేశంలో బౌద్ధ మతాన్ని ఆదరించిన చివరి రాజవంశం?
   1) పుష్యభూతి వంశం 2) కుషాణులు
   3) పాల వంశం 4) సేన వంశం
3. ప్రజల ద్వారా ఎన్నికైన రాజు?
   1) ధర్మపాల 2) గోపాల
   3) హర్షవర్ధన 4) నన్నుక
4. ఓదంతపురి బౌద్ధ విహారాన్ని నిర్మించింది?
   1) అశోకుడు 2) అమోఘవర్షుడు
   3) గోపాలుడు 4) కనిష్కుడు
5. బౌద్ధ పండితుడు హరిభద్రుడు ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?
   1) ధర్మపాలుడు 2) మొదటి నాగభటుడు
   3) గోపాలుడు 4) దేవపాలుడు
6. పాలరాజుల కాలంలో టిబెట్‌లో బౌద్ధమత ప్రచారం చేసిన బౌద్ధ భిక్షువులు?
   1) అతిష దీపాంకర, సంతరక్షిత
   2) ఆచార్య నాగార్జున 3) శ్రీవర, శ్రీజ్ఞాన
   4) పద్మసాంభవ, పూజ్యపాద
7. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కైలాసనాథ గుహాలయ నిర్మాత?
   1) నందివర్మ 2) నరసింహవర్మ
   3) మొదటి కృష్ణుడు 4) మూడో గోవిందుడు
8. రాజ్య వ్యవహారాల్లో స్త్రీలు ప్రముఖ పాత్ర పోషించిన ఉత్తరభారతదేశ రాజవంశం?
   1) గహద్వాలులు 2) కాశ్మీర్ ఉత్పల వంశం
   3) చౌహాన్‌లు 4) చందేలులు
9. నలంద బౌద్ధ విహారాన్ని నిర్మించిన విదేశీ రాజు?
   1) సంగ్రామ విజయోత్తుంగ వర్మన్
   2) విజయబాహు 3) బలపుత్రదేవ
   4) మహేంద్రవర్మన్
10. శివుడికి 1000 ఆలయాలను నిర్మించిన రాజు?
    1) నారాయణ పాలుడు 2) విగ్రహ పాలుడు
    3) గౌడ శశాంకుడు 4) హర్షుడు
11. చోళరాజు మొదటి రాజేంద్రుడి చేతిలో ఓడిపోయిన పాలరాజు?
    1) మహేంద్రపాలుడు 2) మదనపాలుడు
    3) మొదటి మహీపాలుడు
    4) ధర్మపాలుడు
12. గీతగోవిందం గ్రంథకర్త జయదేవుడు ఎవరి ఆస్థాన కవి?
    1) బల్లాల సేన 2) లక్ష్మణ సేన
    3) విజయ సేన 4) సంగ్రామ సేన
13. సేన రాజ్యాన్ని అంతం చేసినవారు?
    1) కుతుబుద్దీన్ ఐబక్ 2) ఇల్‌టుల్‌మిష్
    3) భక్తియార్ ఖిల్జీ 4) అల్లావుద్దీన్ ఖిల్జీ
14. రాష్ట్రకూటుల రాజధాని?
    1) ఎల్లోరా 2) మాన్యఖేట్
    3) 1,2 4) వాతాపి
15. దంతిదుర్గుడు నిర్మించిన ఆలయం?
    1) ఎల్లోరా-దశావతారాలయం
    2) ఎల్లోరా- కైలాసనాథాలయం
    3) కంచి- కైలాసనాథాలయం
    4) మహాబలిపురం-తీర దేవాలయం

**సమాధానాలు**

1) 3 2) 3 3) 2 4) 3 5) 1
6) 1 7) 3 8) 2 9) 3 10) 1
11) 3 12) 2 13) 3 14) 3 15) 1

# సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న సగటు దూరం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

## మన విశ్వం

- నక్షత్ర వీధుల్లో చిన్న, చిన్న గుంపుల్లో ఉన్న నక్షత్ర సముదాయాలను తారాగణం లేదా నక్షత్ర రాశి అంటారు.
- నక్షత్రరాశుల్లో కొన్నింటిని ఉత్తరార్ధగోళం నుంచి చూడగలిగితే, మరికొన్నింటిని దక్షిణార్ధ గోళం నుంచి మాత్రమే చూడగలం. ఇప్పటి వరకు మొత్తం 88 నక్షత్ర రాశులను శాస్త్రజ్ఞులు అధ్యయనం చేశారు.
- సూర్యుడు తిరిగే దారిని సంవత్సర కాలం మొత్తం 12 భాగాలుగా విభజించి, వాటి ఆకారాలను బట్టి నక్షత్ర సముదాయాలను 12పేర్లతో పిలుస్తున్నారు. ఈ పన్నెండు రాశులను కలిపి రాశిచక్రం అంటారు.
- జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఈ రాశుల తేదీలను బట్టి కాలాలను, రుతువులను, పంచాంగాలను గణిస్తారు.
- రాకెట్లు రెండు రకాలు అవి..
  1. యుద్ధ రాకెట్లు, 2. రోదసీ రాకెట్లు.
- కృత్రిమ ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశించేందుకు సెకనుకు 11.2 కి.మీల. వేగం అవసరం.
- కృత్రిమ ఉపగ్రహాలు భూమికి ఉపగ్రహాలుగా పని చేస్తే, స్పేస్ ప్రోబ్స్ అనేవి ఇతర గ్రహాలను శోధించేందుకు తోడ్పడతాయి.
- ప్రప్రథమంగా రష్యా.. 1957 అక్టోబర్ 4న మానవుడు లేని స్పుత్నిక్-1 అనే అంతరిక్ష నౌకను రోదసీలోకి పంపింది.
- 1961 ఏప్రిల్ 12న రష్యాకు చెందిన కల్నల్ యూరీ గగారిన్.. వస్తోక్ అనే అంతరిక్ష నౌక ద్వారా 83.34 నిమిషాల్లో మొట్టమొదటిసారిగా భూ ప్రదక్షిణం చేశాడు.
- 1963లో వస్తోక్-6 అనే అంతరిక్ష నౌకలో రష్యా మహిళ లెఫ్టినెంట్ కల్నల్ వాలెంటీనా టెరిస్కోవా అంతరిక్ష యానం చేసింది.
- 1969 జూలై 21న అమెరికాకు చెందిన అపోలో -11 అనే అంతరిక్ష నౌక ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు ప్రప్రథమంగా చంద్రుడిపై కాలు మోపారు.
- 1984 ఏప్రిల్ 3న భారతదేశానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ రాకేష్‌శర్మ.. సోయూజ్-టి-11 అనే రోదసీ నౌక ద్వారా అంతరిక్షయానం చేశాడు.
- భారతదేశం కూడా రోదసీ పరిశోధనల్లో ఎంతో ప్రగతిని సాధించింది. ఆర్యభట్ట, భాస్కర-1, 2, రోహిణి, ఐఆర్ఎస్, ఇన్‌శాట్ - 1ఎ, 1బి, 1సి, 1డి, 2ఎ, 2బి; పీఎస్ఎల్‌వీ - డి2 మొదలైన ఉపగ్రహాలను ప్రయోగించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో శ్రీహరికోట వద్ద రాకెట్ లాంచింగ్ స్టేషన్ (షార్) ఉంది.
- మన విశ్వం వేలకొద్దీ గెలాక్సీలను కలిగి ఉంది. ప్రతి గెలాక్సీలోనూ మిలియన్‌ల నక్షత్రాలు ఉన్నాయి.
- నక్షత్రాలకు వాటి చుట్టూ తిరిగే గ్రహ కూటములు ఉన్నాయి.
- గ్రహాలకు వాటి చుట్టూ తిరుగుతూ ఉండే ఉపగ్రహాలుంటాయి. అందువల్ల మన విశ్వం చాలా విశాలమైంది.
- సూర్యుడు పాలపుంత అనే గెలాక్సీకి చెందిన ఒక సామాన్య నక్షత్రం. సూర్యుడు, గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్స్ అన్నింటినీ కలిపి సూర్య కుటుంబం అంటారు.
- గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ వివిధ దీర్ఘ వృత్తాకార మార్గాల్లో తిరుగుతున్నాయి.
- భూమికి సహజ ఉపగ్రహం చంద్రుడు.
- భూమి సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి ఒక సంవత్సరం పడుతుంది. అంటే 365 1/4 రోజులు. భూమి తన అక్షం చుట్టూ తాను తిరగడానికి 24 గంటలు పడుతుంది.
- సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఖగోళ ప్రమాణం అంటారు.
  $1AU = 1.496\times10^{11}$ మీ.
- కాంతి ఒక సంవత్సర కాలంలో శూన్యంలో ప్రయాణించే దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.
- ఒక కాంతి సంవత్సరం = $9.3\times10^{15}$ మీ. = $6.33\times10^4$ AU
- పార్‌సెక్ అనేది దూరం ప్రమాణాలన్నింటిలోనూ పెద్దది.ఇది 3.26కాంతి సంవత్సరాలకు సమానం.
- బుధ గ్రహం పరిభ్రమణ కాలం - 88 రోజులు.
- అత్యధిక పరిభ్రమణ కాలం కలిగిన గ్రహం ప్లూటో (248 సంవత్సరాలు).
- గ్రహాలన్నింటిలో పెద్ద గ్రహం-గురుడు(బృహస్పతి).
- గ్రహాలన్నింటిలో చిన్న గ్రహం - బుధుడు.
- సూర్యుడి నుంచి కనిష్ఠ దూరంలో బుధుడు, గరిష్ఠ దూరంలో ప్లూటో ఉన్నాయి.
- అత్యధిక ఉపగ్రహాలు ఉన్న గ్రహం-శని (30)
- ఉపగ్రహాలు లేని గ్రహాలు - బుధుడు, శుక్రుడు.
- భూమి మీద మినహా మిగతా గ్రహాలపై ప్రాణులు నివసించడానికి అనుకూల వాతావరణ పరిస్థితులు లేవు.
- బుధ గ్రహం సూర్యుడికి అతి సమీపంలో ఉండటం వల్ల దాని మీద పగలు అతి వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది.
- శుక్ర గ్రహం అతి దట్టమైన మేఘాలతో కప్పి ఉండటం వల్ల సూర్యకాంతి దాని తలాన్ని చేరలేదు.
- శని గ్రహం కిలోమీటర్ల మందం ఉన్న మంచు పొరలతో కప్పి ఉండటం వల్ల అతి చల్లగా ఉంటుంది. కాబట్టి ప్రాణులుండేందుకు అవకాశం లేదు.
- కుజ గ్రహం మాత్రం ఆక్సిజన్, నీటి ఆవిరిలతో కూడిన వాతావరణం కలిగి ఉంది. దాని ఉష్ణోగ్రత $25^0$ సెంటీగ్రేడ్ నుంచి $40^0$ సెంటీగ్రేడ్‌కి మధ్యలో ఉంటుంది.
- ధ్రువ నక్షత్రాన్ని ఆంగ్లంలో పోలారిస్ అంటారు. ఇది భూమి ఉత్తర ధ్రువానికి ఎదురుగా ఉంది.
- ధ్రువ నక్షత్ర స్థానాన్ని సప్తర్షి మండలం సహాయంతో తెలుసుకోవచ్చు.
- సప్తర్షి మండలాన్ని ఇంగ్లిష్‌లో గ్రేట్‌బేర్ అంటారు.
- గ్రేట్‌బేర్ అనేది నాగలి లేదా గాలిపటం ఆకారంలో ఉంటుంది.
- సూర్యుడు తన చుట్టూ తాను ఒకసారి తిరిగి రావడానికి 25 రోజులు పడుతుంది.
- లీప్ సంవత్సరంలో 366 రోజులుంటాయి. ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.
- సూర్యుడి తర్వాత భూమికి అత్యంత సమీపంలోని నక్షత్రం- ప్రాక్సిమాసెంటౌరి
- హేలీ తోకచుక్క 76 సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది.
- రాశులన్నింటిలో పెద్ద తారాగణం - హైడ్రా
- చంద్రుడిపై వస్తువుల బరువు భూమిపై బరువులో ఆరో వంతు ఉంటుంది.

### మాదిరి ప్రశ్నలు

1. భారతదేశం మొదటగా భూకక్ష్యలోకి ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహం?
   1) ఆర్యభట్ట 2) భాస్కర-1
   3) ఇన్‌శాట్-1బి 4) భాస్కర-2
2. అన్నింటికంటే ప్రకాశంగా కనిపించే గ్రహం?
   1) శని 2) భూమి
   3) శుక్రుడు 4) బుధుడు
3. పగలు, రాత్రి ఏర్పడడానికి కారణం?
   1) భూ పరిభ్రమణం 2) భూ భ్రమణం
   3) ఉల్కాపాతం 4) ఏదీకాదు
4. చంద్ర గ్రహణం ఏ సందర్భంలో ఏర్పడుతుంది?
   1) భూమి.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   2) చంద్రుడు.. భూమికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   3) సూర్యుడు భూమి, చంద్రుడి మధ్య వచ్చినప్పుడు
   4) అన్నీ
5. రాశుల్లో అన్నింటికంటే పెద్ద తారాగణం?
   1) సెరస్ 2) ఇంకారస్
   3) హైడ్రా 4) హేలీ
6. రష్యా సహకారంతో భారతదేశంలో రాకెట్ లాంచింగ్ స్టేషన్‌లు ఏర్పర్చిన ప్రదేశాలు?
   1) తుంబా 2) శ్రీహరికోట
   3) ఢిల్లీ 4) 1, 2
7. అత్యధిక ఉపగ్రహాలు కలిగిన గ్రహం?
   1) శని 2) బృహస్పతి
   3) బుధుడు 4) శుక్రుడు
8. ఇప్పటివరకు గుర్తించిన నక్షత్రాల్లో అతి పెద్దది?
   1) సెరస్ 2) ఎప్సిలాన్ అరిగ
   3) హైడ్రా 4) ఇంకారస్
9. మొట్టమొదటి స్పేస్ షటిల్?
   1) అపోలో 2) స్పుత్నిక్
   3) కొలంబియా 4) వస్తోక్
10. స్కైలాబ్ అనే ప్రయోగాత్మక అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏ దేశం ఏర్పాటు చేసింది?
    1) రష్యా 2) అమెరికా
    3) ఇండియా 4) సింగపూర్

**సమాధానాలు**

1) 1 2) 3 3) 2 4) 1
5) 3 6) 4 7) 1 8) 2
9) 3 10) 2

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. చంద్రుడు తన చుట్టూ తాను, అలాగే భూమి చుట్టూ తిరగడానికి పట్టే రోజులు? (డీఎస్సీ-2000)
   1) 30 రోజులు 2) 29 1/2 రోజులు
   3) 92 1/2 రోజులు 4) 29 రోజులు
2. ధ్రువ నక్షత్రం నావికులకు దేన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది? (డీఎస్సీ - 2000)
   1) గెలాక్సీ 2) గాలి
   3) దిక్కు 4) వాతావరణం
3. ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)? (డీఎస్సీ-2001)
   1) $3\times10^4\times60\times60\times24\times365.25$
   2) $3\times10^2\times60\times60\times24\times365.25$
   3) $3\times10^5\times60\times60\times24\times365.25$
   4) $3\times10^3\times60\times60\times24\times365.25$
4. నక్షత్రాలు కాంతిని నలుదిశలకు వెదజల్లా లంటే వాటిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత? (డీఎస్సీ-2002)
   1) 10 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   2) 5 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
   3) 5 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   4) 10 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
5. 1994లో విజయవంతంగా ప్రయోగించిన భారతీయ ఉపగ్రహ నౌక? (డీఎస్సీ-2002)
   1) ఇన్‌శాట్-1బి 2) పీఎస్ఎల్‌వీడీ-2
   3) భాస్కర-2 4) ఆర్యభట్ట
6. సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న సగటు దూరం?
   1) 149,000,000 కి.మీ.
   2) 149,598,500 కి.మీ.
   3) 149,593,300 కి.మీ
   4) 149,895,500 కి.మీ.
7. ఏ అంతరిక్ష నౌకల ద్వారా అంగారక గ్రహంపై జీవరాశి లేదని నిరూపించారు? (డీఎస్సీ-2003)
   1) స్కాటర్న్ - 5, స్కాటర్న్ - 6
   2) అపోలో - 11, సోయూజ్-టీ-11
   3) వైకింగ్-1, వైకింగ్-2
   4) సోయూజ్ -టీ-11, శాల్యూట్
8. బుధ గ్రహం పరిభ్రమణ కాలం? (డీఎస్సీ-2006)
   1) 88 రోజులు 2) 248 రోజులు
   3) 365 రోజులు 4) 243 రోజులు
9. స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్ష యానం చేసిన రోజు? (డీఎస్సీ-2006)
   1) 3-6-1984 2) 3-4-1984
   3) 3-4-1985 4) 3-6-1985
10. భూమధ్య రేఖ వద్ద భూమి వ్యాసం కి.మీ.లలో? (డీఎస్సీ - 2008)
    1) 12,576 2) 12,657
    3) 12,756 4) 12,765
11. సూర్యుడి చుట్టూ పరిభ్రమించే గ్రహాల్లో ద్రవ్యరాశిలో రెండో స్థానంలో ఉన్న గ్రహం, ఆత్మభ్రమణ కాలం అన్నింటి కంటే ఎక్కువ ఉన్న గ్రహం వరుసగా? (డీఎస్సీ - 2008)
    1) బృహస్పతి, భూమి
    2) బుధుడు, అంగారకుడు
    3) శని, శుక్రుడు
    4) నెప్ట్యూన్, యురేనస్
12. స్పేస్ ప్రోబ్‌కు ఉదాహరణ? (డీఎస్సీ-2008)
    1) పయనీర్ 2) ఆర్యభట్ట
    3) భాస్కర - 2 4) అట్లాంటిస్
13. ఏ గ్రహం మీద ఆక్సిజన్, నీటి ఆవిరితో కూడిన వాతావరణం ఉంది? (డీఎస్సీ-2012)
    1) కుజుడు 2) బుధుడు
    3) బృహస్పతి 4) యురేనస్
14. సూర్యగ్రహణం సంభవించడానికి కారణం? (ఏపీ టెట్ - 2017)
    1) చంద్రుడి నీడ భూమిపై పడటం వల్ల
    2) సూర్యుడి నీడ భూమిపై పడటం వల్ల
    3) చంద్రుడి నీడ సూర్యుడిపై పడటం వల్ల
    4) సూర్యుడి నీడ చంద్రుడిపై పడటం వల్ల
15. సాధారణంగా పిలిచే 'తెగిపడిన చుక్కలు' ఏమిటి? (ఏపీ టెట్ - 2017)
    1) ఆస్టరాయిడ్లు 2) తోక చుక్కలు
    3) ఉల్కలు 4) ఉపగ్రహాలు
16. తన కక్ష్యలో తాను దొర్లుతున్నట్లు కనిపించే గ్రహం? (ఏపీ టెట్ - 2017)
    1) నెప్ట్యూన్ 2) బృహస్పతి/ గురుడు
    3) బుధుడు 4) యురెనస్
17. సూర్య, చంద్రులకు ఆకాశంలో ఒక పూర్తి భ్రమణానికి పట్టే కాలంలో తేడా? (ఏపీ టెట్ - 2017)
    1) 2 నిమిషాలు 2) 50 నిమిషాలు
    3) 24 నిమిషాలు 4) 10 నిమిషాలు
18. 'హేలీ తోక చుక్క' కనిపించనున్న సంవత్సరం? (ఏపీ టెట్ - 2017)
    1) 2061 2) 2062
    3) 2063 4) 2064
19. ధృవ నక్షత్రానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది? (ఏపీ టెట్ - 2017)
    1) ఇది భూమికి దగ్గరగా ఉన్న నక్షత్రం
    2) ఇది భూభ్రమణం అక్షానికి సూటిగా పై వైపున ఉంటుంది
    3) ఇది నిలకడగా ఉన్నట్లు కనిపిస్తుంది
    4) దీని స్థానాన్ని సప్తర్షి మండల రాశి ద్వారా కనుగొనవచ్చు
20. 'అరుణగ్రహం' అని కూడా పిలిచే గ్రహం? (ఏపీ టెట్ - 2018)
    1) సూర్యుడు 2) శుక్రుడు
    3) కుజుడు 4) బృహస్పతి

**సమాధానాలు**

1) 2 2) 3 3) 3 4) 4 5) 2
6) 2 7) 3 8) 1 9) 2 10) 3
11) 3 12) 1 13) 1 14) 1 15) 3
16) 4 17) 2 18) 1 19) 1 20) 3

# భారత పౌరులు కానివారికి కూడా లభించే హక్కు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

## మాదిరి ప్రశ్నలు

1. వ్యక్తి స్వేచ్ఛపై సహేతుకమైన పరిమితులు ఎవరు విధించవచ్చు?
   1) కేబినెట్  2) పార్లమెంట్
   3) భారత రాష్ట్రపతి
   4) సుప్రీంకోర్టు
2. సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛపై కింది వాటిలో పరిమితి కానిది ఏది?
   1) శాంతి భద్రతల దృష్ట్యా
   2) భారతదేశ సార్వభౌమాధికారం దృష్ట్యా
   3) భారతదేశ సమగ్రతా దృష్ట్యా
   4) వ్యక్తి స్వేచ్ఛ దృష్ట్యా
3. కింది వాటిలో సరికానిది ఏది?
   1) చట్టాన్ని ధిక్కరించి నేరం చేసిన సందర్భంలో మాత్రమే నేరస్తుణ్ని శిక్షించాలి
   2) నేరం జరిగినప్పుడు ఆ చట్టం అమల్లో ఉండాలి
   3) చట్టంలో నిర్దేశించిన దానికంటే ఎక్కువ శిక్ష విధించకూడదు
   4) నేరం జరిగినప్పుడు చట్టం అమల్లో ఉండనవసరం లేదు
4. ఎమ్మెల్యే, ఎంపీలకు ఏదైనా ఒక కేసులో ఎంతకాలం శిక్ష పడితే తమ పదవులకు అనర్హులవుతారు?
   1) రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
   2) మూడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
   3) ఆరేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
   4) నాలుగేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
5. బలవంతంగా నేరాన్ని అంగీకరించడం ఏ అధికరణకు వ్యతిరేకం?
   1) 20(2)  2) 20(3)
   3) 20(1)  4) 20(4)
6. భారత పౌరులు కాని వారికి కూడా లభించే హక్కు?
   1) ఉద్యోగాల్లో సమాన హక్కు
   2) విద్యా సాంస్కృతిక హక్కు
   3) స్వేచ్ఛగా సమావేశమయ్యే హక్కు
   4) వ్యక్తిగత స్వేచ్ఛ
7. స్త్రీలు, బాలికల అవినీతి వ్యాపార నిరోధక చట్టం ఎప్పుడు చేశారు?
   1) 1976  2) 1956
   3) 1978  4) 1965
8. పార్లమెంటు ప్రధాన కర్తవ్యం?
   1) చట్టాలు అమలు చేయడం
   2) చట్టాలు రూపొందించడం
   3) చట్టాలపై అవగాహన కలిగించడం
   4) దేశాన్ని పరిపాలించడం
9. ఆదేశిక సూత్రాలకు సంబంధించి కింది వాటిలో సరికాని అంశం ఏది?
   1) సమసమాజ స్థాపన వాటి లక్ష్యం
   2) ఆర్థిక వన రుల లభ్యత మేరకు అమలు చేస్తారు
   3) న్యాయస్థానాల రక్షణ ఉంది
   4) దేశ పాలనకు ప్రధానమైన సూత్రాలు
10. కింది వాటిలో రాష్ట్రపతి పదవికి ఉండాల్సిన అర్హత కానిది ఏది?
   1) స్పీకర్‌గా ఎన్నిక కావాలి
   2) 35 ఏళ్ల వయస్సు ఉండాలి
   3) భారతదేశ పౌరుడై ఉండాలి
   4) లాభసాటి పదవుల్లో ఉండరాదు
11. ఉప రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పేర్కొన్నారు?
   1) 5వ భాగం  2) 4వ భాగం
   3) 6వ భాగం  4) 7వ భాగం
12. సాధారణంగా ఉపరాష్ట్రపతి పదవీకాలం?
   1) 5 ఏళ్లు  2) 6 ఏళ్లు
   3) రాజ్యాంగం నిర్ధారించలేదు
   4) పైవేవీ కావు
13. ప్రధానమంత్రి పదవీ కాలం ఎంత?
   1) 5 సంవత్సరాలు
   2) ఎన్నికలు జరిగే వరకు
   3) రాజ్యాంగం నిర్ణయించలేదు
   4) రాష్ట్రపతి సంతృప్తి మేరకు
14. కింది వారిలో ఎవరిని జాతి నాయకుడు అంటారు?
   1) రాష్ట్రపతి  2) ప్రధానమంత్రి
   3) లోక్‌సభ స్పీకర్  4) ఉప రాష్ట్రపతి
15. 'సమష్టి బాధ్యత' అనేది ఏ ప్రభుత్వ ప్రధాన లక్షణం?
   1) అధ్యక్ష తరహా ప్రభుత్వం
   2) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
   3) రాచరిక ప్రభుత్వం
   4) గణతంత్ర ప్రభుత్వం
16. రాజ్యాంగాన్ని ప్రజల తరపున ఎవరు ఆమోదించారు?
   1) బ్రిటిష్ ప్రభుత్వం
   2) కేంద్ర ప్రభుత్వం  3) రాజ్యాంగ పరిషత్
   4) రాజ్యాంగ ముసాయిదా కమిటీ
17. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత మొదటగా రాజ్యాంగంలో చేర్చిన షెడ్యూలు ఏది?
   1) 10  2) 11  3) 9  4) 12
18. 'రాజ్యాంగం వైఫల్యం చెందితే రాజ్యాంగాన్ని నిందించరాదు. అమలుపరిచే వారిని నిందించాలి' అని వ్యాఖ్యానించింది ఎవరు?
   1) గ్రాన్‌విల్లే ఆస్టిన్  2) బి.ఆర్. అంబేద్కర్
   3) హెచ్.వి. కామత్  4) ఐవర్ జెన్నింగ్స్
19. కింది వాటిలో ఏకకేంద్ర లక్షణం కానిదేది?
   1) లిఖిత రాజ్యాంగం
   2) అదృఢ రాజ్యాంగం
   3) సమగ్ర న్యాయ వ్యవస్థ
   4) ఏక పౌరసత్వం
20. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు రాజ్యాంగంలో చేర్చని అంశమేది?
   1) ఆదేశ సూత్రాలు
   2) ప్రాథమిక విధులు
   3) ప్రాథమిక హక్కులు
   4) అత్యవసర పరిస్థితులు
21. పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
   1) 1988  2) 1986
   3) 1980  4) 1989
22. స్థానిక ప్రభుత్వాలు అనే పదం ఆధునికంగా ఏ దేశంలో తొలిసారి ఉపయోగించారు?
   1) బ్రిటన్  2) న్యూజిలాండ్
   3) ఫ్రాన్స్  4) స్వీడన్
23. భారతదేశంలో మండలాలను ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ఏది?
   1) కర్ణాటక  2) ఆంధ్రప్రదేశ్
   3) పశ్చిమ బెంగాల్  4) ఉత్తర ప్రదేశ్
24. 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తింపజేయాలంటే ఎవరి అనుమతి తీసుకోవాలి?
   1) కేంద్ర ప్రభుత్వం  2) లెఫ్టినెంట్ గవర్నర్
   3) రాష్ట్రపతి  4) కేబినెట్
25. అశోక్ మెహతా కమిటీ సిఫారసులకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   a) జిల్లాస్థాయిలో ఆడిట్ జరగాలి
   b) ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రకారం సీట్లు రిజర్వ్ చేయాలి
   c) న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి
   d) పంచాయతీరాజ్ సంస్థలకు ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలి
   1) a, b, c  2) a, b, c, d
   3) c, d  4) b, c, d
26. రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం?
   1) ఐదేళ్లు 2) ఐదేళ్లు లేదా 70 ఏళ్ల వరకు
   3) ఆరేళ్లు  4) మూడేళ్లు
27. కింది వాటిలో సరైంది ఏది?
   1) వన్య ప్రాణుల సంరక్షణ చట్టం- 1970
   2) పర్యావరణ పరిరక్షణ చట్టం- 1984
   3) అటవీ సంరక్షణ చట్టం- 1980
   4) జాతీయ అటవీ విధానం- 1989
28. ఏ కేసులో సుప్రీంకోర్టు నిర్బంధంలో ఉన్న వ్యక్తులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని ప్రకటించింది?
   1) కిశోర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్ (1981)
   2) డి.కె. బసు వర్సెస్ పశ్చిమ బెంగాల్- (1997)
   3) లోకేంద్రసింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ (1996)
   4) కమలాదేవి వర్సెస్ ముంబాయి (1984)
29. నిర్దేశిక నియమాలైన 39(బి), 39(సి) అధికరణలు, ప్రాథమిక హక్కులైన 14, 19, 31పై ఆధిక్యత కలిగి ఉంటాయని ఏ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది?
   1) మినర్వామిల్స్ వర్సెస్ మద్రాస్ ప్రభుత్వం - 1980
   2) కేశవానంద భారతి కేసు – 1973
   3) గోలక్‌నాథ్ కేసు - 1967
   4) బెల్లా బెనర్జీ కేసు – 1954
30. మొదటి రాజ్యాంగ సవరణ చట్టం - 1951 ద్వారా చేర్చిన అంశాలు ఏవి?
   1) 9వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు
   2) 15(4) అధికరణ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్యావిషయాల్లో కొన్ని సీట్ల రిజర్వేషన్ కల్పించడం
   3) 31(ఎ) అధికరణను కొత్తగా చేర్చారు



   4) పైవన్నీ
31. 368వ అధికరణ ప్రకారం పార్లమెంటుకు రాజ్యాంగంలోని అన్ని అంశాలను మార్చే అధికారం ఉందని ఏ సవరణ ద్వారా నిర్ణయించారు?
   1) 24వ రాజ్యాంగ సవరణ చట్టం
   2) 42వ రాజ్యాంగ సవరణ చట్టం
   3) 25వ రాజ్యాంగ సవరణ చట్టం
   4) 44వ రాజ్యాంగ సవరణ చట్టం
32. ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సుప్రీం కోర్టు, హైకోర్టులకు న్యాయసమీక్షను తగ్గించారు?
   1) 42వ  2) 24వ
   3) 44వ  4) 25వ
33. 'మాండమస్' రిట్ వర్తించని వారు?
   1) రాష్ట్రపతి, గవర్నర్
   2) వ్యక్తుల మధ్య ఒప్పందాలు జరిగినప్పుడు
   3) ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు
   4) పైవన్నీ సరైనవే
34. 'హెబియస్ కార్పస్' రిట్ ద్వారా పౌరులను మాత్రమే కాకుండా భారత భూభాగంలో నివసించే వారందరినీ రక్షించాలని సుప్రీం కోర్టు ఏ కేసులో తీర్పునిచ్చింది?
   1) వినీత్ నారాయణ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (1998)
   2) ఉమ్మ సబీనా వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (2011)
   3) కిశోర్ సామ్రైట్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ (2013)
   4) విశ్వాస్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం(1983)
35. కింది వాటిలో ఏ అధికరణ సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పిస్తుంది?
   1) 326  2) 336
   3) 316  4) 324
36. 'సైనిక శాసనం'కు సంబంధించి సరికాని అంశం ఏది?
   1) శాంతి భద్రతలకు భంగం కలిగితే విధిస్తారు
   2) ఇది ప్రాథమిక హక్కులపై ప్రభావం చూపుతుంది
   3) దేశం మొత్తం లేదా దేశంలోని కొంత భాగంలో విధిస్తారు
   4) దేశంలో ఒక నిర్దిష్ట ప్రాంతంలో దీనిని విధిస్తారు
37. 'ఆదేశిక సూత్రాల అంతిమ లక్ష్యం అజ్ఞానం, దౌర్జన్యాల నుంచి భారత ప్రజల్ని విముక్తి చేయడం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
   1) గజేంద్ర గడ్కర్  2) బి.ఆర్. అంబేద్కర్
   3) బి.ఎన్. రావు  4) కె.సి. వేర్
38. కింది వాటిలో హెబియస్ కార్పస్ రిట్‌కు సంబంధించి సరికానిది ఏది?
   1) ఇది అత్యంత పురాతనమైన రిట్
   2) ఈ రిట్‌ను 1679లో ఇంగ్లండ్ గుర్తించింది
   3) 'యు మే హేవ్ ది బాడీ' అని అర్థాన్నిస్తుంది
   4) నివారక నిర్బంధం కింద అరెస్ట్ అయితే రక్షణ కల్పిస్తుంది
39. బలవంతపు మతమార్పిడిలను నిషేధిస్తూ చట్టం చేసిన తొలి రాష్ట్రం?
   1) ఒడిశా  2) మధ్యప్రదేశ్
   3) తమిళనాడు  4) కేరళ
40. రాజ్యానికి అధికార మతం ఉండరాదని సుప్రీం కోర్టు ఏ కేసులో తీర్పు ఇచ్చింది?
   1) ఎస్.ఆర్. బొమ్మై కేసు (1994)
   2) బాల్‌పాటిల్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (2005)
   3) డి.ఎస్. నకారా వర్సెస్ కేంద్రప్రభుత్వం (1982)
   4) కేశవానంద భారతి కేసు(1973)
41. కింది వాటిలో ఉమ్మడి జాబితాలో లేని అంశం ఏది?
   1) జనాభా నియంత్రణ
   2) వార్తాపత్రికలు  3) కార్మిక సంక్షేమం
   4) ప్రజారోగ్యం
42. హైకోర్టు న్యాయమూర్తుల తొలగింపులో రాష్ట్ర శాసనసభల అభిప్రాయాన్ని తీసుకోవాలని ఏ కమిటీ సిఫార్సు చేసింది?
   1) రాజమన్నార్ కమిటీ
   2) సర్కారియా కమిషన్
   3) పూంఛీ కమిషన్  4) ఏదీ కాదు
43. యూపీఎస్సీ చైర్మన్, సభ్యుల పదవీకాలం ఎంత?
   1) ఐదేళ్లు లేదా అరవై ఐదేళ్లు (ఏది ముందైతే అది)
   2) ఆరేళ్లు లేదా అరవై ఐదేళ్లు (ఏది ముందైతే అది)
   3) ఆరేళ్లు  4) ఐదేళ్లు
44. యూపీఎస్సీ సభ్యుల సంఖ్యను ఎవరు నిర్ణయిస్తారు?
   1) పార్లమెంటు  2) రాష్ట్రపతి
   3) కేబినెట్  4) ప్రధానమంత్రి
45. జాయింట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏ విధంగా ఏర్పడుతుంది?
   1) పార్లమెంటు చట్టం ద్వారా
   2) భారత రాష్ట్రపతి నిర్ణయం మేరకు
   3) కేబినెట్ నిర్ణయం మేరకు
   4) యూపీఎస్సీ నిర్ణయం మేరకు
46. 'అభిశంసన తీర్మానానికి' సంబంధించి సరికాని అంశాన్ని గుర్తించండి.
   1) అభిశంసనకు కారణం చెప్పాలి
   2) మంత్రి మీద కానీ, మంత్రుల మీద కాని పెట్టవచ్చు
   3) ఆమోదిస్తే మంత్రి మండలి రాజీనామా చేయాలి
   4) విధానాలను విమర్శించడం దీని ఉద్దేశం
47. 'కార్పెట్ క్రాసింగ్' అంటే ఏమిటి?
   1) ప్రతిపక్షం నుంచి అధికారపక్షంలోకి మారడం
   2) అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి మారడం
   3) ఒక రాజకీయ పార్టీ నుంచి మరో పార్టీలోకి మారడం
   4) ఏదీకాదు
48. కేబినెట్ లిఖిత పూర్వక ఉత్తర్వుల మేరకు మాత్రమే విధించవలసిన అత్యవసర పరిస్థితి ఏమిటి?
   1) జాతీయ అత్యవసర పరిస్థితి
   2) రాజ్యాంగ అత్యవసర పరిస్థితి
   3) ఆర్థిక అత్యవసర పరిస్థితి
   4) సైనిక అత్యవసర పరిస్థితి
49. ఉపరాష్ట్రపతి పదవికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) 35 ఏళ్లు నిండి ఉండాలి
   2) పార్లమెంటుకు ఎన్నికవరాదు
   3) రాజ్యసభకు ఎన్నిక కావడానికి అర్హతలు ఉండాలి
   4) భారతీయ పౌరుడై ఉండాలి
50. కింది వారిలో ఉపరాష్ట్రపతి కాకుండా నేరుగా రాష్ట్రపతి అయినవారు ఎవరు?
   1) రాజేంద్ర ప్రసాద్
   2) అబ్దుల్ కలాం
   3) నీలం సంజీవరెడ్డి
   4) పై వారందరూ
51. మంత్రి మండలి గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణలు తెలియజేస్తాయి?
   1) 74, 75  2) 76, 77
   3) 80, 81  4) 90, 91
52. రాష్ట్రపతి వీటో చేయడానికి అవకాశం లేని బిల్లులు?
   1) ద్రవ్య బిల్లులు
   2) రాజ్యాంగ సవరణ బిల్లులు
   3) రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ బిల్లులు
   4) పైవన్నీ
53. భారతదేశంలో రాష్ట్రపతికి ఉన్న ఆర్డినెన్స్ జారీ చేసే అధికార మూలాలు ఏ చట్టంలో ఉండేవి?
   1) కౌన్సిళ్ల చట్టం – 1861
   2) భారత ప్రభుత్వ చట్టం –1935
   3) భారత ప్రభుత్వ చట్టం – 1919
   4) రెగ్యులేటింగ్ చట్టం – 1773
54. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలకు సంబంధించి కింది వాటిలో సరికాని అంశం ఏది?
   1) వీరి జీతభత్యాల గురించి రెండో షెడ్యూల్‌లో పేర్కొన్నారు
   2) ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో వారి జీత భత్యాలు తగ్గించవచ్చు
   3) వీరి జీతభత్యాలను రాష్ట్రపతి నిర్ణయి స్తాడు
   4) వీరి జీత భత్యాలను కేంద్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు

### సమాధానాలు

1) 2  2) 4  3) 4  4) 1  5) 2
6) 4  7) 2  8) 2  9) 3  10) 1
11) 1  12) 1  13) 4  14) 2  15) 2
16) 3  17) 3  18) 2  19) 1  20) 2
21) 2  22) 1  23) 1  24) 3  25) 2
26) 2  27) 3  28) 1  29) 2  30) 4
31) 2  32) 1  33) 4  34) 2  35) 1
36) 3  37) 1  38) 4  39) 1  40) 2
41) 4  42) 1  43) 2  44) 2  45) 1
46) 3  47) 2  48) 1  49) 2  50) 4
51) 1  52) 4  53) 1  54) 3

# How many even numbers are there?



BANK EXAMS
REASONING

## Model Questions

***Directions: (Q.No.1-5) Study the following information carefully and answer the questions given below.***

8 persons Amit, Prasad, Suman, Firoz, Gopi, Seenu, Magbul and Khaleel have different weights and different heights Amit is taller than 2 persons and heavier than 4 persons. Suman is heavier than Amit but not heaviest. Number of persons heavier than Suman is same as the number of persons shorter than Suman. Prasad is not the tallest. Three persons are taller than Firoz but shorter than Prasad. Number of persons taller than Khaleel is same as the number of persons heavier than Khaleel and at least one person is taller than Khaleel. Number of persons shorter than Magbul is same as the number of persons lighter than Magbul and at least one person is lighter than Magbul. Khaleel is taller than Amit but not heavier than Amit. The lightest person is tallest. Gopi is lighter than Seenu, who is heavier than Firoz. Seenu is not heaviest

1. Who is the heaviest person?
   a) Amit  b) Prasad  c) Firoz
   d) Seenu  e) Suman
2. Gopi is _____.
   a) Tallest  b) Lightest
   c) Heaviest
   d) Both option (a) and option (b)
   e) Both option (b) and option (c)
3. How many people are there who are taller than Amit and also lighter in weight than Magbul?
   a) 2  b) 3  c) 4
   d) 5  e) More than 5
4. Who among the followings is/are heavier as well as shorter than Khaleel?
   a) Amit  b) Firoz  c) Suman
   d) Both option (a) and option (c)
   e) More than persons mentioned above
5. Amit is _____.
   a) 3rd tallest and 5th heaviest
   b) 6th tallest and 4th heaviest
   c) Heavier than at - least 6 persons
   d) Lighter than 6 persons
   e) None of these

***Directions (Q.No.6-10): Study the following information carefully and answer the questions given below.***

L1, L2, L3, L4, L5, L6, L7, L8, L9, L10, L11 and L12 were seated around a square table facing the centre. There were 2 persons along each side and one person on each of the corner.

L7 was 2nd to the left of L12 who was seated at one of the sides. L6 was next to L12 and was seated opposite to L11. L11 was 2nd to the left of L2 who faced L10. L8 was to the immediate left of L5 who faced L4's neighbor. L1 was 2nd to the left of L9. L9 and L12 were seated at a gap of 3 persons. L3 was not next to L1.

6. Four of the following bear a similar relationship and hence form a group, who among the following is not a part of that group?
   a) L3  b) L8  c) L7
   d) L11  e) L6
7. What was the position of L3 with respect to L6?
   a) Immediate right
   b) Immediate left  c) Opposite
   d) Second to the right
   e) Second to the left
8. Who among the following was seated opposite to L8?
   a) L9  b) L4  c) L7  d) L1
   e) Cannot be determined
9. In which of the following groups was the 1st person seated next to the 2nd and 3rd persons?
   a) L11, L1, L5  b) L5, L8, L1
   c) L8, L10, L3  d) L4, L12, L3
   e) L2, L4, L7
10. ____ was 2nd to the right of ____
   a) L2, L4  b) L9, L2
   c) L8, L10  d) L6, L1
   e) L5, L6

***Directions (Q.No.11-15): In the following question assuming the given statements to be true, find which of the conclusion among given conclusions is/are definitely true and then give your answer accordingly.***

11. *Statements:*
   $A > D = B; C \geq B > M;$
   $L = N; M > N > O$
   *Conclusions:*
   I. $D > C$  II. $D > M$
   III. $B > L$  IV. $A \geq C$
   a) Only III is true.
   b) Only I is true.
   c) Only II and III are true.
   d) Only I and III are true.
   e) Only IV is true.
12. *Statements:*
   $C < P > M; O \leq L < B;$
   $A = C; B < D \leq N$
   *Conclusions:*
   I. $D > M$  II. $O < D$
   III. $C > M$  IV. $O = C$
   a) Only II is true.
   b) Only IV is true  c) All are true
   d) I, III and IV are true
   e) None is true
13. *Statements:*
   $J > I \geq O > L; I < S < J \leq T;$
   $K = O; L > N < M$
   *Conclusions:*
   I. $S < M$  II. $I \leq K$
   III. $M > L$  IV. $T < J$
   a) Only III is true
   b) Only IV is true
   c) Only I and IV are true
   d) None is true  e) Only I is true
14. *Statements:*
   $E < H = I > P; P > E > D;$
   $E < K < H; G \geq I$
   *Conclusions:*
   I. $K > P$  II. $E < P$
   III. $D \leq P$  IV. $G > H$
   a) II, III, IV are true
   b) I, II, III are true
   c) Only II is true  d) All are true
   e) Only III is true
15. *Statements:*
   $H < A \leq D = G; B < F < C;$
   $C = A; G > E > C$
   *Conclusions:*
   I. $A \geq F$  II. $A \leq E$
   III. $H < C$  IV. $B < D$
   a) Only III and IV are true.
   b) Only I and II are true.
   c) All are true.
   d) II, III, and IV are true.
   e) None is true.

***Directions (Q.No.16-20): Study the following series of sets of numbers. Carefully answer the question given below.***

5340, 2468, 8369, 9622, 5370, 7494

16. If in each number second and fourth digits are interchanged, then how many even numbers are there?
   a) 2  b) 3  c) 4  d) 5  e) 1
17. If the digits in each number are arranged in descending order, which of the following will be the lowest?
   a) 8642  b) 9863  c) 9622
   d) 7530  e) 5340
18. What will be the number obtained if third digit of the smallest number is multiplied with second digit of the largest number?
   a) 20  b) 21  c) 14
   d) 36  e) None of these.
19. If in the above set of numbers 1 is added to the second digit and 2 is subtracted from first digit, then which number will be third if arranged in descending order?
   a) 5340  b) 9622  c) 2468
   d) 7494  e) None of these.
20. If 525 is subtracted from each number, then what is the multiplication of 1st digit of the lowest and last digit of the largest number?
   a) 7  b) 6  c) 5
   d) 2  e) None of these

## Key with Solutions


**(1-5):**

**Height:**
Gopi > Seenu > Magbul > Prasad > Khaleel > Amit > Suman > Firoz

**Weight:**
Prasad > Suman > Magbul > Amit > Khaleel > Seenu > Firoz > Gopi

1) b;  2) d;  3) d
4) d;  5) b

**(6-10):**




6) a;  7) d  8) c;
9) b  10) c

**11) c;**
(I) $D = B \leq C$ (×)
(II) $D = B > M$ (✔)
(III) $B > M > N = L$ (✔)
(IV) $A > D = B \leq C$ (×)

**12) a;**
(I) No relation
(II) $O \leq L < B < D$ (✔)
(III) $C < P > M$ (×)
(IV) No relation

**13) d;**
(I) $S < J > I \geq O > L > N < M$ (×)
(II) $I \geq O = K$ (×)
(III) $L > N < M$ (×)
(IV) $J \leq T$ (×)

**14) c;**
(I) $P > E < K$ (×)
(II) $P > E$ (✔)
(III) $P > E > D$ (×)
(IV) $G \geq I = H$ (×)

**15) a;**
(I) $F < C = A$ (×)
(II) $E > C = A$ (×)
(III) $H < A = C$ (✔)
(IV) $B < F < C = A \leq D$ (✔)

**16) b;**
5340, 2468, 8369, 9622, 5370, 7494
5043, **2864**, 8963, **9226**, 5073, **7494**

**17) e;**
5340, 2468, 8369, 9622, 5370, 7494
**5430**, 8642, 9863, 9622, 7530, 9744

**18) d;**
5340, 2468, 8369, 9622, 5370, 7494
$\Rightarrow 6 \times 6 = 36$

**19) d;**
5340, 2468, 8369, 9622, 5370, 7494
3440, 0568, 6469, 7722, 3470, **5594**

**20) a;**
5340 - 525, 2468- 525, 8369- 525, 9622- 525, 5370- 525, 7494 - 525
4815, **1968**, 7844, 9097, 4845, 6969
$\Rightarrow 1 \times 7 = 7$